AADOIF223

స్వీయచరిత్రము

సంక్షిప్తప్రతి

748
7910
19K
1937
1962



ప్రకాశకులు:

హితకారిణీ సమాజము-రాజమహేంద్రవరము

1962.


CT

AADoIF 2చిక్క

శ్రీ రావుబహదూర్ కందుకూరి వీరేశలింగము పంతులుగారి

స్వీయ చరిత్ర ము

సంక్షిప్త ప్రతి



ప్రకాశకులు:

హితకారిణీ సమాజము-రాజమహేంద్రవరము

జనవరి 1962

సర్వ హక్కులు:
హితకారిణీ సమాజమువారిది

వెల:
మూడు రూపాయలు.

ANDOVER

౧

పరిచయము

నవ్యాంధ్ర నిర్మాత రావుబహద్దూర్ శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారి స్వీయచరిత్ర ప్రథమభాగమును 1911 లోను ద్వితీయ భాగమును 1915 లోను విజ్ఞానచంద్రికా గ్రంథమండలివారు ప్రచురించిరి. ద్వితీయముద్రణమును 1936 లోను తృతీయముద్రణమును 1954 లోను, పంతులుగారి రచన లన్నిటికిమొక్క ప్రచురణాధికారము గల హితకారిణీసమాజము వారే ప్రచురించిరి.

ఈ స్వీయచరిత్రము సుమారు 900 ల పేజీల గ్రంథము. దీని మూల్యము ఎనిమిదిరూపాయలు. శ్రీ పంతులుగారి జీవితచరిత్రమును చదువవలెనను, ఆసక్తిగల ప్రజలందరకు అందుబాటులోనుండునట్లు, ఇంచుమించు 250 పేజీలలో వారి జీవితములోని ప్రధానాంశములను విడువకుండా ఒక సంక్షిప్త ప్రతిని ప్రచురించవలెనని మా సమాజము సంకల్పించినది.

మా సంకల్పమునకు చేయూతనిచ్చి, వీరేశలింగ ఆస్థికోన్నత పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులయిన శ్రీ అక్షిని శంకరరావు B. A. L. T. గారు ఈ సంక్షిప్తప్రతికి వలసు సూచనలను చేసి పంపిరి. ఆ సూచనలు ఆధారముగా జేసికొని, రాజమండ్రి గోదావరి సెంట్రలు బ్యాంకు మాజీకార్యదర్శియైన శ్రీ అంకరాజు శంకరరావుగారు ఈ ప్రతినికూర్చి సమర్పించుటయే గాక ముద్రణాదికములలో మాకు తోడ్పడిరి.

ఈ యివుఫరకును మా కృతజ్ఞత తెలుపుచున్నాము. ఈ సంక్షిప్త ప్రతిని ఆంధ్రప్రజ లాదరించగలరని ఆశిస్తున్నాము. మేమడిగిన వెంటనే, మూలగ్రంథమును, సంక్షిప్తప్రతిని పరిచి, తొలిపలుకు వ్రాసియిచ్చిన విద్వాన్ విశారద సూరాబత్తుల సుబ్రహ్మణ్యం M. A. L. T. రిజైస్ట్రరీజినల్ డైరెక్టరు ఆఫ్ ఎడ్యుకేషన్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

హితకారిణి సమాజము,
రాజమహేంద్రవరము.

పొన్నాడ వేంకటాద్రి
గౌరవ కార్యదర్శి.

తొలిపలుకు

శ్రీ వీరేశలింగముగారు తమ జీవితకథను వ్రాసి 1910 లో ప్రచురించి యాంధ్రదేశమున కమూల్యసేవ జేసిరి. ఆంధ్రమున నది ప్రథమ స్వీయచరిత్రమగుటయేగాక యాంధ్రదేశ జీవనవికాసమును సాధించిన యొక మహాపురుషుని జీవితగాథగా నది నెగడినది. పెద్ద తడవు విచారించిచూచినను ఆంధ్రావళికింత బహుముఖచైతన్య మిచ్చిన మరొకవ్యక్తి యాయనకు ముందుగాని, వెనుకగాని, నేటి వరకుఁ బుట్టియుండలేదని దోఁచును.

మహాపురుషు లందరు తమ జీవితములను గ్రంథస్థములు చేయ లైరి. గోపరాజు, పోతరాజు, త్యాగరాజు మొదలగు నాంధ్ర మహా పురుషులు తమ జీవితమును వ్రాసికొనకపోవుటచేత వారి గూర్చిన యదార్థమెంతో, కల్పితమెంతో తెలియకున్నది. ఆంధ్రుల భాగ్య వశమున వీరేశలింగముగారు తమ జీవితమును వ్రాయు సమ్మో తించిరి. రచనా వైదగ్ధ్యమును బట్టి చూచినను, విషయ ప్రాధా న్యమును బట్టి చూచినను, వీరేశలింగముగారి తక్కిన గ్రంథ ములన్నియు ఒకయెత్తు, స్వీయచరిత్ర మొకయెత్తు. ఇతరులు వ్రాసిన తమ జీవితములకన్న తామే వ్రాసికొన్న తమ జీవిత చరిత్రలకు ప్రత్యేక ప్రాశస్త్యముండుననని వేఱే చెప్పనక్కర లేదు. మహాత్మా గాంధి జీవిత మెందరెందరు వ్రాసినను ఆయన ఆత్మకథ కున్న విలువ విశిష్టమైనదేకదా!

కాలక్రమేణ వీరేశలింగముగారి స్వీయచరిత పఠన మాంధ్ర లోకమునన్న గిల్లుచున్నట్లు తోచుచున్నది. వీరికి పలుకారణము లున్నవి. వారు సాధించిన సంస్కరణములు సంఘములో పరిపాటియై చెల్లుచుండుటయు, వారు చూపిన నూతన వచన రచనావిధానములు విరివిగా వాడుకలోనికి వచ్చుటయు మాత్రమేగాక వారి స్వీయచరిత్ర సుమారు వేయి పుటలవరకు విస్తరించియుండుటయు నీకారణములలో

గొన్ని. ఇంతటి బృహత్కార్యమును సావధానముగా బఠించుట కే కొద్ది మందికో గాని తీరిక యుండదు. మనసును బుట్టదు. ఈ ఔదాసీన్యమన్ని భాషలలోని పెద్దపుస్తకములకు వర్తించునది. అందువల్లనే ఇతరభాషలలోని పెద్దపెద్ద గ్రంథములు సంక్షిప్తపరుపబడుచున్నవి. గొప్పగ్రంథముల కొకే సంక్షిప్తప్రతిచొప్పునగాక వేర్వేరు అంతస్థుల వారికిఁ దగినట్లనేక సంక్షిప్త ప్రతులుకూడ చేయఁబడుచున్నవి. మహాత్మాగాంధి జీవితచరిత్ర పెద్దలకుఁ చిన్నలకు విద్యార్థులకుఁ దగినట్లుగాఁ బలువిధముల సంక్షిప్తము చేయఁబడెనుకదా!

కథాచమత్కార ప్రధానములైన నవలలే విజయవంతముగా సంక్షిప్తపరుపఁబడుచున్నప్పుడు, విషయప్రధానమైన గ్రంథములు సులభ సంక్షిప్తసాధ్యములని వేఱే చెప్పనక్కరలేదు. ఆంగ్లమున మహానవల లన్నియు సంక్షిప్తము చేయఁబడిన వనవచ్చును. మన 'వేయిపడగలు', 'నారాయణరావు', 'మాలపిల్ల' మొదలగు పెద్ద నవలలుకూడ సంక్షిప్తము కావలసియున్నవి. సంక్షిప్తకారుఁడు రచయిత భాషనే వాడుచు, గ్రంథమునకుఁ బ్రాణమిచ్చు ప్రధానాంశముల కెట్టి లోపము కలుగకుండ జాగ్రత్తవహించుట యవసరము. ఒక్కొక్కప్పుడు కవిప్రవాసిన మూలగ్రంథము సంక్షిప్తములో నష్టపోవుటకు బదులు వన్నెకెక్కుటయు సాధ్యమే. నితంతు వివాహములు శాస్త్ర సమ్మతములనివాదించు నవసగ మీ కాలమునలేము; ఆయా సందర్భములలో నడచిన దావాలు తీర్పులు నానాటి ప్రజకుఁ గుతూహలము గావించునవి కావచ్చును. వానిని నడిపించి సాధించినవారికవి ప్రధానములుగాఁ గాన్పించుటలోఁ జిత్రములేదు. కాని యీ వివరణలలోని యాసక్తి శాశ్వతమైనదికాదుగదా! అట్లే స్త్రీవిద్యా ప్రథమ ప్రయత్నములలో స్త్రీలకొఱకు ప్రవాసిన రచనలుకూడ నాడు క్రొంగ్రొత్త లగుటఁబట్టి ప్రశస్తములై యట్టివానినుండి కొన్ని భాగము లెత్తి చూపుట యవసరముగాఁ దోచియుండవచ్చును. అట్లే భాషా బహుశాఖా రచనలలోఁ బ్రథమప్రయత్నములైన వానినుండి కొన్ని భాగములు క్రోడీకరింపవలెనని యనిపించవచ్చును. నేఁటి వివిధ వివరణ

ములు, క్రోడీకరణను, తొలగించినను గ్రంథమాదాస క్తి కుంటుపడదు సరికదా,అట్టివిస్తరణలనుతగ్గించుటచేతనేగ్రంథముప్రకాశింపవచ్చును.

మూలగ్రంథాపేక్ష లేకయే పాఠకులయెదుట గ్రంథకర్తయొక్క రచనను సజీవముగా నిలుపగల్గిన సంక్షిప్తమే సరియైన సంక్షిప్త మగును. స్వీయచరిత్రను మూలములో నేను వెనుక చదివియుంటిని. ఇప్పుడీ సంక్షిప్తగ్రంథము నామూలాగ్రముగా బఠించితిని. నే నిది చదువుచున్నప్పు డిది నాకు స్వతంత్ర గ్రంథమువలెనే కన్పట్టుచు, నా యా ఘట్టములందు నన్నొంత్రేనియు ను త్తేజితునిఁ జేసినది. దీనిలో మొదటి భాగమున మూడవ ప్రకరణ మపరాధ పరిశోధక నవల (Detective Novel) వలె నడచినది; నాల్గవ ప్రకరణము సాహస గాథ (Tale of adventure) వలె స్ఫురించినది. నెపోలియనే పీరేశ లింగముగా మరొక నీరవిహారము చేసెనాయని చాలపర్యాయములు తలపునకుఁ బట్టినది. సి. ఆర్. రెడ్డిగారన్నట్లు పీరేశలింగ సమాధిపై నుండవలసిన చిహ్నము కత్తిగాని కలముకాదనితోచినది. శరత్ నవల వలె ఒక్కబిగిని ఈ 239 పుటలు చదివినఁగాని విడువలేకపోతిని. పుస్తకము ముగించి, కండ్లు మూసికొని, "ఆహా, ఎంతటి మహా పురుషుఁడని ధ్యానసమగ్నుఁడనైతిని. ఈవిధముగా బాలకు నుత్తేజ పరచఁగల్గిన సంక్షిప్తకావ్యము స్వతంత్ర సర్వాంగసుందర పరిపూర్ణ గ్రంథమసిపించుకొనగల విజయము నాధించిన దనుటలో సందేహా మేమి? ఇట్టి పుస్తకములను పాఠ్యగ్రంథములుగాఁ బెట్టినయెడల విద్యార్థులకు సత్యదీక్ష, కార్యపరాయణత్వము, పరహితసేవ, దైవ భక్తి మొదలగు సద్గుణములు తప్పక యలవడును.

ఇట్టి సంక్షిప్తప్రతి యువకహస్తముల కెన్నఁడో లభించియుండ వలసినది. ఏబదిసంవత్సరములు దొర్లిపోయినగాని లభింపదయ్యెను. నేటికి శ్రీ అంకరాజు శంకరరావుగారు భక్తిపూర్వక ప్రగాఢ కృషితో దీసిన ప్రశంసాపూర్వముగా సిద్ధమొసర్చిరి. ఈ కార్యసాధ నలో వీరికి అడవి శంకరరావుగారి సూచనలు కూడఁ దోడ్పడినవి. వీరిద్దరు మనకు వందనీయులు.

కాకినాడ
30-11-61

సూరాబత్తుల సుబ్రహ్మణ్యం
(రిట్టైర్డ్ రీజనల్ డైరెక్టరు ఆఫ్ ఎడ్యుకేషన్)

అవతారిక 1.

నేను చెన్నపురి నివాసముగా నేర్పఱుచుకొని యచ్చటనున్న కాలములో నా మిత్రు లనేకులు స్వీయచరిత్రమును వ్రాయవలసిన దని నన్ను నిర్బంధపఱుపఁ జొచ్చిరి. వారి నిర్బంధమును మానుపుకో జాలక నాకంతగా నిష్టము లేకపోయినను 1903 వ సంవత్సరమునందు స్వీయచరిత్రమును వ్రాయనారంభించి వ్రాసినదాని నెప్పటి కప్పుడే 111 పుటలు మా చింతామణి ముద్రాయంత్రములోనే ముద్రింపించి తిని. ఇంతలో నన్ను ప్రోత్సాహపఱుచుచు నిర్బంధపఱుచుచు వచ్చిన వారిలో ముఖ్యులయిన సి. వై. చింతామణిగారు చెన్నపురిని విడు చుట తటస్థించి నంమన వారిపోకతోనే నేనును నా పూనిన పని నప్పటికి విడిచితిని. అయినను ముద్రితమయిన పుస్తకభాగమును నా మిత్రు లనేకులు చూచుట తటస్థించెను. నా స్వీయచరిత్ర భాగమును చదివిన మిత్రులలో నొక్కరగు కె. వి. లక్ష్మణరావుగారు తమ విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో తాము ప్రచురింపఁ బోయెడు పుస్త కముల పట్టికలో నీపుస్తకమును గూడ చేర్చి ప్రకటించిరి. అందుచేత నిప్పుడు ప్రకటింపఁబడినదానిలో విశేష భాగమును కడచిన వేసవి కాలములో నేను బెంగుళూరిలో వ్రాయవలసిన వాఁడనైతిని. కొంత పఱుకు వ్రాసివిడిచిన పుస్తకమును నాచేత మరల వ్రాయించుటకు కారకు లయినందున వారియెడల నే నెంతయు కృతజ్ఞత గలవాఁడ నయి యున్నాను.

తెలుగుభాషలో స్వీయచరిత్రమును వ్రాయఁబూనుకొనుట కిదియే ప్రథమ ప్రయత్నము. సహృదయులు నాయెడల సదయ హృదయులయి యిందు పొడకట్టు భ్రమ ప్రమాద జనిత దోషము లను సుహృద్భావముతో నుపేక్షించి నన్ను మన్నింతురుగాక !

రాజమహేంద్రవరము}
15వ. డిశంబరు 1910 }

కందుకూరి వీరేశలింగము.

అవతారిక 2.

ఈ స్వీయ చరిత్రముయొక్క ద్వితీయభాగములోని మొదటి ప్రకరణము విశేషభాగములోని మొదటిప్రకరణము విశేషభాగము 1910 వ జూనునెలలో నా భార్య సజీవురాలయి యుండఁగా బెంగుళూరిలో వ్రాయబడినది. మిగిలిన భాగమునంతను 1913 వ సంవత్సరము వేసవికాలములో నేను బెంగుళూరికి వెళ్లినప్పుడు మెయి జూను నెలలో వ్రాసితిని. నాకిప్పు డడుగువడియేడేండ్లు నిండి యఱువది యెనిమిదవయేఁడు ప్రారంభమైనది. ఇటునంటి యవస్థలో నీ స్వీయచరిత్రములో భ్రమప్రమాదులవలఁ గలిగిన దోషములేవేని పడినచో మహాజను లుపేక్షించి క్షమింతురుగాక!

రాజమహేంద్రవరము
1వ. ఏప్రియల్ 1915

కందుకూరి వీరేశలింగము.

ప్రథమముద్రణపీఠిక

స్వీయచరిత్రమునందు వీరేశలింగ మహాజీవితకథయేగాక యా కాలమందలి యాచారములు, కట్టుబాటులు, న్యాయస్థానముల వ్యవహారములు, దేశీస్థితి మొదలయినవెన్నో తేటతెల్లముగఁ దెలియును. అందుచేత నిది యాంధ్రదేశముయొక్క సాంఘిక చరిత్రమని చెప్పవచ్చును.

ఈ స్వీయచరిత్రము మొట్టమొదట విజ్ఞానచంద్రికా మండలివారు ముద్రించి ప్రకటించిరి, ఆ ప్రతులన్నియు విక్రయింపఁబడిపోవుటచేత, వీరేశలింగము పంతులుగారిచే నెలకొల్పఁబడిన హితకారిణీ సమాజమీ రెండవముద్రణమును జేయించి ప్రకటింపఁగలిగినది. ఈ గ్రంథమందలి మొదటిభాగమును ఆంధ్రవిద్యాపీఠమువారు బి. ఏ. తరగతికిఁ బఠనీయగ్రంథముగా నిర్ణయించినందుకు హితకారిణీ సమాజమువారు విశ్వవిద్యాపీఠమువారికిఁ గృతజ్ఞులై యున్నారు.

రాజమండ్రి
22-4-37.

చిలకవర్తిలక్ష్మీనరసింహము,
వీరేశలింగ మహాశయుని శిష్యపరమాణువు.

తృతీయముద్రణపీఠిక

వీరేశలింగము పంతులుగారొక మహావ్యక్తి, ఆయన యొక యుగపురుషుడు. ఆయన ప్రభావము నేటివఱకు సంఘమందు, సాంఘికజీవనమందు. భాషయందు, వాఙ్మయమందు, నిత్యవ్యవహారమునందు, ఇక్కడ నక్కడ యనలేల ప్రతీవిషయమునందును, ప్రస్ఫుటముగా కనబడుచున్నది. అట్టి మహనీయుని స్వీయచరిత్ర నిక్కముగా నాంధ్రులకు రంజకమయినది. అట్టి ప్రాశస్త్యమును దాసియందుండుట చేతనేగావలయును, అది మూడవముద్రణభాగ్యమునునోచుకొన్నది.

వీరేశలింగము పంతులు ధీశాలి. దేశమును, తన ప్రజను ఉద్ధరించవలెనని సంకల్పముగల మహిమ గలవాడు. శ్రీ పంతులుగారు తన జీవితమునంతయు తన తోడి యాంధ్రప్రజల నుద్ధరింపదలపడిన మహనీయులు. వారి ప్రభావము సాంఘికజీవమునం దెంతగలదో వాఙ్మయమునం దంతయును గలదు. ఆయన అభినవ గద్యవాఙ్మయ దురంధరుడు. అది వీరేశలింగముపంతులుగారితో నారంభమయ్యెను.

పంతులుగారి స్వతంత్ర రచనలలో ప్రధానమైనది ఆంధ్రకవుల చరిత్ర. ఆంధ్రకవుల చరిత్ర ఆంధ్రభాషయందొక యుత్తమగ్రంథము. దానితో తుల్యమయినది, అనుపమానమయినది స్వీయచరిత్ర. భారతీయ భాషలలో వీరేశలింగము పంతులుగార స్వీయచరిత్రవంటి గ్రంథము మొదట వెలువడిన కారణమున, అద్వితీయమైన, అసమానమయిన, అపూర్వమయిన ఉత్తమగ్రంథము. స్వీయచరిత్ర వ్రాయువారికి రెండు అపూర్వములయిన గుణము లుండవలెను. అందొకటి సత్యప్రియత్వము. రెండవది తనగురించి, లోకులన్నదానిని విమర్శించుట, సమర్థించుట, లేక సమన్వయించుటకు సహాసబుద్ధి గలిగియుండుట. ఈ రెండు విశేషగుణములును శ్రీ పంతులుగారి స్వీయచరిత్రయందు గాననగును. పంతులుగారి స్వీయచరిత్ర ఒక విధముగా ఆంధ్రుల సాంఘికచరిత్ర.

రాజమహేంద్రవరము
1-11-1954

భావరాజు వేంకటకృష్ణారావు.

సంపాదకీయ భూమిక.

శ్రీ రావుబహదూరు కందుకూరి వీరేశలింగము పంతులవారి స్వీయచరిత్రలోని మొదటిభాగమును 1911లో ప్రకటించియున్నాము. రెండవభాగమును, అధికశ్రమల కోర్చి, రచించి మా యుద్యమము నకుఁ ప్రోత్సాహముఁ గలిగించినందులకు వారికి మా కృతజ్ఞతా పూర్వక వందనములు సమర్పించుచున్నాము.

గ్రంథమునందు సమకాలికులగు ననేకులంగూర్చి సందర్భను సారముగ పంతులవారు, ఒకొక్కచో దూషించుచును ప్రాసియున్నారు. స్వీయచరిత్రమువంటి గ్రంథమునందు, ఇట్టి దూషణ భూషణము లుండుట వింతకాదు.

మన సాంఘికవిషయము లనేకములీ గ్రంథమునందుఁ జర్చింపబడినవి, కావున నాంధ్రమహాజనులీ స్వీయచరిత్ర నాదరించుచు సంఘమునందలి గుణదోషములను గ్రహింతురుగాక యని కోరుచున్నాము.

చింతాద్రి పేట.
ఏప్రిలు 24-1915

ఇట్లు విదేయుడు
సంపాదకుడు
విజ్ఞాన చంద్రికామండలి.

ఈశ్వరప్రార్థనము

ఓ పరమేశ్వరా! ఓ దయాసత్య ధర్మస్వరూప! ఓ సుజన హృదయ ప్రమోద సంధాయకా! నీకు నమస్కారము.

మొట్టమొదట నెవ్వడైనఁ దన చరిత్రమును జెప్పుకొనుట కుపక్రమింపగానే లోకు లాతని గర్వియనియు నాత్మశ్లాఘాప్రియుఁడనియుఁ బ్రఖ్యాతికాముఁడనియు నానావిధముల భావింతురు. ఈ చరిత్రమును వ్రాయభూనుకొనుటలో నా యంతరంగమునందిట్టి నీచోద్దేశము లేవియుఁ జొరకుండునుగాక! ఓ భక్తవరదా! నా హృదయమునందు సదా సత్యమును వినయమును నెలకొలుపుము. ఘనుల మహాకార్య ప్రకటనమువలెనే సామాన్యుల యల్పకార్య ప్రకాశనము కూడ నభివృద్ధికి సహకారియగు నన్నయార్యోక్తి నిజమయ్యేనేని యీ యవిశ్రుత చరితము సహితము కొంతటికిఁ గొంత ప్రయోజనకర మగునుగాక!

1

స్వీయ చరిత్రము

మొదటి ప్రకరణము - బాల్యదశ

క్రీస్తు శకము 1848 మొదలుకొని 1860 వ సంII వరకు

రాజమహేంద్రవరము నందలి యస్మత్పితామహార్జితమైన స్వగృహమునందు కీలకనామ సంవత్సర చైత్ర శుద్ధ త్రయోదశీ భానువారము నాడు (అనగా క్రీస్తు శకము 1848-వ సంవత్సరము ఏప్రిల్ నెల 16వ తేదీని) సూర్యోదయానంతరమున మూడు ఘడియ లకు నేను జననమొందితిని. మా యిల్లు రాజమహేంద్రవరములో నున్న పెద్ద యిండ్లలో నొకటి. నా రాజశేఖర చరిత్రము నందలి రాజశేఖరుఁడుగారి గృహవర్ణన మించుమించుగా మా గృహ వర్ణ నమే.

మా పూర్వులు శైవబ్రాహ్మణులలోని యాఱువేల నియోగి శాఖలోఁ జేరినవారు. అందుచేత వారుస్మార్తులయిన నియోగులతో సంబంధ బాంధవ్యములను జేసికొనుచుండిరి. నా మాతాతగారయిన చంద్రమౌళిగారికి స్మార్తులలోని శ్రీచూర్ణధారుల కన్యనిచ్చుట తట్స్థ మైనది. ఆ దంపతుల కుదయించిన మత్పితామహులగు వీరేశలింగము గారు తాము లింగధారణమును మానివేసి సంస్కారమునకు మొదట దారితీసిరి. వారి పేరింటివాడనగు నాకును బాల్యమునుండియుఁ దత్సం స్కార వాసన యించుక సోఁకినది. మా తాతగారి జన్మభూమి

యేలూరు. మా తాతగారు రాజాశ్రయమును బొంది స్వగ్రామమును విడిచి రాజమహేంద్రవరమునకు వచ్చి విశేష ధనార్జనముచేసి రాజ భవన మనదగినంత మహాసౌధమును గట్టి యచ్చటనే స్థిరనివాస మేర్పఱుచుకొనిరి. చూచువారి కన్నులు కుట్టునట్టుగా నంత గొప్ప యిల్లు కట్టుట చూచి యోర్వలేక తోడి నియుక్తులు కొందఱు తమ కపట ప్రయోగ నైపుణిచేత మా తాతగారిని పనినుండి తొలగించు నట్లు చేసిరట!

ఆయనయొద్ద బురాణము చెప్పెడు శాస్త్రుల యొద్దనే నేను కాళిదాసత్రయమును జదివినాడను. ఆయన యాంధ్రభాషాభిమానము గలవారయి యింట సమర్థులయినవారిని నిలిపి వారిచేత భారత భాగవత రామాయణములను, గొన్ని ప్రబంధములను వ్రాయించిరి. ఆయన పని పోయియున్న కాలములోనే ప్రథమ కుమారునికి కళత్ర వియోగము తటస్థించెను. కుమారునకు మరల వివాహము చేయవలె నన్న ప్రయత్నములో నుండగానే యొకనాటి రాత్రి గుండెలలో నొప్పివచ్చి మా తాతగారాకస్మికముగా స్వర్గస్థులయిరి. మరణకాల మునందాయనకు జనని యక్కమ్మగారును, భార్య కామమ్మగారును, జ్యేష్ఠపుత్రుడు సుబ్బారాయుడుగారును ఉండిరి. నేను ద్వితీయ పుత్రుని పుత్రుడను. మా పెదతండ్రిగారి ద్వితీయ వివాహముతో మున్నున్న విత్తము కొంతయు సంతరించినది. మా తండ్రులుద్యో గముల నిమిత్తము కృషిచేయ నారంభించిరి. మా తండ్రిగారికి కాకి నాడలోని మండల కర్తగ్రాహి కార్యస్థానమునందు పిఠాపురసంస్థాన సంబంధమున స్థిరమైన లేఖకోద్యోగము దొరకినది. చిన్నతనము లోనే మా తండ్రిగారికి మేనత్తకొమారిత నిచ్చి వివాహము చేసిరి.

ఆకాలమునం డెల్లవారికిని దయ్యములయందలి విశ్వాస మత్యధికము. మా తల్లి కిట్టి నమ్మక మమితమయినందున దటుచుగా

నాను తన్నేదో దయ్యమావహించి పీడించుచున్నదని నిద్రాహార ములు సరిగాలేక బాధపడుచుండెనట! ఇటువంటి యువతి గర్భమున జనించినవాఁడ నగుటచేత శిశుదశలో సహితము నేను దుర్బలుఁ డనుగానే యుంటినట! పురిటిలోనే దగ్గొకటి పట్టుకొని యప్పటి నుండి నన్ను విడువక బాధించుచున్నది. ఈ దగ్గిన్నుండగా నాటు నెలల ప్రాయమప్పుడు నాకు స్ఫోటకము వచ్చినది. స్ఫోటకప్రమచ్చలు కొన్ని యిప్పటికిని స్పష్టముగా నా ముఖమువిూఁద గనబడుచున్నవి. నాకు నాలుగేండ్ల ప్రాయమప్పుడు మా తండ్రిగారు కురుపువేసి కాకినాడలో పరమపదించుట సంభవించినది. నాకు పెదతండ్రిగారి వద్దనే చనవెక్కువ. అందుచేత నాకప్పుడు పితృవియోగ దుఃఖము మన స్సున నాటలేదు. మా తండ్రిగారి యుత్తరక్రియ లయిన తరువాత మేమందఱమును కాకినాడ విడిచి వచ్చి రాజమహేంద్రవరము చేరి తిమి.

ఆకాలమునఁదు గోదావరి కాలువలు క్రొత్తగా త్రవ్వుచుండిరి. అప్పుడు కాలువల పనిపై నధికారము వహించియుండిన యొక దొర వద్ద నా పెదతండ్రిగారికి లేఖకోద్యోగము దొరికినది. అందుచేత మా నిమిత్తము వచ్చిన మనుష్యుల వెంట బయలుదేఱి యయిదేండ్ల వాఁడనయిన నేనును నా తల్లియు పెదతల్లియు నొకపల్లకిలో గూరు చుండి కొంతదూరము ప్రయాణము సాగినతరువాత మార్గమధ్యము నందొక కాలువ దాటవలసి వచ్చెను. ఆసమయమునం దెట్లో నేను కాలువలోఁ బడి ప్రవాహవేగమునఁ గొట్టుకొనిపోవుచుంటిని. పల్లకిని మోయుచున్న బోయవాఁ డొకఁడు చూచి నన్నుఁ బట్టుకొని, పల్లకి లోని నా తల్లుల కొప్పగించెను. మృత్యుముఖమునఁబడి వెలువడినది యీ జలగండముతో నిది మూఁడవసారి.

కొంతకాలము నా పెదతండ్రి వేంకటరత్నముగారు రాజమ
హేంద్రవరములోనే పనిలో నుండిరి. నేను మొట్టమొదట మాయింటికి
న్నాఱు గజములలో నున్న గోపాలస్వామి యాలయములో నుండిన
చదువులబడికిఁ బంపఁబడితిని. ఆ బడిపంతులయిన పులిపాక అమ్మి
రాజుగారు తొట్రినోటివాఁడగుటచేత నాతఁడు ముక్కుతో మాటా
డెడివాఁడు. అల్పకాలములోనే యీ యయ్యవారిహాలోక యాత్రను
విడిచినందున తదనంతరము మా యింటికి సమీపమునన్నున్న సోమ
రాజుగారి బడికి మావారు నన్నుఁ బంపిరి. గూనివాఁడగుటచేత నీయ
నను గూనిసోమరాజుగారని సాధారణముగా బిలిచెడివారు. ఈయన
తెలుఁగునందుఁ గొంత పాండిత్యము గలవాఁడయి పిల్లలచేత పురా
ణమును గూడఁ జదివించి యర్థము చెప్పుచు వచ్చెను. నాచేతఁ బ్రథ
మమున నర్థసహితముగా బాలరామాయణమును నమరనిఘంటువును
చదివించిరి. అటుతరువాత వాచకమును భ్రాతయుఁగాక రుక్మిణికల్యా
ణమును, సుమతీశతకమును, కృష్ణశతకమును, ఆంధ్రనామసంగ్రహ
మును, నాచేత వల్లెవేయించిరి. ఇంతటితో నన్ను బడి మానిపించి
రాజకీయోద్యోగమునకుఁ గావలసిన పనిని నేర్చుకొనుటకయి
తాలూకాకచేరిలో గుమాస్తాగానున్న పోతరాజు రఘురామయ్యగారి
యొద్ద ననొప్పగించిరి. నేను ప్రతిదినమును మధ్యాహ్నమున తాలూ
కాకచేరికిఁ బోయి యాయన చెప్పిన పని చేయుచుంటిని. ఈకాల
ములో దూరి సోమయాజులుగారు ప్రాతఃకాలమునందు మా యింటికి
వచ్చి నాకు రఘువంశమును జెప్పుచుండిరి; సాయంకాలమునందు మా
పెదతండ్రిగారే నాకింగ్లీషక్షరములను, గుణితమును, మాటలను
నేర్పుచుండిరి. హిందూదేశ రాజ్యనిర్వహణ భారమును శ్రీమహా
రాజ్ఞిగారే స్వయముగా వహించిన తరువాత దేశభాషలలోను,
నింగ్లీషుభాషలోను సామాన్యపరీక్షలును విశేషపరీక్షలును గొన్ని

యేర్పఱుపబడినవి. 1860-వ సంవత్సరమున మావారు నన్ను దొర తనమువారి మండల పాఠశాల కిండ్లీషు నేర్చుకొనుటకయి పంపిరి.

నేనిండ్లీషు పాఠశాలలోఁ బ్రవేశించునప్పటికయినను దేహము దృఢపడి కండపుష్టిఁ గలవాఁడనై యుండక పెద్దగాలి వేసిన నెగిరి పోవునట్లు సన్నముగా పూచికపుడకవలెనుండెడివాఁడను. నాతల్లియుఁ బెదతండ్రియు నా కన్నమును చిఱుతిండియు నధికముగా బెట్టి నాజీర్ణా శయమును గొంతవఱకు దుర్బలపరచినారు; నా పితామహిషియు ప్రపితామహిషియు నను గడప దాటనీయక యెత్తుకొని మోచి నా శరీరమును దుర్బలపఱచినారు. అందుచేత నాకప్పు డజీర్ణవ్యాధి చిహ్నములు పొడచూపుటయేగాక పీనసరోగ మొకటి క్రొత్తగా నన్నాశ్రయించినది. నన్నీ వార్థకదశయందును విడిచిపోఁజాలకున్నది. చదువ నియమించిన పాఠము రెండు మూడు సారులు చదువునప్పటికే వచ్చినను, వ్రాయ నియమించిన కాగితములు గంటలోనే ముగింపఁ గలిగినను, దినమంతయు చదువుచున్నట్టును, వ్రాయుచున్నట్టును నటించుచు, నా ప్రపితామహివద్దచేరి మెల్లగా నామెతో నేనో మాటలు వేయుచుండెడివాఁడను. నేనిండ్లీషు నారంభించుటకు ముందే సంభవించిన యామె కైలాసప్రాప్తితో మా బాలవృద్ధకథాకాలక్షేపములు పరిసమాప్తి నొందినవి. గర్భాష్టమునందనగా నేడవయేటనే నా కుపనయనము జరిగినది మొదలుకొని త్రికాలములయందును యుక్తసమయమునందు సంధ్యావందనముచేయుచు గాయత్రి నెంతో శ్రద్ధతో ప్రతిదినము జపించుచుంటిని. సహస్రగాయత్రి చేసిన దినములునుఁ గొన్ని కలవు. అప్పుడప్పుడు సాయంకాలముల గోదావరికి బోయి సూర్యున కర్ఘ్యప్రదానముచేసి సంధ్యవార్చి ప్రదోషకాలమున మార్కండేయస్వామి యాలయమునకును వెనుక గోపాల స్వామి యాలయమునకును బోయి వచ్చుచుందును. త్రిరేఖలుదీర్చి

దట్టముగా ముఖముమీఁదను మోమ్మీమీఁదను భుజములమీఁదను విభూతిపెండెకట్లు సవరించి, శుద్ధ శ్రోత్రియునివలె బిళ్ళగోచిపెట్టి బట్ట కట్టుచుందును. ఒక్క-ప్రొద్దును నుపవాసము లుండలేకపోయినను, ఏకాదశినాఁటి రాత్రి ప్రొద్దుపోయినదాఁక మేలుకొనుటయే కాక యొక సంవత్సరము శివరాత్రినాఁడు జాగారము సహితము చేసితిని. రఘువంశములో నైదు సర్గములు చదివియుండుటచేతను బడిలో నాంధ్రనామసంగ్రహమును జదివి పురాణముల వినుచు వచ్చుటచే తను గొంచెమర్థజ్ఞానము కలవాఁడనయి మా యింటనున్న ప్రాఁత తాటాకుల పుస్తకములను దీసి చదువ నారంభించితిని. భారతములో నా కత్యాత ప్రియములగు భాగములు విరాటపర్వములోని యుత్తర గోగ్రహణమును, భీష్మ ద్రోణ కర్ణ శల్య పర్వములు; శ్రీమద్భాగవ తములోని సప్తమస్కంధమును, దశమస్కంధమును మా పెద తండ్రిగారికి స్థిరమయిన పనియయి యామున గ్రామాంతరములయం దుండుచు వచ్చుటచేత నింట నొంటిగానున్న నాకీ గ్రంథపఠనాదుల కవకాశము కలిగినది. నేనింగ్లీషారంభించుటకు ముందే నాకు ఛాందస వృత్తి బలియ నారంభించినది. నా తల్లి మొదలయినవారు నన్ను నిష్ఠాపరత్వమునుండి మరల్పఁజూడక ప్రోత్సాహపఱుచుచు వచ్చిరి. ఆ కాలమునందు నాకు దేహబల మెంత తక్కువగా నుండెనో బుద్ధి బల మంత యెక్కువగా నుండెనని చెప్పవచ్చును. నాకా పిన్నవయ స్సునఁగల గ్రహణధారణశక్తులసాధారణము లయినవి. అయినను నాకు వానివలన విశేషలాభము కలుగుటకు మాఱుగాఁ గొంతవఱకు నష్టమే కలిగినదని చెప్పవచ్చును.

రెండవ ప్రకరణము - విద్యార్థి దశ

క్రీస్తు శకము **1860** మొదలుకొని **1870** వ సం॥ వరకు

వేసవికాలపు సెలవు లయినతరువాత రెండవ యర్థసంవత్స రమునందే పాఠశాలలో నేను ప్రవేశించినను సంవత్సరాంతమునఁ బరీక్షలు జరుగునప్పటికి మా తరగతిలో మొదటి బహుమానమును బొందితిని. మా పాఠశాల మందిరము పరశురామప్రీతి యయిపోయి నందున నా యగ్రబహుమాన పుస్తకము సహిత మగ్నిహోత్రులకే యర్పిత మయిపోయినది. నూతన భవనము నిర్మింపఁబడువఱకును గొంతకాలము పాఠశాల చిత్రవస్తు ప్రదర్శనశాలలోఁ బెట్టఁబడినది. అక్కడ నేను రెండవ తరగతిలోఁ జదువఁ జొచ్చితిని. అప్పటికే నాకు దెలుఁగు పుస్తకములయం దభిలాష హెచ్చి మా యింటఁగల తాటాకు పుస్తకములనే చదువుచుండ సాఁగితిని. నా తల్లియు మత్తవతల్లియు మా యింటికి సమీపమునందే వాసముచేయుచుం డిన కానుకొలను రామచంద్రుఁడుగారను పేరుగల మా యుపాధ్యా యుని యొద్దకుఁబోయి నేనింట నింగ్లీషు పుస్తకములను ముట్టుచుండు టయే లేదనియు నన్ను శిక్షింపనలసినదనియు నొకనాఁ డాయనను వేఁడుకొంటిని. నే నింగ్లీషుపాఠ మొప్పగింపని దినమొక్కటియు లేద నియు, నేను నా తరగతిలోఁ బ్రతి పాఠమునందును మొదటివాఁడను గానో రెండవవాఁడనుగానో యుందుననియు, చెప్పి యాయన వారిని బంపివేసెను. నే నింటినుండి పాఠశాలకుఁ బోవుచు దారిలోఁ బాఠ మును జూచినంతమాత్రమునచే నాకవి ముఖస్థమయి యప్పటికి తప్పులు లేక యప్పగింప శక్తుఁడ నగుచుంటిని.

ఈ కాలములో నాకుఁ బురాణములు చదువు పిచ్చి యంతకం తకు ముదురఁ జొచ్చినది. తపోమహత్వములను గూర్చి చదువుచు న్నప్పుడెల్లను నాకుఁ జిత్తోద్రేకము గలిగి, ఈ తపోవర్ణన లన్నియు సత్యములని నమ్మి యితరులను నా భ్రమలోఁ బడవేయఁ దొడఁగితిని. నా భ్రమలో ననాయాసముగాఁ బడినవారు నా సహపాఠు లయిన రాచర్ల వెంకటరామయ్యగారును కనపర్తి లక్ష్మయ్యగారును హోతా వీరభద్రయ్యగారును. హిమవత్పర్వతము మీఁదఁ దపసు చేయునట్లు పథకమేర్పఱచి, వారిని ముగ్గురిని బ్రయాణము చేసితిని. ఒకనాటి సాయంకాలమున వారిలో నిరువురు నాయొద్దకు వచ్చి రేపే ప్రయాణమని చెప్పిరి. నేను వారివెంట రాఁజాలనంటిని. వారు పాఠ శాల దారినే, తపోగమన ప్రారంభులయి యుత్తరాభిముఖముగా వెడలిరి. మూడవ యతనిని పిఠాపురము వద్దనే పట్టుకొని యింటికిఁ గొనివచ్చిరి. విజయనగరము వఱకును బోయిన తరువాత రెండవ యతఁడు మురుగు లమ్మికొని వెనుకకు మరలెను. మొదటి యతఁడు వెండిమొలత్రాడమ్మికొని జగన్నాథము వఱకును బోయి యాత్ర చేసికొని, పోయినదారినే మరలివచ్చెను.

నా తల్లియు పెదతండ్రిగారును గలిసి యాలోచించి మా పట్ట ణమునకు రెండు మైళ్ళ దూరములోనున్న కాతేరను గ్రామమునం దున్న యద్దంకివారి పడుచును నాకు వివాహము చేయుటకయి యేర్పాటు చేసిరి. నాకు పదమూఁడవ యేటను నా సహధర్మచారి ణికిఁ దొమ్మిదవ యేటను బొమ్మలపెండ్లివలె మా వివాహమహోత్స వము నడచినది. నా పెండ్లి కొక్కటికాదు, రెండు బోగముమేళము లను బెట్టిరి. నా భార్య యద్దంకి పట్టాభిరామయ్యగారి కొమారిత. మేనమామయు కాతేరి కరణమును నగు వెన్నేటి వెంకటరత్నము గారే యా చిన్నదానిని బెంచి నాకిచ్చి వివాహము చేసిరి. సంతా

నము లేనివారయినందున దమ మేనకోడలియం దాయనయు భార్యయు నెక్కువ ప్రేమగలవారయి పెంచిన మోహముచేత పెట్టు పోతలయం దేలోపమును గలుగనీయక దయచూపుచుండిరి. మేన మామగారు బడికి బంపుచుండుటచేత, బెండ్లినాటికే తెలుగు కొంత చదివినది. వివాహ దినములలో మా యిరువుర నొక్కచోట గూరు చుండబెట్టి మాచేత రుక్మిణీకళ్యాణములోని పద్యములను జదివించుట నాకిప్పటికిని స్మరణకు వచ్చుచున్నది. నా భార్యకు జననీజనకులు పెట్టినపేరు బాపమ్మ యయినను వివాహమయిన తరువాత మాతల్లి యా పేరు మార్చి రాజ్యలక్ష్మి యని తనతల్లి పేరు పెట్టినది. ఈ ప్రకారముగా ద్వాదశవర్షము పూర్తియయిన తరువాత నేను బ్రహ్మ చర్యాశ్రమమును విడిచి 1861వ సంవత్సరము నందు గృహస్థాశ్రమ మునందుఁ బ్రవేశించితిని.

నా పెండ్లి యయిన తరువాత నా పెదతండ్రిగారి భార్యకును నా తల్లికిని తగవులాట లారంభమైనవి. మొత్తముమీద నాతల్లిదే యెక్కువ తప్పిదమని చెప్పవచ్చును. నా తల్లి కోపస్వభావమును, స్వతంత్రబుద్ధియు వాక్పారుష్యము గలదయినను, దయార్ద్రహృదయ మును, పరోపకారచింతయు, సత్యశీలతయు, ధైర్యశాలిత్వమును, పూనిన కార్యమునందలి స్థిరప్రవృత్తియు నామె కలంకారములుగా నుండెను. ఆమె గుణములలోఁ గొన్ని నాకును బట్టుపడినవి. ప్రకృతి చేత నేనును కోపస్వభావము గలవాఁడనే; సాధారణముగా నేనెంత శాంతచిత్తుఁడనుగా గానబడినను నాకు కోపమతిశీఘ్రముగావచ్చును. కొంతకాలమువఱకు నా పెదతండ్రిగారు కారణములేని ఈ శుష్కకల హములను వారించుటకయి నయమున భయమున సర్వవిధముల ప్రయ త్నము చేసి చూచెను, గాని దేనివలనను కార్యములేకపోయెను. నా పెదతండ్రిగారొకసారి భాగములు పంచుటకు వస్తువులపట్టికను వ్రాయ

వలెనని కూరుచుండి, చేతులాడక గదిలోనికి బోయి మంచముమీఁద బరుండి దుఃఖింపఁ దొడగెను. మరలఁ గొన్నిదినముల కాయన 1862వ సంవత్సరము ఆగష్టు నెలలో నొకనాఁడు భాగముల పట్టికను వ్రాసి నా సగపాలు నాకిచ్చివేసెను. తరువాత కొలఁదికాలములోనే నా పెదతండ్రిగారు తమ యుద్యోగధర్మమునుబట్టి గ్రామాంతరము నకుఁ బోవలసినవారయిరి. నా పాలికి వచ్చిన యక్కఱకుమాలిన వస్తువు లేవేవో యమ్మి వేసి మా తల్లి మా యప్పాల నప్పుడే తీర్చి వేసెను. ఆమె యటుతరువాత సహితము పది రూపాయలైనను ఋణ మెప్పుడును చేయలేదు. మా పెదతండ్రిగారు తమ వంతు గృహము మీఁద వచ్చిన యద్దెనుగూడ పుస్తకముల నిమిత్తమును విద్యనిమిత్తమును నాకే యిచ్చుచుండిరి; ఇదిగాక యప్పుడప్పుడు మాకు కొంత ధనసాహాయ్యమును సహితము చేయుచు వచ్చిరి.

ఈ కాలమునందు నేనుజేసిన యకార్య మొకటి కలదు. ఓగిరాల జగన్నాథముగారప్పుడు రచించిన సుమనోమనోరంజన ప్రబంధమునంతను మూఁడవ తరగతిలోఁ జదువుకొనుచుండినప్పుడే కాగితములమీఁద వ్రాసికొంటినని నా చదువరులు విన్నప్పుడు నాకుఁ దెలుఁగునందుఁగల యభిలాషాధిక్యమును తెలిసికోఁగలరు. ఆంధ్ర కావ్యములలో నెల్లను వసుచరిత్ర ముత్తమమైనదని పలువురు చెప్పుచు వచ్చిరి. అప్పుడా పుస్తకము వెల నాలుగు రూపాయల యెనిమిదణాలు; నాచేత నెనిమిదణాలకంటె నెక్కువగా లేవు; నాతల్లి నడిగిన నేమియు నిచ్చుజాడ కనఁబడలేదు. పుస్తకపఠనాభిలాషము నన్నవివేకిని జేయగా నేను పుస్తకవిక్రేతయగు పందిరి మహాదేవుడను వైశ్యునికడకుఁ బోయి, నా వాంఛను దెలిపితిని. పుస్తకము వెల పూర్ణముగా తీఱువఱకును తన పుస్తక విక్రయశాలలోనే దానిని చదువుకొనుచుండునట్లు సమయమేర్పఱచి, యా పణికుడు నాప్రార్థన

మంగీకరించెను. ఆవజకు నాయొద్దనున్న యెనిమిదణాలును నాకప్పుడు నెలజీతముకొరకిచ్చిన యెనిమిదణాలును జేర్చి యొక రూపాయ పుస్తక విక్రయికున కిచ్చి యాతని యంగడిలోనే కూరుచుండి పుస్తకమును జదువ నారంభించితిని. నేను పాఠశాలకు బోకుండుట రెండవ వెలలోనే నా సహపాఠులవలన నా తల్లికిఁ దెలిసినది. అప్పుడామె నన్ను మందలించి మిగత సొమ్మిచ్చి నాకా పుస్తకమును గొనిపెట్టి నన్ను మరల పాఠశాలకుఁ బంపెను.

శీఘ్రకాలములోనే చేసిన నేరమునకు దండనమో యనునట్లు నాకు వ్యాధి యారంభమైనది. నాకు శైశవము నుండియు నుండిన దగ్గునకు తోడుగా నజీర్ణాతిసార రోగములుకూడ నన్నాశ్రయించి నవి. 1863వ సంవత్సరాంతము నుండి 1864వ సంవత్సరాంతము వఱ కును నేను మరణజీవితముల మధ్య నూఁగులాడుచుంటిని. గండ్రాపు వెంకన్నగారనెడు వైద్యశిఖామణి వైద్యమువలననే దేహస్వాస్థ్యము కలిగినది. నేనప్పుడు జీవించుట యతి మానుషమైన పరమాద్భుత కర్మమని యా మునయే పలుమాఱు నాతో ననుచు వచ్చెను. 1865 సంవత్సరారంభమున నాకు వ్యాధి నివ్మళించినను, వేసవికాలపు సెలవులయిన తరువాత దొరతనమువారి మండలపాఠశాలయందా వఱకు విడిచిపెట్టిన మూఁడవ తరగతిలోనే నేను మరలఁ బ్రవేశించి తిని. నే నాఱుమాసములే యా తరగతిలోఁ జదివినను సంత్సరాంత మునందు జరిగిన పరీక్షలో నేనే మొదటివాఁడనైతిని. సంవత్సరా ర్జిత సంఖ్యయు, సంవత్సరాంతపరీక్షా సంఖ్యయు నొంటిగా జేర్చిన సంఖ్యనుబట్టి యా సంవత్సరము నాతరగతిలో నేనే ప్రథముడనైతిని. ఆ సంవత్సరము మొదలుకొని పాఠశాలలోఁ జదువుకొన్నంతకాల మును నేను చదువునిమిత్తము జీతమీయవలసిన యావశ్యకమే లేక పోయెను.

నాల్గవ తరగతిలోఁ జదువుకొనుచున్న కాలములో నన్ను గూర్చి నేను విశేషముగాఁ జెప్పుకొనవలసిన దేదియు లేదు, ఒక నాడు మధ్యాహ్న కాలమున మా మండల న్యాయాధిపతియైన హైకోర్టు మారీసుగారు పాఠశాలను జూచుటకయి యాకస్మికముగా వచ్చి పాఠశాలలోని బాలురలోనెల్ల సత్ప్రవర్తనము గలవారెవ్వరో వారి పేరు వ్రాయవలసినదని విద్యార్థుల కందఱికిని కాగితపుముక్కల నిప్పించిరి. ఆ కాగితపు ముక్కల నన్నిఁటిని పోగుచేసి యందు వ్రాయఁబడిన నామధేయములను జదివినప్పు డధికసంఖ్యగల బాలురు నా పేరు వ్రాసినట్లెర్పడెను. సద్వర్తనము కొఱకై యొక బహుమానము నియ్యఁదలఁచుకొని దొరగారిట్లు పేరులు వ్రాయించిరి. ఆ బహుమానము నాకే వచ్చినదని చెప్పనక్కఱ లేదు. ఆ దొరగారు పది రూపాయల విలువగల పుస్తకములు నన్నుఁ గోరుకొమ్మన్నప్పుడు నైతరగతికి గావలసిన పుస్తకములను, నిఘంటువు నొకదానిని నేను గోరుకొంటిని. ఆ నిఘంటువుపై దొరగారు స్వహస్తముతో వ్రాసిన వ్రాతను జూచుకొన్నప్పుడెల్లను నాకు సంతోషము గలుగుచుండును. ఆకాలమునం దిరువది రూపాయలకు మించిన దొరతనమువారి యుద్యోగముల కర్హులనుగాఁ జేసెడిది సామాన్య పరీక్షయని యొకటి యుండెను. ఈ పరీక్షయందుఁగాని సర్వకలాశాలా పరీక్షయందుఁగాని కృతార్థులైనఁగాని యెవ్వరును విశేష పరీక్షలకు పోఁగూడదు. సామాన్య పరీక్షా ప్రశ్నపత్రములను జూచినప్పుడు నాకవి సులభముగా కనఁబడినందున నాకా పరీక్షకుఁ బోవలెనని యత్యంత కుతూహలము కలిగెను. నాకప్పటికి పదునెనిమిది సంవత్సరములు నిండ లేదు. అయినను శీఘ్రముగాఁ బరీక్షసిద్ధుఁడను గావలెనన్న బాల్య చాపల్యముచేత నేను పరీక్షకు పోవుట మానక నా వయస్సు పందొమ్మిది సంవత్సరములని కాఁబోలును ప్రార్థనాపత్రమునందు వ్రాసి

పంపిత్రిని. ఇంగ్లీషు వైద్యుడు సహితము నేను స్ఫోటకపడితిననియు నా వయస్సు పందొమ్మిది సంవత్సరములనియు నిర్ణయపత్ర మిచ్చెను. గాని యంతమాత్రముచేత నేను దోషిని గాకపోను. ఆసంవత్సరమే నే నుభయభాషలలోను పరీక్షాసిద్ధుఁడనై, ఉత్తర సర్కారులలో కృతార్థులైన వారిలో రెండవ వాఁడనై నిలిచితిని. ఆ కాలమునందు బుద్ధిపూర్వకముగా నాడిన యసత్య మిది యొక్కటియే యని నా నమ్మిక ము.

మా మండల పాఠశాలలోని యప్పటి తెలుఁగు పండితులైన పులిపాక గురుమూర్తిశాస్త్రిగారాంధ్రమునందంత పాండిత్యము గలి గినవారు కారు. ఆ యాంధ్రోపాధ్యాయుఁడు మా తరగతిలోని బాలురకు పాఠములు నాచేతనే చెప్పించి యెప్పుడును నన్నగ్రస్థాన మునందుఁ గూర్చుండఁబెట్టెడివాఁడు. మాకుఁ గొంతకాలము నైయా పురి మొవల్యారుగారు ప్రధానోపాధ్యాయులుగా నుండిరి; ఇంగ్లీషు పద్యకావ్యములయం దాయన కర్థముకాని భాగములకుఁ గొన్నిసమ యములయందు నేను సరియైన యర్థము చేయుచుండఁగలుగుట చూచి యింగ్లీషునందు నేను గట్టివాఁడనని యాయన యెల్లరతోను చెప్పుచుండెడివాఁడు. ఆయన తరువాత మాకు చెంగల్వ కుప్పుస్వామి శాస్త్రులవారు ప్రధానోపాధ్యాయులుగా వచ్చిరి. ఆయన చేయలేని లెక్కలను నేను జేయఁగలుగుచుండుట చూచి గణితశాస్త్రము నందు గట్టివాఁడనని నన్ను మెచ్చుకొనుచుండెడివారు. దేశపటము లను వ్రాయుటయందు తక్కిన బాలురకంటె నాకెక్కువ నైపుణి యుండెను. నేను రెండవ తరగతిలోనో మూడవ తరగతిలోనో చదువుకొనుచుండిన కాలములో నా పెదతండ్రిగారును ములుకుట్ల గంగన్నగారును గలిసి మాయింట రాత్రులు ప్రొద్వివాక పరీక్షకుఁ జదువుకొనుచుండెడివారు. వారు చదువుట కారంభించినప్పుడు గత

దినము చదివినదాని చింతనము చేయుచుండెడివారు. రాజశాసన ప్రకరణ భాగములలో నేదియైనను వారికి స్మరణకు రాకపోయె నేని నేనందుకొని చెప్పుచుండెడివాఁడను. నా ధారణాశక్తికి వారా శ్చర్యపడుచుండెడివారు. నాల్గవ తరగతిలోను సంవత్సరాంత పరీక్షలోను నేనే మొదటివాఁడ నైతిని. పరీక్షాప్రశ్నముల కేర్పఱుపఁబడిన పరమసంఖ్య 480 లో నాకు వచ్చిన సంఖ్య 420. అప్పటి పాఠశాలా పరీక్షకులైన బవర్సుదొరగారు 'నన్ను ప్రత్యేకముగా తమ గదిలోనికిఁ బిలిపించి, ఆదరముతో నా వీపుమీఁద తట్టి, యిచ్చట ప్రవేశపరీక్షుం డేటిన తరువాత చెన్నపురికిఁబోయి పట్టపరీక్షవఱకును తప్పక చదువ వలసినదని హితబోధ చేసిరి. ఆ సంవత్సర బహుమాన సమయము నందు సద్వర్తనమునిమిత్తమయి యిచ్చిన పుస్తకములును పరీక్షయం దగ్రపదమును బడసినందున కిచ్చిన పుస్తకములును గలిసి నేను మోయలేనన్ని యాయెను. ప్రవేశపరీక్ష తరగతిలోఁ జదువునప్పుడు నేను పాఠశాలలో జీతమియ్యవలసినపని లేకపోయెను.

1867వ సంవత్సరము నందు నే నయిదవ తరగతిలో ననఁగా ప్రవేశపరీక్ష తరగతియందు చదువుచుండినను నాకా సంవత్సరము చదువు సాగనేలేదు. మా పెదతండ్రిగారు రోగపడి రాజమహేంద్ర నరమునకు వచ్చి లోకాంతరగతులయిరి. నా తల్లియొక్కయు బంధు వులయొక్కయు ప్రేరణమువలన మండలన్యాయాధిపతియగు మారీసు దొరగారిని పని నిమిత్తమయి పోయి చూచితిని. మా పెదతండ్రిగారు లోకాంతగతులయిన తరువాత దొరగారాయన మృతికి విచారించి మంచిమాటలతో ననూఁజడించి, ఆయేర్పాటులో కడపటిదానిని నాకిచ్చెదనని వాగ్దానము చేసిరి. రెండు మూడు దినముల కాపని పరీక్షాసిద్ధుఁడు కాని మరియొకని కియ్యఁబడినట్లు, సిరస్తాదారుగారు నూఱు రూపాయలు సారితోషికముగా స్వీకరించి యాపని యాతనికి

వేయించినట్లు తెలియవచ్చినది. అట్లా శాభంగము గలుగుట కలుక పొడమి ముందెప్పుడును న్యాయసభలో లేఖకోద్యోగమునందుఁ బ్రవేశింపకుండునట్లు శపథము చేసికొని, మరలఁ బాఠశాలకుఁబోవ నారంభించితిని. ప్రధానోపాధ్యాయుఁడైన వైమూపురి మొబల్యారి గారింగ్లీషు పద్యకావ్యమును చక్కఁగా బోధించుటకు సమర్థులు గాక యుండిరి. సమర్థుఁడైన మఱియొకరిని నాయున స్థానమునకు రప్పించుట కర్తవ్యమని విద్యావిచారణాధికారిగారికిఁ బంపునిమిత్త మింగ్లీషున నొక సంఘనివేదనము వ్రాసి దానిపైని మా తరగతిలోని వారిచేత వ్రాళ్ళు చేయించి, తక్కిన తరగతిలోని బాలుర చేవ్రాళ్ళు చేయించుటకై కనకపర్తి లక్ష్మయ్యగారి చేకిచ్చి యొక భానువారమునాఁ డావిజ్ఞాపనపత్రమును బంపితిని. విజ్ఞాపనపత్ర వార్త మా ప్రధానోపాధ్యాయునికిఁ దెలిసి దానిని తెచ్చి తనకిమ్మని మా తరగతిలోనే చదువుకొనుచుండిన మొండ్రేటి రామచంద్రుఁ డను నాతనిని యొడఁబఱిచెను. అతఁడు తానందు వ్రాలుచేసి తెచ్చినట్లు నటించి దానిని మా ప్రధానోపాధ్యాయున కిచ్చెను. నేనంతటితో నిరుత్సాహుఁడను గాక నామిత్రు నేమియు ననక, మఱియొక ప్రతిని సంతకముచేయించి పంపవచ్చునని చెప్పి యాతని నింటికి బంపివేసితివి. ఆ మఱునాఁడు మా ప్రధానోపాధ్యాయుఁడు చేత బెత్తము పట్టుకొని నాల్గవతరగతి లోనికిఁబోయి నా మిత్రుని గొడ్డును బాఁదినట్లు బాఁదెను.

ప్రధానోపాధ్యాయుఁ డట్లు నా మిత్రుని గొట్టి మా తరగతి లోనికి వచ్చి నన్ను "బుద్ధిహీనుడా" యని తిట్టెను. ఆమాట యన గానే నేను తరగతిని విడిచి యావలికిఁ బోయితిని. నా తరగతిలోని బాలురందఱును వెలుపలికి వచ్చి నాతోఁగలసి యిండ్లకుఁ బోయిరి. ఆ ప్రధానోపాధ్యాయుఁ డాదినమువఱకును నన్నెప్పుడును గౌరవముతోఁ జూచుచుండెడివాఁడు. విద్యున్ము లనేకములు ప్రథమప్రయ

త్నములోనే కలిగినను నేను లేశమాత్రము జంకక, ఆ ప్రధానోపా
ధ్యాయుని నక్కడనుండి పంపివేయువఱకును పనిచేయువలయునని
నిశ్చయించుకొంటిని. ఈ విషయమున మా పాఠశాలలోని సహాయో
పాధ్యాయులుకూడఁ గొందఱు మమ్మ్మె ప్రోత్సాహపఱిచిరి. మేము
మఱునాటినుండి పాఠశాలకుఁ బోవ మానితిమి. మఱుసటినాఁడు
ప్రధానోపాధ్యాయుఁడు పాఠశాలకుఁ బోవునప్పటికి వట్టి బల్లలేకాని
పిల్లలు లేకుండిరి. మేము సంఘ విజ్ఞాపనపత్రములను మరల సిద్ధము
చేసి అధిక సంఖ్యాకులచేత వ్రాళ్ళు చేయించి యొక ప్రతిని విద్యా
విచారణకర్తకు చెన్నపురికిని, ఇంకొక ప్రతిని పాఠశాలాపరీక్షకునకు
విశాఖపట్టణమునకును బంపితిమి. అంతేకాక యాదినమునే విద్యా
విచారణకర్త యగు మాగ్డానల్డుగారికిని, పాఠశాలాపరీక్షకులగు గ్రిగ్సు
గారికిని, తంత్రీవార్తలనుగూడఁ బంపితిమి, వెంటనే రాజమహేంద్ర
వరమునకుఁ బోయి విచారణ చేయవలసినదని విద్యావిచారణకర్త
పాఠశాలాపరీక్షకునకు వ్రాసి, మా విజ్ఞాపనపత్రమును వారికి బంపిరి.
గ్రిగ్సుగారు రాజమహేంద్రవరమునకు వచ్చి మమ్మందఱిని పిలిపించి
విచారణచేసి, వైయాపురి మొదల్యారిగారిని వేఱొకచోటికి బంపి
వేయవలసినదని పయికి వ్రాసిరి. విద్యావిచారణాధికారి వైయాపురి
మొదల్యారిగారిని నరసాపురమునకు బంపి, అక్కడనుండి చెంగల్వ
కుప్పుస్వామిశాస్త్రులవారిని రాజమహేంద్రవర మండల పాఠశాలకు
ప్రధానోపాధ్యాయునిగాఁ బంపిరి. మేమందఱమును మరల పాఠశా
లకుఁ బోయి చేరితిమి. మొదటి విజ్ఞాపనపత్రము నెత్తుకొనిపోయి
ప్రధానోపాధ్యాయున కిచ్చిన విద్యార్థి విశాఖపట్టణమునకుఁ బోయి
యచ్చటి ప్రభుత్వమువారి బోధనాభ్యసన పాఠశాలలోఁ జేరెను.

1868వ సంవత్సరములో నేను మరలఁ బాఠశాలలోఁ జేరినను
నాకా సంవత్సరమునను చదువు జరగలేదు. మా పెత్తండ్రిగారి మర

ణానంతరమున చరగూపమైన సొత్తంతయు పట్టుకొని యాయన భార్య తన పుట్టినింటికిఁ బోయెను. మా పెదతండ్రిగారి వంతునకు వచ్చిన గృహభాగము మిక్కిలి విశాలమయి పట్టణ మధ్యమందుండెను. ఆ యింటి నపహరింపవలెనని కన్నువేసియున్నవారిలో నొకరిద్ద ఱది విక్రయింపుమని నా పెదతల్లిని ప్రోత్సాహపఱిచిరి. పాపభీతిలేని యొక గొప్ప గృహస్థుఁ డా యిల్లామెవద్ద నతి హీనవిక్రయమునకు వ్రాయించుకొని, భర్తయొక్క యుత్తరక్రియల నిమిత్తము ఋణములు చేసినట్లుగా నిష్ఠులైనవారిపేర దొంగపత్రములు వ్రాయించి, వారిచేత వ్యాజ్యములు వేయించి తీర్పులను బడసెను. ఈసంగతి నా తల్లికిఁ దెలిసి నన్నుఁ దీసికొని యొక న్యాయవాది కడకుఁ బోయి గృహవిక్రయము నాపింపవలసినదని యాయనను వేఁడెను. మా గృహరహస్యములను బూర్ణముగాఁ దెలిసినవాఁడైన యా న్యాయవాది యావజ్జీకు జరిగిన విభాగము క్రమమయినది కాదని చెప్పి అనుగత న్యాయసభలో వ్యాజ్యము వేసెను. న్యాయాధిపతి విచారణ చేసి యావజ్జీకు జరిగినది క్రమమయిన విభాగమేయని వ్రాసి మా వ్యాజ్యమును కొట్టివేసెను. అంతటితో నూరకుండక యా న్యాయవాదియే మండలన్యాయసభలో దానిపై నుపర్యభియోగము చేయించెను. మండలన్యాయాధిపతి దానిని సహితము కొట్టివేసి రెండు న్యాయసభలలోను ప్రతివాదికైన కర్చు లిచ్చుకోవలసినదని తీర్పు చెప్పెను. వ్యయములక్రింద నా భార్యకుండిన నాలుగైదు వందల రూపాయల నగలను విక్రయింపవలసి వచ్చినది. నా పెదతండ్రిగారి భార్య యిప్పటికిని సజీవురాలయి నాకంటె నెక్కువ దార్ఢ్యము కలదయి యున్నది.

ఈకాలమునకే నేను తెలుఁగున కవిత్వము చెప్పుట కారంభించితిని. నేనేకేశ్వరోపాశకుఁడను గాక యప్పటివఱకు విగ్రహారాధ

కుఁడనై యే యుంటిని. కవిత్వము చెప్పుట కారంభింపఁగానే గోపాల స్వామివిూద నొకటియు, మార్కండేయస్వామివిూద నొకటియు రెండు కందపద్య శతకములను జెప్పితిని. వీనిలో మొదటిది మార్కం డేయ శతకము; రెండవది గోపాల శతకము; ఈ కడపటి శతకము లోని యీ క్రిందిపద్య మొకటిమాత్ర మభాగ్యోపాఖ్యానములో మొదట వేయుటచేత నిప్పటికి నిలిచియున్నది.

క. శ్రీరమణీహృల్లోలా, కారుణ్యలతాలవాల కాంచనచేలా
ఘోరాహవజయశీలా, శ్రీరాజమహేంద్రవరపురీ గోపాలా!!

నేనప్పుడు శివకేశవులు సమానులన్న విశ్వాసముతో నుభ యుల నారాధించుచు, వేదాంతమునందెక్కువ యభిరుచిగలవాఁడనై యుండెడివాఁడను. వేలకొలది గాయత్రీ జపము చేయుచునుండుటయే కాక యాంజనేయ మంత్రమును రామమంత్రమును ఉపదేశమునొంది బహువారములు పునశ్చరణ చేసితిని. ఒక భూతవైద్యుఁడు నాకు దయ్యమును జూపెదనని చెప్పి, ఒకనాటి రాత్రి నన్ను దూరముగా నూరివెలుపలి కొక మట్టిచెట్టు నద్దకుఁ గొనిపోయి "నీవు భయపడక పోయినను ప్రభుత్వమువారి వలన నాకు చిక్కు వచ్చును నేను చూపను" అని చెప్పి నాకాశాభంగము కలిగించి వెడలిపోయెను. ఈసంగతి యితరులతోఁ చెప్పగా, వారు పిశాచగణములోఁ బుట్టిన వారికిగాని దయ్యములు కనఁబడవని నాకు సమాధానము చెప్పెడి వారు.

ఈ కాలమునందే కేశవచంద్రసేనులవారి యుపన్యాసములు కొన్ని చదువుటవలన నేనావఱకు సత్యములని నమ్మిచుండిన కొన్ని విషయములనుగూర్చి సందేహము కలిగెను. ఆ సమయమునం దాత్మారి లక్ష్మీనరసింహముగారు మా మండల పాఠశాలకు ద్వితీ యోపాధ్యాయులుగా వచ్చిరి. వారు బ్రహ్మసమాజ మతమునందప్పు

డభినివేశము గలవారు. ఆయు నత్సోత్సాహము వలన మే ముపయు క్త ములయిన విషయములను వారమునకొకసారి చర్చించుటకయి విద్యా ర్థులలో నొకసమాజము నేర్పరచుకొంటిమి. నేనుగాక కనపర్తి లక్ష్మయ్యగారును మరియిద్దరు ముగ్గురును మాత్రమా సమాజమునకు వచ్చుచుండిరి. మేమయిదాఱుగురమును లక్ష్మీనరసింహముగారి యింటివద్దగాని మాయింటివద్దగాని సభచేసికొనెడివారము. ఆయే డును సంవత్సరాంతర పరీక్షలోనాకు పుస్తకబహుమానము వచ్చెను. నేనాసంవత్సరము సర్వకళాశాలా ప్రవేశపరీక్షకు బోయితినిగాని కృతార్థుడను గాలేదు.


1869వ సంవత్సరమునందు నన్నుమరల రోగమాశ్రయింప దగ్గను దౌర్బల్యమును హెచ్చయ్యెను. చిన్నప్పటినుండియు నాయూ హాలెప్పుడును శక్యాశక్యవిచారములేక యున్నతపదములకయి పాఱు చుండెడివి. నామనస్సైశ్వర్యాధి కారముల నిమిత్తమెప్పుడును ప్రాక్కు లాముచుండెడిదికాదు. అచ్చతెనుఁగు కావ్యముల నొకరిద్దఱే రచియిం చిరని యెఱిఁగియుంటిని. నిరోష్ట్యకావ్యము నొక్కకవియే రచించె నని వినియుంటిని. నిర్వచనకావ్యము నొక్కకవియే రచియించి యుం డెనని తెలిసికొనియుంటిని. అందుచేత సామాన్యకవులు పోయినమా ర్గమునఁ బోవక యీమూఁడులక్షణములు నొక్కకావ్యమునందేకూర్చి యసాధ్యమైన క్రొత్తత్రోవను త్రొక్కవలెనని నాకప్పుడు సంకల్ప ము జనియించెను. బాల్యచాపల్యముచే సాహసముచేసి ‘‘శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధ’’ మనుపేర నలచరిత్రమును జేయబూని నాపూనిన ప్రతిజ్ఞ నెట్లోనిర్వహించి కృతకృత్యుఁడను గాఁగలిగితిని. ‘‘రసికజనమనోరంజన’’ మనుపేరనొక మిశ్రప్రబంధమునుగూడ జేయ నారంభించితిని.

ఆకాలమున చిత్రపు కామరాజుగారు మండల న్యాయసభలో దొరతనమువారి న్యాయవాదిగనుండిరి. మండలకర్గ్రాహితోను తది తర హూణాధికారులతోను నింగ్లీషున నుత్తరప్రత్యుత్తరములను జరపుటకు సమర్థుడైన యొకలేఖకుఁ డాయనకుఁ గావలసియుండెను. నెలకిరువది రూపాయల జీతమిచ్చెదననియు, ప్రాతఃకాలమున మూడు గంటలసేపు తనయింటివద్ద పనిచేయవలసినదనియు ఆయన నన్ను కోరెను. నేనంగీకరించి యాపనిలో చేరితిని. నే నాయనయింటివద్ద పని చూచుచున్నకాలములో సహితము కొన్నిసమయము లందాయన యుంచుకొన్న వేశ్యవచ్చి యాయనతో సరస సల్లాపములాడుచు వచ్చెను. అందుచేత నెలజీతము పుచ్చుకోఁగానే నాపనిమానివేసితిని. తరువాత రాజమహేంద్రవర మండల పాఠశాలకు ప్రధానోపాధ్యా యులైన బారోగారివద్దను, కారాగృహములపైనధికారియైన కెప్టెన్ హాల్లెట్టుగారివద్దను, తెలుఁగు చెప్పుటకయి నాకు నెలకు ముప్పదియైదు రూపాయలు వచ్చెడివి. 1869వ సంవత్సరమున నేను పరీక్షకు పోలేదు.

70 వ సంవత్సరమునందు బారోదొరవారు ప్రకటించుచుండిన 'గోదావరీ విద్యాప్రబోధిని' అను మాసపత్రికకు నేను తెనుఁగున వ్రాయుచుంటిని. నాశుద్ధాంధ్ర నిరోష్ఠ్యనిర్వచనైషధ మాపత్రిక యందే మొదట కొంచెము భాగము ప్రకటింపబడినది. నేను పాఠ శాలలో చదువకయే 1870వ సంవత్సరమున సర్వకలాశాల ప్రవేశ పరీక్షకుఁబోయి కృతార్థుఁడ నైతిని.

ఈప్రకరణమును జదివెడు యువజనులకు మిత్రసంగ్రహమును దార్చి కొంచెము హెచ్చరిక చేయనలసియున్నది. మాబంధువులే మాయింట కాపురముండెడివారు. ఆకుటుంబయజమానున కించు మించుగా నాయీడేగల యొక కుమారుఁడుండెను. ఇరువురమును పదు నెనిమిదేండ్ల ప్రాయముగల వారమగుటచేత మొట్టమొదట పండెము

2DA



వీరేశలింగము పంతులుగారు జన్మించిన – స్వగృహము

రాజమహేంద్రవరము.

20B

లేకయే చీట్లాటచుండి తరువాత చింతగింజలును, గవ్వలును బెట్టి యాడఁ జొచ్చితిమి. నామిత్రుని సోత్సాహముచేత గవ్వలు దమ్మిడీలయినవి; దమ్మిడీలు డబ్బులయినవి. ఈయాటవలన నేను రెండు మూడు రూపాయలను గెలిచితిని. నామిత్రుఁడును మిత్రుని మిత్రులును చీట్లాటకు రమ్మని యొకబోగము సానియింటికి నన్నుఁదీసికొని పోయిరి. ఆదినమునసొక ముసలిజూదరి మాత్రమే మాతోచీట్లాడెను. మరుసటి దినమునందు వాఁడు తనకూతురయిన పడపు పడఁతిని గూడఁగొనివచ్చి యాటకుఁగూర్చుండఁబెట్టెను. ఇంకను గొంతకాల మీదారినే యనుసరించినయెడల నేను నీతిమాలిన నిర్భాగ్యుఁడనయి చెడియుందునుగాని వెంటనే నాదుర్వ్యాపారమునుండి మరలుకొని నామిత్రునితోడి సాంగత్యమును విడిచిపెట్టితిని. బాగుపడగోరువారు దుస్సంగ దూరులగుటకు సర్వవిధములఁ బాటుపడవలయును.

మూడవ ప్రకరణము

ఉపాధ్యాయత్వ పత్రికావిలేఖకత్వ ప్రథమ దశ.

క్రీస్తు శకము 1870 మొదలుకొని 1880 వ సంవత్సరము వఱకు

ప్రవేశపరీక్షయందుఁ కృతార్థుఁడనైన కొన్ని నెలలలోనే నేను రాజమహేంద్రవరమునందలి దొరతనమువారి మండల పాఠశాలలో నప్పటి ప్రధానోపాధ్యాయులయిన కుప్పస్వామి శాస్త్రులవారి సాయమునలన నెలకిరువదియైదు రూపాయల జీతము మీఁద సహాయోపాధ్యాయుఁడనుగా నియమింపఁబడితిని. అల్పకాలికమైన యీపని సంవత్సరకాలముండి నిలిచిపోయినది. పనిలోనున్నకాలములో నేను గొన్ని తరగతుల కింగ్లీషును లెక్కలును హిందూదేశచరిత్రమును చెప్పుచుండెడివాడను. ఏలూరి లక్ష్మీనరసింహముగారు, దురిసేటి శేషగిరిరావుగారు, వేపా కృష్ణమూర్తిగారు మొదలయిన వారప్పుడు నాల్గవ తరగతిలో నావద్ద చదువుకొనుచుండెడివారు. నాకు న్యాయవాదియై పనిచేయవలెనని కోరికయుండెడిది. అందుచేత నేనుదానికి గావలసిన పరీక్షలకుఁ జదువ యత్నించితిని. మండలపాఠశాలలో నాతో సహోపాధ్యాయుఁడు చల్లపల్లి బాపయ్యగారు నాకు పరమ మిత్రుడుగానుండెను. 1871 వ సంవత్సరము శ్రావణమాసములో దండశాసనోన్నతపద పరీక్షకు మేమిరువురము బోయితిమి. మేమా పరీక్షలో లబ్ధవిజయుల మైనట్లు 1872 వ సంవత్సరమున రాజకీయ వ్యవహార పత్రికయందుఁ ప్రకటింపఁబడినది.

ఈకాలమునాటికి నాపూర్వవిశ్వాసములు కొన్నమార్పుచెందుచుండిభూతావేశమునందు నాకునమ్మకముపోయినది. ఈకాలమునందు జ్యోతిశ్శాస్త్రములోని ముహూర్తజాత భావములందును, శకునములు

మొదలైనవాని యందును నాకు విశ్వాసము పూర్ణముగా చెడినది. సమ్మకము లేనివానిని పామరుల సంతుష్టికై నమ్మినట్లు నటించి యాచరించుచుండుట సాధారణముగా నాస్వభావమునకు సరిపడదు. విశ్వాసములేని దానియందు విశ్వాసములేనట్లు చెప్పుటయు, అవిశ్వాసరాహిత్యమును మాటలచేతనే గాక చేష్టలయందును చూపుటయు, నాకు స్వాభావికము. నాయవిశ్వాసమును లోకమునకు జూపుటకును నాకవకాశము కలగినది. మాగొడ్డిలోనున్న యరటి చెట్లొకటి నడుమనుండి చీల్చుకొని పువ్వునైకివచ్చి గెలవేసినది. చెట్టుమధ్యనుండి గెలవేయుట యరిష్టసూచకమని ఎవ్వరెన్ని విధములఁ జెప్పినను వారిమాటలు చెవినిబెట్టక యేమిజరుగునో చూతమని యూచెట్టట్లేయుంచితిని. మండల పాఠశాలలోనిపని నిలిచిపోయిన తరువాత నాకు 1872వ సంవత్సరము జ్యేష్ఠమాసములో కోరంగియను గ్రామమునందుగల యింగ్లీషు పాఠశాలలో నెలకు ముప్పదిరూపాయల జీతముగల ప్రధానోపాధ్యాయత్వము లభించినది. ఆపనికి పోవునప్పుడు మంచి ముహూర్తము పెట్టుకొని పొమ్మని యితరులును మావారును నన్నుబలాత్కారముచేసిరి. వారి నిర్బంధమును లక్ష్యముచేయక యమావాస్యనాడు బైలుదేరిపోయి పనిలోఁ బ్రవేశించితిని.

కోరంగికిఁ బోకపూర్వము నేను రాజమహేంద్రవరములో నుండినప్పుడే మచిలీ బందరు నందలి పురుషార్థప్రదాయినికి గ్రంథములుప్రాసి పంపనారంభించితిని. నేనప్పటికి శుద్ధాంధ్రనిరోష్ఠనిర్వచన నైషధమును, రసికజనమనోరంజనమును, ముగించి శుద్ధాంధ్రోత్తర రామాయణమును జేయనారంభించియుంటిని. కోరంగికిఁ బోయిన తరువాతగూడఁ బురుషార్థ ప్రదాయినికి వ్రాయుచునేయుంటిని. నేను రచియింప మొదలుపెట్టిన యచ్చతెలుఁగు సభాపర్వములోని కొంత భాగము కొక్కొండ వెంకటరత్నముపంతులు వారిచేఁ జెన్నపట్టణ

ములోఁ బ్రకటింపఁ బడుచుండిన యంధ్రభాషా సంజీవనిలోఁ బ్రచురిం
పఁబడినది. నేనక్కడనున్నకాలములో రెండవతరగతి భాషాంతరీ
కరణ పరీక్షకు 1872వ సంవత్సరము ఆశ్వయుజ మాసములో ఇంగ్లీషు
తెలుఁగు భాషలయందుఁబోయి కృతార్థుఁడ నైతిని. ఒక్కయల్పాం
శము తక్క నేనచ్చటనున్న కాలములో విశేషముగాఁ జెప్పవలసిన
దేదియులేదు. నాతల్లికి పిశాచభ్రమ యుండుచువచ్చెను. నేను దయ్య
ముల విషయమునఁ దఱచుగా సంభాషించుచు వచ్చుటచేత 1876 వ
సంవత్సరమునకుఁ దరువాతమాత్రము కలుగలేదు. కోరంగిలోనున్న
కాలములో నామాతకట్టి భ్రమకలుగుచునే వచ్చెను. అక్కడివారు
గొప్ప భూతవైద్యుఁడని నాయొద్దకొక యోగినిగొనివచ్చిరి. నేనాతని
మాయింటనుంచుకొని భోజనము పెట్టెదననియు, నాతల్లిదేహము
స్వస్థతపడిన తరువాత మంచిబహుమానము చేసెదననియు చెప్పితిని.
ఆతఁడందున కొప్పుకొని మాయింటఁబ్రవేశించెను. నేనుదనకు లోఁబ
డితి ననుకొని పెక్కుమిషలమీఁద నావద్దనుండి ధనము లాగఁజూచెను.
నాతల్లిశరీరము స్వస్థపడిన పిమ్మటఁగాని నేమియునియ్యనని నిరాకరిం
చితిని. అప్పుడతఁడు కనున్నలెఱ్ఱచేసి నావంక క్రూరదృష్టితోఁ
జూచెను. నేనుభయపడక నవ్వురాగా పకపకనవ్వితిని. అందుమీఁద
నతఁడు మఱింత రోషమువచ్చి కాఁటులు ప్రేలనారంభించెను. నేనును
పట్టరాని కోపముగలవాఁడనయి చేరువనున్న మూఁతశాల భటుని
చేత మెడపట్టించి యాయోగీశ్వరుని వీధిలోనికి గెంటించితిని. వేఱొక
చోటికిఁబోయి యతఁడొక యింటనొకగది పుచ్చుకొని యలికి ప్రుగ్గు
పెట్టి ప్రయోగముచేసినన్ను చంపెదనని పలుకుచు స్నానముచేసి
యుపవాసముతోఁ గూర్చుండి యేదో మంత్రజపముచేయ నారంభిం
చెను. ఆయోగి రాత్రి వఱకును భోజనము లేక కొబ్బరికాయల నీళ్ళు
ప్రొగి యట్లేయుండి మఱునాటి ప్రాతఃకాలమునఁ దన్నుఁ జూడ

వచ్చిన వారితో నెల్లను నేను శరభసాళ్వమును దనమీదఁ బ్రయో
గము చేసితిననియు, ఆదేవత తన్ను శీఘ్రముగానే చంపుననియు,
చెప్పసాగెను. నాకు మంత్రమహిమయందలి విశ్వాసము పోయిన
తరువాతనే నాతల్లియొక్క భ్రమను నివారించుసిమిత్తమై శరభసాళ్వ
మంత్రము నుపదేశమయితిని. నేను రెండుదినము లుపేక్షించి యూ
తనియొద్దకుఁ బోయి నేనేమియు జేయలేదని నమ్మఁబలికి అతనిని మా
యింటికి గొనివచ్చితిని. ఈ నాలుగు దినములలోనె యేనుఁగువంటి
వాడు పీనుఁగువంటివాఁడయి క్రమక్రమముగా నస్వహితము కలిగి
యతఁడు యథాస్థితికి వచ్చుటకు నెలదినములు పట్టినది. పూర్ణముగా
స్వస్థపడిన తరువాత నాతనికొక క్రొత్తబట్ట కట్టఁబెట్టి యొకరూపాయ
రొక్కమిచ్చి పంపివేసితిని.

1874వ సంవత్సరమునం దాషాఢమాసమున నేను కోరంగిలోని
పనిని విడిచి ధవళేశ్వరము నందలి యాంగ్లోదేశభాషా పాఠశాలలో
నెలకు రు44ల జీతముగల ప్రధానోపాధ్యాయత్వమునందుఁబ్రవేశించితిని.
ఇక్కడనున్న కాలములో శ్రీ కొకొండ వేంకటరత్నముపంతులు
గారును వారిపక్షమువారును స్త్రీలవిద్యకుఁ బ్రతికూలముగా నాంధ్ర
భాషా సంజీవనిలో వ్రాయుచుండగా, నేను స్త్రీలవిద్యకనుకూలముగాఁ
బురుషార్థప్రదాయినికి వ్రాయుచుంటిని. స్త్రీవిద్యానిషేధ వాదులు
స్వవాద దార్బల్యమును బట్టి కాఁబోలును ముందుగాఁ బ్రతివాది
దూషణమున కారంభించిరి అప్పుడు నేనును ద్విగుణముగా దూషణ
మునకుఁ బ్రతిదూషణముచేయఁ గడఁగితిని. అప్పుడు క్రొత్తగా మిత్రు
లుగా నేర్పడిన బయపునేడి వెంకటజోగయ్యగారు మొదలయినవారు
కొందరు నాకీవాదమునందు సహాయులయి యుండిరి.

1875వ సంవత్సరమునందు నేను సంక్షేప లేఖన (Precis Writing) పరీక్షయందింగ్లీషున కృతార్థుడనైతిని. ఈపరీక్షనిమిత్తము

నేను రాజమహేంద్రవరమునకుఁ బోయియుండినప్పుడే నాకచ్చటి రాజకీయశాస్త్ర పాఠశాలాధ్యక్షులగు మెట్కాఫ్‌పుగారితోడి ప్రథమ పరిచయము కలిగినది. ఆకాలము నందాయన తెలుఁగభ్యసించుచుండిరి. వారికేదో వాక్యార్థవిషయమున సందేహము కలుగఁగా, నేనా సందేహమును తీర్పఁగలనని కుప్పుస్వామిశాస్త్రులవారు చెప్పియుండుట చేత, పాఠశాలా భవనములో నేను పరీక్షాప్రశ్నముల కుత్తరములు వ్రాయుచుండఁగా వారిపువురును నాయొద్దకువచ్చిరి. నాకుతోఁచిన సమాధానము చెప్పఁగా, వారత్యంత సంతుష్టులయి వెడలిపోయిరి. వారి కప్పుడే నాయందు మంచి యభిప్రాయము కలిగెను. సంక్షేప లేఖనపరీక్షయందుఁ గృతార్థుఁడ నగుటచేత నేననుగత .దండధాయి (Sub Magistrate) పదమున కర్హుఁడనైతిని. న్యాయవాదిని గావ లెనని తలంపుగొని యున్నప్పుడా పరీక్ష కొకసారి పోయినను, న్యాయ వాది పదమునందును రోఁతపుట్టి రెండవసారి యాపరీక్షకుఁ బోవ మానుకొంటిని.

1874వ సంవత్సరము ఆశ్వయుజమాసమునుండి ‘‘వివేకవర్ధని’’ అనునామముతో నాలుగు పెద్దపుటలుగల యొక చిన్న మాసపత్రికను తెలుఁగునఁ బ్రకటింప నారంభించితిని. నాపత్రిక నప్పుడు చెన్నపురిలో శ్రీకొక్కొండ వేంకటరత్నము పంతులువారి సంజీవనీ ముద్రాక్షరశాల యందు ముద్రింపింపనారంభించి,మూడుమాసములైన తరువాత శ్రీధర ముద్రాక్షరశాలకు మార్చి పత్రికను ద్విగుణముచేసి పుస్తకరూపమున ప్రకటింప మొదలుపెట్టితిని. మాపత్రికాముఖమునకు తిలకముగాను పత్రికా నిర్వహణమునందు మాకు మార్గదర్శకముగాను ఉండుటకయి,

క. ఒరులేయవి యొనరించిన,
నరవరయప్రియము తనమనంబునకగుఁ దా
నొరులకు నవిసేయకునికి.
పరాయణము పరమ ధర్మ పదములకెల్లన్.

అనుభారత నీతి వాక్యరత్నమును మేము మాకు మూలసూత్రముగాఁ గైకొంటిమి.

ఈపత్రికా ప్రకటనమునందు నాయుద్దేశములు భాషాభివృద్ధియు దేశాభివృద్ధియు ముఖ్యముగా రెండు. నేనేర్పఱుచుకొన్న భాషాభివృద్ధిమార్గము తెలుఁగు భాషలో మృదువైన సులభశైలిని సలక్షణమైన వచన రచన చేయుట; దేశాభివృద్ధి మార్గము జనులలోఁగల దురాచార దుర్వ్యర్తనములఁ బాపియు వృద్ధిపద్ధతులను జూపియు వారి నధిక నీతిమంతులనుగాఁజేసి దేశము నున్నత స్థితికిఁ దెచ్చుటకయి శక్తివంచనలేక పాటుపడుట. దేశాభివృద్ధి కలుగుటకయి విద్యావిషయమునను, వ్యవహారవిషయమునను కులాచార విషయమునను, నీతి విషయమునను, మతవిషయమునను నానాముఖముల గృషిచేయవలయుననియే కానియొక్క రాజ్యాంగములయందే పనిచేయుట నాయుద్దేశ్యముకాదు. రాజ్యాంగ విషయమున నెక్కడనో దూరమునన్న పరిపాలకులను వారి శాసనములను దూషించుట కంటె సమీపమునన్నుండి రాజశాసనములను నడుపు వారి దోషములను వెల్లడిచేయుట యధిక ప్రయోజనకరమని నా నమ్మకము. ఆకాలమునందు రాజకీయోద్యోగులలో లంచము తప్పు గాక యుద్యోగ ధర్మమనియె యెల్లవారి నమ్మకము. కాబట్టి రాజ కీయోద్యోగులలోని యీయాక్రమమును మాన్ప బూనుట మాపత్రికో ద్దేశములలో నొకటి. లంచము లిచ్చెడి ప్రజలలోను పుచ్చుకొనెడి యధికారులలోను నీతిమానమునువృద్ధిచేయుట యింకొక యుద్దేశము. కులాచారములను చక్కఁబఱుపఁబూనుట మరియొక యుద్దేశము. సత్ప్రవర్తనము మతమున కధికావశ్యకమని, పరిశుద్ధమత సిద్ధాంతములను బోధించుట వేఱొకయుద్దేశము. ఇట్టి సదుద్దేశములతో మా వివేకవర్ధని మొదట వెలువడినది. ఆస్తిక్యము, వివేకము, సత్యము అహింస మొదలైనవియే మొదటి పత్రికయందు వెలువడిన యుప

న్యాసములు. నేనప్పటికే బహుదేవతారాధనమును విడిచి యేకేశ్వరోపాసనమును బూనినవాఁడనైయుంటిని.

లంచములు తగవన్న, రాజకీయోద్యోగులకు గోపము; వేశ్యాగనాసంగము నీతిగాదన్న శృంగార నాయకులకుఁ గోపము; పూర్వాచారమును మార్చుకోవలెనన్న, పామర జనులకుఁ గోపము; నీతిమాలిన బాహ్యవేషములు మతవిరుద్ధములన్న, ఆచార్యపురుషులకుఁ గోపము. మాపత్రికోద్దేశమును నిశ్శంకముగా నిర్వహింపవలసినచో నిన్నికోపములను సరకు చేయకుండవలెను.

స్త్రీవిద్యావిషయక ఖండవాద మాంధ్రభాషా సంజీవనిని విడిచి పెట్టక యందే నెగడుచున్నను మండనవాదము మాత్రము పురుషార్థప్రదాయినినుండి తరలివచ్చి వివేకవర్ధనిని జేరినది. నేను ధవళేశ్వరమునందు సభలుచేసి బాలికావిద్యాభ్యాసము వలని లాభములను గూర్చి పలుమాఱు ప్రసంగించుచురాగా, నక్కడి ప్రముఖులందఱును 1874 వ సంవత్సరము సెప్టెంబరు నెలలో నొకబాలికా పాఠశాలను స్థాపించి దానికి మల్లాది అచ్చన్న శాస్త్రులవారిని ప్రథానోపాధ్యాయుల గానేర్పరచిరి. చందాలతోఁ స్థాపింపబడిన యాబాలికాపాఠశాల తరువాత స్థానికసంఘమువారి సంరక్షణమునకుఁ బాత్రమయి యిప్పటికిని నవిచ్ఛిన్నముగా జరుగుచున్నది. స్త్రీవిద్యయొక్క యావశ్యకమును గూర్చియు బాలికాపాఠశాలా స్థాపననుగూర్చియు సమాకూర్పఁబడిన యాసభలే తరువాత దేశక్షేమాభివృద్ధులకు వలయు విషయములు మాటాడు చుండుటకై యొక స్థిరమయిన సమాజముగా నేర్పడి నేనక్కడ నున్నంతకాలమును ప్రతి భానువారమునాఁడును సభలు జరుగుచు వచ్చినవి.

నేనప్పుడు పద్యములను వచనమువలెనే యాశుధారగాఁ జెప్పఁగలిగెడివాఁడను. అందుచేత ధవళేశ్వరములో నొకదినమున కతిపయ

మిత్రబృంద సమక్షమున అష్టావధానము చేసితిని. అష్టావధానవార్త నాఁడే గ్రామము నందంతట వ్యాపింపఁగా, ఆయూరనున్న యుద్యోగస్థులు మొదలయినవారందఱు, నింకొకసారి యష్టావధానమును బహిరంగ స్థలములోఁజేసి చూపవలసినదని, ననునుఁ బ్రార్థించిరి. వారిమాటతీసివేయలేక పయివారమున మాపాఠశాలా మందిరమునఁ జేసెదనని చెప్పితిని. నేను సంస్కృతమునందుగూడ ననుష్టుప్ శ్లోకములు చేయనారంభించితిని గాని నాకా భాషయందలి పాండిత్యమత్యల్పమయినదని భావించి తరువాత మానివేసితిని. నేనుచేసిన సంస్కృత శ్లోకములు కొన్ని మద్విరచిత బ్రాహ్మవివాహమునందున్నవి. చేసిన వాగ్దానప్రకారముగా, నిర్ణయింపఁబడిన దినమున మాపాఠశాలా మందిరము నందష్టావధానము ముగియుటకు రెండుగంటల కాలము పట్టినది. నేనొక భానువారమునాడు రాజమహేంద్రవరమున విశాలమయిన మాయింటిచావడిలోనే యష్టావధానముచేసితిని. తరువాత నెందఱెన్నివిధములఁ బ్రార్థించినను మేదస్సునకు వేదనాకరమైన యష్టావధానమును జేయ మానితిని.

మావివేకవర్ధని తన కారుమాసములు వచ్చినదిమొదలు గొప్పవారిలోని దుర్నీతిని మాన్పుటకయి ప్రయిత్నింప నారంభించినది. నేను ధవళేశ్వరములో నున్న కాలమునందనగా 1875వ సంవత్సరము జూలయి నెలలో బసవరాజు గవర్రాజుగారు రాజమహేంద్రవరము నుండి నాయొద్దకు వచ్చి తాము నూతనముగా స్థాపింపఁబోవుచున్న ‘‘రాజమహేంద్రవర దేశీయపాఠశాలాసమాజ’’ ప్రారంభదినమున నన్నక్కడకు రమ్మని యాహ్వానముచేసిరి. నేనా సమాజములోనొక సామాజికుఁడనుగాజేరి, 1875వ సంవత్సరము ఆగస్టునెల 15వతేదీని ‘ఐకమత్యము’ను గూర్చి యుపన్యసించితిని. నాఁడు మొదలుకొని తప్పక ప్రతి భానువారమునాడును మధ్యాహ్నము మూఁడుగం

టలకు ధవళేశ్వరమునుండి నాలుగుమైళ్లు రాజమహేంద్రవరమునకు నడచిపోయి సాయంకాల మాఱుగంటలకు సభ ముగిసిన తరువాత మరల నొంటిగా ధవళేశ్వరమునకు నడచి పోవుచుండెడివాఁడను.

లౌక్యాధికార ధూర్వహులయి యున్నవారి దుష్ప్రవర్తనము లను వెల్లడిచేయుచు వచ్చుటచేత నాకు విరోధు లంతకంత కెక్కువ కాజొచ్చిరి. ఆకాలమునందు వేశ్యాప్రియుల సంఖ్యమేర మీఱి యుండెను. రాజమహేంద్రవరములో పాఠశాలయనఁగా వేశ్యల చదువుకూటమనియే యర్థము. శుద్ధశ్రోత్రియులు సహిత మధికారుల మెప్పుకయి యీవేశ్యల పాఠశాలలకు నెల కయిదులు పదులు రూపా యలు చందా లిచ్చుచుండిరి. ఈబోగము మేళములు నాయుడుగారి మేళము, పంతులుగారిమేళము, శాస్త్రిగారిమేళము, అని పిలువఁబడు చుండెను. ఎవ్వరియింటనైన శుభకార్యము వచ్చిన పక్షమున, ఈ ప్రముఖులు తమతమ మేళములను బెట్టవలసినదని సందేశములను బంపుచుండిరి. పత్రికావిలేఖిత్వము పైనిబడినందున నిట్టిబలవంతుల కప్రియముగా నీదుర్వ్యాపారమును గూర్చి పలుమాఱు వ్రాయవలసి వచ్చినది. ఒక్కటితక్క వేశ్యలపాఠశాలలన్నియు నల్పకాలములోనే తీసివేయఁబడినవి. దురభిమానముచేత నిలుపఁబడిన యాయొక్క పాఠశాలయు వేశ్యలమూలమునఁ దదభిమానికి సంభవించిన యాపద వలన నశించినది. పొరుగూళ్ళనుండి వచ్చినవేశ్యలు తమ ప్రనాసక్లేశ మును విడిచి మరలస్వగ్రామములకుఁ బోయిసుఖింపవలసిన వాఁడయిరి.

పత్రికాధిపత్యము వలన స్వతంత్ర జీవనము చేయుదగినంత ధనాగమము కలుగునని నాకెప్పుడును నమ్మకములేదు. నాగ్రంథము లను పత్రికా విలేఖకులు మొదలైనవారు శ్లాఘించుచు వచ్చుట చేతను, నేను రచించిన పుస్తకములను బహుపాఠశాలలో పాఠ్య పుస్తకములనుగాఁ బెట్టుటచేతను, గ్రంథకర్తృత్వము వలన స్వతంత్ర జీవనోపాయము కలుగునన్న ధైర్యము కలిగినది. నా వ్యాకరణము

వలన రెండుమూడు మాసములలో నిన్నూఱు రూపాయలు వచ్చినవి; నా నీతిచంద్రిక విగ్రహ తంత్రమువలన వేయిరూపాయలు వచ్చినవి. చల్లపల్లి బాపయ్యగారును నేనును గలిసి నూఱేసి రూపాయలచొప్పున భాగము లేర్పఱిచి ముద్రాయంత్రమును దెప్పింపవలెనని ప్రయత్నించితిమి. కాని భాగస్థులు తగినంతమందిచేరలేదు. ధవళేశ్వరములో నుండఁగా మున్నూట యేఁబదేసి రూపాయల చొప్పున నాఱుభాగములు వేసికొని ముద్రాయంత్రమును రాజమహేంద్రవరమునఁ బ్రతిష్ఠింపవలెనని మరలఁ బ్రయత్నించితిమి. భాగస్థులేర్పడిన తరువాత నేనొకసారి చెన్నపట్టణమునకుఁ బోయితిని. నేను నీతిచంద్రిక విగ్రహ తంత్రమును రచించుటచేత మిక్కిలిసంతుష్టులైన బహుజనపల్లి సీతా రామాచార్యులవారు మొదలైన పండితులు నాకయిన వ్యయముల నన్నిటిని దామే భరించి, ఒకనాఁడు సభచేసి నా ఛాయాప్రతిమను దీయించి నాకొక వెండిపాత్రమును బహుమానము చేసిరి. నేనిప్పుడు మంచినీరు త్రాగుట కుపయోగించునది యప్పుడువారిచ్చిన రజిత పాత్రమే. నేను చెన్నపురిలోనున్న కాలములో వారు నాయుపచార ము నిమిత్తమయి మన్నవ బుచ్చయ్య గారిని నాకప్పగించిరి. అప్పటి నుండి నాకాయనతోడి మైత్రిగలిగి నానాటవర్ధిల్లినది. పచ్చియప్ప గారి శాస్త్రపాఠశాలలో తెలుఁగు పండితులుగానున్న కార్మంచి సుబ్బరాయలుగారు నాకుఁ చెన్నపురిలోఁ గానలసినవన్నియుఁ గొని పంపుచుండుటకు వాగ్దానముచేసిరి. నేను మరల ధవళేశ్వరమునకు వచ్చినతరువాత యుపాధ్యాయత్వమును మానుకొని 1876వ సంవత్స రారంభమున యేప్రియల్ నెల మధ్యనుండి పని మొదలుపెట్టి మా యింటనే నెలకొల్పఁబడిన స్వీయ ముద్రాయంత్రమునందే వివేకవర్ధనిని ముద్రింపింప నారంభించితిమి.

ముద్రాయంత్రము వలన వచ్చిన యాయమును వివేకవర్ధనికి వచ్చిన చందాల మొత్తమును గలిపినను పనివాండ్ర జీతములకే

చాలిచాలక యుండెను. వివేకవర్ధనిని ముద్రించుకొనుట కానుకూల్య మధికముగాఁ గలిగినందున నాకదియే లాభముగా నుండెను. నేను వివేకవర్ధనిని బ్రకటింపఁజొచ్చిన పిమ్మట నరసాపురములో నా మిత్రు లగు మిార్షుజాయతల్లీఖాన్ గారు " విద్వన్మనోహారిణి " యను తెలుఁగు మాసపత్రికను బ్రకటింప నారంభించిరి. మా యిరువురకు 1874 వ సంవత్సరాంతము నుండి మైత్రి యారంభమై యంతకంతకు వృద్ధినొందెను. వివేకవర్ధని నొక సంవత్సరము నడిపిన తరువాత విద్వన్మనోహారిణిని దానితోఁ గలిపివేసి, వివేకవర్ధనిలో నింగ్లీషుభాగ మాయన బ్రాయుచుండుటకును తెలుఁగుభాగము నేను బ్రాయుచుండుటకును ఏర్పాటు చేసికొంటిమి.

1876వ వ సంవత్సర మధ్యమునుండి వివేకవర్ధనిని పక్షపత్రికను జేసి నడపఁ జొచ్చితిని. ఆ నెలలోనే "హాస్యసంజీవని" యను పేర హాస్యరస ప్రధానమైన యొక మాసపత్రికను గూడ వివేకవర్ధని కను బంధముగాఁ బ్రచురింప నారంభించితిని. శ్రీ కొక్కొండ వేంకరత్నము పంతులవారు వివేకవర్ధనిని పరిహసించి తలకొట్లు కలిగించుటకై "హాస్యవర్ధని" యను నామధేయముతో నొక మాసపత్రికను సంజీవని కనుబంధముగా 1875వ సంవత్సరాంతమున వెలువఱచి పంపిరి. హాస్యవర్ధనితోఁ బ్రతిఘటించి పోరాడుటకొరకయి యాంధ్రభాషా సంజీవనికి విరోధముగా నప్పుడుదయించిన పత్రికా పుత్రికయే యీ హాస్యసంజీవని. హాస్యసంజీవనిలో "కోదుభాషాసంజీవని" యనుభాగ మొకటికూడ నుండెను. నా బ్రాహ్మవివాహ మీ పత్రికయండే ప్రధ మమున వెలువడ నారంభించెను. అట్టి వ్రాత కదియే తెలుఁగుభాష యందు మొదలగుటచేత మాకలుగట్టి జనులు హాస్యసంజీవనిని ముఖ్యముగా నందులో బ్రాహ్మవివాహమునుజదివి యానందించుచు వచ్చిరి. తన రెండవయేట హాస్యవర్ధని యదృశ్యము కాఁగా మా

హాస్యసంజీవని వివేకవర్ధనిలో నంతర్భాగముగాఁ బ్రవేశించి దురా చార దుర్నీతి భంజనమునఁ దెంతో పనిచేసినది.

నేను ధవళేశ్వరమును విడిచివచ్చిన తరువాత 1876 వ సంవత్సరము నవంబరు నెల మొదటి తేదిని రాజమహేంద్రవరము రాజకీయ శాస్త్ర పాఠశాలలో నెల కిరువదియైదు రూపాయల జీతముగల యాంధ్ర ద్వితీయోపాధ్యాయపదమునందుఁ గుదురవలసినవాఁడ నైతిని. మొట్టమొదట నాకీపనిని దయచేసెదమని మెట్కూపుగారు ఫారసీ శ్రీనివాసరావుగారిచేత వర్తమానము పంపినప్పుడు నిరాకరించితిని. నాబంధువులును మిత్రులును నన్ను చీవాట్లుపెట్టి, స్వాస్థల ములోనున్న యాపని కొప్పుకొమ్మని బలవంత పెట్టిరి. వారి హితబోధ యుక్తమయినదని భావించి, నేనే మరలబోయి యాపనిని నాకీయ వలసినదని ప్రార్థించితిని. నా ప్రార్థన యంగీకరింపఁబడినది. అప్పుడా పాఠశాలలో ప్రథమ శాస్త్రపరీక్ష మాత్రమే యుండెను. తరువాత రెండు మాసములకు 1877వ సంవత్సరారంభమునందు మా పాఠశాలలో పట్టపరీక్ష తరగతికూడ పెట్టఁబడెను. ఈవఅకున్నవాఁడ గాక పత్రికా నిర్వాహణాదికమునందు నాకు నూతనముగా మిత్రులైన బుర్రా రాజలింగముశాస్త్రిగారు తోడుపడఁ దొడఁగిరి. చల్లపల్లి బాపయ్యపంతులుగారును, బసవరాజు గవర్రాజుగారును ధవళేశ్వరములో నాయొద్దకుఁ దఱచుగా నచ్చుచు నాతో మైత్రివాటించిన యేలూరి లక్ష్మీనరసింహముగారును, నా కాప్తులును పత్రికా నిర్వాహణమునందు సహాయులు నగుచుండిరి. విశాఖపట్టణ మండలము నుండి క్రొత్తగా వచ్చి మా మండల న్యాయసభలో న్యాయవాదులైన చిరావూరి యజ్ఞన్నశాస్త్రిగారు పత్రిక కెప్పుడైన వ్రాయుచుండెడి వారు. ఒక్క పాఠశాలలో నుండుటచేత నేనును బసవరాజు గవర్రాజుగారును, బుర్రా రాజలింగముశాస్త్రిగారును, యేలూరి లక్ష్మీ

నరసింహముగారును సదా కలసిమెలసి యుండి పత్రిక వ్రాయువిషయ ములగూర్చియు మాన్పవలసిన దురాచారములను గూర్చియు నాలో చించుకొనుచుండెడివారము. ఈ నలుగురిలోను నాయకుఁడను. వారిలో నిరువురు కొంతకాల ముపాధ్యాయులుగానుండిరను, అప్పుడు తక్కిన ముప్పురును విద్యార్థులుగాను నేనొక్కఁడనే యుపాధ్యాయుఁడనుగాను ఉంటిమి. పత్రికలో మేము వ్రాసినదానివలన మనసు నొచ్చినవారందఱును మమ్ము దుష్టచతుష్టయమని పిలుచుచువచ్చిరి.

వసూళ్ళు వేయుట యనఁగా వివాహాది శుభకార్యములయుం దాహూతులయి చూడవచ్చిన పెద్దమనుష్యు లందఱును బోగము మేళమునకు రూపాయ తక్కువకాకుండ నొసఁగులొసఁగెడి యాచార మాకాలమునందు మాప్రాంతములలో సర్వసాధారణమై యుండెను. ఆకాలమునందు మా పట్టణమునందే యొక దండవిధాయి యుండెను. ఆత డేవేవో మిషలు కల్పించి నెలకు రెండుసారులైనను తనయింట బోగముమేళములు పెట్టి. గానవినోదము ననుభవించుటకై నందఱి నాహ్వానము చేయుచుండెడివాఁడు. ఆ సభల కెవ్వరైనను పోకయుం డిరా, వారి యింటి ముందఱ పెంట యున్నదనియో ముఱికినీరు వీధి లోనికి వచ్చినదనియో యా మందభాగ్యు లేదో యభియోగముపైని సభలకీడ్వఁబడి నాలుగు రూపాయలు ధనదండన మిచ్చికోవలసిన వారగుచుండిరి. ఇటువంటి యధికారులు కొందరు తమయింటవచ్చెడు వసూళ్ళలో సగము మాత్రమే వేశ్యల కిచ్చుటకును తక్కిన సగ మును తామే గైకొనుటకును వేశ్యలతో నేర్పాటు చేసికొని యీ విధముగా నెల కిన్నాళ్ళో మున్నాళ్ళో గడించుచుండిరి. ఈ దురా చారమును నివారించుటకయి సభలు చేయించి మా వివేకవర్ధని యెంతో పనిచేసినది.

వాలేస్ గారు మాకప్పుడు మండల న్యాయాధిపతిగా నుండిరి. ఆరంభదశలో నొకరిద్దఱు ప్రాక్టీవాకులు గొందఱికి న్యాయవాది

పట్టాల నిమ్మని వ్రాసిరి కాని మా మండల న్యాయాధిపతిగారు వారికి పట్టాల నియ్యలేదు. మా మండల న్యాయాధిపతిగా రటుతరువాత కొందఱికి పట్టాల ననుగ్రహించిరి. కాని యొక వ్రాడ్వివాకుఁడు వ్రాసినమీఁదట, నిచ్చిన పట్టాలను మరల లాగుకొనిరి. ఆంతట నొక క్రొత్త సిరస్తాదారు వచ్చెను. ఆయన మంత్రిత్వ కాలములో మొట్ట మొదట న్యాయవాదుల యొద్ద లేఖకులకు మాత్రమే పట్టా లియ్యఁ బడెను; తరువాత న్యాయవాదుల యొద్దనుండి యోగ్యతాపత్రికలను దెచ్చుకొన్నవారి కందఱికిని పట్టాలియ్యఁబడెను. ఇట్లు పదిమందికి మండల న్యాయసభలోను, డెబ్బదిమందికి వ్రాడ్వివాక న్యాయసభలోను పట్టాలు లభించినవి. మా మండల న్యాయసభలోని న్యాయవాదులు కొందఱు తామావఱి కంతగా ధనార్జన చేయఁగలిగినవారు కాకపోయినను యోగ్యతాపత్రికా ప్రదాన మూలమున ధనసంపాదనము చేయగలవారైరి. చొక్కగా యోగ్యతాపత్రికలను సంపాదించుకొనినవారికి సహితము కొందఱకు పట్టాలు రాకుండెను. వారి విన్న పములు దొరగారిని జేరుటకయి మధ్య నింకొక ముడుపు చెల్లింప వలసియుండెను. ఈ యక్రమమును సహింపక మా వివేకవర్ధని పరీక్షా సిద్ధులు కానివారికి పట్టాలనిచ్చుట యన్యాయమని ఘోషింప నారంభించెను. న్యాయవాది పట్టాల విషయమునఁ గొన్ని ముఖ్యాంశములను దెలుపుటకయి 1879వ సంవత్సరము జనవరి నెల 2వ తేది తమ న్యాయసభకు రావలసినదని మా మండల న్యాయాధిపతిగారు నా కాజ్ఞాపత్రమును బంపిరి. న్యాయాధిపతులకెల్లను న్యాయాధిపతియైన యీశ్వరుని యుండే భారమువైచి మఱునాఁడు యథాపూర్వముగాఁ బాఠశాలకుఁ బోయి పనిచేసి, తరువాత సెలవుపుచ్చుకొని యక్కడ నుండియే మండల న్యాయసభకు నడచి పోయితిని. మూఁడు గంటలకు దొరగారును సభకు వచ్చిరి. ఆయన నాకు కుర్చీయిచ్చి కూర్చుండఁ

బెట్టి తమ పెట్టెలోనుండి వివేకవర్ధని పత్రికను దీసి న్యాయవాది పట్టా లను గూర్చిన వ్యాసమును జూపి "ఇది మీరే వ్రాసితిరా?" అని యడిగెను. ఉన్నత న్యాయసభవారి ముద్రతో నున్న యా పత్రికను జూడఁగానే యందలి తత్త్వమంతయు నా కవగతమయ్యెను. వెంటనే లేచి, నేను "నాకీ యాజ్ఞాపత్రిక యే రాజశాసనానుసారముగాఁ బంపబడినదో యెఱుఁగ వేడెదను" అని బదులుచెప్పితిని. న్యాయాధిపతి, ఇంచుక యాలోచించి "ఈ పత్రికను మీరే ప్రకటించెదరా?" అని మఱియొక ప్రశ్న వేసెను. "నేనుత్తరము చెప్పుటకు బద్ధుఁడను గానిపక్షమున బదులుచెప్పుటకు నాకిష్టములేదు" అని నేను తెలియఁ బలికితిని. ఈ ప్రశ్నోత్తరముల నన్నిటిని వ్రాసికొని "ఇక మిమ్మల్ప్టి యుంచుట నా కిష్టములేదు" అని దొరవారనిరి. "సంతోషము" అని నే నీవలికి వెడలివచ్చితిని. నామీఁద మానసష్టమునకయి యభియో గము తేవలసియున్నదని మా న్యాయాధిపతిగారు దండవిధాయికి వ్రాయఁగా, ఆతఁడది వ్యపహారిక విషయ మయినందున దొరతనము వారి యంగీకారముపొంది యభియోగము తేవలసియుండునని బదులు వ్రాసెను. నా పయి యభియోగము తెచ్చుటకు సెలవియ్యవలసినదని దొరగారు దొరతనమువారికి వ్రాసికొనిరి. గాని వారంగీకరింపకైరి. ఈలోపల నున్నత న్యాయసభవారును దొరతనమువారును, ఇచ్చిన పట్టాలన్నెల్ల మరల నూడఁదీసికోవలసినదని మా మండల న్యాయాధి పతి కుత్తరవు చేసిరి. ఆయన పై వారి యుత్తరవ్రులను చెల్లింపగా నవీన న్యాయవాదులు నన్నును మా వివేకవర్ధనిని శపించుచుండిరి.

ఆకాలమునందు లంచములు స్వీకరింప నొల్లని రాజకీయోద్యో గులు సహిత మందందుఁ గొందఱుండుచు వచ్చిరి. గాని వారి సంఖ్య యత్యల్పమయి యుండెను. లంచములు గైకొనుట యుద్యోగధర్మ మని యెల్లవారును దలఁచియుండుటచేత నిచ్చువారుగాని పుచ్చు

కొనువాఁడుగాని దానిని తప్పుగాఁ దలఁపకుండిరి. 1878వ సంవత్సరా
రంభమున పోలూరి శ్రీరాములుగారను నతఁడు కొంతకాలము రాజ
మహేంద్రవరమునకు ప్రాడ్వివాకుఁడుగా వచ్చెను. ఆయన చెల్లెలిని
దొరతనమువారి న్యాయవాదిగా నుండిన - చిత్రపు - కామరాజుగారి
కుమారున కిచ్చి వివాహము చేసినందున వారిరువురు నాప్తబంధువు
లును పరమమిత్రులు నయియుండిరి. క్రొత్తగా ప్రాడ్వివాకపదమునకు
వచ్చిన యీ ఘనుఁడు దన్నుఁ జేరినవారికడ నెల్లను ద్రవ్యభక్షణము
చేయఁబూనఁగా మహాబలుఁడైన చిత్రపు కామరాజుగారాయనకు
సహాయులయి నిలిచిరి. అందుచేత నా బ్రాహ్మణప్రభువు నిర్భయుఁ
డయి బహిరంగముగా న్యాయసభలోనే ధర్మమును పాటపాడించి
విక్రయింపఁ జొచ్చెను. అప్పుడీ న్యాయవిక్రయమునకయి వ్యావహా
రిక పరిభాష యొకటి క్రొత్తగా నేర్పడవలసి వచ్చెను. న్యాయవాదు
లకు వేఱు వాదములతో పనిలేక యీ నూతన వ్యవహార శాసనము
యొక్క ప్రకరణ సంఖ్యను పేరుకొనుటయే వారి వాదనకుఁ జాలి
యుండెను. న్యాయాధిపతిగారు వానుదహరించిన ప్రకరణ బలమును
రహస్యమున విచారించి తాము తృప్తిపొందిన పిమ్మట వ్యవహారము
నేదో యొక పక్షమున తీర్చుచుండిరి. ఆ నూతన శాసనములో దశ
సంఖ్యలును తద్గుణిత సంఖ్యలును గల ప్రకరణములేకాని వాని నడిమి
యంకెలుగల ప్రకరణము లేవియు లేవు. ఉభయపక్షముల న్యాయ
వాదులును నూతన న్యాయశాసనముయొక్క ప్రకరణముల నుదహ
రించుచు రాగాఁ గడపట నెక్కడనో యొక సంఖ్యకడ పాటనాటికి
నిలిచిపోవును. మునసబుగారు మఱియొక గ్రంథమునకు దిగి యీ
ప్రకారముగా దినమున కెన్నియో వ్యవహారములను విచారించి తీర్చు
చుండిరి. పెద్ద ప్రకరణమును జూపి యెక్కువ పాటపాడిన న్యాయ
వాది యీరాత్రి యీ న్యాయపరిపాలకుని యింటికేఁబోయి యీ ప్రక

రణార్థమును కన్నులకు గట్టినట్లుగా దీపము వెలుతురున విశదముగా జూపిన పక్షమున మఱునాఁ డాపక్షమున మునసబుగారు న్యాయసభలో తీర్పు వినిపించుచుందురు. ఆ నూతన శాసనముయొక్క పారిభాషిక ప్రకరణము లన్నియు వాగ్రూపములు గాక ధనరూపములయినవని బుద్ధిమంతులయిన మా చదువరులు తమంతనే గ్రహించి యుందురు. మా మునసబుగారు పెద్ద మొత్తములు గల వ్యాజ్యములను ముందుగా విమర్శించి తీర్పు నారంభించిరి; అంతేకాక తామున్న యల్పకాలములోనే విశేష విత్తము సంపాదింపవలెనన్న దురాశచేత నేకకాలమునందే తామొక్క వ్యవహారములో సాక్షుల విమర్శ చేయుచు నింకొక వ్యవహారములో సాక్షుల విమర్శజేయుటకు గుమాస్తాల కప్పగించుచుండిరి; తాము కొన్ని వ్యాజ్యముల గ్రంథమును జదివి స్వయముగా తీర్పుల వ్రాయుచు, మఱికొన్నిటిని తమ చుట్టమైన చిత్రపు కామరాజుగారి కప్పగించి యాయనచేత చిత్తుతీర్పులు వ్రాయించి తాము వానికి శుద్ధప్రతులను వ్రాసికొనుచు యథేచ్ఛముగా విహరింపజొచ్చిరి. ఇట్లాతఁడు చేయుచుండినను, పై యధికారియైన మా మండల న్యాయాధిపతిగారాయన కేవల న్యాయమూర్తి యనియే భావించుచుండిరి.

బాధనొందిన ప్రజలును వారి పక్షమునఁ బనిచేయు న్యాయవాదులు కొందఱును ప్రాడ్వివాకశిఖామణియొక్క దౌర్జన్యములను గూర్చి మొఱ్ఱపెట్టుకొన నారంభించిరి, గాని వారిలో నొక్కరును తాము లంచము నిచ్చినట్లుగాని మునసబు లంచములు పుచ్చుకొనుచున్నట్లుగాని బహిరంగముగా సాక్ష్యమిచ్చుటకు సిద్ధపడినవారు కనఁబడలేదు. లంచములనుగూర్చి నాతోఁ బలుమాఱు చెప్పుచువచ్చిన న్యాయవాదులు మాత్రము సమయమువచ్చినప్పుడు పయి యక్రమములు జరుగుచున్నట్లు చెప్పి సాక్ష్యమిచ్చెదమని వాగ్దానము చేసిరి.

నేను చల్లపల్లి బాపయ్యగారిని, చిరాపూరి యజ్ఞన్నగారిని మా యింటికి రప్పించి, పయి న్యాయవాదు లావఱకు నాతో జెప్పినవాని నెల్లను వారి యెదుట జెప్పించి, మేము ముప్పురమును మునసబు లంచములు పుచ్చుకొనుచున్నాడన్న యర్థము సూచనయగునట్లుగా చైత్రమాస పత్రిక కింగ్లీషున నొకవ్యాసమును వ్రాసితిమి. ఆవ్యాసము పత్రికలో ప్రకటింపబడుటకు ముందుగా లంచములు పుచ్చుకొను విషయమును మాత్రము విడిచి తక్కిన విషయముల నొక కాగితము మీద వ్రాసి చేవ్రాళ్ళుచేసి నా కిచ్చెదమని యా న్యాయవాదు లప్పు డొప్పుకొనిరి. వ్రాసిన వ్యాస మచ్చుకూర్పబడి ప్రకటనము నకు సిద్ధమయ్యెను గాని న్యాయవాదులు పంపెదమని వాగ్దానము చేసిన లేఖ మాత్రము నాకు చేరలేదు. వాను లేఖను మఱునటి దిన మున బంపెదమని నాకు బదులుపంపి తామీ వ్యవహారములో దగులుకొనకూడదనియు పత్రికావిలేఖకులు తగులుకొని చిక్కులు పడుచుండగా దాము పయినుండి వేడుక చూడనచ్చుననియు తమలో దామాలోచించుకొనిరట. అ వార్త తెచ్చిన యతడు మాటలధోరణిని వారిరహస్యము నాకడ నెలిబుచ్చెను. వారు వేఱుగ వ్రాసి యియ్యవలసిన యావశ్యకమే లేదనియు, పెద్దమనుష్యుల యెదుట జెప్పియుండుటచేత నాకా సంగతులను దెలిపినవారి పేరులు గూడ బత్రికలో వేసి ప్రకటించెదననియు, అతనితో జెప్పితిని. ఆతడప్పుడే నా యొద్దనుండి పోయి తనకాప్తుడయిన యొక న్యాయవాదితో నేనన్న మాటలు చెప్పెను. అతడు తమ పేరులు వెల్లడియగునని భయపడి తక్కిన న్యాయవాదులకడ కాలోచనకుఁ బోయెను. నాటిరాత్రి వారెట్లో నిశాసమయమున కందఱు నొక్కచోట సమావేశమయిరి. నడిరేయి రెండు జాములవేళ నెవ్వరో మావీధి తలుపులు గుద్దుచున్న సందడి వినబడగా, నేను గాఢనిద్రలో నులికిపడి లేచి

మేడ దిగివచ్చి తలుపుతీయునప్పటికి మా న్యాయవాది లందఱును నాకుఁ బ్రత్యక్షమైరి. వారు మహాసత్యసంధులవలెను, ధర్మమూర్తుల వలెను నటించుచు, ఏమేమో నీతివాక్యములు పలికి తాము వాగ్దా నముచేసిన లేఖ నప్పుడు వ్రాసియిచ్చెదమని చెప్పిరి. వారాపఱకు వ్రాసియిచ్చెదమన్న విషయముల మాత్రమే కాక నాతో వారు జెప్పిన మఱికొన్ని విషయములనుగూడ వారిచేత నప్పుడు వ్రాయించి పుచ్చుకొని వారి నింట్లకుఁబంపివేసితిని.

బసవరాజు గవర్రాజుగారు పత్రికా నిర్వహణాదులయందు నా కత్యంత సహాయులుగా నుండిరను, ఆయన కామరాజుగారి తోడి యల్లుఁ డగుటచేత నేనే యాయనకీ వ్యవహారములో నేమియు పని పెట్టకుంటిని. గవర్రాజుగారు మాత్రము న్యాయైకపక్షావలంబము చేతను స్నేహభావముచేతను నాపక్షమునే వహించియుండి నేనొక వేళ కామరాజుగారికి విరోధముగా పనిచేయ నియమించినను చేయు టకు సంసిద్ధులయియే యుండిరి. నేనొకనాడు ప్రొద్దువాక న్యాయస్థా నమునకుఁ బోయి ప్రచ్ఛన్నముగా నొకమూలఁ గూచుండి యా ఘనుని వర్తనమంతయు సావకాశముగా జూచివచ్చితిని. ఉద్యోగస్థు లందఱును వారి పట్టగుటచేత నాకు సహాయులుగా నుండువారు న్యాయసభలో నెవ్వరును లేరు. వివేకవర్ధనిని జదివియు మా మండల న్యాయాధిపతిగా నెంతమాత్రమును విచారణ చేయక యుపేక్షించి యూరకుండిరి. మండల న్యాయసభలోని యప్పటి రాజసేవకులలో పదిరూపాయల జీతముగల లేఖకుఁడైన బయపునేడి వెంకటజోగయ్య గారొక్కరు మాత్రము నాపక్ష మవలంబించియుండిరి. ఆయనవలననే నాకప్పుడు న్యాయస్థానమునందు జరుగు కుతంత్రములు కొన్ని తెలి యుచుండెను. దుర్బల పక్షమైన మా కపజయము తప్పక కలుగునని యెల్లవారును బ్రతీక్షించుండిన యాకాలములో నీశ్వరుఁడు మాకొక్క

యాధారమును గనఁబఱిచెను. చిత్రపు కామరాజుగారు మునసబు గారి నిమిత్తము వ్రాసిన చిత్తు తీర్పుకాగితములను శుద్ధప్రతులు వ్రాయఁబడిన తరువాత చించివేసి తమ యింటి కెదురుగానుండిన పాడుదొడ్డిలోని పెంటకుప్పలలో బాఱవేయించుచుండిరి. వారింటి కెదు టింటిలో గాపురమున్న యొక న్యాయవాది వచ్చి వారేమో కాగితపు ముక్కలు పాఱవేయుచున్నారని నాతోఁ జెప్పెను. వీధులు తుడుచు దాని కేమైన నిచ్చి యా ముక్క లెత్తించి రెండుబుట్టలతో ముక్క లను మా యింటికడఁ జేర్చెను. ఆముక్క లేమైన నతికి చదువఁ దగి యుండునేమోయని శ్రమపడి యతికించిన వానిలోఁ గొన్ని కరగ్రాహి మొదలైనవారికి వ్రాయఁబడిన యుత్తరములయి యొందునకుఁ బనికి రానివయిపోయెను. ముక్కలు సంగ్రహించి తెచ్చిన న్యాయవాది యతికించినవానిలో రెండు కాగితములు చేరి పూర్ణముగా నొక తీర్పు యయ్యెను. పడిన ప్రయాసము వ్యర్థమయిపోలేదని నాకప్పు డపరిమిత సంతోషము కలిగినది. ఆ వ్యాజ్యమును గోలుపోయినవాఁడొక మహ మ్మదీయుఁడు, నా సహపాఠియు రెండవతరగతి న్యాయవాదియునైన దామరాజు నాగరాజుగారిచేత నా మహమ్మదీయునిఁ బిలిపించి మాటాడఁగా, అతఁడు కామరాజుగారు లంచమిమ్మని తన్నడిగినప్పుడు దానియ్యలేకపోయితిననియు ప్రతివాదియొద్ద లంచము పుచ్చుకొని మునసబు వాని పక్షమున తీర్పుచేసెననియు చెప్పెను. ఆసంగతులనే మహమ్మదీయుని సమ్మతితో విన్నపమొకటి వానిచేత వ్రాలుచేయించి చిత్తు తీర్పుయొక్క సగభాగము సందుతోఁ జేర్చి కుట్టించి మండల న్యాయసభలో బెట్టించితిమి. నాగరాజుగారియొద్ద లేఖకుడు మిర్తిపాటి రామయ్యగారా విన్నపములోఁ బేర్కొనఁబడిన సాక్షులలో నొకఁడు. ఈ విన్నపము సంగతి తెలియగానే కామరాజుగారా మహమ్మదీ యుని దమ యింటికి రప్పించి, వానికి వ్యాజ్యపు మొత్తమునకు ద్విగు

ణముగా ధనమిచ్చి వాసియొద్దనున్న తీర్పు ముక్కల నపహరించెను. అన్ని రూపాయ లొక్కసారిగా చేతఁబడఁగానే యా మహమ్మదీ యుఁడు సంతోషముతో తన మిత్రులకు విందుచేసెను. ముక్కలు పోయినట్లు మాకుఁ దెలిసినది. ఈలోపల మఱి మూడునాలుగు తీర్పుల ముక్కలను గూడ మే మతికి పూర్తి జేసితిమి. సాక్ష్యమైన మిర్తిపాటి రామయ్యగారిచేత మహమ్మదీయుఁడు జిత్రపు కామరాజుగారివద్ద సొమ్ము పుచ్చుకొని ముక్క లిచ్చివేసెననియు, కామరాజుగారు మునసబుగారికి లంచములు కుదుర్చుచున్నట్టును దీర్పులు వ్రాసి యిచ్చుచున్నట్టును బుజువుచేయుటకు తనయొద్ద నాధారము లున్న వనియు, మహమ్మదీయుని తీర్పు సగము ముక్క తనయొద్ద నున్న దనియు మండల న్యాయసభలో నొక విన్నపము పెట్టించితిమి. కామ రాజుగారా మహమ్మదీయునిచేత తన విన్నపములోని సంగతు లేవియుఁ దానెఱుఁగననియు, ఒక న్యాయవాది (దామరాజు నాగ రాజుగారు) మోసముచేసి తనచేత నందులో సంతకము చేయించె ననియు, తన విన్నపమును విమర్శింప నక్కఱలేదనియు, మఱియొక విన్నపమును బెట్టించెను. మండల న్యాయాధిపతిగారా న్యాయవాదిని మహమ్మదీయుని బిలిపించి వారు చెప్పిన సంగతులను వ్రాసికొనిరి గాని పిమ్మట నేమియుజేయక యూరకుండిరి. మిర్తిపాటి రామయ్యగా రిచ్చిన విన్నపముపైని మా మండల న్యాయాధిపతిగారు మహమ్మ దీయుని తీర్పుయొక్క సగము ముక్కను బుచ్చుకొని, సాక్షుల పేరు లను తక్కిన యాధారములను ప్రదర్శింపవలసినదని యుత్తరువిచ్చిరి. నాయొద్దనున్న ముక్క లన్నిటిని నిచ్చివేసిన పక్షమున నైదువేల రూపాయల నిచ్చెదమని చిత్రపు కామరాజుగారు నాకు సందేశమును బంపిరి. ఆ సందేశము నప్పుడు నేను తిరస్కారభావముతో నిరాకరిం చితిని. ఇప్పటి కైదు తీర్పుల ముక్కలను మేము పూర్ణముగా నతి

కోపం గలిగితిమి. అతికోపంబడినవానిలో నొక్క తీర్పును మాత్రము నాయొద్ద నుంచుకొని తక్కిన నాలిగింటి ముక్కలను ఒక్క కాగితపు సంచిలోం బెట్టి నా యుంగరముతోనే లక్కముద్ర వేసి, మిర్తిపాటి రామయ్యగారిని నావెంట మండల న్యాయసభకుం దీసికొనిపోయి, ఆ ముక్కల సంచిని విమర్శ దినము వఱకును న్యాయాధిపతి సొంత పెట్టెలోనే యుంచుకొనునట్లు విన్నపము వ్రాయించి, వానిని దొర వారికిం బ్రబర్శింపించితిని. పనికిమాలినవని తీసివేసిన ముక్కలుపోగా బుట్టెడు ముక్కలు నాయొద్ద మిగిలియుండినవి. వానిలో నేవైన సరిగా నతుకునేమో చూచుటకై యా బుట్టను నేను దామరాజు నాగరాజుగారి యొద్ద నుంచితిని. ఆ మఱునాఁ డుదయమున నొక రెండవ తరగతి న్యాయవాది నాతో మాటలాడుటలో మునసబు గారును, కామరాజుగారును, నాగరాజుగారి యింటి కేదోపనిమీఁదఁ దన్నుఁ బంపినట్లు పొరపాటునఁ గొన్ని మాటలు జారవిడిచెను. నేనా యనను బంపివేసి వెంటనే నాగరాజుగారి యింటికిఁ బోయి యా ముక్కల బుట్టను దీసికొని నా పెట్టెలోఁ బెట్టి తాళము వేసితిని. అటుపిమ్మట రెండుమూడు దినములలో నాకు మొదట ముక్కలను దెచ్చియిచ్చిన న్యాయవాది వచ్చి తనకా దినమున న్యాయసభలో పనిలేదనియు బుట్ట తీసికొనిపోయి తీర్పు లతికించెదననియుఁ జెప్పెను. నేనామాట నమ్మి ముక్కలబుట్ట నిచ్చివేసితిని. కామరాజుగారేదో మాయోపాయము పన్ని ముక్కలబుట్ట నపహరించిరని నాటి సాయం కాలమే వార్త నాచెవిని బడఁగానే నేనా న్యాయవాదికడకుఁ బోయి యదుగఁగా నతఁడా బుట్టలో పనికివచ్చు ముక్కలేవియు లేనందున వానిని కాల్చివేసితినని చెప్పెను. నాయొద్ద నింకొక్క తీర్పు మిగిలి యున్నదని నా మిత్రులుసహిత మెఱుఁగరు.

మిర్తిపాటి రామయ్యగారి విన్నపముపైని మండల న్యాయాధిపతి విమర్శకు జూన్ నెల 26వ తేదీ నిర్ణయించి, సాక్షుల కాహ్వాన

ములు పంపి, ఆయా వ్యాజ్యముల గ్రంథములు పంపుమని ప్రార్థించు కున కుత్తరపు చేసిరి. విమర్శన దినము రాకమునుపే మండల న్యాయాధిపతి పెట్టెలోని తీర్పుముక్కలు సిరస్తాదాకు చేతిలోనికి నెళ్ళినవి. చిత్రపు కామరాజుగారా ముక్కల నేలాగునైన నపహరింపవలెనని సర్వవిధములఁ బ్రయత్నించుచుండిరి. అప్పుడు మండల న్యాయసభలో సిరస్తాదారుగా నుండిన రొజారియోగారివద్ద లంచముల వ్యవహారములలో నండశాఖాలేఖ్య రక్షకుఁడైన (Criminal Record Keeper) బొబ్బిలిప్రగడ వెంకన్నగారు మంత్రిగా నుండిరి. అనుదినమును సూర్యనమస్కారములు చేయుచు నిష్టాపరుడయి యుండెడి యీ మంత్రిశిఖామణికి మున్నూఱు రూపాయలిచ్చి చిత్రపు కామరాజుగారు తీర్పుల ముక్కలను తీసివేయించుట కేర్పాటు చేసిరఁట. ఈ మొత్తములో నరువదిమైసు రూపాయలును రెండు సారా బుడ్లను దక్క సిరస్తాదాయగారికి మఱేమియు దక్కలేదఁట. న్యాయసభలో మండల న్యాయాధిపతి సమక్షమునఁ బ్రదర్శింపఁబడిన ముక్కలను దొంగ లెత్తుకొనిపోయినట్లు కనఁబఱుపవలెనని యనుకొనిరి. ఆ యాలోచనను బట్టి తెల్లవాఱి విమర్శ యారంభమగుననగా 25వ తేదీ రాత్రి న్యాయసభాభవనము యొక్క గోదావరి వైపునున్న తలుపొకటి తెఱువఁబడి ప్రాఁతపెట్టెలు పగులగొట్టఁబడి, కాగితములు నేలమీద చిమ్మివేయఁబడినవి. నాఁడు విచారణదిన మగుటచేత సాక్షులును పౌరులును పదిగంటలు కాకమునుపే సభాభవనమునకుఁ బోయియుండిరి. నేనును మిత్రులతోడ సభామందిరమునకు ముందుగానే పోయియుంటిని. ఆనఱకే సిరస్తాదాయగారును క్రిమినల్ రికార్డ్సు కీపరుగారును యొక గదిలో తలుపులువేసుకొని రహస్యముగా నేదో చేయుచుండిరి. నేనును నా మిత్రులును తాళము చెవిపెట్టు తలుపు సందులో నుండి యొకరొకరుగా లోపలఁ జూచితిమి. ఇంతలో

న్యాయాధిపతి సభకు విజయంచేసి స్వపీఠము నధిష్ఠింపగానే మిర్తి పాటి రామయ్యగారు తనచేత నర్పింపఁబడిన ముక్కలు మార్పఁబడు చున్నవని న్యాయాధిపతి ముందఱ మొఱ్ఱపెట్టుకొనెను. కొంచెముసేప టికి, సిరస్తాదారు వచ్చి యతికించియుండని ముక్కలను గొన్నిటిని న్యాయాధిపతి బల్లమీఁదఁ బెట్టెను. శోధించి చూచి యవి తాను కాగితపు సంచిలోఁ బెట్టి యిచ్చిన ముక్కలు కావనియు, సిరస్తాదారు ముక్కలను మాఱ్ఱుచుండఁగా చూచిన సాక్ష్యులున్నారనియు, వెంటనే విమర్శ చేయవలసినదనియు, మిర్తి పాటి రామయ్యగారు బహువిధ ముల న్యాయాధిపతిని ప్రార్థించెను. ముక్కలుపోయినందుకుఁ దాము చేయవలసిన పనిలేదని న్యాయాధిపతి సెలవిచ్చిరి. మండల న్యాయ సభలోని న్యాయ విచారణ నాటికీవిధముగా ముగిసినది. ముక్కలు దొంగ లెత్తుకొనిపోయిరని చెప్పుటకయి మొట్టమొదట రాత్రివేళ తలుపు తెఱచి కాగితములను తాఱుమాఱుగా పార్వైచినను, వారు చిత్రపు కామరాజుగారి ప్రాతలోనున్న పనికిమాలిన ముక్కలను దెప్పించి గదిలో గూరుచుండి రహస్యముగా వానిని పూర్వపుముక్క లకు మాఱుగా నొక కాగితపు సంచిలో వేసి ముద్రవేసిరి. ముక్కలు పోలేదని సిరస్తాదారుగారు కడపట మండల న్యాయాధిపతి ముందు పెట్టి చూపినవి యీ క్రొత్తముక్కలే.

రాజమహేంద్రపురా రక్షకపర్యవేక్షుఁడు, ఈ యన్యాయ మును విని నన్ను మండల రక్షకాధ్యక్షునికడకుఁ గొనిపోయి మాటా డెను. ఆ రక్షకాధ్యక్షుఁడు మనసు కరఁగినవాఁడయి న్యాయసభలో జరిగిన చౌర్య విషయమయి విచారణ జరుపుటకు సెలవియ్యవలసిన దనియు, సిరస్తాదారుని యొక్క యీలోచనమీఁదనే యీపని జరగి నట్లనుమానింపఁ దగియున్నదనియు మండల న్యాయాధిపతి కుత్తరము వ్రాసెను. విచారణ యావశ్యకము లేదనియు, ముక్కల దొంగతన

మునుగూర్చి తన సిరస్తాదారువిషయమయి సందేహపడుట కవకాశము లేశము లేదనియు నతఁడు బదులువ్రాసెను. అంచుపైని మండల రక్షకాధ్యక్షుఁడు తాను వెంటనే కాకినాడకుఁ బోయి మండల దండవిధాయితో నడచిన కథయంతయు విన్నవించి, సిరస్తాదారుని క్రిమినల్ రికార్డు కీపరును పట్టుకొనుటకయి యావమన యొద్దనుండి యధికార పత్రములను గొనివచ్చెను. ఆ మఱునాఁడు రొజారియోగారును, బొల్లాప్రగడ వెంకన్నగారును భోజనముచేసి న్యాయస్థానమునకుఁ బోవు సమయములో నా రక్షకభటులు వారి యిండ్లకుబోయి వారిను వురను బట్టుకొని పడవ యెక్కించి కాకినాడ మండల దండవిధాయి యొద్దకుఁ దీసికొనిపోయిరి. మండల దండవిధాయి ప్రథమ విచారణ చేసి మాపవలన సాక్ష్యములను గైకొని, రాజమహేంద్రవరమునకు వచ్చి చౌర్యము జరిగిన స్థలమును చూచి, మండల న్యాయాధిపతి వాగ్మూలమును గైకొని, బొల్లాప్రగడ వెంకన్నగారిని విడిచిపెట్టి సిరస్తాదారుగారిని మాత్ర మంతిమ విచారణ నిమిత్తము మండల దండాధికారి కార్యస్థానమునకుఁ బంపిరి. మామండల దండాధికారియు న్యాయాధిపతియు నయిన వాలేసుగారి వ్యవహారములో సాక్షియయి యుండినందున చెన్నపురి యున్నత న్యాయసభవారు విచారణ నిమిత్తమి మావ్యవహారమును కృష్ణామండల దండాధికారి కార్యస్థానమునకుఁ బంపిరి. అక్టోబరు నెలలో నక్కడ విచారణ జరిగెను. ఈ మూఁడు మాసములును మా సిరస్తాదారు కారాగృహమునందే యుండవలసిన వారయిరి. విచారణజరిగినమీఁదట కృష్ణామండల దండాధికారిగారును కెల్సాలుగారు సరియైన ముక్కలు మండల న్యాయసభలో నర్పింపఁ బడినందుకు లేశమైనను సందేహము లేదనియు, సిరస్తాదారే వాని నపహరించినట్టు సాక్ష్యము లేనందున నతఁడు నిర్దోషియనియు, వ్రాసి రొజారియోగారిని విడుదల చేసిరి.

మా వివేకవర్ధనిలో వ్రాయబడిన యంశమును జూచి చెన్న పురి దొరతనమువా రున్నత న్యాయసభవారికి వ్రాయఁగా, వారు విమర్శచేసి పర్యవసానము తమకుఁ దెలుపవలసినదని మా మండల న్యాయాధిపతిగారి కుత్తరు పిచ్చిరి. అప్పుడు మండల న్యాయాధిపతి మేలుకొని నన్నును మఱికొందఱిని పిలిపించి విమర్శ కారంభించిరి. విచారణారంభ దినమున మా ప్రతిపక్షులైన చిత్రపు కామరాజు గారు మొదలగువారు మహోల్లాసముతో సభకువచ్చి సావజ్ఞ ముగా నావంక సారెసారెకుఁ జూచుచు నాకెదురుగా కుర్చీల నలంకరించి కూరుచుండిరి. నేను తప్పక కారాగృహమునకుఁ బంప బడుదునని వారికి మాత్రమేకాక యెల్లవారికిని గట్టినమ్మకము గలిగి యుండెను. నాయొద్ద నింకొక తీర్పు ముక్క మిగిలియున్నదని నా మిత్రులకుఁగాని యమిత్రులకుఁగాని తెలియదు. ఇల్లు వెడలునప్పుడు నేనా తీర్పుకాగితమును చొక్కా సంచిలో వేసుకొనియే న్యాయసభకుఁ బోయితిని. మండల న్యాయాధిపతి తమ ప్రక్కనే క్రింద నాకొక్క కుర్చీని వేయించి కూర్చుండ నెలవిచ్చిరి. విచారణ యారంభమగుటకు ముందుగా నేనొక కాగితమునిమ్మంద నావద్ద కామరాజుగారి వ్రాతతోనున్న చిత్తు తీర్పింకొకటి యున్నదని ఆ వ్యాజ్యపు గ్రంథము సంఖ్య వ్రాసి దొరగారి కిచ్చితిని. ఆయన యొక యుత్తరపు కాగిత మున్పై నేమో వ్రాసి కాగితపు సంచిలో వేసి చెంతనున్న భటుని బిలిచి నీవిది ప్రాడ్వివాక సభలో నిచ్చి వారిచ్చినది గొనిరమ్మని యాజ్ఞాపించెను. పోయిన భటుఁ డరగంట లోపలనే యా వ్యాజ్యపు గ్రంథమును గొనివచ్చి దొరవారి చేతికిచ్చెను. అప్పుడు నా జేబులోని కాగితమును పైకిఁదీసి దొరగారి కిచ్చితిని. దొరతనము న్యాయవాది యగుటచేత కామరాజుగారి వ్రాత యందఱకుఁ దెలిసినదిగానుండెను. నేనిచ్చిన చిత్తుకాగితములో హంసపాదములు టఁడుపులు ననేకము లున్నవి. వ్యాజ్యపు గ్రంథములోని తీర్పు సరిగా దానికి శుద్ధప్రతిగా

నున్నది. ఆ రెంటిని జూడగానే దొరగారికి మునుపున్న యభిప్రాయ మంతయు నొక్కసారిగా మారిపోయినది. ఆయన యా చిత్తుతీరును దీసి కామరాజుగారి చేతికిచ్చి యిది నీవ్రాత యగునా కాదా యని యడిగెను. గద్గదస్వరముతో "నా వ్రాతవలెనే యున్నది" అని యాయన బదులుచెప్పెను. "ఇది తప్పక నీ వ్రాతయే. సత్యము నా కిప్పుడు బోధపడినది. ఈవఱకు పోయిన ముక్కలను సిరస్తాదారునకు లంచమిచ్చి మార్పించినవాడవు నీవే. విమర్శనిమిత్తము రేపటి దినము నిన్ను దండవిధాయి యొద్దకుఁ బంపెదను" అని కోపముతోఁ బలికి మా మండల న్యాయాధిపతి కాగితమును కలమును గైకొని సిరస్తా దారును క్రిమినల్ రికార్డు కీపరును పనిలోనుండి తొలగించినట్టువ్రాసి చదివి వినిపించెను. నాటికి సభ ముగిసినది. కామరాజుగారు సభనుండి యింటికిబోయి తన సొత్తు విషయమై మరణ శాసనమును వ్రాసి యా రాత్రియే విషము త్రాగి యాత్మహత్య చేసికొనిరి. మండల న్యాయాధిపతి రొజారియోగారిని బొల్లాప్రగడ వెంకన్నగారినికూడ పనిలోనుండి తొలగింపఁగా, వారున్నత న్యాయసభవారికిని దొర తనమువారికిని విజ్ఞాపన పత్రములను బంపుకొనిరి గాని వానిపలన గార్యము లేకపోయెను. సిరస్తాదారుగా నుండిన రొజారియోగా రన్న వస్త్రములకు లేక బిడ్డలతో బాధపడుచు కడబట పిచ్చివాండ్ర వైద్య శాలలో దుర్మరణము నొందెను. ఉన్నత న్యాయసభవారు పోలూరి శ్రీరాములుగారినికూడ లంచములు పుచ్చుకొన్నందుకు విమర్శ చేయవలసినదని మండల న్యాయాధిపతి కుత్తరు నియ్యఁగా, విమర్శ మధ్యమునసే యాకస్మికముగా నతఁడును దేహవియోగము నొంది యిహలోక దండనమును తప్పించుకొనెను.

ఆకాలమునందు శరీర ప్రయాసముగాక నాకును గొన్ని కష్ట ములు వచ్చినవి. సెప్టెంబరు నెల 8వ తేదీని మేము మొట్టమొదట

రాజమహేంద్రవరమున సంఘసంస్కార సమాజమును స్థాపించి పని చేయ నారంభించితిమి. ఆ సమాజము ప్రథమోపన్యాస సమయము నకు నా ప్రియమాతకు ప్రాణముమీఁదికి వచ్చినందున నేనా యుప న్యాసమును కొంత వాగ్రూపమునఁ జెప్పవలసినవాఁడ నైతిని. 1878వ సంవత్సరము సెప్టెంబరు నెల 22 వ తేదీని నాపాలనే పడిన రెండవ యుపన్యాసము నియ్యవలసిన వంతు వచ్చునప్పటికి నా ప్రియ జనని లోకాంతరగతురాలయి నన్ను దుఃఖసముద్రములో ముంచి పోయినది. ఆమె యుత్తరక్రియలు ముగిసినతోడనే నేను రొజారియో గారి వ్యవహారములో సాక్ష్యమిచ్చుటకు బందరుపురమునకుఁ బోవల సినవాఁడనైతిని. దూరమున నున్న రాజధానీ పరిపాలకులను తప్పు లెన్ని దూషించుట నిరపాయకరమయిన పనిగాని తాను వసించు తావున నుండు ననుగతదండ విధాయిపైనగాని యా రక్షకభటునిపై తప్పెన్ని వ్రాయుట యనపాయకరమైన పనిగాదు. ఆయినను దండ విధిచేత వివేకవర్ధనిని భంజింప విజృంభించినవారు కానరాలేదు. నా కప్పుడు రాజమహేంద్రవర రాజకీయశాస్త్రపాఠశాలలో నెల కిరువది యైదు రూపాయల జీతము. ఆరంభములోనే నెల కిరువదియైదు రూపాయల పనిని కరగ్రాహి కార్యస్థానములో నిచ్చినట్లు నేను కోర కయే నాకొక వాగ్దానము వచ్చెను. నా హితులు చెప్పిన బుద్ధి వినక యా పని నిరాకరించితిని. అప్పుడు కృష్ణామండలములో నుండిన చల్లపల్లి రంగయ్యగారును గంజాంమండలములో నుండిన వల్లూరి జగన్నాధరావుగారును కూడ నాకా శాఖలో మంచిపనులు చెప్పించి నన్నున్నతదశకుఁ దేఁజూచిరి గాని నేనా విషయమున నంతగా నాద రమును జూపలేదు.

నేనును నా మిత్రులు కొందఱును గూడి యప్పుడప్పుడు భగ వత్ప్రార్థనలు చేసుకొనుచుండెడివారము. రాజమహేంద్రవరములో

వారవారమును మానసికముగా నీశ్వరోపాసనము చేయు సమాజము నొకదానిని స్థాపించవలసినదని నా మిత్రులయిన బుర్రా రాజలింగము గారు నన్నడిగిరి. ముఖ్యముగా ఆయన ప్రార్థనము మీదనే ప్రార్థన సమాజమును 1878వ సంవత్సరములో మొదట మా గృహమున స్థాపించితిమి. నేను బుర్రా రాజలింగముగారును, బసవరాజు గవ రాజుగారును, ఏలూరి లక్ష్మీనరసింహముగారును, బయపునేడి వేంకట జోగయ్యగారును, కన్నమురెడ్డి పార్థసారథి నాయుడుగారును సమా జముగాఁ జేరితిమి. అప్పుడు పార్థసారథి నాయుడుగారు కీర్తనలు పాడుచుండెడివారు; నేను చిన్న ధర్మోపదేశము ప్రాసి చదివెడివాఁ డను. కొన్ని నెలలైన తరువాత మామిత్రులను గొందఱను ప్రార్థనా సమయములందు రానిచ్చెడివారము; సంవత్సరమైన తరువాత సమా జమును బహిరంగముగా విజయనగరము మహారాజుగారి బాలికా పాఠశాలకుఁ గొనిపోతిమి. ఇప్పుడీ ప్రార్థన సమాజమునకు స్వకీయ మైన మందిరమే యేర్పడియున్నది. ఈ ప్రార్థనసమాజ మెన్నియో సత్కార్యములకును, ఎందఱి వర్తనమునో చక్కబఱుచుటకును, కారణమైనదని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును. ఈ సమాజము వలననే పూర్వాచారపరాయణులకు సహితము గుడ్డివాండ్రకు కుంటి వాండ్రకు మొదలైన వికలాంగులకుఁ జేసినదే యుత్తమ దానమను జ్ఞానము కలిగినది. ఈ సమాజము వలననే బీదలకు రాత్రి పాఠశా లలు మొదలైనవి మొదట స్థాపింపఁ బడినవి.

నాలుగవప్రకరణము.

స్త్రీ పునర్వివాహ సంస్కార ప్రయాస దశ.

(క్రీ. శ. 1880వ సంవత్సరము మొదలుకొని 1890వ సంవత్సరము వరకు)

ఒకరు తానుపదేశించినదాని ననుష్ఠించి చూపినంగాని కేవల శుష్కోపన్యాసములవలనను పుస్తక ప్రకటనము వలనను కార్య ముండదు. నా మిత్రులైన బసవరాజు గవర్రాజుగారు తమ కూఁతు నకు వదునాలేండ్లు నిండుటకు ముందు పరిణయము చేయనని పలుకు చుండెడివారు గాని తమ ప్రతిజ్ఞను నెఱపి యితరులకు దారిచూపు టకు వారి కాయువు లేకపోయినది. నా మిత్రుఁడును నియోగియు నైన యొక సంస్కార ప్రియుఁడు తన కొమారితలలో నొకతెను పాఠశాలలో విద్యాభ్యాసము చేయుచున్న యొక వైదిక బాలున కిచ్చెదనని చెప్పెను. చదువునందు తెలివిగలవాఁడును బుద్ధిమంతుఁడు నైన యా బాలుని తండ్రియు తానా చిన్నదానిని తన కుమారునకు చేసుకొనెదనని చెప్పెను. ఇట్లు మాటలలో కొంతకాలము గడచిన తరువాత నా మిత్రుడు స్వశాఖ బాలున కిచ్చియే యా చిన్నదానికి వివాహము చేసెను. ఇదియేమని యడుగఁగా నతఁడన్యశాఖ వరున కిచ్చుట తన కిష్టమేయైనను తన భార్య కిష్టము లేకపోవుటచేత స్వ శాఖవానికే యియ్యవలసి వచ్చినదని చెప్పెను. వివాహాదుల యందు దుర్వ్యయముల నొకానొకఁడు సంస్కారప్రియత్వము చేతనే మాని వేసినను జను లాతని లోభియనియే భావించి గేలిచేయుదురు. ఆ కాలమునందు రాజమహేంద్రవరమునను తత్ప్రాంతముల యందును వివాహాది శుభకార్యములయందు బంధుమిత్రాదులను భోజనము

లకుఁ బిలుచునప్పు డందఱిని యజమానుఁడు స్వయముగాఁ బోయి పిలిచి రావలెను. మేము రెండు సభలుచేసి, భోజనములకుఁ బిలుచుటకయి స్వయముగాఁ బోవుటకు మాఱుగా నాహ్వాన పత్రికలను బంచుట యుచితమని బోధించితిమి. గాని పూర్వనాగరికులు మా ప్రయత్నము సాగనీయకపోయిరి. మాలో మేము పత్రికలమూలము ననే భోజనములకు పిలుచుకొనుట కేర్పాటు చేసుకొని యట్లుచేయ జొచ్చితిమి.

మన దేశములో శవములను స్మశానములకు గొనిపోయెడు విధమును ,శవములను ఖననముచేసెడు విధమును, నాగరికులచే గర్హింపదగినవిగా నున్నవి. పట్టణములో నివ్వరి యింటనైన మరణాపద తటస్థించినప్పుడు లాకుర్యులు వైదికులు నన్న భేదములేక యెల్లవారును వెంట బోవుటకును ప్రేతమును, రుద్రభూమికి గొనిపోయి తోడ్పడుటకును నియమము చేసికొనుటకయి కొన్ని సభలు చేసితిమి. ఈ విషయమయి 1888వ సంవత్సరములో గవర్రాజుగారి మరణానంతరమున నేను సభలో చెప్పిన యొక చిన్న యంశము నిందుదహరించుచున్నాను. 1881వ సంవత్సరము నవంబరు నెలలో ఆయనకు ప్రథమమునఁ బుట్టిన పురుషశిశువు మూడు మాసములు పెరిగిపోవుట సంభవించెను. శిశువు పట్టదగిన కొయ్యపెట్టెను చేయించి శిశుకళేబరము నందుంచి మూఁతకు మేకులు బిగించి దానిని రాత్రివేళ గవర్రాజుగారును నేనును మఱి యిద్దఱు మిత్రులును గలిసి బండిలో పెట్టుకొనిపోయి వారి తోటలోనే యొకచోటఁ బూడ్చి వచ్చితిమి.

1874వ సంవత్సరమందు చెన్నపురిలోని ప్రముఖులు స్త్రీ పునర్వివాహమును ప్రోత్సాహపఱచుటకయి సమాజమొకటి స్థాపించి, యన్ని మండలములకును ప్రకటన పత్రికలను బంపిరి. ఆ సమాజమునకు శ్రీ పల్లె చంచలరావు పంతులుగారు కార్యదర్శి. నేనప్పుడు

నలుబది నాలుగు రూపాయల జీతముగల యుపాధ్యాయుఁడనై యుం
డుటచేత వారి ప్రకటన పత్రికలు నావఱకును జేరలేదు. ఆసమాజము
సందడి చేయుచున్న కాలములో విశాఖపట్టణములోని ప్రముఖుల
ప్రార్థన ననుసరించి, శ్రీ మహామహోపాధ్యాయ పరవస్తు వేంకట
రంగాచార్యులవారు పునర్వివాహ సంగ్రహమను పేరుతో స్త్రీ పున
ర్వివాహము శాస్త్రసమ్మతమని 1875 వ సంవత్సరమునం దొక
చిన్న పుస్తకమును ప్రాసి ప్రకటించిరి. ఈ విషయమున నటుతరువాత
బందరులోఁ ప్రకటింపఁబడెడు పురుషార్థప్రదాయనీ పత్రికలో నెవ్వరో
యప్పుడప్పుడు ప్రాయుచుండెడివారు.

నా మిత్రుఁడు చల్లపల్లి బాపయ్యగారు "మనము స్త్రీ పున
ర్వివాహము విషయము కృషిచేయవలె" నని నాతో నత్యంతా
సక్తితోఁ జెప్పెను. ఇట్లు ప్రస్తావనము జరిగిన మూడవసారి నా
మిత్రునివంకఁ జూచి "నిన్ను మీ యన్నలు విడిచిపెట్టినను బంధువులు
బాధపెట్టినను కడవఱకును నాతో నుండి పనిచేసెదవా?" అని ధీర
వృత్తితో నడిగితిని. అతఁడణుమాత్రమును సంశయింపక "ఎన్ని
కష్టములు వచ్చినను తొలగక నిలిచి పనిచేసెదను" అని తక్షణమే
యుత్తరము చెప్పెను. ఇక నేను వేఱు మాటాడక "సభాహ్వాన
పత్రికను ప్రాసి తెమ్ము. నేను ప్రాలుచేసి ప్రకటించెదను" అని చెప్పి
పంపితిని. అత డాహ్వానపత్రికను ప్రాసి తీసికొని రాగానే దానిమీఁద
సంతకముచేసి పట్టణములోనివారి కందఱికిని బంపితిని. ఇది యీశ్వర
ప్రేరితమును నీశ్వర ప్రీతికరమును నందుచే నాకుఁ బరమధర్మమును
నన్న దృఢవిశ్వాసముతోనే సాధ్యాసాధ్య విచారమును తలపెట్టక
నేనీ పనిలోఁ బ్రవేశించితిని. తనకు ధర్మమయిన పనిలో శక్తివంచన
లేక కృషిచేయుట యొక్కటియే మనుష్యుని పని; దాని ఫలాఫల
ముల నియ్యవలసినవాఁ డీశ్వరుఁడు గాన, సత్కార్యమునందు యథా

శక్తిని గృషిచేతను ఫలము గలుగకపోయిన పక్షమున మనుష్యుని లోపమేదియు లేదు. మనుష్యుఁడు చేయవలసిన పనిని జేసినవాఁడగుటచేత నంతవఱకే యతఁడు శ్లాఘ్యుఁడు. నా యాహ్వానపత్రిక నెలువడగానే విధవావివాహ మన్న శబ్దమే కర్ణకఠోరమై యెల్లవారికిని హృదయశూలముగా నుండెను.

అప్పుడు నాకు స్త్రీ పునర్వివాహ విషయమయి ఈశ్వరచంద్ర విద్యాసాగరులవారి గ్రంథమున్నట్టు తెలియును. గాని నా కప్పుడది లభించినది కాదు. మనుస్మృతియు, యాజ్ఞవల్క్య స్మృతియు, పరాశర స్మృతియు మాత్రము నాయొద్ద నున్నవి. తత్వబోధినిలోఁ బ్రకటింపఁబడిన యుపన్యాస మొకటియు, పురుషార్థప్రదాయినిలోఁ బ్రకటింపఁబడిన యుపన్యాస మొకటియు నాకు లభ్యములయినవి. ఈ గ్రంథ సహాయ్యముతో నా బుద్ధికిఁ దోచిన యుక్తులను శాస్త్రప్రమాణము లను గూర్చి, నా శక్తికొలఁది నొక యుపన్యాసము వ్రాసి విజయనగరపు మహారాజుగారి బాలికా పాఠశాలా మందిరమున జరిగిన మహా సభలో 1879 వ సంవత్సరము ఆగస్టునెల 8 వ తేదీని మొట్టమొదట చదివితిని. ఆ దినమున వివిధాభిప్రాయములతో గుంపులు గుంపులుగా వేడుక చూడవచ్చిన జనులతో నిండిన సభాభవనమంతయు క్రిక్కిఱిసిపోయినది. నా యుపన్యాసము ముగియగానే సభలోనుండి పండితులనేకులు లేచి భయంకరారావములతో నన్నుఁ గవిసిరి. వారు తమ పాండిత్య ప్రభావమును గనఁబఱచి నన్ను బహువిధముల దూషించి, పయివారము నా యుపన్యాసముమీఁద ఖండనోపన్యాసములు వ్రాసి చదివెదమని చెప్పి, నాటికి సభనుండి వెడలిపోయిరి. బాపయ్య పంతులుగారు సంస్కృతమునఁ గొంత పాండిత్యము గలవారగుటచేత నాకు బహువిధముల తోడుపాటుగా నుండిరి. నేనప్పుడు ముప్పది స్మృతులకంటె నెక్కువగాఁ గొని తెప్పించినాఁడను. నేనక్కడక్కడ జూచిన భాగములలోనే నావాదమున కనుకూలములైన ప్రమాణ

వచనము లనేకము లప్రయత్నముగా నాకు దొరకెను. పండితు లుప
న్యాసములు చేసిన సభనాఁడు నా పక్షివాదమును విన్నమీఁదట వి వే
కుల కందఱకును పండితులవాద మసారమైనదనియు స్త్రీ పునర్వి వా
హము శాస్త్రసమ్మతమనియు నభిప్రాయము కలిగెను. పండితులు
విశాఖపట్టణ మండలమునుండి దంతులూరి నారాయణ గజపతిరాజు
గారిచేత నొక ఖండన గ్రంథమును వ్రాయించి దానియందు తమకు
తోఁచిన విషయములనుగూడఁ జొప్పించి మహాతంత్రజ్ఞుడైన జ్యోస్యుల
వేరిచయనులగారి లోపల నొక సభచేసి నన్నచటి కాకస్మికముగా
నొక పెద్దమనుష్యునిఁ బంపి, పిలుచుకొనిపోయి, పై గ్రంథమునుజదివి
నన్ను పరాజితునిఁ జేయఁజూచిరి గాని యీశ్వరానుగ్రహమువలన
నేను సమయోచితములైన ప్రత్యుత్తరముల జెప్ప నారంభింపఁగా
కడుపునొప్పి యని యొకఁడును కాలునొప్పి యని యొకఁడును లేచి
పోవఁ దొడఁగిరి.

నేను మొట్టమొదట నిచ్చిన యుపన్యాసము ప్రకటింపఁబడఁ
గానే తెలుగుదేశమునం దంతటను స్త్రీ పునర్వివాహ విషయమైన
వాదములే ప్రబలి, భువనగిరి పరదేశి సోమయాజులుగారును, శ్రోత్రము
కోటేశ్వరశాస్త్రులు గారును, కొక్కొండ వేంకటరత్నము పంతులు
గారును, వర్తమానరత్నాకర విలేఖకులును, మందార మంజరీ పత్రి
కాధిపతి యైన యోగిరాల జగన్నాథము గారును, వేదము వేంకట
రాయ శాస్త్రులుగారును, దంతులూరి నారాయణ గజపతిరాయి
గారును, దాసు శ్రీరాములు పంతులు గారును, ఇంకను ననేకులు నా
ప్రథమోపన్యాసముమీఁద ఖండన గ్రంథములను వ్రాసిరి. సమాధాన
ముగా శ్రీ విజయనగర మహారాజుగారి బాలికా పాఠశాలలో అక్టో
బరునెల 12 వ తేదీని జరిగిన మహాసభలో నేను నా ద్వితీయ విజ్ఞా
పనము నుపన్యసించి ప్రకటించితిని. ప్రతివాదుల వాదములకెల్ల నుత్త
రములను వివేకవర్ధనిలోఁ బ్రకటించుచు వచ్చితిని.

నేను మొట్టమొదట గాకినాడ నొక భానువారమునాడు పోయి స్త్రీ పునర్వివాహము శాస్త్రసమ్మతమని హిందూశాస్త్ర పాఠశాలా భవనములో నొక యుపన్యాసము చేసితిని. విధవా వివాహమునకు బ్రతిపక్షులుగా నున్న తత్పురవాసులగు పండితులు, పయి భానువారమునాడు ఖండనోపన్యాసము నిచ్చెదమని తెలవిచ్చిరి. సమాధానములను జెప్పుటకయి యా యాదిత్యవారమునాడు స్త్రీ పునర్వివాహ విధాయకపక్షవాదులు యుక్తసమయమున కే పాఠశాలా మందిరమునకు బోయియుండిరను, పండితులు మొదలగువారు దేవాలయములో సభచేసెడు పక్షమున వత్తుమని వర్తమానము పంపినందున వారి యిష్టానుసారముగా నేనును నా సహాయులును విష్ణ్వాలయమునకు బోయితిమి. మిక్కిలి యాలస్యముగా సభ యారంభింపబడగా, వేదార్థ విచారము ముగియునప్పటికే ప్రొద్దు గ్రుంకినందున నాటికి సభ చాలింపబడినది. మఱునాటి యుదయమున స్మృతిభాగము యొక్క యర్థమునుగూర్చి వారు గ్రంథమును ముగించునప్పటికి పది గడియల ప్రొద్దెక్కినది. తమ ఖండన గ్రంథముమీద విధాయకవాదు లేమియుఁ జెప్పఁగూడదని తాము మధ్యాహ్నమున జరుగు సభకు రామని వారందఱును వెడలిపోయిరి. మధ్యాహ్నము సభకూడిన పిమ్మట మల్లాది అచ్చన్నశాస్త్రి గారను మహాపురుషు లక్కడకు విజయంచేసి, భగవన్ముఖము జూచి తాము మాధ్యస్థ్యము చేయుట కంగీకరించెదమని, ప్రతిపక్షులు లేకుండ తగవుచెప్పుట యుచితము కాదని, వారిని పిలుపించు భారమును తాము వహించెదమని జెప్పి తమ శిష్యుని నొక్కనిఁ బంచిరి. ప్రతిపక్షులు మాత్రము గంటకు లోపల రాలేదు. వారు వచ్చినమీదట నేను శ్రుతిభాగముయొక్క యర్థ వివరణము చేయగానే శాస్త్రులవారు నిష్పాక్షికమైన తమ యభిప్రాయము జదువుటకయి రొంఁజిని బెట్టుకొని తెచ్చిన కాగితమును

జదువ నారంభించిరి. అంతట సభ్యుల కా మధ్యస్థునియొక్క న్యాయ పక్షావలంబము డెలిసి యిక నభిప్రాయము నీయవలదని వారించిరి. పతిపక్షులు రాళ్లుదువ్వుట కారంభించి నన్ను మర్దింప యత్నించు చుండగా నాతోడ వచ్చిన విద్యార్థులు, వారికి నాయకుడైయుండిన బ్రాహ్మణుని దిట్టముగా గొట్టుట చేతను, తత్సట్టణ రక్షక భటాధికారి గుమ్మడిదల మనోహరుగారు వచ్చి యూయల్లరి మూకను కొట్టులోఁ బెట్టింపఁజూచుట చేతను వేగముగానే యా దుండగపు బాపనగుంపు పలాయన మయ్యెను. ఈ యల్లరిచేత నాటి కుపన్యాసము ముగియ కుండగనె సభ చాలింపఁబడినది.

మొట్టమొదట స్త్రీ పునర్వివాహ సమాజమని పేరు పెట్టుకొని పనిచేయ నారంభించినవారము. నేనును, చల్లపల్లి బాపయ్యగారును, బసవరాజు గవర్రాజు గారును, ఏలూరి లక్ష్మీనరసింహము గారును, బయపునేడి వేంకట జోగయ్యగారును, కన్నముదెడ్డి పార్థసారథి గారును, చిర్రావూరి యజ్ఞన్న శాస్త్రిగారు, కాజ రామకృష్ణారావు గారు; కొమ్మి రామలింగశాస్త్రిగారు మొదలైనవారు కూడఁ గొందఱు మాలో నటుతరువాత జేరిరి. నేనును, బాపయ్యగారును బోయి యింటింటికిని దిరిగి యముగఁగా లౌక్యులయిన బ్రాహ్మణ గృహస్థులు ముప్పదిమంది కంటె నెక్కువ సంఖ్యగలవారు వివాహ సమయమునందు తాము భోజనమునకు వచ్చెదమని వాగ్దానములు చేసి సమాఖ్యాపత్రము మీఁద వ్రాళ్ళుచేసిరి. నాకు పరిచితులయిన బారు రాజారావుగారు, పైడా రామకృష్ణయ్యగారు రాజమహేంద్రి వరమునకు వచ్చినప్పుడు నాకు వారితోడ మైత్రిని గలిగింపగా, వారప్పుడీ పనినిమిత్తమయి ముప్పదివేల రూపాయల నిచ్చెదమని వాగ్దానము చేసిరి. ఈ వాగ్దానమువలన మాకు మఱింత యుత్సా హము గలిగిద్విగుణ ధైర్యముతోఁ బనికి పూనిననను, రెండు సంవత్స

రములకు పిమ్మట ప్రథమ వితంతు వివాహ మగువఱకును పట్టిన సమస్త వ్యయములను నేనే వహించినాఁడను.

ఇంతలో రాజమహేంద్రవరమునకుఁ గ్రొత్తగా న్యాయవాదిగా వచ్చిన న్యాపతి సుబ్బారావుగారు మాలోఁ జేరిరి. కాకినాడకు సుబ్బరాజిగా వచ్చిన కంచి కృష్ణస్వామిరావుగారు మాకత్యంత ప్రోత్సాహము కలిగింపఁ జొచ్చిరి; ఆత్మూరి లక్ష్మీనరసింహముగారు రాజమహేంద్రవరమునకు డిస్ట్రిక్టు మునసబుగా వచ్చి మాకనేక విధముల తోడుపడఁ దొడఁగిరి; చెన్నపట్టణమునకు పోయియుండిన సోమంచి భీమశంకరముగారు మరల వచ్చి మమ్మఁ జేరిరి. ఈ ప్రకారముగా మేము కొంత బలపడి, ఆత్మూరి లక్ష్మీనరసింహముగారును, న్యాపతి సుబ్బారావుగారును, కొమ్మ్ర రామలింగశాస్త్రిగారును, బసవరాజు గవర్రాజుగారును నేనును జేరి యైదుగుర మొక యాంతరంగిక సమాజముగా నేర్పడి రహస్యముగా కార్యాలోచనము చేయుట కారంభించితిమి.

ఒన దినమునఁ బూర్వాచారపరాయణులైన లౌక్యులును వైదికులును మార్కండేయస్వామి యాలయములో సభచేరి తగు మనుష్య నొక్కనిఁ బంపి నన్నా దేవాలయమునకు రప్పించిరి. ఆ సభానాయకుల యనుమతితో బ్రాహ్మణులు కొందఱు సభావసానమునఁ బోవునప్పుడు సందడిలో నన్నుఁ గొట్టవలెనని పచ్చిరట! దేవాలయ మంతయు రెండు వందల విద్యార్థులతో నిండిపోయినది. వారిలో ననేకుల చేతులలో కట్టెలుండినవి. నా విషయమయి దౌర్జన్యము జరిగింపఁ దలఁచుకొని వచ్చిన యా దుష్ట విప్రులు విద్యార్థుల సంఖ్యను జూచి భయపడి మెల్లగా నావలికిజాఱిరి. ఆదినము మొదలు కొని పట్టణములో సంక్షోభమును కక్షావేశములును మఱింత ప్రబలసాగెను.

1880 – 1881 వ సంవత్సరములలో వివేకవర్ధనియు ప్రార్థనా సమాజమును విద్యార్థుల సంఘ సంస్కరణ సమాజమును గూడ మహోత్సాహముతో మిక్కిలి చురుకుగా బనిచేయుచుండెను. విరూపాక్ష పీఠస్థులైన శంకరాచార్య స్వాములవారు విజయనగరము నుండి బైలుదేఱి మా గోదావరీ మండలమునకు వచ్చుచుండిరి. పీఠాధిపతుల యుర్వాకృత్యములను గూర్చియు, వారు విత్తాపహరణము నిమిత్తము చేయుచున్న యకృత్యములను గూర్చియు, వారిని స్వకృత్యమునకు మరల్చుటకు శిష్యులు చేయవలసిన కర్తవ్యమును గూర్చియు, మా వివేకవర్ధని బహువిధముల ప్రాసి ప్రజల కన్నులు తెఱపుట కారంభించినది.

రాజమహేంద్ర పురవాసులు స్వాములవారియెడ గౌరవము లేనివారయి మా పురమునకు వచ్చినపుడు వారికి భిక్షలు చేయకుండిరి. నేనే మధ్యవర్తినిగానున్న సభలో జగపఁబడిన యేర్పాటును బట్టి తరువాత వారికి భిక్షలు జరిగినవి. స్త్రీపునర్వివాహ విషయమైన శాస్త్రమునుగూర్చి సిద్ధాంత నిర్ణయము చేయవలసినదని నేనును న్యాయపతి సుబ్బారావుగారును కాజ రామకృష్ణారావుగారును ప్రాళ్ళు చేసి స్త్రీపునర్వివాహ ప్రవర్తక సమాజమువారి పక్షమునఁ బంపిన విజ్ఞాపనపత్రము ననుసరించి జరిగిన సభలో స్వాములవారి పక్షమున వచ్చిన ప్రతినిధి యయిన యద్దేపల్లి కృష్ణశాస్త్రులవారు "స్వాముల వారు బహుజనుల యిష్టానుసారముగా నడవవలసినవారు గనుక బహుజనులు చేరి స్త్రీపునర్వివాహము తమ కిష్టమని సంఘ విజ్ఞాపనము ప్రాసికొన్నచో వారాలోచింతురనియు, ప్రస్తుత కాలమునకుఁ దగినట్లుగా నిప్పుడు క్రొత్త నిబంధనల నేర్పఱుచుకొనుటకే యూహ్యమును లేదనియు" చెప్పి యప్పటికి తప్పించుకొనవలసినవారయిరి.

1880 – 1881 వ సంవత్సరములలో మా ప్రార్థన సమాజము కూడ మహోచ్ఛదశయందుండినది. నేనే దానికి నియమిత ధర్మోప

న్యాసకుఁడనుగా నుండెడివాఁడను. ఏలూరి లక్ష్మీనరసింహముగారు మా యందఁతీకంటెను నప్పు డధికోత్సాహమును భక్తియుఁ గనఁబఱి చెడివారు. పరుశుద్ధాస్తికమత వ్యాపనము నిమిత్తమై యీవిధమున యాస్తిక పాఠశాలయను పేరుతో నొక పాఠశాలను స్థాపించెను. ఆ పాఠశాలా భవనములోనే యాస్తికమత పుస్తకములను జదివి బోధించుటకయి యొక తరగతి పెట్టఁబడినది. ప్రార్థనా సమాజము నా యాస్తిక పాఠశాలలోనే పెట్టితిమి.

1881 వ సంవత్సరము మార్చి నెలలో పండిత శివనాథశాస్త్రి గారు రాజమహేంద్రవరమునకు వచ్చి హృదయోత్తేజకరములయిన యుపన్యాసముల నిచ్చి పోయిరి. ఆ యుపన్యాసముల వలన నింగ్లీషు చదువుకొన్నవారిలో సత్కార్యోత్సాహము హెచ్చినది. విద్యార్థులు ప్రత్యేకముగా ప్రార్థనా సమాజముల నేర్పఱుచుకొని యేకేశ్వరారాధనము చేయసాగిరి. రాత్రి పాఠశాలలను స్థాపించి వంతులు వేసుకొనిపోయి పనివాండ్రకు పాఠములు చెప్పుచు వచ్చిరి. ఈ పాఠశాలల విషయమయి రబ్బాప్రగడ పాపయ్యగారు, తాయి సూర్యప్రకాశరావుగారు, పెద్దిభట్ల వేంకటప్పయ్యగారు మొదలయిన విద్యార్థు లనేకులు మహోత్సాహముతో పనిచేయుచుండిరి. రాత్రి పాఠశాలల విషయమై తిగవులు వచ్చి విద్యార్థులు క్రొత్తగా వేఱొక పాఠశాలను స్థాపింపవలసి వచ్చినను, విద్యార్థుల పాఠశాల యొక్కటియే యిప్పటికిని నిలిచి నగర పారిశుధ్యవిచారణ సంఘమువారి పరిపాలనములో నున్నది. తమ మరణము వఱకును బసవరాజు గవరాజుగారా రాత్రి పాఠశాలలకు కార్యనిర్వాహకులుగా శ్రద్ధతోఁ బనిచేయుచుండెడివారు. నేనును నా మిత్రులును విద్యార్థుల నిట్టి సత్కార్యములకు పురికొల్పి ప్రోత్సాహపఱుచుచుండెడివారము. విద్యార్థులు ప్రార్థనాసమాజ కార్యములోను శ్రద్ధాభక్తులు కనఁబఱచి బీదల కన్నదానము చేయుట మొదలగు నమస్త సత్కార్యములలోను మిక్కిలి శ్రమపడుచుండెడివారు.

మా శాస్త్రపాఠశాలలోని విద్యార్థులు ఇన్నీసుపేటలో నొక బాలికాపాఠశాలను సహితము స్థాపింప నుద్దేశించిరి. వారి పక్షమున నేనాపనికిఁ బూని యిన్నీసుపేటలో 1881 వ సంవత్సరమున నొక బాలికా పాఠశాలను స్థాపించితిని. మా శాస్త్రపాఠశాలాధ్యక్షులైన మెట్కాఫుగారు వ్రాయుటచేతఁ గొంతకాలము శ్రీ పిఠాపురపు రాజు గారా బాలికా పాఠశాల నుంచుటకయి తమ సత్రమునిచ్చిరి. దానికిఁ గార్యనిర్వాహకుఁడ నయియుండిన నేను నగర పారిశుద్ధ్య విచారణ సంఘములో సభ్యుఁడ నగుటచేత మొదటి సంవత్సరము సెలకు పదేసి రూపాయల చొప్పునను, రెండవ సంవత్సరము పదునైదేసి రూపాయల చొప్పునను, మూడవ సంవత్సర మిరువదేసి రూపాయల చొప్పునను, సహాయ ద్రవ్యము నిప్పించుచు వచ్చితిని. దొరతనము వారును వేఱుగ దానికి సహాయద్రవ్యము నిచ్చుచుండిరి. తరువాత నది దొరతనమువారిచేఁ గైకొనఁబడి స్థిరపడి బాలికా విద్యాభ్యాస మున కత్యంతోపయుక్తమై యున్నది.

కులాచార, రాజకీయ వ్యవహారములలో దురాచారములను వినోదకరముగా సంభాషణ రూపమున వెల్లడిచేసి మూన్పుటకయి వివేకవర్ధని కంతర్భాగముగా హాస్యసంజీవని ప్రకటింపఁబడుచుండెను. ఇందు ప్రకటింపబడిన వ్యవహార ధర్మబోధినిని నామిత్రులు విద్యార్థులు జేరి 1880 వ సంవత్సరమున విజయనగరము మహారాజాగారి బాలికా పాఠశాలలో మొదటఁ బ్రయోగించిరి. ఇటువంటిసూపకములను ప్రద ర్శించుట కదియే మొదలయినందున నూఱులకొలది జనులు వచ్చి చూచి యానందించిరి. 1881 వ సంవత్సరములో కడపటి భాగమున నొక నాటకసమాజమును స్థాపించి, థార్వాడనాటకులు వచ్చి నాటక ములాడి విడిచిపోయిన పాకలోనే "రత్నావళి" "చమత్కార రత్నా వళి" యను రెండు నాటకములు చేసి యాడించితిని. విద్యార్థుల సంర

తకులు తమ బాలురచేత వేషములు వేయించినందునకయి నామీఁద నభియోగము తెచ్చెదమని నన్ను బెదరించిరి. విద్యార్థులు నాటకము లాడుటయందలి యుత్సాహముచేతఁ దమ పాఠములయం దశ్రద్ధను జూపుచున్నట్లు కనఁబడినందున నాటక సమాజములయం దటుతరు వాత నేనంతగా నాదరము చూపుచు రాలేదు.

1881 వ సంవత్సరము నందు మా విద్యార్థుల సంఘసంస్కరణ సమాజము సహితము మిక్కిలి యుత్సాహముతోఁ బనిచేయు చుండెను. ఈ సమాజమునకుఁ గార్యదర్శి పెద్దిభట్ల వెంకటప్పయ్య గారు. ఆ సమాజములోఁ జేరినవాఁడు తాము చుట్టలు పొగము మొదలయిన దురాచారములు మానుటకును బోగము మేళముల యాటపాటలకుఁ బోవకుండుటకును సమస్త సంఘ సంస్కరణముల యందును తోడుపడుటకును ప్రతిజ్ఞలను గైకొనిరి. వారితో నేను సహిత మాప్రతిజ్ఞలను గైకొంటిని. అప్పుడు విద్యార్థులుగా నుండి ప్రతిజ్ఞలు గైకొన్న పెద్దిభట్ల వెంకటప్పయ్యగారు మొదలయినవాఁడు తాము లౌక్యాధికారధూర్వహులయినతరువాత సహితము బాల్యము నందుఁ జేకొన్న ప్రతిజ్ఞల నతిక్రమింపక మరణపర్యంతమును పాలించుచు వచ్చిరి. అట్లు ప్రతిజ్ఞాపాలనముచేయుచున్నవారిలో నేనొక్కఁడను. నేను బాల్యమునుండియు ప్రబలమైన దగ్గుచేత బాధపడుచున్న వాఁడను. చుట్ట కాల్చుటవలన దగ్గు పోవునని యాశపెట్టి నాచేత చుట్టకాల్పించవలెనని ప్రయత్నముచేసిరి కాని యీశ్వరానుగ్రహము వలనను స్వాభావికమైన నా దృఢనిశ్చయత్వము వలనను వారి బోధలకు లోఁబడినవాఁడను గాను.

నా యుపన్యాసము వలనను బోధనలవలనను కలిగిన యుత్సాహముచేత విద్యార్థు లనేకులు తాము వితంతు కన్యలను వివాహమాడి లోకమునకు దారిచూపెదమని ఘోషింప మొదలుపెట్టిరి; వితంతు

కన్యలు కొందఱు తమ డెందములలో సుఖాశాబీజము లుత్సాహ పఱుపఁగా సంతోష చిహ్నములను కనఁబఱుపసాగిరి.

కృష్ణామండలములోని తిరువ్వూరు డిప్యూటీ తహసీల్దారుగా నుండిన దర్భా బ్రహ్మానందముగారు తమ తాలూకాలోని యొక గ్రామములో పఁడ్రెండేండ్ల యీడుగల యొక వితంతు బ్రాహ్మణకన్య యున్నదనియు, తగు మనుష్యులను పంపఁగలిగిన యెడల తల్లిని సమ్మతిపఱచి యా చిన్నదానిని వారివెంటఁ బంపునట్లు ప్రయత్నము చేసెదమనియు, నాకొక లేఖను వ్రాసిరి. మనుష్యులను నాలుగైదు దినములలోఁ బంపుచున్నానని 10 వ తేదిని బ్రహ్మానందముగారికి లేఖ వ్రాసి నేనా విషయమైన కృషిలోనే యుంటిని. తాము రాజమహేంద్రవరమునకు వచ్చినప్పటినుండియు ఆస్థాన్మారి లక్ష్మీనరసింహము గారు నాకు సర్వవిధముల సహాయులుగా నుండిరి. ఆయన తన కార్య స్థానమునందు మిక్కిలి తెలివిగలవాఁడును పరమ విశ్వాసియు నయిన యొక భటునికి నెలవిచ్చి యా భటుని నావశము చేయగా, మొదటి నుండియు మాతో పని చేయుచుండిన సోమంచి భీమశంకరముగారిని నా లేఖతో బ్రహ్మానందముగారి యొద్ద కానెల 15 వ తేదీని బంపితిని.

మా మిత్రుఁడు పోవలసిన గ్రామము మా పట్టణమునకు నూట యేఁబదిమైళ్ళ దూరములో నున్నది. అక్కడ కయోమార్గములు లేవు; తంతి సమాచార మందదు. నేను నామిత్రులతోడ నాలోచించి, ఆ చిన్నది వాసముచేయు గ్రామమును తల్లి యింటిపేరును జరప వలసిన కృత్యమును వివరముగాఁ దెలుపుచు మా మిత్రున కొక లేఖ వ్రాసి దానికి లక్ష ముద్రలు వైచి, లక్ష్మీనరసింహముగారే యిచ్చిన విశ్వాసపాత్రుఁడైన మఱియొక భటుని చేతికిచ్చి పంపితిమి. ఈ జాబు చేతులోపల మా మిత్రుఁడు గమ్యస్థానముచేరి విచారింపగా, బ్రహ్మానందముగారావఱకే గ్రామము విడిచి యుద్యోగాంతరమువొంద

దూరగ్రామము పోయినట్లు తెలియవచ్చినది. మామిత్రుఁడాగ్రామము లోనే వేచియుండగా, మేము పంపిన మనుష్యుఁడు పోయి కలిసికొని 22వ తేదీని మా లేఖ నిచ్చెను. తక్షణమే పోవలసిన గ్రామమునకు వారు మువ్వురును బైలుదేఱి పోయిరి. నా మిత్రుఁడు రాత్రి రెండు యామముల కాగ్రామము చేరి ప్రయాసముమీఱ వారి యిల్లు తెలిసి కొని చిన్నదాని తల్లిని లేపి యామె నేలాగుననో యొప్పించి యా చిన్నదానిని సురక్షితముగా రాజమహేంద్రవరమునకుఁ గొనివచ్చి యిరువదియేడవ తేదీని మా యింటివద్ద చేర్చెను. ఆ మఱునాఁడే యా చిన్నదానిని చూచుటకయి జనులు మా యింటికి రాసాగిరి. అప్పుడు మేము వరాన్వేషణమున కుపక్రమించితిమి. ఆవఱకు మా యింటనే యుండి విద్యనేర్చుకొని అప్పుడు విశాఖపట్టణములో రక్షక శాఖయం దిరువది రూపాయల పనిలోనున్న యిరువదిరెండు సంవత్స రముల ప్రాయముగల యొక చిన్నవాని భార్య యాకస్మికముగా మర ణము నొందుట తటస్థించెను. నేనాతనికీవిషయమున జాబు వ్రాయగా తానీ చిన్నదానిని వివాహమాడుట కంగీకరించెను. వివాహదినము నిశ్చయింపఁబడినది. వ్యయముల నిమిత్తమయి పైడా రామకృష్ణయ్య గారు వేయి రూపాయలు మాకిమ్మని నాళము కామరాజుగారికి వ్రాయఁగా వారా మొత్తమును మాకిచ్చిరి. పరికరము లన్నియు సమకూర్పబడినవి. అయినను విశాఖపురమండలారక్షకశాఖాధ్యక్షుడు వరునకు సెలవీయుటకు నిరాకరించినందున వివాహమునకు విఘ్నము సంభవించునట్లు కానఁబడెను. మా గోదావరీ మండలారక్షకశాఖా ధ్యక్షుఁడయి నాయందు మంచి యభిప్రాయము కలిగియుండిన కర్నల్ పోర్చిస్ గారప్పుడు చెన్నపురి రాజధానిలోని యా రక్షకశాఖ కంత కును నధికారిగా నుండుట తటస్థించెను. నేనాయనకు వ్రాయఁగా నా దొరగారు వరునకు సెలవిచ్చి పంపవలసినదని విశాఖపట్టణ

మండలారక్షకశాఖాధ్యక్షునకు తంతివార్తను బంపుటయేకాక గోదావరీ మండలా రక్షకశాఖాధ్యక్షునకు వివాహసంబంధమున నేనుగోరిన సర్వసహాయ్యములును జేయవలసినదని సహితము వ్రాసిరి. విశాఖ మండలా రక్షకశాఖా ప్రధానకార్యస్థానాధిక్షకుడు దర్భా వేంకట శాస్త్రిగారు వరుని వెంటబెట్టుకొని నచ్చి యుక్తకాలములో రాజమహేంద్రవరము చేరిరి. వరుడు గోగులపాటి శ్రీరాములుగారని తెలిసినతోడనే మా పట్టణములోని యాతని బంధువులు మొదలైనవారు వచ్చి వివాహము చేసికోవలదని హితోపదేశములు చేసి కార్యము గానక మరలిపోవుచు వచ్చిరి. వివాహము జరుగునని నిశ్చయముగా తెలిసిన తరువాత మా పట్టణమునందు పుట్టిన సంక్షోభ మింతింత యని చెప్పుటకు శక్యముకాదు. వివాహదినమున మాయింటమాత్రమే కాక మాయింటి చుట్టును మావీధి పొడుగునను రక్షకభటులు కావలి కాయవలసి వచ్చినది. ఇటువంటి మహాసంక్షోభములో 1881వ సంవత్సరము డిశంబరు నెల 11వ తేదీని రాత్రి రాజమహేంద్రవరములో మొదటి స్త్రీపునర్వివాహము జరిగినది.

ఆ వివాహమునకు చల్లపల్లి బాపయ్యగారు రాలేదు. ఆయన యన్న లిద్దరును నాటిరాత్రి యీయనను బలవంతముగా నొకగదిలో పెట్టి తాళమువేసి నిర్బంధించి యీవలకు రానీయకపోయిరి. న్యాపతి సుబ్బారావుగారా రాత్రి వివాహమునకు రాలేకపోయిరి. ధైర్యశాలులును, దేశాభిమానులు నయిన మిత్రులనేకులు వివాహదినము లలో తాంబూలములకు మాత్రమేకాక భోజనములకు సహితము వచ్చిరి. మంచికార్యములలో నెల్లను నాకు కుడిభుజమయి యుండి పయికి పేరు నాదియైనను చాటున నాకంటెను బహుగుణము లధికముగా పనిచేయుచు వచ్చుచున్న బసవరాజు గవర్రాజుగారిని ముఖ్యముగా శ్లాఘింపవలసియున్నది. మరణపర్యంతమును నన్నును నేను

పూనిన వితంతువివాహ పక్షమును విడువక ప్రాయశ్చిత్తమునకు లోఁబడకయుండిన మహాపురుషు డీయన యొక్కఁడే. గవర్రాజుగారి వలెనే యీపక్షమునఁ జేరి వివాహసమయమున భోజనములుచేసిన వాఅందరును కొంచెముగానో గొప్పగానో శ్రమలకోర్చినవా రే. కొందరు తొందరపడి ప్రాయశ్చిత్తము చేసికొన్నను, ఇటువంటి భయంకర సమయములో ధైర్యము నిలుపలేకపోయినందుకు నేను వారిని నిందింపను. శ్రీ పైడా రామకృష్ణయ్యగారి యంతటి ధైర్యా దార్యశాలి ప్రాయశ్చిత్తము చేసికోవలసి వచ్చినన్నాడు సామాన్య జనులు ధైర్యము నిలుపగలుగుదురా ?

విద్యార్థులును రక్షకభటులును నా కంగరక్షకులుగా నుండుట చేతను, ప్రభువులకెల్లను ప్రభువయిన యీశ్వరుఁడే నన్ను కాపాడు వాఁడయి యుండుటచేతను, దుష్టులవలన నా కేవిధమైన యపాయ మును గలుగలేదు. హిందువులైన రక్షకభటులు సహితము మాకు ప్రతిపక్షులుగా నుందురని విన్నవింపగా, మా మండలారక్షకభటాధి కారి పయిస్థలములనుండి మహమ్మదీయులను క్రైస్తవులను తాత్కా లికముగా రాజమహేంద్రవరమునకుఁ బిలిపించెను; మా యింటి చుట్టును భటులను కావలియుంచెను; ఏదైన యల్లరి జరిగినపక్షమున నాయకులను పట్టుకొనెదమని ప్రతిపక్షుల నాయకులకు ప్రకటనపత్రిక లను బంపెను. ప్రతిపక్షుల ప్రయత్నములను సరకుగొనక మేమును విచ్చలవిడిగా ధనవ్యయముచేసి వారి క్రియలకు ప్రతిక్రియలు చేయు చుంటిమి. ధనవ్యయమునకు వెనుకతీయక మా పట్టణములోని వాద్య ములు వాయించు మంగలివాండ్రనెల్ల మేము పెండ్లిలో మేళమునకు కుదిర్చితిమి. నూఱేసి రూపాయ లప్పిచ్చియు, భోజనములు గాక నెల కేడేసి రూపాయల చొప్పున జీతమిచ్చి సంవత్సరము వరకు పని చేయించుకొ కొఁడంబడికలు వ్రాసియిచ్చియు, వినాహాదినమునను

లలో దినమునకు నాలుగేసి రూపాయల చొప్పున నియ్య నొప్పు కొనియు, మేము నలుగురు వంటబ్రాహ్మణులను నీళ్ళబ్రాహ్మణులను సంపాదించుకోఁగలిగినారము. ఎంతమంది యాజకులను బెదరు పెట్టి సాగనంపినను, కట్టకడపట ధైర్యముచేసి వచ్చిన పురోహితుని భార్యను గోదావరిలో పడుటకయి పరుగెత్తించి, మరలించినను, నూఱు రూపాయలిచ్చి మంత్రము చెప్పుట కొక యాజకుని సంపాదింపఁగలగినారము. ఈ వివాహమహోత్సవమును జూచుటకయి యూ రాత్రి మా పట్టణములోని యూరపియనులు సహిత మందఱును దయ చేసిరి. మాయింటి చుట్టును రక్షకభటు లఱువది మంది కావలిగాయు చుండిరి. మండల రక్షకభటశాఖాధ్యక్షుడే స్వయముగానుండి తగిన యేర్పాటులు చేయుచుండెను. సంయుక్త దండవిధాయకుఁడే స్వయ ముగా రక్షణక్రమమును విచారించుచుండెను. అందుచేత నాటి వివా హము జయప్రదముగా జరిగెను. మా వంటబ్రాహ్మణులలో నొకఁడు మఱునాఁడు పాతిపోఁగా పోలీసువారతనిని పట్టితెచ్చి వానిని తమ యధీనములో నుంచుకొని వంటవేళకు తీసుకొనివచ్చుచు మాకెంతో తోడుపడిరి.

మొదటి వివాహమయిన నాలవదినమున పండ్రెండేండ్లు ప్రాయముగల యొక బాలవితంతువును వెంటబెట్టుకొని వచ్చి యామె తల్లి తన భర్త యా చిన్నదానిని వివాహము నిమిత్తము మాయొద్దకు బంపెనని చెప్పెను. మేమామె మాటలు నమ్మి సకలకలాశాలాప్రవేశ పరీక్ష నిమిత్తమయి పరీక్షాస్థలమునకు సోఁబోవుచున్న యొక విద్యా ర్థిని రప్పించి వధువును జూపి యాత డొప్పుకొన్నమీఁదట వివాహము సిద్ధముచేసితిమి. ప్రతిపక్షులవారు అతఁడు మంగళస్నానమునకుఁ గూరుచుండఁగా చూచి పరుగెత్తుకొనిపోయి యీ వార్త నతని తండ్రితోఁ చెప్పిరి. అతఁడును పెద్దపెట్టున కేకలువేయుచు వివాహ

సమయమున వధూవరులు పెండ్లిపీటలమీఁద కూరుచుండియున్న ప్పుడు పెండ్లికుమారుని లేవఁదీసి లాగుకొనిపోవుటకయి ప్రయత్నిం చెను. కాని, మాలోనివాఁడు కొందఱాయనను కోఁగిటఁ బట్టుకొని శతమానము ముఁగిపడువఱకును మంచిమాటలు చెప్పి తరువాత మెల్లఁగా నావలకు పంపివేసిరి. ఆ మఱునాటి రాత్రి యా యిద్దఱు పెండ్లిదంపతులను మహావైభవముతో పెండ్లిపల్లకులలో నూరేగించి తిమి. అఱువదిమంది పోలీసుభటులతో పోలీసు సూపరిండెంటే పల్ల కులను జనుల యెత్తిడినుండి సంరక్షించుచు పురవీధులలో వెంట నడిచెను. హిందువులలోని తగు మనుష్యులు మాత్రమేకాక మండల న్యాయాధిపతి సంయుక్త దండవిధాయకుఁడు శాస్త్రపాఠశాలా బ్రధానోపాధ్యాయుఁడు మొదలయిన యూరపియనులు సహితము మహోత్సాహముతో పల్లకుల వెంట నడిచిరి. ఆవధూవరులను జూచిన సామాన్యజను లందఱును సంతోషించి యెక్కఁడజూచినను ఆ కార్య ములను శ్లాఘించుచునే వచ్చిరి.

రెండవ పెండ్లికొమార్తను తండ్రి యనుమతిలేకయే తీసికొని వచ్చినదని తల్లివలన సత్యము గ్రహించి మేమే పెండ్లికొమారిత తల్లిని పినతల్లిని పంపి యామె భర్తను మాయొద్దకు రప్పించుకొని సభల కెక్కకుండ తప్పించుకొంటిమి. పూర్వాచారపరాయణులలోని ధూర్తులుచేయు దుండగములకును పెట్టు బాధలకును తాళఁజాలక పిఱికికిగుండె కలవారనేకులు ప్రాయశ్చిత్తములు చేసికొని ప్రతిపక్షు లలోఁ జేరిరి. కొంత ధైర్యముకలిగి నిలిచినవారిలో స్వగృహములు కలవారికిని పరగృహముల నుండి వెడలఁగొట్టఁబడని బలవంతులకును గాక మిగిలిన వారికి నేను మాగృహమిచ్చితిని. కొటికలపూఁడి రామే శ్వరరావుగారికి గవర్రాజుగారు తమ గృహము నిచ్చిరి. నా పితా మహి సహితము నన్ను విడిచి మా యింటినుండి లేచి పొరుగింటికి

కాపురమునకు వెళ్ళెను. నేనామెకుఁ గావలసిన సమస్తమును సమకూర్చుచుంటిని. వృద్ధురాలయిన యామె కొన్నిదినములలో కొంత మాటీ నామీది స్వాభావిక ప్రేమచేత వచ్చి మాయింటనే ప్రవేశించెను; కడపట మాతోనే భోజనముచేయుచు 1884వ సంవత్సరమున మృతినొందు వరకును వివాహము చేసికొన్న దంపతుల నత్యంత ప్రేమతో నాదరించుచు వచ్చెను. వివాహములయిన కొన్నిదినముల లోనే ముప్పదివయందికి శ్రీ శంకరాచార్యస్వాములవారి యొద్దనుండి బహిష్కార పత్రికలుకూడ వచ్చినవి.

ఈబాధ లిక్కడ నిట్లుండగా చెన్నపట్టణము నుండి యనేక మిత్రులు వెంటనే చెన్నపట్టణము వచ్చి యచ్చట కొన్ని యుపన్యాసములు చేసినపక్షమున తప్పక కొన్ని వివాహములగుననియు నాహ్వానము చేసిరి. వారి కోరిక చెల్లించుట కర్తవ్యమని నాకు తోచినందున, చెన్నపట్టణమునకుఁ బోయి జనేవరు 16వ తేదీని పాఠశాల తెఱచులోపల మరల రాజమహేంద్రవరమునకు రా నిశ్చయించుకొంటిని. నల్లగొండ కోదండరామయ్యగారిని వెంటఁబెట్టుకొని బయలు దేటి డిశెంబరు నెల 29వ తేదిని కాకినాడలోఁ బ్రవేశించితిని. పొగయోడ బయలుదేఱెను 30వ తేదిని గాలివాన యారంభమయ్యెను. నాటి మధ్యాహ్న మాగాలివానలోనే పడవయెక్కి నా సహచరుని తోడఁగూడ పొగయోడ సమీపమునకు బోఁగలిగినను, ధూమ నౌకాధికారి మమ్మెక్కించుకోక నిరాకరించినందున మేముభయులమును రాత్రి యెనిమిది తొమ్మిది గంటలకు తీరము చేరవలసిన వారమయితిమి.

స్వాములవారు పంపిన బహిష్కార పత్రికలు పెద్దపులులవలె బెదరింపఁగా మాలోనివారు శంకరాచార్యస్వాములవారి మీఁద మానసష్టమునకయి యభిమోగము తెచ్చుటయే దానికితగిన మందని

నన్నాపనికి పురికొల్పిరి. స్వాములవారిపై నభియోగము తెచ్చుటకు నేనొప్పుకొనలేదు. ఆత్మూరి లక్ష్మీనరసింహముగారు స్వాములవారిపై నభియోగము తెచ్చిరి కాని యది కొట్టుబడిపోయినది. మా ప్రతి పక్షులు విజయగర్వితులయి మా పక్షమువారిని మఱింత లోకువచేసి గేలిచేయసాగిరి. ఆత్మూరి లక్ష్మీనరసింహముగారు వైష్ణవమత ప్రవిష్టులయి ప్రాయశ్చిత్తము చేసికొనగా, వారు వితంతువివాహ పక్షమున పనిచేసినందుకే ప్రాయశ్చిత్తము చేసికొనిరని ప్రతిపక్షులును పామరులును పలుకఁజొచ్చిరి. పైడా రామకృష్ణయ్యగారే వితంతు వివాహపక్షమును విడిచిబెట్టి ప్రాయశ్చిత్తము చేయించుకొనఁబోవు చున్నారని యొక ప్రబలప్రవాద మెల్లయెడలను వ్యాపించెను.

ఇటువంటి కష్టకాలములయందు సహితము న్యాపతి సుబ్బారావుగారు మా కాలోచన చెప్పుచు సర్వవిధముల సాయము చేయుచుండిరి. సుబ్బారావుగారు రామకృష్ణయ్యగారిని ప్రాయశ్చిత్త కర్మల నుండి మరలించు సందేశమును వహించి మా పక్షమున కాకినాడకుఁ జోయి వారితో మాట్లాడి ప్రాసిసట్టుగా రామకృష్ణయ్యగారు రాజమహేంద్రవరము వచ్చి నన్ను చూచిరి. ప్రాయశ్చిత్తము చేసికొనకుండ మరలించుటకయి యాయనకు నేను చెప్పవలసినంత చెప్పితిని. రామకృష్ణయ్యగారు ప్రాయశ్చిత్తము చేసికొని నాఁడే కాకినాడకు వెడలిపోయిరి. ప్రాయశ్చిత్తము చేసికొన్న తరువాత రామకృష్ణయ్యగారు మాసవ్యయముల నిమిత్తము సొమ్మ్ము పంప మానివేసిరి. నేనీ సంగతి నెవ్వరికిని దెలియనీయక యథాపూర్వకముగా సేవకుల జీతములు మొదలైన విచ్చుచు పనులు జరపుచుంటిని.

ఇప్పుడు గోగులపాటి శ్రీరాములుగారి వృత్తాంతమునకు వత్తము. ఆయన వివాహము చేసికొని మరల విశాఖపట్టణమునకు వెళ్ళిన యల్పకాలములోనే యాయనకు రక్తగ్రహణి పట్టుకొని యంత

కంతకు హెచ్చయ్యేను. మా యింటనేయున్న నల్లగొండ కోదండ రామయ్యగారు జనేవరినెల 29 వ తేదీని విశాఖపట్టణము చేరునప్పటికే యతని వ్యాధి యీశ్వరానుగ్రహము వలన మరలి యతఁడు స్వస్థతకు వచ్చుచుండెను.

రాజకీయోద్యోగుల యకృత్యముల నణఁచుటకును సంఘ సంస్కారములను దేశమునందంతటను వ్యాపింపఁజేయుటకును మా చేతిలో వివేకవర్ధనీ పత్రిక యమూల్యాయుధముగా నుండెను. మా ప్రతిపత్తులు, ముద్రాశాల భాగస్థుల ప్రేరేపించి ముద్రాయంత్రము పనిని నిలుపునట్లు చేసిరి. రు 1250 లను వారికిచ్చి ముద్రాయంత్ర మును నేనే కొని పని నెప్పటినటె సాగింపసాగితిని. నేను వితంతు వివాహోద్యమములో మునిఁగియున్నప్పుడు సహితము మిత్ర సాహా య్యమున నిర్భయముగా నితరుల దౌష్ట్యములను వెల్లడించి ధర్మస్థాప నము చేయఁ బాటుపడుచునే యుంటిని. ఈ విషయమున శ్రీ వైడా రామకృష్ణయ్యగారి లేఖలలోని కొన్ని వాక్యము లిందుదాహరించెదను.

(1) కాకినాడ 1-10-81,"

"గొప్పవారికి విరోధముగ మీరు ప్రాసిన వ్యాసములలో కొన్ని టిని చదివినప్పుడెల్లను నేనత్యంత కంపమును బొందుచున్నాను..... మీ కనేక శత్రువు లున్నారు..... మీ కడపటి దానిలో జాన్‌సన్ గారి విషయమునను పుర పారిశుద్ధ్య సంఘము విషయమునను స్మిత్తు గారి విషయమునను మీ వ్యాఖ్యానములను విచారముతో చదివి నాను. ఎన్నైనను మేము లక్ష్యము చేయమని మీరంటిరి. ఇది జాన్‌సన్ గారి నుద్దేశింపఁబడినది. దండవిధాయులతోను, దండ శాఖాధికారులతోను తగవు పెట్టుకొనవలదని నేను మీకు హితము చెప్పుచున్నాను.....ఏ దినమునైన మీరు శ్రమలోనికి వచ్చెదు పక్షమున, వితంతుపక్షములో నొక గొప్ప పోషకుని నేను పోగొట్టు కొనవలసి వచ్చును. ఆవేడి మీతో పడిపోవును."

దండవిధాయకుఁడైన జాన్‌సన్ గారే రెండుమాసముల తరువాత జరిగిన వితంతు వివాహ సమయమున తాము స్వయముగా యూరేగింపు వేడుకను నడపి నాకెంతో సాయముచేసిరి; డాక్టర్ స్మిత్తుగా రిప్పటికిని నాకు మిత్రులయి రాజమహేంద్రవరము వచ్చి నప్పుడెల్లను నన్ను చూచి పోవక మానరు.

(2) కాకినాడ, 26—3—84.

"కెల్సాల్ గారి విషయమైన మీ వ్యాఖ్యానములు ముఖ్యమైనవి కావని మీకు తెలుపగోరుచున్నాను. మీకు రహస్యమైనట్టిగాని బహిరంగమైనట్టిగాని శత్రువు కావచ్చునని నేను భయపడుచున్నాను. .....మీరు ప్రజలకు మిక్కిలి విలువగలవారు. కాబట్టి యిటువంటి గొప్పవారును బలవంతులునైన వారినిగూర్చి వ్రాయకుఁడు. మేము మిమ్మె పోగొట్టుకొన్న పక్షమున, మేము సమస్తమును పోగొట్టు కొందుము. నన్ను క్షమింపుడు".

మండల న్యాయాధిపతియైన యీ కెల్సాల్ గారు నాకు పరమ మిత్రులయి రాజమహేంద్రవరములో నున్నప్పుడు మా యింటికి వచ్చుచుండుటయేకాక యుపకారవేతనమును బడసి యింగ్లండునకుఁ బోయినతరువాతసహిత మప్పుడప్పుడిప్పటికిని నాపేర లేఖలు వ్రాయుచున్నారు.

లక్ష్మీనరసింహముగారు తెచ్చిన యభియోగము పోయిన సమయములో మాకు పాఠశాలలోని విద్యార్థు లనేకులు చేతనయిన సర్వవిధముల తోడుపడినారు; కొందఱొక్కఁడకు పొమ్మన్నను పోయి చేయుమన్న పనిని రెండవవా రెఱుఁగకుండ చేయుచు వచ్చిరి.

లక్ష్మీనరసింహముగారి యభియోగము పోయిన నుఱునాఁడు శంకరాచార్య స్వాములవారిని మహావైభవముతో రాజమహేంద్ర పుర వీధులలో నూరేగించిరి; కాని మాయింటిముందర నల్లరి యేమా

త్రము చేయక సాగిపోయిరి. నాఁడే యీవార్తను తంత్రీముఖమున కాకినాడకు పంపఁగా నా లేఖను పురజనులు పల్లకిలోఁబెట్టి యూ రాత్రియే యూరేగించి పైఁడా రామకృష్ణయ్యగారి యింటిముందు నిలిచి యల్లరిచేసిరి. ఈ యల్లరియే యీయనను ప్రాయశ్చిత్తమునకు లోఁబడునట్లు చేసినది. స్వాములవారు రాజమహేంద్రవరమును విడు వక కొన్నిమాసము లక్కడనే నిలిచియుండిరి. రెండుదినము లయిన తరువాత పగలు పండ్రెండు గంటలవేళ స్వాములవారి శిష్యులు గోదావరిలో స్నానముచేయుచుండగా, విద్యార్థు లిద్దఱక్కడకు స్నానమునకు పోయిరి. వారిని చూచి స్వాములవారి శిష్యులు విద్యా ర్థుల నందఱిని కలిపి తిట్టగా, తిట్టుట న్యాయముకాదని యొక విద్యార్థి మందలించినందున వాక్కలహము ముదిరి యీశిష్యులా చిన్నవానిని పట్టుకొని క్రూరముగా కొట్టిరి. రెండవ విద్యార్థి పాఱిపోయి యీ సమాచారమును పట్టణములో చెప్పగా, పాఠశాలలోని విద్యార్థు లనేకులు గుంపులుకూడి స్వాములవారున్న గృహాముముందు నీధిలో తిరుగసాగిరి. మఱునాఁటి మధ్యాహ్నమున ధైర్యము తెచ్చుకొని యీ శిష్యులు సాహసించి యయిదాఱుగు రొక్క కూటముగాచేరి గోదావరి యొడ్డునున్న యిసుకతిప్పకేసి నడిచి, మరల వచ్చుచు ధాన్యపుపాకలను సమీపించునప్పటికి, విద్యార్థులు కనఁబడిరి. నలు ప్రక్కలను చూపు నిగిడింపఁగా విద్యార్థులు గుంపులు గుంపులుగా వచ్చుచుండిరి. విద్యార్థులు ముందుకు వచ్చువారిని పట్టుకొని బుద్ధి చెప్పి యీ శిష్యులను విడిచిపెట్టిరి. వెనుకటివారు గోదావరిలో దిగి కంఠము లోతువఱకును పాఱిపోయిరి. విద్యార్థులు వారిని వెంబడించి పట్టుకొని తమ తోడివిద్యార్థి నన్యాయముగా గొట్టిన బుణమును వడ్డితోడఁ గూడ తీర్చుకొనిరి. మొట్టమొదట దెబ్బలుతిని తప్పించు కొనిపోయిన శిష్యులు స్వాములవారి సన్నిధానము చేరి, అక్కడ నున్న రక్షకభటులతోడ కొన్ని నిమిషములలో మరల యుద్ధభూమిని

చేరిరి. నీటిలోనున్న విద్యార్థులా రక్షకభటులను జూచి మతియొక రేవున తేలి యింటికిపోయిరి. శిష్యులను వెంటబెట్టుకొనిపోయి రక్షక భటులు వారిని స్వాములవారితో జేర్చిరి.

మఱునాటి యుదయమున స్వాములవారు తమ పీఠమును మా పట్టణము నుండి తరలించి శిష్యబృందముతో తాము నదిని తరించి భిక్షలు చేయింపలేక శ్రమపడుచున్న యా పురమువారినికూడ తరింపఁ జేసిరి. మొట్టమొదట దెబ్బలుపడిన విద్యార్థి స్వాములవారి శిష్యుల మీఁదను, స్వాములవారి శిష్యులు విద్యార్థులమీఁదను ధర్మసభలలో నభియోగములు తెచ్చిరి. కాని దండవిధాయకుఁడు జగద్గురు శిష్యుల కై దేసి రూపాయలు ధనదండనము విధించి బుజువులేనందున విద్యార్థులను విడిచిపెట్టెను.

చెన్నపట్టణములో మాతో సహభోజనమున కేర్పాటుచేసి మాకు ప్రోత్సాహము కలిగించుటకయి చెంచలరావుగారు మమ్మెచ్చటకు రండని యాహ్వానముచేసిరి. నేను మేయి నెలలో పోవుట మంచిదని యెంచి యా సెల మొదట ప్రథమ వివాహ దంపతులను వెంటఁ బెట్టుకొని భార్యాసహితముగా బైలుదేఱి, విశాఖపురి రేవులో పొగ యోడ నెక్కి నాలవ దినమున చెన్నపట్టణపు రేవు చేరితిని. చెంచల రావుగారోడమీఁదికే మనుష్యులను బంపి, మైలాపురములో మా కయి యేర్పఱిచిన విశాల గృహమునందు ప్రవేశపెట్టిరి. నేను సుఖ భోజనము చేయుచు పంతులుగారు పంపిన గుఱ్ఱపుబండ్లమీఁద పోయి యక్కడ నుపన్యాసము లిచ్చుచు రఘునాథరావుగారి రాకను ప్రతీక్షించుచుంటిని. నేనొకసారి చాకలిపేటలో వితంతు వివాహమును గూర్చి యుపన్యసించుచుండఁగా వైష్ణవబ్రాహ్మణులు మర్దింపఁ జూచిరిగాని పనప్పాకము ఆనందాచార్యులుగారు యుక్తసమయ

ములో నన్నక్కడనుండి తమ బండిలో నెక్కించుకొనిపోవుటచేత వారిబారినుండి తప్పించుకొంటిని. ఇంకొక్కసారి నేను పెద్దినాయని పేటలో నుపన్యసించుచుండగా పండితులనేకులు చేరి నన్ను పరాభవింప నెంచి, యనేకప్రశ్నములు వేసిరి. నేను వాని కన్నిటికిని శాస్త్రోక్తములయిన సమాధానములను చెప్పితిని. తిరువళ్ళిక్కేణిలో జరిగిన పండితసభలో కంచి సుబ్బారావుగారి పక్షమువారితో శాస్త్రార్థ విషయమయి వాదప్రతివాదములు జరిపితిని. ఈ సభలకు పూర్వము ఆండర్సన్ హాలులో స్త్రీపునర్వివాహమునుగూర్చియుపన్యసించుటకు చెంచలరావుగారి బండిలో వారితోడగూడ బైలుదేఱితిని. నా యుపన్యాసమును వినకముందే పండితులేమేమో పెద్దకాగితములమీద నచ్చొత్తించి పట్టణమునందంతటను పంచిపెట్టిరి. అది చదివినకొలఁదిని కోపవ్యగ్రతచేత నామనస్సు నావశముగాక యుద్రేకింపఁ జొచ్చెను. ఇట్టిస్థితిలో నేనుపన్యాసపీఠము నెక్కి, రెండు గంటలసేపు నోటికివచ్చిన ట్లేమేమో చెప్పితిని, పలుమాఱు కరతాళధ్వనులతో సభాభవనమంతయు మారుమ్రోయఁ జొచ్చెను. ఆ పత్రికారచనకు కర్తలయి సభకు వేంచేసియుండిన ఘనులు సిగ్గుపడి తలలు వంచుకొనిరి. తరువాత స్త్రీపునర్వివాహ శాస్త్రసంగ్రహము నుపన్యాస రూపమునవ్రాసి యొకసభలో చదివి దాని నచ్చటనే యచ్చొత్తించితిని.

ఈప్రకారముగా మేము కాలముపుచ్చుచుండఁగా రఘునాథరావుగారు చెన్నపట్టణమునకువిచ్చేసిరి. వారును చెంచలరావుగారును గలిసి సంస్కారప్రియుల కందఱికిని నిర్ణీతదినమున సంస్కార భోజనమునకు దయచేయవలసినదని బహుదినములకుముందుగానే యాహ్వాన పత్రికలను బంపిరి. సబుజ్జిగా నుండిన గణపతయ్యరుగారొక్కరు మాత్ర మాహ్వాన మంగీకరించి రాఁగలిగిరి. అప్పుడు రఘునాథరావు గారును మిత్రులును శ్రీ పార్థసారథిస్వామివారి యాలయము నుండి

ప్రసాదమును తెప్పించి మాత్రోడఁగూడ విందారగించిరి. ఆ విందుకు వచ్చినవారు వివాహసంపశ్చులుగాక రఘునాథ రావుగారును, చెంచల రావుగారును, గణపతయ్యరుగారును, దంపూరి నరసయ్యగారును, మన్నవ బుచ్చయ్యగారును, నేనును గలిసి సాంఘికసంస్కారాభి మాన షట్చక్రవర్తులు. విందు ముగిసిన తరువాత చంచలరావుగారు మాకందఱికిని విలువబట్టలను కట్టనిచ్చి, ప్రయాణవ్యయములకయి నూఱు రూపాయలు రొక్కమిచ్చి, మమ్మిర్వీ వీడుకొల్పగా జూన్ నెల నడుమను సుఖముగా రాజమహేంద్రవరముచేరి, మా యెప్పటి వ్యవహారములో మరల మేము ప్రవేశించితిమి.

ఇప్పటికి మా సమాజమునకు నిధిగా ధనమేమియు లేదు; నెల చందాలు లేవు; మాసవ్యయముల కయినను రామకృష్ణయ్యగారిత్తురో లేదో సందేహము. ఈస్థితి నంతను శ్రీ కంచి కృష్ణస్వామిరావుగారితో మెట్టిపెట్టుకోఁగా వారు రామకృష్ణయ్యగారిని ప్రోత్సాహపఱచి రఘు నాథ రావుగారిని, పళ్ళె చంచలరావుగారిని ట్రస్టీలనుగా నేర్పఱిచి జూన్ నెల కడపట పదివేల రూపాయలను చెన్నపట్టణమునకుఁ బంపు నట్లు చేసిరి. మాకు చెన్నపట్టణమువారు పంపుదురు గాని రామ కృష్ణయ్యగారు స్వయముగా సొమ్మియ్యరు. సొమ్మును మాకు చెన్నపురి వారే పంపినను సొమ్ము రామకృష్ణయ్యగారిచ్చినదే. సొమ్మును చెన్నపట్ట ణము పంపినప్పుడు రామకృష్ణయ్యగారు చెంచలరావుగారి పేరను రఘునాథరావుగారి పేరను వ్రాసిన యుత్తరములో చెన్నపట్టణ సమాజమువారు రెండు వివాహములకు రెండువేల రూపాయలు వ్యయపఱచుకొనునట్లు వ్రాసి వివాహ మొక్కంటికి వేయేసి రూపా యల చొప్పున నాయొద్దకు పంపుచుండవలసినదనియు, వ్యయముల క్రింద జూన్ నెల మొదలుకొని నెలకు డెబ్బదియైదు రూపాయల చొప్పున నాకుఁ బంపుచుండవలసినదనియు వ్రాసిరి.

పెద్దిభట్ల యజ్ఞన్నగారును ప్రాథమిక పాఠశాలలో నుపాధ్యా యుఁడైన తాడూరి రామారావుగారును రాజమహేంద్రవరమువచ్చి మొదటివారు తమ చెల్లెలిని వైదికవరున కిచ్చి వివాహము చేయుట కును, రెండవవారు మాధ్వ వితంతువును వివాహమాడుటకును, అంగీ కరించిరి. వైదికవరుఁడు మా పాఠశాలలోని విద్యార్థులలో నొకఁడు సంసిద్ధుడయియే యుండెను; మాధ్వ వధువు సహితము లభించినట్లే యుండెను. ఉమ్మెత్తాల వేంకటపతిరావుగారి కూఁతురును, యజ్ఞన్న గారి చెల్లెలును, ఇద్దఱును చదువుకొన్నవారయి నాకావఱకే యుత్త రములు వ్రాసియుండిరి. ఇద్దఱిలో నొక చిన్నది పెద్దాపురములో నున్నది; ఇంకొక చిన్నది కాకినాడలో నున్నది; ఆకాలమునందు మా కర్తవ్యంతాప్తులయిన గుమ్మిడిదల మనోహరము పంతులుగారు పోలీసు ఇన్స్పెక్టరుగా నుండిరి; మా పక్షమునం దభిమానము గలవాఁడయి మేము కృషిచేయవలసిన చిన్నదాని యింటి యెదుటనే కాపురముం డిన తంజావూరి వేంకటచలపతిరావుగారు లభింపఁగా కాకినాడలో ఆయనవలన కార్యసాఫల్యమును బడయుట కేర్పఱచుకొంటిమి, గవ ర్నరుగారు చెన్నపురికి పోవలసిన యావశ్యకము తటస్థింపగా, ఈవిష యమును కాకినాడలో పనిచేయుటకును, కొట్టుపడిపోయిన లక్ష్మీనర సింహముగారి యభియోగ సంబంధమైన యుపర్యభియోగ విషయ మయి చెన్నపట్టణములో పనిచేయుటకును, వితంతువివాహ పక్షమున నేనాయనను నియమించితిని. అయన చెన్నపురి పోవు దారిలో కాకి నాడ నుండి 1882 సం॥ ఆగష్టు 24 తేదీని నాకిట్లు వ్రాసిరి :—

"నా ప్రియ గౌరవనీయ మిత్రుఁడా!

"ఎల్లోరా పొగయోడ నేఁడిక్కడ ప్రతీక్షింపఁబడుచున్నది. లచ్చిరాజుగారు, రామారావు మొదలయినవారిని చూచితిని. తన్ను స్వశాఖవాని కెవ్వనికైన వివాహము చేయమని కోరుచు స్వహస్త

ముతో ఆచిన్నది మీపేర వ్రాసిన యుత్తరమొకటి వారియొద్ద నున్నది. రాత్రిపాఠశాల విషయమైన యల్పవిషయములలో తగులు కొనకుఁడు. సంబంధములను కుదిర్చి యావశ్యకమైన పనిచేయుటకు సంపర వెంకన్నగారిని మనము పనిలోపెట్టవలెనని తలఁచుచున్నాను".

పయి యుత్తరములో పేర్కొనబడిన చిన్నది పెద్దాపురపు చిన్నది. మా ప్రయత్నముచేత దొరతనమువారు కొట్టుపడిపోయిన లక్ష్మీనరసింహాముగారి యభియోగమును పైని ఉన్నత న్యాయసభలో ఉపర్యభియోగమును పెట్టించిరి. న్యాయమూర్తి ముత్తుస్వామయ్య గారు, శిష్యులకు బహిష్కార పత్రికలను పంపుటకు శంకరాచార్యుల వారి కధికార మున్నదనియు, ఆయన తన శిష్యులకు మాత్రమేకాక యితరులకుకూడ తెలియునట్లుగా బహిష్కారపత్రికలను పోస్టుకార్డుల మీద వ్రాసి పంపుట తప్పిదమనియు, నిర్ధారణముచేసి యాచార్య స్వాములవారి కిన్నూఱు రూపాయలు ధనదండనమును విధించిరి. నా కిప్పుడుండిన కార్యోత్సాహమే నాచేత ననేక కార్యములను చేయింపఁగలిగినది; వితంతువివాహ ప్రయత్నమటుండఁగా నేను క్రొత్త గ్రంథములను రచించుచుంటిని; వివేకవర్ధని యను వారపత్రికను నడుపుచుంటిని. శాస్త్రపాఠశాలలోని విద్యార్థులు పగలెల్లపాటుపడివచ్చెదు బీదవాండ్ర విద్యాభివృద్ధి నిమిత్తమయి రాత్రిపాఠశాలను సాగించెడి యేర్పాటును చేసితిని. సంపర వెంకన్నగారిని వెంటనే పిలిపించి, నా సొంతము నుండి నెల కెనిమిది రూపాయలు జీతమిచ్చునట్లేర్పఱచి, గ్రామములవెంట తిరిగి పనిచేయ నియమించితిని.

పెద్దాపురము చిన్నదానిని తెల్లవారునప్పటికి రాజమహేంద్ర వరము తీసికొనివచ్చి మాయింట విడుచునట్లు తగిన యేర్పాటు లన్నియు చేసితిమి. ఈసంగతి ఆచిన్నదాని బంధువులకు ముందుగా తెలియఁగా వారు జాగరూకులయి యుండుటచేత మావారు పోయిన

దారినే వట్టిచేతులతో మరలిరావలసిన వారయిరి. మా యుత్తర ప్రత్యుత్తరముల సంగతిమాత్ర మెవ్వరికిని తెలియక రహస్యముగానే యుండినది. అందుచేత మేము మఱియొక యుపాయము నాలోచించి మా ముద్దాశాలలో పనిలోనుండిన మునిసామిని పెద్దాపురమునకుఁ బంపితిమి. రాత్రి రెండు జాములవేళ మబ్బుపట్టి చినుకులు పడుచుండఁగా, వీధిలోనికి వచ్చి మా చిన్నది యా మనుష్యునితో తాను వచ్చుటకు సిద్ధముగానున్న సంగతిని తెలిపెను. అతఁడు వెంటనే యా చిన్నదానిని వెంటఁగొని, తానావఱకు తీసికొనిపోయిన బట్టలా చిన్న దానికి కట్టి పురుషవేషమువేసి, రెండామడలు నడచి, అక్కడ బండి చేసికొని మఱునాఁడు పగలు రెండుజాములవేళ నామెను మా యింటికిఁ జేర్చెను.

ఆ చిన్నది యిల్లుదాటిన నాలుగైదు నిమిషముల కెల్లను తల్లి మొదలైనవా రామె తగలిన సంగతి కనిపెట్టి తమ నగలెత్తుకొని పారిపోయినదని యా చిన్నదానిమీఁద పోలీసువారివద్ద ఫిర్యాదుచేసి యామెను పట్టుకొనుటకయి యీ రాత్రియే వారంటు పుట్టించిరి. ఆ వారంటు నిచ్చినది గుమ్మడిదల మనోహరముగారే. నాకీ వర్తమా నము పాఠశాలలోనుండఁగా మఱునాటి మధ్యాహ్నము తెలియవచ్చి నది. నేను సెలవుగైకొని పోలీసు సూపరిండెంటుగారి కార్యస్థాన మునకుపోఁగా, ఆయన కాకినాడకు పోయినట్టు తెలిసినది. అప్పుడింటికి వచ్చి చిన్నదానిని భద్రపఱిచి, వెంటనే ధవళేశ్వరము పోయి పడవ నెక్కి మఱునాటిమధ్యాహ్నమునకు కాకినాడ చేరితిని. పోలీసు సూపరిం డెంటంతకు ముందే వచ్చి కాలువలోని తమ పడవలోనున్నట్టు తెలసి సాయంకాలము నాలుగు గంటలవేళ దొరగారిని సందర్శించి సంగతి విన్నవించితిని. అతఁడా చిన్నదానిని పట్టుకొనకుండ పోలీసుద్యోగస్థుల కుత్తరువు పంపెదనని చెప్పి నన్ను పంపివేసెను. ఇఁక పెండ్లికొమా

రుని తీసికొనిపోవలసి నేనాయనవద్దనుండి హిందూపాఠశాలకు పోయి యాతనిని నావెంట రమ్మని పిలువఁగాఁ ఆతఁడీ యభియోగ వార్తను వినుటవలనను భీతివలనను జడిసి నావెంట రాకుండుటకయి సాకులు చెప్ప మొదలుపెట్టెను. కాని నేను పూనికను విడువనందున నాతో వచ్చి మఱునాఁడు తెల్లవారిన తరువాత మేడపాడు దగ్గిర పడవ దిగి పారిపోయెను. నేను నాఁడు మధ్యాహ్నము రెండు గంటలకు రాజమహేంద్రవరము చేరి, రామకృష్ణయ్యగారు మొదలైన మిత్రుల కందరికిని వరుస మరలఁ బంపుటనుగూర్చి యుత్తరములు వ్రాసితిని. పెండ్లికుమార్తెమీఁది యభియోగ మామె వివాహము చేసికొనఁబోవు చున్నదన్న ద్వేషముచేత తెచ్చినదయినట్టు కనఁబడుచున్నందున, ఆమెను పట్టుకొనవలదని పోలీసువారికి సూపరిండెంటు వద్దనుండి వెంటనే యుత్తరువు వచ్చెను. తరువాత పెండ్లికొమారుని బాధింప నెంచిన ఋణప్రదాతల చేతులనుండి యాతని విముక్తునిఁజేసి పెండ్లి కొమారితను జూచి మాటాడిపోవ్రటకయి తుదకాతనిని రాజమహేం ద్రవరమునకు మరల రప్పించితిమి. నేను రాజకీయ వైద్యునిచేత వధు వును పరీక్షింపించి యాయననలన వధువు పదునారేండ్లు దాటినదని నిర్ణయపత్రమును (Certificate) పుచ్చుకొంటిని. పెండ్లికుమార్తె తల్లి మొదలగు బంధువులు మా యింటికి వచ్చి వధువును మరల దీసి కొనిపోవ్రటకయి నానావిధముల పాటుపడిరిగాని నిరాశులయి వెనుక మరలవలసినవారయిరి.

ఈసమయమునందు లక్ష్మీనరసింహముగారు సెలవుమీఁద బంద రులో నుండిరి; గన్నరాజుగారు విశాఖపట్టణమునకు మాపనిమీఁదనే పోవలసినవారయిరి. ప్రథమ వివాహము చేసికొన్న గోగులపాటి శ్రీరాములుగారికిని భార్యకును సరిపడలేదనియు, తల్లి యాచిన్నదా నిని తనతోడఁ దీసికొనిపోవ సిద్ధముగానున్నదనియు, పెద్దాపురపు

వధువును తీసికొనివచ్చుటకయి మేముచేసిన కృషి విఫలమయిన కాల ములో విశాఖపట్టణములోని మిత్రులయొద్దనుండి నాకుత్తరములును తంత్రీవార్త్తలును వచ్చినవి. ఆసమయమునందే చెన్నపట్టణము నుండి తాము బయలుదేఱుచున్నామని గవర్రాజుగారు నాకు తంత్రీవార్త్తను బంపిరి. మధ్యాహ్నము రెండుగంటల కాయన యోడదిగి పడవలో తీరము చేరునప్పటికి, నేనొడ్డుననుండి యాయనను కలుసుకొని విశాఖ పట్టణమునుండి వచ్చిన లేఖలను తంత్రీవార్త్తలను జూపి శ్రీరాములు గారికిని భార్యకును పొందుపఱుచుటకయి విశాఖపట్టణము వెళ్ళవలసి యున్నదనిచెప్పితిని. వచ్చిన యోడలోనే విశాఖపట్టణమున కాయన వెళ్ళెను.

ఇచ్చట వరునియొక్క యన్నగారు రాజమహేంద్రవరము వచ్చి మంచిమాటలచేత నాతనిని తీసికొనిపోవలెనని యెన్నో యుపా యములుచేసెనుగాని వివాహమగువఱకును పెండ్లికుమారునిని కంటికి ఱెప్పవలె నొకరువిడిచి యొకరము కాచి, 1882వ సంవత్సరము అక్టో బరు నెల 22వ తేదీని బహుకష్టముమీఁద మూడవ వితంతు వివా హము చేసి యీశ్వరానుగ్రహముచేత నిర్వహింపగలిగితిమి. విశేష వ్యయముచేసి యీ వివాహమును మొనటిదానికంటెను నధికవైభవ ముతో జరపితిమి. మా ప్రతిపక్షులు తెచ్చిన యభియోగము విమర్శ మీఁద డిసెంబరు నెలలో కొట్టుపడిపోయినది. పెండ్లికొమారిత తండ్రి అభియోగము కొట్టుపడిపోయిన తరువాత మాయింటికి వచ్చి క్షమా ర్పణముచేసి, యీ వ్యవహారము నిమిత్తమయి రాజమహేంద్రవర ములో నుండవలసివచ్చుటచేత తనకు పదిరూపాయ లప్పయ్యెనని చెప్పఁగా నేనా పదిరూపాయల నిచ్చివేసితిని.

ఈ వివాహ మయినతరువాత అక్టోబరు 24వ తేదీని కలకత్తా నుండి ఈశ్వరచంద్రవిద్యాసాగరులవారిట్లు వ్రాసిరి :—

"దేశముయొక్క మీ భాగములో మూడవ బ్రాహ్మణ వితంతువుయొక్క వివాహనిర్వహణమునుగూర్చిన సమాచారమునకై నేను మీకెంతయు నుపకారస్మృతి కలవాడనై యున్నాను. ఇక్కడి వితంతు వివాహితులు ఈ శుభవర్తమానము వలన మిక్కిలి సంతోషమును పొందియున్నారు. అదృష్టహీనులైన దుఃఖభాగినుల పట్ల మున మీయొక్క పరోపకార ప్రయత్నములకు నిరంతర విజయము కలుగునుగాక యనుట— మీ సుహృదుడైన యీశ్వరచంద్రశర్మ యొక్క సమాహిత ప్రార్థన".

కలకత్తా నుండి యీశ్వరచంద్రవిద్యాసాగరులవారును, బొంబాయినుండి మహాదేవగోవిందరానెడిగారును, నాతోడ నప్పుడప్పు డుత్తరప్రత్యుత్తరములను జరుపుచు శాస్త్రవిచార విషయమున నా సందేహాములను దీర్చుచు నాకెంతో సాయము చేయుచుండెడి వారు.

కాకినాడలో నుత్తమ వైదికకుటుంబమునందు జననమొంది చదువుకొన్న యొక బాలవితంతు వుండెను. వెంకటప్పయ్యగారు వెనుక మాట్లాడినది యీ చిన్నదాని యన్నగారితోనే. ఆచిన్నదాని యింటియెదుటనున్న యింటిలో తంజావూరి చలపతిరావుగారను నొక పెద్దమనుష్యుడు కాపురముండెను. అయన వితంతు వివాహాముల యందు విశేషాభిమానము కలవాడగుటచే జాలిపడి యాచిన్నది తమ యింటికి వచ్చినప్పుడు వివాహవిషయమైన ప్రసంగము తీసికొని రాగా నామె తనయభీష్టమును తెలియబఱిచెను. ఆ చిన్నది యొక నాటి ప్రాతఃకాలమునం దొంటిగా నున్నప్పు డాయనను కలిసికొని, ఆరాత్రి పెండ్లివారు తమ వీధినుండి యూరేగునప్పుడు తన్ను తీసికొని పోవునట్లేర్పాటు చేసినపక్షమున రాజమహేంద్రవరము వెళ్ళుదునని చెప్పెను. నాటి వివాహము శ్రీ పైడా రామకృష్ణయ్యగారి యింటనే.

సుమారు రాత్రి పదిగంటలవేళ పెండ్లి యూరేగింపు వారియింటి ముందునుండిసాగెను. నియమింపబడిన మనుష్యుడును పెండ్లిపల్లకితో నూరేగింపునకు ముందే నడుచుచుండెను. పల్లకియు సంకేతస్థలమున సిద్ధముగా నుంచబడెను. పెండ్లిపల్లకి తమయింటి ముందుకు రాగానే ఆ చిన్నది సందడిలో వెలుపలికి వచ్చి తనరాకకై యెదురుచూచు చుండిన మనుష్యునివెంట నడిచి పల్లకిలోఁ గూరుచుండెను. తెల్లవారు నప్పటి కాకస్మికముగా పల్లకివచ్చి మాగుయ్యములో దిగఁగా మేమా చిన్నదానిని లోపలికి తీసికొనిపోయి భద్రముగా నుంచితిమి. ఈ చిన్న దానికి వివాహముచేయ నుద్దేశించి యామె యన్నగారావఱకు నాతో మాటాడి యుత్తరములు వ్రాసినవాఁడనైనను, తరువాత జడిసి తాను కార్యముచేయుటకు సాహసింపలేకపోయెను. పులవర్తి శేషయ్య యను నొక వైదిక విద్యార్థి యుండెను. అతఁడు పరీక్షానం తరమున గ్రామాంతరము పోయియుండగా, మనుష్యుని బంపి యాత నిని పిలిపించి యీ చిన్నదాని నాతనికి 1883 వ సంవత్సరము జనవరి నెల 14 వ తేదిని వివాహము చేసితిమి. ఈ వివాహమునాటికి లక్ష్మీనర సింహముగారు బందరు నుండి తిరిగివచ్చినవారయి సహాయులయిరి. ఈ వరుడు శుద్ధ శ్రోత్రియ వంశమునందు పుట్టి వైదికవృత్తియందున్న యన్నలను తండ్రిని కలవాఁడు.

ఆ కాలమునందు విద్యార్థులు మాకుచేసిన సాయమును నే నెన్నటికిని మరువజాలను. ఇట్లు కష్టముమీఁద నిర్వహింపఁబడిన యీ రెండు వివాహములకు నత్యాశ్చర్యపడి వైడా రామకృష్ణయ్య గారు మొదలైన మిత్రులు మాకనేకాభినందన పత్రికలను బంపిరి. ఈ నాలవ వివాహ మయినపిమ్మట ప్రతిపక్షులు తమ ప్రయత్నముల వలన కార్యములేదని తెలిసికొని నిరుత్సాహులయి కార్యవిఘాతము చేయ పాటుపడుటకును మానుకొని యుపేక్షాపరులు కానాగిరి.

సంస్కార వ్యాపనముచేయు నిమిత్తమయి నెల కెనిమిది రూపాయలు జీతమేర్పఱిచి సంపర వెంకన్నగారిని నిముమించితినని చెప్పితినిగదా! ఆయన అక్టోబరు నెలనుండి నావద్ద మూడు నెలలు జీతము పుచ్చుకొనెను. పదునెనిమిదేండ్ల ప్రాయముగల యాయన కూతురైన తనయింటి వితంతువే నాలవ నెలలో మా యింటికి పరు గెత్తుకొని వచ్చి తనకు పతిభిక్ష పెట్టమని నన్ను వేడుకొనెను. ముంజు లూరి వెంకట్రామయ్యగారు ప్రాయశ్చిత్తము చేసికొని వెడలిపోవు నప్పు డిరువది యేండ్ల వయస్సుగల తన తమ్ముని మాయింట దిగ విడిచిపోయిరి. గోపాలమను పేరుగల యాతఁడు తనకు వివాహము చేయవలసినదని పలుమాఱు నన్ను తొందర పెట్టుచుండెను. నాలుగవ వివాహమైన యిరువదియేడు దినముల కనగా 1883 సంవత్సరము జనేవరి నెల 30వ తేదీని కొత్తగావచ్చిన వితంతువు నాతనికి పెండ్లి చేసితిని. ఆసంవత్సరము గోదావరి పుష్కర సంవత్సరము. పదునే డేండ్ల యీడుగల యొక వైదిక వితంతువును తల్లియు నన్నగారును రాజమహేంద్రవరమునకు తీసికొనివచ్చి గోదావరి యొడ్డునన్న సత్రములో దిగియుండిరి. ఇఁక తెల్లవాటిన శిరోజములు తీయింతు రనగా నారాత్రి యెట్లో యా చిన్నది తనవారి నేమఱించి తప్పిం చుకొనివచ్చి నన్ను శరణుజొచ్చెను. నేను వెంటనే శతమాన ములు చేయించి యా రాత్రియే వివాహముచేసితిని. వివాహమాడిన యతనిపేరు చేబోలు వెంకయ్య. ఆఅవదియైన యీ వివాహము 1883 వ సంవత్సరము మార్చి నెల 13వ తేదీని నడచినది. అయిదవ వివాహమునకు నా భార్యయే గోవావరినుండి నీళ్లు మోసికొనివచ్చి వంట మొదలైన పనులెల్లను స్వయముగాచేసి యెంతో కష్టపడవల సినదయ్యెను. బ్రాహ్మణులలో వివాహములు తఱచుగా జరుగుచుం డుట విని యొక వైశ్య వితంతువు తన కొమార్తయైన పదేండ్ల యీడుగల బాలవితంతువును దీసికొనివచ్చి పరిణయము చేయవల

సినదని నా పాదములమీదఁ బడవై చెను. వివాహము చేసికొ నెదనని యావఱకే నావద్ద తిరుగుచున్న యిరువదియేండ్ల యీడుగల బోడా శ్రీరాములను కోమటి చిన్నవానికిచ్చి యా చిన్నదానిని 1883 వ సంవత్సరము ఏప్రియల్ నెల 11వ తేదీని వివాహముచేసితిని. ఏడవది యైన యీ కోమటి వివాహము జరుగునప్పటికి రక్షకభటులయొక్క సహాయ్య మక్కఱలేకయే దంపతులను రాత్రివేళ వీధులగుండ నిర్భయముగా నూరేగింపఁగలిగిన కాలము వచ్చినది.

చెన్నపురములోని మా మిత్రులు పళ్ళె చెంచలరావుగారును రఘునాథరావుగారును వివాహములెల్ల నొక మూలనున్న రాజమహేంద్రవరములో జగుగుటకంటె కొన్నియైనను చెన్నపట్టణములో జరపవలసినదని నన్నును రామకృష్ణయ్యగారిని కోరిరి. రాజమహేంద్ర వరములోని విద్యార్థి యొకఁడు క్రొత్తగా పెండ్లిచేసికొని కాలధర్మము నొందెను. అతని యప్పగారు మాయింటి సమీపమునసే కాపురముండి యప్పుడప్పుడు మాయింటికి వచ్చుచుండెను. ఆమె తన మఱదలు మాత్రమేకాక మఱదలి చెల్లెలు సహితము విధవయయ్యెనని చెప్పెను. దారిబత్తెమున కియ్యగా నామె నాతోఁ చెప్పినట్టు తల్లిని గొనివచ్చెను. తల్లితో మాటాడి గుంటూరు సమీపముననున్న వల్లూరికి పంపి యిద్దరు వితంతు కన్యలను బిలిపించితిని. తణుకు చలపతిరావను నతఁడొకఁడును బేతపూడి ప్రకాశరావనునతఁ డొకఁడును, ఇద్దఱు వరులావఱకే మాయింట నుండిరి. ఈ బాలవితంతువులలో పెద్దదాని వయస్సు పండ్రెండేండ్లు; ఆమె చెల్లెలి వయస్సు పదేండ్లు, ఆ వధువుల నిద్దఱిని నాయొద్దనున్న యీవరులకిచ్చి చెన్నపట్టణములో వివాహము చేయ నిశ్చయించి అక్కడి మామిత్ర ద్వయమునకీ శుభవార్తను దెలిపి, యిద్దఱు వరులు వధువులు పురోహితుఁడు వంటబ్రాహ్మణుఁడు మొత్తమైనవారిని వెంటబెట్టుకొని భార్యాసహితముగా బొగయోడ

నెక్కుటకు నేను కాకినాడ వెళ్లితిని. నా యుత్తరమందగానే చెంచల రావుగారు రఘునాథరావుగారి యుత్తరమందువఱకును రావలదని కాకినాడ తంత్రీవార్తను బంపిరి.

నేనీ వివాహములను చెన్నపట్టణములోనే చేయ నిశ్చయించు కొనియున్నాను గనుక యిల్లు కుదర్చవలసినదని ప్రత్యుత్తరమువ్రాసి తంత్రీవార్త నంపి నాటి సాయంకాలమున సోయెడి పొగయోడలోనే చెన్నపట్టణమునకు బయలుదేరితిమి. 4వ తేది చెన్నపురి ధూమనౌక మధ్యాహ్నము రెండు గంటలకు చేరెను. మావారి నందఱిని అక్క డనే నిలిపి నేనొకఁడను దాని సమీపమునకే యున్న చెంచలరావు గారి కార్యస్థానమునకు పోయి మాయవస్థను దెలిపితిని. ఆయన యద్భుతపడి రఘునాథరావుగారి యింటి ప్రక్కనే యిల్లు కుదర్పఁబడె నని చెప్పి, అయింటికి మమ్మఁ గొనిపోవుటకై యొక భటునినిచ్చెను. చెంచలరావుగారు తమ కార్యస్థానము నుండి తిన్నగా మా యింటికి వచ్చి యరగంటసేపు నాతో మాటలాడుచుఁ గూచుండి తమ యింటికి బోయిరి. వచ్చిననాడు రఘునాథరావుగారి దర్శనము కాలేదు. రెండవనాఁడు మరల చూడఁబోయినప్పుడు వారి భటులు నన్ను వారించినందున నాఁడును మాయింటికిఁ బోయితిని. మూఁడవ నాటి ప్రాతఃకాలమున ననఁగా 7వ తేదీని కావలిభటులు వెనుకటి సాకులనే చెప్పిరి కాని వారి మాటలను గణనచేయక తిన్నగా లోనికి పోయి మేడయెక్కి వారుకూరుచుండు స్థలముచేరితిని. వారు మూడు దినములనుండియు నన్ను చూడలేకపోయినందుకు క్షమార్పణము చేసిరి. నేనా మాటలయందు దృష్టియుంచక రేపటిదినము వివాహము జరుపుటకు నేను నిశ్చయించుకొంటిననియు ఆహ్వానపత్రికలను వారి పేరఁ బంపుట కిష్టపడనియడల నాపేరనే పంపెదననియు, స్పష్టముగాఁ జెప్పితిని. వారించుకసేపాలోచించి యాహ్వానపత్రికను వ్రాసి దానిని

ముద్రింపించుటకయి తమ ముద్రాయంత్రమునకుఁ బంపిరి. చెంచల రావుగారు ప్రతిదినమును మా యింటికి వచ్చి నాతో మాటాడిపోవు చునే వచ్చిరి. రఘునాథరావుగారు ముద్రింపఁబడిన యాహ్వానపత్రిక లను గొన్నింటిని నాయొద్దకు బంపిరి. చెన్నపురి చేరినతరువాత పెండ్లి కూఁతుల తల్లి తన రెండవ కోమారితను ప్రకాశరావుగారికిచ్చి పెండ్లి చేయుట కంగీకరింపనందున నొక్క వివాహము మాత్రమే చెన్నపట్ట ణములో జరిగినది.

1883 వ సంవత్సరము జూన్ నెల 8వ తేది నారంభింపఁబడిన యీ వివాహమహోత్సవము పండ్రెండవ తేదితో సంతోషకరముగా సమాప్తమయినది. వివాహమునకుదయచేసిన రావుబహద్దరు ఆర్కాటు నారాయణస్వామి మొదలాల్యారిగారు బెంగుళూరుకు రావలసినదని నన్నాహ్వానముచేయఁగా నేనొక్కఁడను వెళ్ళి దంపులో నొకటియు, పట్టణములో నొకటియు వితంతు వివాహమునుగూర్చి రెండుపన్యాస ములు చేసితిని. నేనక్కడ రెండుదినము లుండి చెన్నపట్టణమునకు వచ్చి మావారల నందఱిని వెంటఁబెట్టుకొని భూమునౌకమీఁద పోయి స్వస్థానమును సురక్షితముగాఁ జేరితిని. ఈవరకు జరగిన వివా హము లన్నిటిలో దీనికే యధిక వ్యయమైనది.

మేము రాజమహేంద్రవరములో చేరిన రెండు మాసముల లోపల ననఁగా 1883వ సం॥ ఆగష్టునెల 13వ తేదీని రెండవ కోమటి వివాహము జరగినది. ఈ వివాహము చేసికొన్న యతఁడు లక్ష్మీనర సింహముగారి కార్శితుఁడయి యాయన సభ (Court) లో బత్తెపు బంట్రౌతు (Batta peon) గా నుండుటచేత, ఆయన కోరిక ననుస రించియే యీతనికీ వివాహము చేయఁబడినది. ఇది తొమ్మిదవ వివా హము. మఱి నాలుగు నెలలలోపల ననఁగా 1884వ సం॥ జనేవరినెల 5వ తేదీని నల్లగొండ కోదండరామయ్యగారి దయిన పదవ వివాహము

జరగినది. పులవర్తి శేషయ్యగారు వివాహమయిన సంవత్సరమునందే ప్రవేశపరీక్షయందు తేఱుటచేత నేనాతనికి నెలకు పండ్రెండేసి రూపాయల చొప్పున జీతమిచ్చుచు బట్టలు పుస్తకములు మొదలైనవి వేఱుగా నిచ్చుచు నిప్పటికి సంవత్సరము నుండి ప్రథమశాస్త్ర పరీక్షకు చదివించుచుంటిని. 1883 వ సం॥ డిశంబరు నెలయందొక వృద్ధ వైదిక వితంతువు నావద్దకు వచ్చి తన సంరక్షణములో పదమూడేండ్ల ప్రాయముగల వితంతువైన మనుమరాలున్నదని నాతోఁ జెప్పెను. నేను పులవర్తి శేషయ్యగారిని వెంటనిచ్చి ప్రయాణవ్యయములకు కొంత సొమ్మిచ్చి యామెతోఁగూడ తాటిపాకకు పంపితిని. పిల్లను ముత్తవతల్లిని రాత్రివేళ నొరులెఱుఁగకుండ తీసికొనిరావలసివచ్చి తానే కావడిని మోచుకొనివచ్చి యీ శేషయ్యగారే వారిని మా యింటికిఁ దెచ్చి యొప్పగించెను. కోదండరామయ్యగారికిచ్చి వివాహము జేయఁబడినది యీ చిన్నదే. కోదండరామయ్య ప్రథమశాఖ వాఁడు; వధువు వైదికశాఖాసంభవ. శాఖాభేదము విచారింపకచేసిన వివాహములలో నిదియే మొదటిది. ప్రథమ వివాహము చేసికొన్న దంపతుల కొక్కరికిఁదక్కఁ తక్కినవారి కందఱికి కాపురములుండుటకు గృహము లీయఁబడుచు వచ్చినవి.

మాపాఠశాల కేప్రిల్ నెల 20వ తేదినుండి వేసవికాలపు సెలవులియ్యగానే నా భార్యతోను మేము పెంచుచుండిన శ్రీరాములుగారి శిశువుతోను బైలుదేఱి నరసాపురము వెళ్ళితిని. గోగులపాటి శ్రీరాములుగారు వితంతువివాహము చేసికొనునప్పటికి ప్రథమకళత్రము వలన నాలుగు మాసముల పురుషశిశువుండెను. నాయంచలి గౌరవముచేత తండ్రి యీ బాలునకు నాపేరే పెట్టెను. ఆశిశువును పెంచి పట్టపరీక్షయందు కృతార్థుఁడగువఱకును నేనే విద్య చెప్పితిని. నరసాపురములో నున్నప్పుడు సహితము వితంతువివాహ పక్షమున పని

చేయుచు సక్కఁడి సెంట్రల్ హైస్కూళ్లులో వితంతువివాహమును గూర్చి యొక యుపన్యాసము వ్రాసి మెయినెల 28వ తేదిని చదివితిని. నేను నరసాపురము వెళ్ళఁగానే బందరునుండి రాజమహేంద్రనరము వెళ్ళి తిరిగివచ్చిన యీ వ్రాఁకింది యుత్తరము నాకందెను :—

'ఆంతరంగికము' మశూలా

16న ఏప్రియల్ 84.

నా ప్రియమైన ఆర్యా !

ఈపట్టణములో నేడైన వితంతువివాహము జరపఁబడెడు పక్షమున, వివాహము చేసికొన్నవారికి ఘనమైన ధనసహాయ్యముతో తోడుపడెడు స్థితియందు మీరున్నారా? ఉన్నపక్షమున నెంతవఱకు? పయి ప్రశ్న కుత్తరమును నాకు తెలిపినయెడల, ఈప్రశ్నను నేను మిమ్మేల యడుగవలసెనో యందునుగూర్చిన యధికవివరములను మీకు దెలిపెదను. నేనీ మండలములోని మండల న్యాయసభ న్యాయవాదిని;

నా పేరు— చెరువు-సుబ్రహ్మణ్యశాస్త్రి
డిస్ట్రిక్టు కోర్టు వకీలు, మచిలీపట్టణము.

వివాహ వ్యయములను భరించి వధువున కినుమాఱు రూపాయలు నగలు పెట్టెదమనియు, దంపతులు కాపురముండుటకయి మునుమాఱు రూపాయల వెలచేసెడి యింటినిగాని, యీ రొక్కమును గాని యిచ్చెదమనియు నేను వ్రాసితిని. తాను వితంతువివాహము చేసికొనుటకు సంసిద్ధుఁడనయి యున్నాఁడనియు తనకు ధనసహాయ్య మక్కఱలేదనియు, వివాహముచేసికొనుటకు సంసిద్ధులయియున్న మఱియొక వధూవరులకు ధనసహాయ్యము కానలసియున్నదనియు, ఆయన వ్రాసెను.

వ్యాధి బాధచేత దుర్బలశరీరుఁడనై యుండియున్నను, వచ్చు చున్నానని సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి వ్రాసి, బందరుపురమునందు నేను వసించుట కనుకూలమైన యిల్లు కుదుర్చుకొని, మండువేసవి కాలములో నిసుకదారిని మోటుబండిమీద బందరుపురము మేము జేరునప్పటికి నారాక యంతకుముందే తెలియుటచేత పౌరజన వారధి యంతయు కలిఁగి యల్లకల్లోలముగా నుండెను. తన పట్టణములో గత భర్తృకా పాణిగ్రహణమునకు తాను ప్రథమునఁడనుగా నుండెదనని నాపేర వ్రాసిన బ్రాహ్మణధీరుఁ డాసంక్షోభమునకు సంత్రస్తుఁడయి ననొ్నంటిగా చాటునకు గొనిపోయి తానప్పుడు రోగపీడితుఁడయి యుండుటచేత వివాహప్రయత్న మప్పటికి విడిచితిననియు పునఃప్రయత్నము చేసినప్పుడు నాపేర వ్రాసెదననియు జెప్పెను. పట్టణమునకు వచ్చినందుకు వివాహవిషయమునఁ గొన్ని యుపన్యాసముల నిచ్చుటకు నిశ్చయించి నా మొదటి యుపన్యాసమును నేను బసచేసిన శ్రీ వల్లూరు జమీందారుగారి విశాలభవనమునందే చేసితిని. వందలు కొలది జనులు వచ్చుటచేత సభాభవన మంతయు మనుష్యులతో క్రిక్కిఱిసిపోయినది. నిర్బంధ వైధవ్యమువలనఁ గలుగుచున్న వివిధా నర్థములను గూర్చియు తత్సాంకర్య నివారణ సాధనముల గూర్చియు రెండు గంటలసేపుపన్యసించి వారి హృదయములకు తాఁకునట్లుగాన నన్యగతికలైన యనాథకాంతావన పుణ్యకార్యమునందు దీక్షవహింప వలసినదని ప్రార్థించితిని. మొదట నూహించినట్లెవ్వరును నల్లరిచేయక యెల్లవారును కడవఱకును నా యుపన్యాసమును నిశ్శబ్దముగా వినిరి.

వడ్లమన్నాటి వేంకటాచలముగారా పట్టణములో వితంతు వివాహ ప్రతిపక్షులకు ప్రధాన నాయకులు. వారు వితంతువివాహ విషయక విజ్ఞాపనములమీఁద నొక ఖండన గ్రంథమును వ్రాయించిరి. నేను వేంకటాచలముగారి దర్శనార్థమై వారి యింటికి వెళ్ళినప్పుడు

వారు శాస్త్రప్రమాణబద్ధులైన హిందువులకు శాస్త్రార్థవిచార మావశ్యకమనియు, ఆవిషయమయి యొక పండితసభ జరుగుట కర్తవ్యమనియు సెలవిచ్చిరి. నేను వారితో నేకీభవించి, పండితులును, గుణగ్రహణపారీణులైన పెద్దమనుష్యులు మాత్రమే చేరిన చిన్న సభలో శాస్త్రవిషయక వాదప్రతివాదములు జరుపుటయే లాభకర మనిజెప్పితిని. వారందున కొప్పుకొని మఱునాటిమధ్యాహ్నమున తమ చావడిలోనే సభ జరుపుట కేర్పఱిచిరి. నేను యుక్తసమయమునఁ బోయి సభలోఁ గూరుచుంటిని; నా గ్రంథముపై ఖండనగ్రంథము చేసిన శాస్త్రులవారు నాతో వాదము చేయుటకయి నాయెదుటను గూరుచుండిరి. పరాశరసంహితలోని "నష్టేమృతే" యను శ్లోకము యొక్క యర్థనిర్ణయ మొక్కటియే ప్రథమకర్తవ్యమని నేనుచెప్పఁగా శాస్త్రులవారును నాతో నేకీభవించి ఆ శ్లోకమున కర్థముచెప్ప నారంభించిరి. వారు చెప్పఁబూనిన యర్థము ప్రథమమునఁ జేసికొన్న నియమములకు విరుద్ధమనియు, తన స్మృతిలో పరాశరుఁడు చెప్పిన నిర్వచన మీయర్థమును బాధించుననియు, చెప్పి నేను వారుచేసెడి యర్థములను పూర్వపక్షముచేయ నారంభించితిని. ఇట్లు పావుగంటసేపు శాస్త్రార్థవిచారము నడచినపిమ్మట శాస్త్రులవారు సభవారివంకఁ దిరిగి, "అయ్యా! వీరు తమజీవితము నిందులోధారపోసి యీవిషయమయి విశేషకృషి చేసినారు. నాకు కొంతకాలము గడువిచ్చినఁగాని వీరితో వాదము చేయజాలను" అని యూరకుండిరి. ఈ సభానంతరమున వేంకటాచలముగారు తాంబూలాది సత్కారముచేసి నన్ను వీడుకొల్పిరి. అక్కడి ప్రముఖులవద్ద సెలవుగైకొని సకుటుంబముగా రాజమహేంద్రవరమునకుఁ బోయితిని.

బందరు నుండి నేను మరలిరాఁగానే న్యాపతి సుబ్బారావుగారు ఆచ్చూర్మారి లక్ష్మీనరసింహముగారు మొదలైన మిత్రులతో నాలోచించి

స్త్రీపునర్వివాహ పక్షాభిమానులయిన మిత్రులను సమకూర్చి 1884 వ సం॥ జూన్ నెల 22వ తేదిని క్రొత్తసమాజ మొకదాని నేర్పాటుచేసితిని. దీనిని నిర్వహించుటకు ధనము కావలెను. 1832వ సం॥ జూన్ నెలలో శ్రీ పైడా రామకృష్ణయ్యగారనుగ్రహించి పదివేల రూపాయలిచ్చిరి. నేను మితముగా వాడి మొత్తముమీద నెనిమిది వివాహములకును, మాసవ్యయములకు, గృహములు కొనుట, పాత్రసామానులు వైద్యపుఖర్చులు మొదలైనవానికింద 8931 రూపాయలు మాత్రమే ఖర్చుపెట్టి వేయి రూపాయలకంటె నెక్కువగా నిలువచూపితిని. సమాజము క్రొత్తదగుటనుబట్టి కొన్ని మాసముల వఱకు యథాపూర్వకముగా నేనే మాసవ్యయాదులు జరపుచుంటిని.

రఘునాథరావుగారును, చెంచలరావుగారును పెండ్లిభోజనములు చేయకపోయినను మాధ్వులు చెన్నపురిలోని యెనిమిదవ వివాహానంతరమున వారిని కొంత బాధింప నారంభించిరి. వృద్ధురాలైన తల్లియొక్క దీనాలాపములచేత తామొక దుర్బల నిమిషములో ప్రాయశ్చిత్తమునకు లోనుగావలసివచ్చినదని నాపేర చెంచెలరావు గారు తమ నిశ్వేదమును తెలుపుచు లేఖ వ్రాసిరి. నేను రఘునాథరావుగారి పేర వ్రాసితినిగాని వారు ప్రత్యుత్తరమియ్యక ననుగ్రహించినవారుకారు. ఆ సంవత్సరాంతమున శీతకాలపు సెలవులలో నేనీ పనిమీద మరల చెన్నపట్టణమునకుపోయి రఘునాథరావుగారి దర్శనము చేసితిని. ఆయనవద్ద సెలవుగైకొని నేనింటికి వచ్చునప్పటికి కొందఱు విద్యార్థులు నన్ను చూడవచ్చి, యొక వృద్ధబ్రాహ్మణుడు నాలుగైదు దినములనుండి మీకొఱకు తిఱుగుచున్నాడని చెప్పిరి. చిత్తూరు జిల్లాలో నొక గ్రామమున నిద్దరు బాలవితంతువులు గలరనియు, వారికి వివాహములు చేయుటకు తల్లిదండ్రు లొప్పుకొనియున్నారనియు, వరులును సంసిద్ధులయియే యున్నారని యతడు

పలికెను. అయోమార్గ వ్యయముల నిమిత్త మిరువదిమైదు రూపాయ లిచ్చిన పక్షమున తానుపోయి యిద్దఱు పెండ్లికూతుఱులను వారి తల్లి దండ్రులను వరుల నిరువురను గొనివచ్చెదననియు తరువాత వారికి వివాహములు చేయవచ్చు" ననియుఁ జెప్పెను. మంచిది రమ్మని యాయనను నా బండిలో నెక్కించుకొని చెంచలరావుగారి యింటికి తీసికొనిపోయి జరిగిన కథనుజెప్పి సొమ్మిప్పించి యా వృద్ధబ్రాహ్మణు నక్కడినుండియే పంపివేసితిని. తిన్నగా రఘునాథరావుగారి యింటికిఁ బోయి యాయనను సందర్శించి, "వధూవరులను గొనివచ్చుటకయి ప్రయాణవ్యయముల కిచ్చి యొక మనుష్యుని నేనిప్పుడే పంపించితి" నని చెప్పితిని. ఆయన చేతులుజోడించి నాకు నమస్కారముచేసి, "ఈపక్షమున పనిచేసినందుకు నేనీవఱకే బహుబాధలు పొందితిని. నేనిక దీనిలో సంబంధము కలిగించుకొనఁజాలను, క్షమింపుము" అని స్పష్టముగాఁ బలికిరి. నాతోఁ జెప్పినట్లా ముసలాయన నాలుగైదు దినములలో వధువుల నిద్దఱిని వారి జననీజనకులను వరుల నిద్దఱను దీసికొనివచ్చి నాకప్పగించి తనదారిని పోయెను. తరువాత విచారింపగా నా వృద్ధవిప్రుడు వధువుల మాతామహుఁ డయినట్లు తెలియవచ్చెను. మాచేతనున్న వేయి రూపాయలను మాత్ర మీ రెండు వివాహములకును వ్యయపెట్ట నిశ్చయించుకొని ఆ వధూవరుల కుటుంబమును బ్రహ్మసమాజ మందిరమునందుంచి, నా మిత్రునకా విషయమును దెలిపితిని. బళ్ళారి నుండి రావుబహద్దరు సభాపతిముదల్యారి గారు సమస్త వ్యయములను వహించి తమ పట్టణములో వివాహము లను తాము చేయఁబూనుకొనెదమని ప్రార్థించిరి. నా సెలవులయిపోవచ్చి నందున నా మిత్రులయిన మన్నవ బుచ్చయ్యగారి కొప్పగించి, వేయి రూపాయలను బుచ్చయ్యగారి చేతికిచ్చునట్లు చెంచలరావుగారితో మాటాడి యేర్పాటుచేసి, నేను మరలివచ్చితిని. 1885వ సం॥ ఫిబ్రవరి

నెల 6వ తేదీని బుచ్చెయ్యగారు పెండ్లివారితో బళ్ళారికి వెళ్ళినట్లు శ్రీ రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు తంతి వర్తమానమును బంపిరి. ఆ నెల 12వ తేదిని 15 ఏండ్లు ప్రాయముగల పెద్ద వధువును చిత్తూరి సుబ్బారావుగారును, 12 ఏండ్లు ప్రాయముగల చిన్న వధువును జటప్రోలు రామారావుగారును బళ్ళారిలో వివాహమాడిరి.

ఇప్పుడు వివాహములు చేయుటకుమాత్రమే కాక ప్రతి మాసమును చేయవలసిన వ్యయములకు సహితము సొమ్ము కావలసియున్నది. మా సమాజముదారు ధనసహాయార్థమైన విజ్ఞాపనపత్రముతో నన్ను చెన్నపురి మొదలైన ప్రదేశములకుఁ బంప నిశ్చయించిరి. నేను చెన్నపురి చేరిన తరువాత చందాలు నిమిత్తము గొప్పవారియిండ్లకు బండ్లమీఁద తిరుగుచువచ్చుటయేకాక 1885వ సం॥ జూన్ నెల 25వ తేదిని బాబుగారి బాలికా పాఠశాలలో సభచేసి రాజమహేంద్రవర స్త్రీపునర్వివాహ చరిత్రమును గూర్చి యుపన్యసించి యుపన్యాసావసానమున చందాలు వేయించుటకై ప్రయత్నించితిని. నేను ప్రవేశపరీక్ష తరగతిలో చదువుకొనుచుండినప్పుడు ప్రధానోపాధ్యాయుడుగా నుండిన శ్రీ చెంగల్వ కుప్పస్వామిశాస్త్రిగారుపకార వేతనము నొంది యప్పుడు చెన్నపట్టణములో నుండి, నన్ను వెదకుకొనుచువచ్చి చూచి యాలింగనము చేసికొని అయిదు రూపాయలు చందానిచ్చి పోయిరి. అప్పుడీ యుపన్యాసమునందు పైడా రామక్రిష్ణయ్యగారి దృష్టాంతమును జూపి సభవారిని సత్కార్యమునకుఁ బురికొల్పి తరువాత బండ్లు చేసికొనిపోయి చందాలు నిమిత్తము గొప్పవారి గృహములకు తిరుగ నారంభించితిని. రాజమహేంద్రవరములోని మా సామాజికులు నెలచందాల నిచ్చుచుండుటయేకాక వారిలో ననేకులు పెద్దమొత్తములను సహితము దయచేసిరి. మా విజ్ఞాపన పత్రికను జదివి సహాయులైనవారిలో బెంగుళూరులోని యున్నత

న్యాయసభలోని న్యాయాధివతి (Judge) మైన ఏ. రామచంద్ర అయ్యరుగారు వివాహ మొకటికి నూఱేసి రూపాయలు పంపుచుండు టయేకాక, ఆఱేసి నెలలకు నూఱు రూపాయలు చందానిచ్చుచుండిరి. ఇటీవల రావుబహదూరు ఏ. సభాపతి మొదల్యారిగారు వివాహ మొకటికి నూఱేసి రూపాయల చొప్పున బళ్ళారినుండి పంపుచుండిరి. ఈ సంవత్సరము (1895) డిశంబరు నెల 20వ తేదిని జరిగిన 13వ వివాహమునకయిన మున్నూఱు రూపాయలును రామకృష్ణయ్యగారు రహస్యముగా నాయొద్దకుఁ బంపిరి. ఈ వివాహమునందు వరుఁడు పటానేని వెంకయ్యగారు; ఇతఁడు మొదట యుపాధ్యాయుఁడుగా నుండి పిదప కరణ మయ్యెను.

వివాహము నిమిత్తము చిన్నపురికిఁ గొనిపోఁబడి వివాహము జరగక తీసికొనిరాఁబడిన తనుకు చలపతిరావుగారి మఱద లొకతె యింకను వివాహముకాక నిలిచియుండెను. ఈ చిన్నదాని తల్లి తన కొమారితకు వరునగా కొమ్మరాజు గోపాలమను పేరుగల స్వశాఖ వాఁడైన యొక నియోగిబ్రాహ్మణ బాలుని నావద్దకు తీసికొనివచ్చి వివాహము చేయుమని యడిగినది. ఈనడుమ పెండ్లిచేసికొన్న కొందఱి వలన కలిగిన కొన్ని చిక్కులనుబట్టి యీ క్రొత్త పెండ్లికొడుకును పిలిపించి సంవత్సరకాలము చదువు నిమిత్తమయి నెల కెనిమిదేసి రూపాయల చొప్పున నిచ్చెడిది తప్ప మావలన ధనముగాని యింక్లు గాని నగలుకాని మఱియేదికాని యపేక్షింపఁ గూడని స్పష్టముగా చెప్పి, యుతడందున కొప్పుకొన్న మీఁదట నతనిచేత నుత్తరము వ్రాయించి పుచ్చుకొని, మార్చినెల 13వ తేది రాత్రి వివాహ మేర్పఱచి, మండల న్యాయాధిపతి మొదలైనవారి కందఱికి నాహ్వానములు పంపితిని. వారందఱును వచ్చి వేచియుండిరి. కాని పెండ్లికొమారుఁడు రాకపోవుటచేత పెండ్లి నిలిచిపోయినది. ఈ వివాహము తరువాత జరగినను రామకృష్ణయ్యగారి జీవితకాలములో జరగలేదు.

మార్చినెల 17వ తేదిని రామకృష్ణయ్యగారు నాకీ యుత్తర మును వ్రాసిరి :—

"కడచిన 15 దినముల నుండి మెడమీఁద కురుపుచేత నేను బాధపడుచున్నాను. నేను మన ఏ. ఎల్. నరసింహముగారిని చూచి సమస్తమును ఆయనతో మాటాడినాను. దయచేసి ఆయనను చూడుడు"— ఈ యుత్తరము వచ్చువఱకును, రామకృష్ణయ్యగారికి కురుపువేసినట్టే నాకు తెలియదు. లక్ష్మీనరసింహముగారితో మాటాడితినన్న విషయము నాతో నావఱకు పదివేల రూపాయల నిచ్చుటను గూర్చి మాటాడిన విషయమే, ఈవిషయమయి మఱునాఁ డాయన మరణశాసనమే వ్రాసి యిచ్చెను. రామకృష్ణయ్యగారు వ్రాసిన యుత్తరము నాకందిన, రెండుమూడు దినములలోనే యాయన కాల ధర్మమొందుట తటస్థించినది. వారు నాకు వ్రాసిన యుత్తరములలో నిదియే కడపటిది.

1887వ సంవత్సరారంభమున సమాజమువారి ముందు స్త్రీ పునర్వివాహ వ్యాపారమునొక్క భూతవర్తమాన స్థితులను గూర్చి చదివిన యుపన్యాసములో నిట్లు వ్రాసితిని :—

"1884వ సం॥ జనేవరు నెలలో నల్లగొండ కోదండరామయ్య గారి వివాహ మగువఱకును సామాజికులకును వివాహములు చేసి కొన్నవారికిని ఐకమత్యమున కేమియు కొఱత రాలేదు.... కోదండ రామయ్యగారి వివాహమయిన రెండుమూడు మాసములలో కొన్ని కలహకారణములు గలిగినవి". ఈ కారణము ధనాశయని నా యాశయము. నేను నరసాపురము వెళ్ళియుండినప్పుడు 1884 సం॥ మెయి నెల 6వ తేదిని పులవర్తి శేషయ్యగారు నాకు వ్రాసిన యుత్తరము నకు 6వ తేదిని నేనిచ్చిన ప్రత్యుత్తరములో నతఁడు వ్రాసిన యుత్త రము స్వబుద్ధిచేతఁగాక పరుల ప్రోత్సాహముచేత వ్రాయఁబడినదని

నేను వ్రాసితిని. అతనికి నా యుత్తరము వ్రాయునట్లు ప్రోత్సాహపరి చినవారు కోదండరామయ్యగారని నేను నమ్మితిని.

విద్యలేని మూఢులు పలువురుచేరి చేయుదానికంటె విద్యాధికు డొక్కడుచేయు హాని శతగుణము లధికముగా నుండును. మనదేశ ములో నెల్లవారును ధనాకర్షణమునకు వెరపున్న పక్షమున నేయుపా యముచేతనైనను సాధ్యమైనంత డబ్బు లాగవలయుననియే యత్నించుచుందురు. వికలాంగులుగాక యవయవ పటుత్వము గలవారంద ఱును పాటుపడవలసినవారే యనియు పాటుపడనొల్లనివారికి ధన దానముచేసి సోమరితనమును ప్రోత్సాహపఱచుట పాపమనియు నా మతము. నేను పాటుపడెడివాడను ఇతరులు పాటుపడ వలసినవారని తలచెడివాడను. కాయకష్టమువలని గౌరవము నెఱుగని ముంజులూరి గోపాలముగారు జూన్ నెల జీతము పుచ్చు కొన్న తరువాత తాను ముద్రాశాలలో పనిచేయుననియు, రామచం ద్రరావునకును శేషయ్యకును ఇచ్చుచున్నట్లే తనకును నెల కెనిమి దేసి రూపాయల చొప్పున నియ్యవలెననియు నన్నడిగెను. వారిరువు ఱును చదువుకొనుచున్నారు గనుక నిచ్చుచున్నామనియు నీకూరక యియ్యనని యు నేను దృఢముగా జెప్పితిని. తాను పుచ్చుకొన్న జీతపుసొమ్మైపోయిన తరువాత రామకృష్ణయ్యగారి యొద్దకు కాకి నాడకు పోయి యతడు తన యనస్థను చెప్పుకొనెను. ఆయన తరు వాత నన్ను రాజమహేంద్రవరములో కలిసికొన్నప్పుడు, "కాయకష్ట పడగల దృఢశరీరు లుద్యోగము చెప్పినను చేయక సోమరితనమున కాలముగడప నిశ్చయించుకొన్నప్పు డట్టివారికి ధన దానముచేత సంతుష్టి కలిగింపజూచుట నా నియమములకు విరోధమయి నందున మీరుచెప్పినను మీధనము లోనుండియైనను నేనియ్య"నని మొమాటము లేక ఖండితముగా జెప్పితిని. కొన్నిమాసములైన

తరువాత ఈ గోపాలముగారి భార్యకే మసూచిరోగము వచ్చెను. వెంటనే యతని యింటికిపోయి, నాలుగు రూపాయలిచ్చి యొక బ్రాహ్మణ స్త్రీని నియమించి, అయిదు రూపాయలిచ్చి యొక శూద్ర స్త్రీని పెట్టి, కావలసిన పదార్థములు కొని యిచ్చి, ఆరోగ్యస్నానము చేయువఱకును నేను ప్రతిదినమును పోయి చూచుచుంటిని.

నాకు రెండు విధములుగా శత్రువు లనేకు లేర్పడినారు. కీడు వేఁడుచుండెడివారు, అందొక తెగవారు వితంతువివాహ ప్రతిపక్షులుగా నుండి నన్ను ద్వేషించువారు; ఇంకొక తెగవారు వివేకవర్ధనిలో నేను తమ కార్యములను బయలఁబెట్టుచు వచ్చుటచేత నంతస్తాపము నొంది ప్రేటుపడ్డ పాములవలె పగతీర్చుకొనుటకు సమయము ప్రతీక్షించుచుండెడివారు. వివాహములు చేసినకొన్నవారిలో నావఱకెవ్వరికిని సొంతయిండ్లులేవు. అట్టివారికందఱికిని కాపురముండుట కిండ్లియఁబడినవి. భోజనవ్యయములు మాత్రమేకాక చదువుకొనువారికి పాఠశాలల జీతములును పుస్తకములును బట్టలును వేఱుగా నీయఁబడుచు వచ్చినవి. వ్యాధులు వచ్చినప్పుడు వైద్యపు ఖర్చులను, శుభాశుభ కార్య వ్యయముల సమాజమువారే భరించుచుండిరి. ఎవ్వరికైనఁ గొంచెము కష్టమువచ్చిన పక్షమున నేనును గవర్నరాజుగారును బోయి విచారించుచు కాలసిన సాయము నంతను జేయుచుంటిమి. ఆకాలమునందు పులవర్తి శేషయ్యగారు మాయింటికి రాక నాతో నంతగా మాటాడకుండిరి. నేనొక దినమున పగలు పదునొకండు గంటలకు నడిచి యింటికి బోవుచుంటిని. బజారులో నన్ను దూరము నుండి చూచి యతఁడు బండిలోనుండి దిగివచ్చి నా పాదములఁ బడి యేడువఁ జొచ్చెను. కొంచెముకాలము క్రిందట ప్రసవమయిన తన భార్యకు సూతిక కనఁబడి జబ్బుగా నున్నదనియు తాను వైద్యుని నిమిత్తము వెళ్ళుచున్నాననియు, నతఁడు చెప్పెను. భార్యవద్ద నుండు

టకయి వచ్చిన బండిలోనే యతనిని మరల నింటికి బంపివేసి, నేను వెనుకతిరిగి వైద్యుని వెంటగొని శేషయ్యగారి యింటికిఁబోయి తగిన చికిత్సలు చేయించి, పిమ్మట నింటికి భోజనమునకుఁ బోయితిని. నేను భోజనము చేయగానే గవర్రాజుగారి యింటికిఁబోయి యాయనను గూడఁ దీసికొని మరల నిన్నీసుపేటకు బోయితిని. విధివశముచేత శేషయ్య భార్య కాలవశము నొందెను. అప్పుడు పుట్టిన యీ పురుష శిశువును బహుసంవత్సరములకు తరువాత నాతఁడు కాలధర్మము నొందినప్పుడు నాకొప్పగించెను. నేనా పిల్లవానిని నాయొద్ద నుంచుకొని పెంచి విద్య చెప్పించితిని.

విశ్వస్తావివాహ నవలతాంకురమునకు పట్టుకొమ్మయయి నానా ముఖముల తీగలు పాగించిన శ్రీ పైడా రామకృష్ణయ్యగారు 1886వ సం॥ మార్చినెల 28వ తేదిని ప్రాతఃకాలమున స్వర్గస్థులగుట తటస్థించెను. కొంచెముకాలము క్రిందట రాజమహేంద్రవరము వచ్చినప్పుడు మొట్టమొదట నిచ్చెదనని వాగ్దానము చేసిన ముప్పదివేల రూపాయలలో మిగిలిన పదివేలును వేగిరమే యిచ్చెదనని చెప్పినప్రకారముగా మరణమునకు నాలుగు దినములు ముందు తమ సమ్మఖమున నుండ తటస్థించిన యాత్మూరి లక్ష్మీనరసింహముగారిని సమాజపక్షమున ధర్మకర్తను (Trustee) గా నేర్పాటుచి, యుద్దేశించుకొన్న పదివేల రూపాయలను మరణశాసన మూలమున సమాజమునకిచ్చివేసి వాగ్దానమును సంపూర్ణముగా చెల్లించుకొనిరి.

ఈ మరణశాసనముతో జతపరుపఁబడిన 19వ తేదిగల పట్టికలో నిక్కడ నున్నవారిలో మొదటి వివాహమును కడపటి వివాహమును చేసికొన్నవారి పేరులుతప్ప తక్కిన వివాహములు చేసికొన్న దంపతుల పేరు లుదహరింపఁబడి వారివారి వశములోనున్న యిండ్లు వారికియ్యఁబడుసట్లు వ్రాయఁబడెను. రామకృష్ణయ్యగారి మరణానంత

రమున వారు వితంతువివాహ సమాజమువారి పక్షమున వ్రాసి యిచ్చిన మరణశాసనములు రెండును లక్ష్మీనరసింహముగారియొద్దనే యుంచఁబడెను. 1886వ సం॥ ఏప్రిల్ నెల 16వ తేదిని జరిగిన సమాజము యొక్క కార్యనిర్వాహక సంఘమువారి సభలో నీక్రింది నిర్ధారణము చేయఁబడినది.

"సమాజమున కనుకూలముగా, గతించిన రామకృష్ణయ్య గారిచే చేయఁబడిన మరణశాసనములు లేఖ్యారూఢ్యములు చేయఁబడవలెను".

ఈ నిర్ధారణముక్రింద నగ్రాసనాసీనుఁడుగా నుండిన మాకర్ల సుబ్బారావునాయుఁడు బి. ఎ. బి. ఎల్., గారిచేతను, ఆస్థాన్మారి లక్ష్మీ నరసింహముగారిచేతను, బసవరాజు గవర్రాజుగారిచేతను, నాచేతను, న్యాపతి సుబ్బారావుగారిచేతను, వ్రాళ్ళు చేయఁబడెను. నాఁడు జరిగిన యీ కార్యనిర్వాహకసంఘ సభలో పయిన వ్రాళ్ళుచేసినవారు మాత్రమేకాక సోమంచి భీమశంకరముగారును ఆచంట లింగరాజు గారునుకూడ నుండిరి. చేయఁబడిన నిర్ధారణ ప్రకారముగా మరణ శాసనములను రెంటిని గొనిపోయి లేఖ్యారూఢ్యము చేయించుటకయి సమాజ సహాయ కార్యదర్శియైన సోమంచి భీమశంకరముగారు లక్ష్మీ నరసింహముగారి యొద్దకుబోయి యడుగఁగా, పదివేల రూపాయల మరణశాసనమును తపయొద్దనేయుంచుకొని మిగిలిన మరణశాసనము నొక్కదానినే నరసింహముగారిచ్చినందున భీమశంకరముగారొక్క మరణశాసనమును మాత్రమే 1885వ సం॥ మేయినెల 6వ తేదిని సహాయ లేఖ్యారూఢాధికారియెదుట బెట్టవలసినవాఁడయ్యెను. లక్ష్మీ నరసింహముగారు జూన్ నెల 26వ తేదిని సహాయలేఖ్యారూఢాధికారి కార్యస్థానమునకు పోయి మరణశాసనము రామకృష్ణయ్యగారు వ్రాసి యిచ్చినట్లు సాక్ష్యమిచ్చెను. అమఱునాఁడనగా 1886వ సం॥ జూన్

నెల 7వ తేదిని జరిగిన సమాజకార్యనిర్వాహకసంఘముమారిసభలో:- "పి. రామకృష్ణయ్యగారి మరణశాసనమును రాజమహేంద్రవర సహాయ లేఖ్యాగూఢాధికారి ముందర్పించుటకు కార్యదర్శియైన ఎన్. సుబ్బారావుగారి కధికార మియ్యబడినది."

అని మిగలియున్న రెండవ మరణశాసనమును లేఖ్యాగూఢము చేయించుటకై నిర్ధారణము చేయఁబడినది. ఈ నిర్ధారణముక్రింద న్యాయవతి సుబ్బారావుగారును, ఆత్మూరి లక్ష్మీనరసింహముగారును, నేనును, సోమంచి భీమశంకరముగారును, బసవరాజు గపర్రాజుగారును వ్రాళ్ళు చేసితిమి. ఆత్మూరి లక్ష్మీనరసింహముగారు రామకృష్ణయ్య గారి పదివేల రూపాయల మరణశాసనమును లేఖ్యాగూఢార్థమియ్యక కార్యనిర్వాహకసంఘమువారు చేసిన నిర్ధారణముక్రింద వ్రాలుచేయుటకును గల కారణము కొంత వివరింపవలసియున్నది. నేను నాలవ తరగతియందు చదువుకొనుచుండినప్పుడు రాజమహేంద్రవరమున దొరతనమువారి మండల పాఠశాలలో ద్వితీయోపాధ్యాయుఁడుగా నుండిన యాయనయొద్ద మా పాఠములు కొన్ని జరుగుచుండుటచేత నాకాయన గురువు, ప్రియశిష్యుఁడ నగుటచేత నాకాయన బ్రహ్మసమాజ సిద్ధాంతములను బోధించుచు, నేను మాయింటచేసెడి విద్యార్థుల సభలకు వచ్చుచు, నన్ను ప్రోత్సాహపరుచుచుండెడివారు. వివేకవర్ధని స్వపక్షమువారి యక్రమములను వెల్లడింపక పక్షపాతము వహించుచున్నదని కొందఱు మిత్రులు నాతోనే యనిరి. మా పత్రిక స్వపక్షమువారన్న హేతువుచేత వారి దుష్కృత్యములను కప్పిపుచ్చుటకయి బుద్ధిపూర్వకముగా నెప్పుడును ప్రయత్నింపలేదుగాని బహుజనానర్థదాయకములు కాని యల్పదోషముల నుపేక్షించుచు వచ్చెను. ఆత్మూరి లక్ష్మీనరసింహముగారు, మిత్రపక్షానురక్తియు, సత్కార్యసాహాయ్యకరణాసక్తియు, కార్యతంత్రప్రయోగశక్తియు, విశేష

ముగాఁ గలవారే యయినను, దాంభికవర్తనాపేక్షయు, సర్వజన ప్రియాచరణకాంక్షయు నాయనయందు ముఖ్యలోపములుగానుండెను. 1886వ సం॥ మార్చినెల 31వ తేదిని ప్రకటింపఁబడిన వివేకవర్ధనిలో 'దంభాచార్య విలసనమ'ను ప్రహసనము యొక్క ప్రథమ భాగము ప్రచురింపఁబడినది. దానిలోని ముఖ్యపాత్రములు దంభాచార్యులును, మిత్రుఁడు జంబుకేశ్వరశాస్త్రియు, స్వామిశాస్త్రియు, అందు వర్ణింపఁబడిన లక్షణములవంటివి రెండుమూఁడీయనయందుండినవి. రామకృష్ణయ్యగారి మరణశాసనములను నాకాయన చూపినప్పుడు మతో యిద్దరు ముగ్గురు ట్రస్టీలనుకూడ తమతో చేర్చుకొని పనిచేయుఁడని నేనుచెప్పిన హితవచనముల కాయన యామోదించినట్లే మాటాడిరి.

1886వ సం॥ మెయినెల 9వ తేదిని ఒక చిత్రకథ నడచినది. లక్ష్మీనరసింహముగారి మిత్రుఁడు సభకుపోయినపుడెట్లో తోడి న్యాయ వాదులు మొదలైనవారాయనను "జంబుకశాస్త్రిగారు దయచేసినారా? జంబుకశాస్త్రిగారూ! విశేషములేమి?"అని హేళనముచేయు నారంభించిరట! ఆయనయు కొంచము పెద్దమనుష్యులును లక్ష్మీనరసింహముగారి యొద్దకుపోయి దంభాచారవిలసనము మిమ్ముద్దేశించియే వ్రాయఁబడినదని, ఆయనను పురికొల్పి ప్రోత్సాహపఱిచిరఁట! వారి మాటలపైని కోపావేశము గలవాఁడయి నెలపై నెనిమిది దినము లూరకున్నతరువాత నాకస్మికముగా దంభాచార్యవిలసనమును కలిగి యుండిన వివేకవర్ధనిని బుద్ధిమంతులందఱును చేరి యాలోచించిన యద్భుతవిధమున లక్ష్మీనరసింహముగారు దగ్ధము చేయించిరి. మెయి 1886వ సంవత్సరపు వివేకవర్ధనిలో దంభాచార్యవిలసనము యొక్క-ద్వితీయభాగమును, ఆయన యద్భుతచర్య నొకదానిని తెలుపుచు వ్రాయఁబడిన యొక చిన్న వ్యాసమును, ప్రకటింపఁబడినవి.

లక్ష్మీనరసింహముగారావఱకు బ్రహ్మసమాజ సిద్ధాంతముల యందు సంపూర్ణ విశ్వాసము కలదని చెప్పుచు మా ప్రార్థనసమాజ మున కప్పుడప్పుడు వచ్చుచుండెడివారు. శంకరాచార్యస్వాములవారి మీఁద తాము తెచ్చిన యభియోగము కొట్టుపడిపోయిన తరువాత స్నేహితులు తమ యింటికి కర్మలు చేయించుటకు రాకపోగా వైష్ణవు లను చేరఁదీసి ప్రాయశ్చిత్తము చేయించుకొని తస్మద్రాధార ణము నొంది మధ్వవైష్ణవునకు నామములు మెండన్నిస్లు ద్వాదశోర్ధ్వ పుండ్రములను తులసిపూసల తావళములను గండభేరుండంచు బట్ట లను ధరింపఁజొచ్చెను; ఈనడుమనే జాతిభేదములవలని యనర్థములను బెలుపుచు క్రైస్తవాచార్య ప్రేరణమున నొక యుపన్యాసమిచ్చెను; స్నేహితులను కూడఁగట్టుకొనివచ్చుటకయి యాకస్మికముగా వేదముల యందపరమిత విశ్వాసమునొంది వేదపాఠశాల పెట్టి వితంతు వివాహ ప్రతిపక్షనాయకుల వేదపాఠశాలతో దానిని చేర్చిరి. వైదిక ముద్రా యంత్రమును వైదిక పుస్తకభాండాగారమును స్థాపించుటకయి చం దాలు సమకూర్చిన విధమును వివరింపక నీతిపరులు మెచ్చఁదగినది కాదనిమాత్ర మిచ్చట చెప్పుట చాలును. మాయుభయుల మిత్రులును స్వల్ప విషయములనుగూర్చి మిత్రులుగా నుండినవారు రచ్చకెక్కి తగవులాడుట ధర్మముకాదని, అనేకవిధముల మాకు హితబోధచేసి మమ్మి సమాధానపఱుప పూనుపడిరి. ఇట్లు మమ్మిల నుభయులను సమాధానపఱిచి సంధిచేయ పూనుపడినవారిలో ముఖ్యులు శ్రీ న్యాయపతి సుబ్బారావుగారు. కొంతకాల మీపిధముగా రాయబారములు జర గినపిమ్మట కడపట లక్ష్మీనరసింహముగారు 1886వ సం॥ 6వ ఆగష్టు తేదిని క్షమాపణ లేఖలు బంపిరి.

వివేకవర్ధని తీవ్రముగా ప్రాయక సౌమ్యముగా ప్రాయవలసిన చిత్తను న్యాయపతి సుబ్బారావుగారే ప్రాసి దానిని లక్ష్మీనరసింహము

గారికి చూపి యీయన సరియన్నమీదట మరలఁ దెచ్చి నా కిచ్చిరి. ఇదియంతయు జరగుటకుఁ గొంతకాల మాలస్యమయినందున 1886వ సం॥ సెప్టెంబరు నెల 8వ తేది వఱకును ఋమార్పణపత్రము స్వాఖ్యానముతో వివేకవర్ధనియందు ప్రకటింపఁబడలేదు. అందుచేత నీ లోపల సెప్టెంబరు 6వ తేదిని జరిగిన స్త్రీపునర్వివాహ సమాజము యొక్క కార్యనిర్వాహక సంఘమువారి సభయందు చేయఁబడిన నిర్ధారణముల కేమియు నాక్షేపణ చెప్పక యీమోదించి లక్ష్మీనరసింహముగారు దానిక్రింద తమ చేవ్రాలు చేసి సమాజమువారి యధికారము నొప్పుకొనిరి. నిర్ధారణలనెల్ల నంగీకరించి క్రింద చేవ్రాలు చేయుటయేకాక లక్ష్మీనరసింహముగారు వీనినెల్లనుజరపిరి తరువాత 1886వ సం॥ సెప్టెంబరు నెల 8వ తేదిని లక్ష్మీనరసింహముగారి ఋమార్పణ పత్రమును వివేకవర్ధని తన వ్యాఖ్యానముతోను మొదటి నుండియు జరిగిన యుత్తరప్రత్యుత్తరములతోను ప్రకటించినది.

లక్ష్మీనరసింహముగారిఁక నిర్భయముగా తమ మనసు వచ్చినట్టు వ్యవహారము నడపవచ్చును. తమతమ దౌర్జన్యములను వివేకవర్ధనిలో వెల్లడించుచు వచ్చుటచేత నాకు శత్రువులయిన వారందఱును లక్ష్మీనరసింహముగారి కాలోచనచెప్పుట కిప్పుడు మంత్రులయిరి. రామకృష్ణయ్యగారిచ్చిన పదివేలలో నేభాగమును వివాహముల కుపయోగపడకుండఁజేసిన పక్షమున ముందు వితంతు వివాహములు జరగవనియు, అట్లుచేయుటయే పగతీర్చుకొని నన్ను సాధించుట యనియు, లక్ష్మీనరసింహ ప్రభృతు లావఱకే యాలోచించిరి! పదివేల రూపాయల వలన వచ్చెడి వడ్డీనంతను మీకే పంచిపెట్టుచుండెదనని యాశపెట్టి లక్ష్మీనరసింహముగారు రాజమహేంద్రవరములో నున్న వితంతువివాహ వరులను తనలోఁ జేర్చుకొని, ఈవఱకు వివాహము చేసికొన్నవారి పోషణమునకును చిల్లర వ్యయములకును

మాత్రమే వడ్డీని ముఖ్యముగా వ్యయము చేయవలసినదని తనతో రామకృష్ణయ్యగారు రహస్యముగా చెప్పిరన్న నవస్పృష్టి నొకదానిని బైలుదేరదీసి. వారిచేత కొన్ని నిర్ధారణములు చేయించి, వానిని లేవ అక్టోబరు తేదీగల తమ ప్రకటన పత్రముతో నితరస్థలములయం దుండిన వరులకు తరువాతఁబంపిరి.

సమాజము వారందఱికిని కష్టసమయమునందు సాయము చేయవలెను. ఈ పక్షముయొక్క క్షేమముగోరువారు దీనిపురోభివృద్ధిని చూడవలెను.

కార్యనిర్వాహక సంఘమువారు న్యాయసభలకుఁబోయి యేదో యొకవిధముగా వ్యవహార నిర్ణయమును పొందియుందురుగాని ధనాభావముచేత నట్టిపని జరుగలేదు. సమాజము దుర్బలస్థితి యందుం డుటను గనిపెట్టి లక్ష్మీనరసింహాముగారు స్వతంత్రించి యానిధిని దొర తనమువారి పత్రములనుండి తొలఁగించి, ముందుగా వాణిజ్య ధనాగారమునఁ (Commercial Bank)బెట్టి, తరువాత నాధనము నక్కడనుండి తీసి దానితో చిఱ్తూరు మండలము నందొక గ్రామమునుగొని 'రాజా' యను బిరుదునామముతో తన్ను బిలుచుకొనుచు తన మరణ పర్యంతమును పదికుటుంబములకు సంవత్సరమునకు మున్నూరు రూపాయలు పంపుచుండిరి.

లక్ష్మీనరసింహాముగారి లోకాంతరగతితోనే వడ్డిమాత్రమే కాక యానిధియంతయు సమూలముగా నంతరించి; యీనడుమను నష్ట మయిన రెండుకుటుంబముల యంశములనుగూడ పాళ్లువేసి పంచు కొను శ్రమకూడ వారికి తప్పిపోయినది.

1886, 1887 సంవత్సరములలో సమాజము వారొక్క వివాహమున్నైనను చేయఁగలిగినవారుకారు. 1887 సంవత్సరాంతమున కార్యనిర్వాహక సంఘమువారి కార్యదర్శి శ్రీన్యాపతి సుబ్బారావు పం

తులుగారు తమ కార్యనివేదన పత్రికలోని యాదాయ వ్యయ పట్టిక లో ఁ జూపిన ప్రకారముగా నేనుతిరిగి పోగుచేసికొనివచ్చిన రు 742-12-4లును, సమాజమువారు నెలచందాలమూలమునను దాన ధనరూపమునను పోగుచేసిన రు1585-4-0లును (మొత్తము 2328-0-4) నెల జీతముల క్రిందను వివాహదంపతులకిచ్చిన ధనదానములక్రిందను (1888- సం11 1వ జనేవరున నిలువయుండిన రు 212-13-4 లు గాక) వ్యయపడినవి. రామకృష్ణయ్యగారు మరణమునొందు నప్పటికాయన మరణశాసనానుసారముగా నిద్దఱిద్దఱికి పంచిపెట్టవలసినవి రాజమ హేంద్రవరములో రెండిండ్లనుండినవి. ఆయిండ్లను పంచిపెట్టుటకు కార్య నిర్వాహకసంఘమువారు ఆత్మూరిలక్ష్మీనరసింహముగారిని నియమించిరి.

ఈలోపల సమాజమునకు కొన్ని విపత్తులు సంభవించినవి. 1888వ సంవత్సరము ఏప్రిల్ నెల 19వ తేదీని ద్వితీయవివాహవరుఁడైన రామచంద్రరావు లోకాంతరగతుఁడయ్యెను. ఆ నెల 23 వ తేదీని చతుర్థవివాహవరుఁడైన శేషయ్యభార్య శేషమ్మ పరలోకగతురాలయ్యెను; శ్రీరాములుగారికిని భార్యకును పడక. తుదకీ దాంపత్యము పొసగుపాటునకు రాలేదు. భార్యాభర్తల కిరువురకును శీఘ్రకాలములోనే స్థిరవియోగము తటస్థించెను. విశాఖపట్టణములో వితంతు వివాహము చేసికొన్నవాఁడితఁ డొక్కఁడే. సాయముచేయుటకు వేరు కుటుంబములేదు. ఈతఁ డీప్రకారముగా బహుసంవత్సరము లొంటిగా కష్టపడి కడపట 1888వ సంవత్సరమునందు క్రైస్తవమత ప్రవిష్టుఁడయ్యెను.

1888వ సంవత్సరము జూలై నెల 6వ తేదీని కొమ్మరాజు గోపాలముగారి వివాహము జరిగినది. ఈతనికియ్యబడిన వధువు, వల్లూరి పున్నమ్మ వివాహము నిమిత్తమయి రామకృష్ణయ్యగారే మున్నూరు రూపాయలు తమ మరణమునకు ముందిచ్చియుండిరి.

రామచంద్రయ్యగారు బెంగుళూరునుండి పంపిన నూరు రూపాయలును నెలకెనిమిదేసి చొప్పున నీవరున కీయఁబడినవి. 1888వ సంవత్సరము అక్టోబరు నెల 17వ తేదీని కోదండరామయ్యగారి ద్వితీయ వివాహము జరిగినది. ఈయన కార్యదర్శియొద్ద బదులని పుచ్చుకొని మరల తీర్పని రు75ల సమాజధనముతోనే వివాహవ్యయములు నడచినవి; సభాపతి మొవల్యారిగారు పెండ్లియొకటికి సమాజమున కిచ్చెదమని వాగ్దానము చేసిన నూరు రూపాయలును కోదండరామయ్యగారే తెప్పించు కొనెను.

ఇక్కడి యీవితంతు వివాహసమాజములో రాజమహేంద్రి వరములో పరిముఖులుగా నుండినవారు ముక్కాలు మువ్వీసము చేరియుండిరి. ఇంతమంది ఘనులుండినను పూర్వోక్తములైన రెండును గాక యైదుసంవత్సరములకాలములో క్రొత్తవివాహమొక్కటియే జరి గినది. వెనుకటివానికి వలెనే దీనికిని రామకృష్ణయ్యగారిచ్చిన యిల్లే శరణమైనది. తాడూరి రామారావు పంతులుగారు సమాజము అను మతితో నూతన దంపతుల కాపురమునకయి యిల్లుకట్టించుకొనుటకు మున్నూరురూపాయలిచ్చి మాయింటిభాగమును తానుస్వాధీనముచేసి కొనెను. ఇఁకముందు నూతనదంపతులకిచ్చుటకు సమాజమువారివద్ద నిండ్లులేవు; ఇండ్లు కట్టించి యిచ్చుటకయి ధనములేదు. సంవత్సర మున కారురూపాయలిచ్చుట భారముగానుండునని సామాజికు లియ్యవలసిన చందా మూడురూపాయలకు తగ్గింపబడి, మూడొక్క టిగాచేయఁబడినది. ఆయొక్కరూపాయ సహిత మనేకులు క్రమముగా నీయకుండిరి.

1892వ సంవత్సరము మొదలుకొని సమాజమువారు సంవత్సర మున కొక్క పర్యాయము దేశీయ సంఘసంస్కరణ సభకు ప్రతి నిధుల నేర్పరుచుటకయి చేయుసభలుతప్ప, వేరుసభలులేక విశ్రాంతి

సుఖము ననుభవింపజొచ్చిరి. వివాహములను నాస్వాంతసౌమ్మ్యతో నామనస్సువచ్చినట్లు నేనేసమాజమువారి యావరణముక్రింద చేయ జొచ్చితిని. 1892వ సంవత్సరములో రెండు వివాహములును, 1893వ సంవత్సరములో రెండువివాహములును, ఈ ప్రకారముగా 1907వ సంవత్సరమున నేను చెన్నపట్టణమునకు వెళ్లునప్పటికి పదివివాహములు చేసితిని. నాకుభనము కావలసినపుడెల్లను న్యాపతి సుబ్బారావు పంతులుగారు నాకుబదులిచ్చి నేనిచ్చినప్పుడు వడ్డిగైకొనక యసలు మాత్రము పుచ్చుకొనుచుండెడివారు. ఇరువదియేడవ వివాహము చేసి నేనిక్కడనుండి చెన్నపురికిబోయితిని. అక్కడ ముప్పదియైదవ వివాహము జరుగుచుండగా ఆత్మూరి లక్ష్మీనరసింహము సోమయాజులుగారు నన్నుచూడవచ్చి వధూవరులకు కట్నముచదివించి సంతోషించి పోయెను, ఇప్పుడుచేయుచున్న కొన్ని వివాహములకు వ్యయములను వరులు తామేభరించుచున్నారు.

1881 కిని 1890 కిని నడుమ నేనితరవిషయములందును చురుకుగా పనిచేయుచునే యుండెడివాడను. పాఠశాలకుపోయి బాలురకు బోధింపనిదినము లత్యల్పముగానుండెను. విద్యార్థుల సంఘములకుఁ బోయి యుపన్యాసములిచ్చి వారిని సత్కార్యములకు పురికొల్పుచుండెడివాఁడను. ఇన్నీసుపేట పాఠశాల యొక్కయు పట్టణపాఠశాల యొక్కయు కార్యనిర్వాహక సంఘములలో నొక్కఁడనుగానుండి, మహ్మదీయ విద్యాసంఘమునకు మహమ్మదీయుల ప్రార్థన మీఁద నేనేకార్యదర్శిగా వారివిద్యార్థుల భోజన గృహమును నడుపుచుండెడి వాఁడను. పురపారిశుద్ధ్య విచారణసంఘములోను, తాలూకాస్థలనిధి సంఘములోను మండల స్థలనిధిసంఘములోను సభ్యుఁడనుగానుండి. పనిచేయుచుండెడివాఁడను. పురపారిశుద్ధ్య సంఘసభ్యుఁడనుగానుండి లంచములు పుచ్చుకొనువారి నామముల పుటాక్షరములనే పాత్రముల

పేరులమొదట పెట్టి పారిశుద్ధ్యసంఘ ప్రహసనమునువ్రాసి వివేకవర్ధనిలో బహుపత్రికలయందు ప్రకటించితిని. సభ్యులు దీపస్తంభముల తమయిండ్లముందర నే వేయించుకొనుచుండిరి;దీపముల గుత్తదారుఁడు వీధులలోని దీపముల చమురు సభ్యులకొందరి యిండ్లలోని దీపములకు పోయవలసి వచ్చుచుండెను. బాటలు బాగుచేయుటకై యేటేట నియ్యఁబడు ప్రజల సొమ్ములో విశేషభాగ మీదుష్టుల సంచులలోనికే పోవుచుండెను. ప్రబలులైన ప్రజలు తమ వీధియరుగులను పెంచియు, ఇండ్లను ముందుకు జరిపికట్టియు, స్థలమునాక్రమించుకొని వీధులంతకంతకు సన్నమగునట్లు చేయుచుండిరి. పారిశుద్ధ్యవిచారసంఘము వారి ధర్మవైద్యశాలలో రోగులకు పథ్యపానములు తిన్నగా జరగక యాధనములో సగపాలు వైద్యశాలసహాయులనఁబడెడి యల్పోద్యోగీయుల పాలగుచుండెను.

నేనొక దినమున ధర్మవైద్యశాలకు పోయితిని. అప్పుడు రోగులకు లెక్కలలో చూపఁబడినట్లు పాలును రొట్టెయుఁగాక గంజియు మెతుకులును పెట్టబడుచుండెను. నేనురోగులను ప్రశ్నించుచుండఁగా చూచి యొకసేవకుఁడు వైద్యశాల ప్రధాన సహాయుఁడైన రంగయ్యనాయనిని దీసికొనివచ్చెను. అతఁడువచ్చినన్ను లోపలకురాక వెలుపలనుండవలసినదని నిషేధించెను. నేను వైద్యశాలను విడిచిపోయి యాతని చర్యను పురపారిశుద్ధ్య సంఘమువారికి తెలియఁబఱిచితిని. నేను చెన్నపట్టణమునకు వితంతువివాహసమాజ పక్షమున చందాలు పోగుచేయుటకయి పోయియుండినప్పుడు (పురపారిశుద్ధ్య సంఘాధ్యక్షులు) నాగోజిరావు పంతులుగారు 1885వ సంవత్సరము మెయినెల 19వ తేదీని నాకిట్లు వ్రాసిరి:—

"రంగయ్య నాయఁడిప్పుడు నిర్ణయమైన క్షమార్పణమును చేసియున్నాడు. ఇపుడు చేయఁబడిన క్షమార్పణము నంగీకరించుటకు

విూరిష్టపడిన పక్షమున, ఆతఁడు రక్షింపవలసినదని మిక్కి లిదీనముగా వేడుచున్నందున, నేనతనిని మార్చువిషయమై పట్టుపట్టను."

నేనాతాని క్షమార్పణమునంగీకరించి యాతనిని రాజమహేంద్ర వరములోనే యుంచవచ్చునని వ్రాసితినిగాని రాజధానీ వైద్యశాలాధి కారి యతని నన్యస్థలమునకు పంపివేసెను.

ఒకదినమున పట్నాల వీరేశలింగమను స్వర్ణకారుడొకడు నాలు గైదడుగులు రాజవీధిలోని స్థలమాక్రమించుకొని పునాదులు ముందుకు జరపి గోడలేవఁదీయుచుండెను. ప్రాతగోడయాన వాళ్ళింకను స్పష్ట ముగా కనఁబడుచుండెను. నేనదిచూచి గృహపతిని పిలిపించి యిట్ల క్రమముగా స్థలము నాక్రమింపఁ గూడదనియు, స్థలము నిమిత్తము పారిశుద్ధ్య విచారణసంఘమువారికి విజ్ఞాపనపత్రిక పంపుకొని వారిచ్చిన పక్షమున నిప్పుడుకట్టుచున్నరీతిగా కట్టుకొనవలయుననియు, చెప్పితిని. అతడు నామాటకొప్పుకొని పనిమానిపి, పనివాండ్రనింటికిపంపివేసెను. నేను సాయంకాలమయిదుగంటలకు మరల నాదారినే యింటికిపోవు చుండునప్పటి కాయిటిపని మరల నారంభింపబడినది. నేనీవిషయమయి మరునాడు సభవారికి జ్ఞాపికపఁపితిని. ఈజ్ఞాపిక సభలో విచారణకు వచ్చుటకు లోపలనే యిల్లుకట్టించి పూర్వపు గురుతులేవియు లేకుండఁ జేసిరి. ప్రధానరథ్యలోనే యీవిధముగా నాక్రమణము జరుగుటను గూర్చి (చర్చించి) ఆక్రమణము తీసివేయించుటకు సభలో నిర్ధారణ చేయబడినది. ఆనిర్ధారణానుసారముగా సభవారిపక్షమున నేనుపోయి మనుష్యులచేత నాక్రమించుకొన్న పెణకను రంపముతోకోయించివేసి వీధియరుగులను ఒకయరుగువిూఁదనున్నగదిని గడ్డపాఅలతోత్రవ్వించి వేసితిని. ఆసభ్యులకు తానుముందుగా నిరువదియైదు రూపాయలిచ్చితి ననియు, నేనాటంకపెట్టినవిూదట వారు మరల డెబ్బదియైదు రూపా యలుకైకొనిరనియు, అతఁడప్పుడు నాతోచెప్పుకొని దుఃఖించెను.

ఇప్పుడు త్రవ్వి పడగొట్టుటచే నెగుడుదిగుడైన భాగమును తిన్నగా సమసూత్రముగా కట్టించుకొనుటకయి పారిశుద్ధ్యసంఘమువారికి విజ్ఞాపనపత్రమును పెట్టుకొమ్మని యతనితోఁజెప్పితిని. అతడుపంపుకొన్న విజ్ఞాపత్రమునైని వారాతనికోరికనంగీకరించిరి.

ఆకాలమునందు పండా మామయ్య యని రాజమహేంద్రవరములో నొకప్రసిద్ధపురుషుఁడుండెను. అతనికి నంగళ్లవాడయైన ప్రధానరథ్యయందొక యిల్లును కొట్లును నుండెను. అతఁడు తనయింటి యరుగులను పెంచికట్టెను. ఆయింటిసమీపమున నేవాసముచేయువారును పారిశుద్ధ్యసంఘములో సభ్యులునయిన నాళము కామరాజుగారాయాక్రమణమును నాకుజూపఁగా నేనాయాక్రమణమును తీసివేయించుటకయి జ్ఞాపికపెట్టితిని. ఈవిషయమొకనాఁడు ప్రాతఃకాలమున జరిగినసభలో విచారణకువచ్చెను. నేనా దినమున సభకు కొంచెమాలస్యముగా పోవుట తటస్థించెను. నాఁడధ్యక్షప్రతినిధి సభకురానందున సభ్యులలో నొక్కరైన మెట్కాపుగారగ్రాసీనత్వమును వహించిరి. నేను సభకు పోవునప్పటికీవిషయమే విచారింపఁబడి నిర్ధారణమునకు సిద్ధముగానుండెను. నేనుపోవుచునే యప్పుడుచర్చింపఁబడుచున్న విషయమేమని యడుగఁగా, పండా మామయ్య యరుగువిషయమనియు సభ్యులలో నధికసంఖ్యాకులాక్రమణము లేదనుచున్నారనియు దొరగారుచెప్పిరి. నేనులేచి "యీసభ్యులలో నాక్రమణములేదన్నవారెవ్వరు?"అని బిగ్గరగానడిగితిని. సభ్యులెవ్వరును మాటాడక మూకీభావమునువహించిరి. అంతట నగుగులు తీయించి వేయవలసినదన్న నిర్ధారణమును వ్రాసిచదివి, నీతిలేక యన్యాయపక్షము వహించెడు సభ్యులను గర్హించుచు మెట్కాపుగారు మాటాడిరి. సభవారాయాక్రమణమును తీసివేయించుటకు నన్ను నియమించిరి. కొందరు సేవకులతో గడ్డపారలు పారలు పట్టించుకొనిపోయి నేనెమటనిలుచుండి యరుగుత్రవ్వించుట కారంభిం

చితిని మామయ్యనన్నచూచి "యధికారులే యిట్లునిలుచుండి యిల్లు త్రవ్వించుచుండగా బక్కవాండ్రము మేమేమిచేయుఁగలము?" అని పలికి లోపలికిపోయెను. నేనరుగు త్రవ్వించివేసి యింటికిపోయితిని.

ఈప్రధానరథ్యలోనే స్థలమునుగొని దానికిముందు రథ్యప్రక్క నున్న యేడడుగులస్థలము తనకివ్మని గుడిసేవ వెంకటరత్నముగారు పారిశుధ్యసంఘమువారికి విన్నపముపంపిరి.సభ్యులలో ననేకులాస్థలమునియ్యదలచి యెంతస్థలమియ్యవచ్చునో తెలుపుటకు ననున్ను మఱియిద్దఱు సభ్యులను ఉపసంఘముగానేర్పరచిరి. నేనాసభనుండియే వారినిరువురను వెంటఁగొని యాస్థలమునకువచ్చిచూచి, స్థలమువంకరగానున్నందున వంకరతీరునట్లు దానికొననుండి సమరేఖగీచినచో రెండవకొన నేర్పడెడి యడుగున్నరస్థలమును మాత్రమే యియ్యవచ్చుననియు, రథ్యల ప్రక్కల విశాలముగా స్థలముండుట యావశ్యకమనియు, ఈమధ్యనే కొంచెము తావు కలుపుకొనె నన్న హేతువుచేత బీద వాఁడైన కంసాలియిల్లు కోయించి అరుగులు త్రవ్వించిన మనము ధనికుఁడైన యీయనకే న్యాయమునుబట్టి యిప్పు డధికస్థలము కలుపుకొన ననుజ్ఞ యియ్యవచ్చుననియు చెప్పఁగా నాతోడిసభ్యులు నాతో నేకీభవించి నేను వ్రాసిన నివేదన పత్రముమీఁద వ్రాళ్ళు చేసిరి. అప్పుడు నా చెంతనున్న వెంకటరత్నము నాయుడుగారు తాను ముందున్న స్థలము కలుపుకొని రథ్యప్రక్కను మేడకట్టుట నారంభించితి ననియు, ఏలాగునైన ననుగ్రహించి యాస్థల మిప్పింపవలసిన దనియు ప్రార్థించిరి. నాతోడి వారిరువురును కొంచెము మెత్తపడిరిగాని నేనుమాత్రము మీ స్థలములోనే మేడకట్టుకొనుట కేర్పాటుచేసికోక పైస్థలము నపేక్షించినందువలనఁ గలిగెడు నష్టమును మీరు భరింపవలసినదే యనియు, మొగమోట పడక చెప్పివేసితిని. అందుమీఁద నాయుఁడుగారి విన్నపమును విన్నమీఁదట దాక్షిణ్యపడి నాగోజీరావు

పంతులుగారు నాటిసభవారి యుద్దేశ మాస్థలము నాయుడుగారి కియ్యవలయుటయేయనియు, హరిచ్చటకంటె ముందుగా మీరేమాటదక్కించుకొనుట బాగుండుననియు, నాకుత్తరమువ్రాసిరి. ఆనిర్ణయ విషయమున మాత్రమే సునిశ్చితమైనదిగానుండవలెనని నేను ప్రత్యుత్తరమిచ్చితిని. దానిపైని నాగోజీరావుపంతులుగారిక ప్రయోజనములేదని నాయుడుగారితో చెప్పివేయగా, ఆయన మేడను తమస్థలములోనే కట్టుకొనిరి.

నాగోజిరావుగారు పాఠశాలపరీక్షకులయి రాజమహేంద్రవరము విడిచినప్పుడప్పటి యువకగ్రాహిహామ్మెట్టుగారు పారిశుద్ధ్యసంఘాధ్యక్షత్వమునకై ప్రయత్నించిరి. మాశాస్త్రిపాఠశాలలో మోటాకపు గారును, సుందరరావుగారును, నేనును ముగ్గురము పారిశుద్ధ్య విచారణసంఘములో సభ్యులుగా నుండెడివారము. ఒకనాడు మోటాకపుగారు పారిశుద్ధ్యవిచారణ సంఘాధ్యక్షత్వమునకు హామ్మెట్టుగారిపేరు నిర్దేశించుచు నొకకాగితమువ్రాసి దానికనుమోదించి క్రిందవ్రాలు చేయుటకయి నాయొద్దకు తీసుకొనివచ్చిరి. దొరతనమువారు స్థానిక ప్రభుత్వమునిచ్చుటవలన ప్రయోజనము సభ్యులు స్వతంత్రముగా పనిచేయుటకొఱకనియు, దండానాధికారములేనివారినే యధ్యక్షునిగా కోరుకోనుట నాయభిమతమనియు, నేను చెప్పితిని. నన్నువిడిచి దొరగారు కాగితమును సుందరరావుగారియొద్దకు తీసుకొనిపోగా, ఆయన మాఱుమాటాడక వెంటనే దానిమీదవ్రాలుచేసెను. అధ్యక్షుని నియమించుకొను దినము వచ్చినప్పుడు సభలో దండవిధాయకుడైన హామ్మెట్టుగారిని కోరుకొనక యధ్యక్షత్వమునకు వేఱొకనిని కోరుకొనవలసినదని నేను చెప్పితిని గాని సభ్యులు వారినే యధ్యక్షునిగా గోరుకొనిరి. హామ్మెట్టుగారు పారిశుద్ధ్య సంఘవ్యవహారములను చక్కబెట్టుటకై తమపక్షమున నొకప్రతినిధి నేర్పఱుపగోరి సభ్యులలో నట్టిపని కెవ్వరు సమర్థులని మోటాకపుగారి నాలోచనయడిగిరి. వారు

సుందరరావుగారినిపేర్కొనక నాపేరుచెప్పిరి. అందుమీద హామ్మెట్టు గారు నన్నడుగఁగా నుద్యోగనియామకములు మొదలుగాఁగల సమస్త విషయములలోను నాకు సర్వస్వాతంత్ర్యమునిచ్చినఁగాని నేనాపని నంగీకరింపనంటిని. ఆయన యందున కొప్పుకొని సభ్యుల యనుమతితో తనయధికారములనన్నిటిని నాకు సంక్రమింపజేసెను. నేను ముఖ్యవిషయములలోనెల్ల దొరగారితోనాలోచించి యాయన యంగీకారమును బడయుచు లంచములమాన్పుటకును కార్యస్థానవ్యవహారము లవిలంబగాను యథాక్రమముగాను జరుపుటకు పన్నులవిషయమున మార్పులు చేసి యాదాయమును వృద్ధిపరచుటకును పాటుపడితిని. నేను ప్రతి గృహమునుతిరిగిచూచి తక్కువ పన్నులున్న ధనికులయిండ్లకు హెచ్చు చేసి యెక్కువపన్నులున్న కొందరు బీదలయిండ్లకు తగ్గించి యంగడి వీధినున్న కొట్లపైని న్యాయమైన పన్నులువిధించి మొత్తముమీాద పారిశుద్ధ్యసంఘమునకు ధనాగమమెంతో హెచ్చునట్లుచేసితిని. సరిగా నెలకు పదేసిరూపాయలును అంతకంటెనెక్కువగాను అద్దెలువచ్చు చుండిన కొట్లకావరకు నెలకెనిమిదణాలద్దె రాఁదగినట్లునిర్ణయించి కట్టిన పన్నులను పెంపుచేయుటచేత ముఖ్యముగా నీ ధనగమము హెచ్చినది.

ఈపన్నులవిషయమున మార్పుచేసినతరువాత వితంతు వివాహ విషయమున నాకు ప్రతిపక్షులుగానుండిన వైదికులు తమకు పన్నులు హెచ్చుచేయఁబడునని భయపడితిమనియు, నట్లుజరగక కొన్ని విషయములలో తగ్గింపఁబడి న్యాయము జరిగెననియు తమతోచెప్పి నన్ను శ్లాఘించిరని చల్లపల్లి రంగయ్యపంతులుగారు నాతోఁజెప్పిరి. హామ్మెన్నట్టుదొరగారిచ్చటినుండిమార్పఁబడి వెళ్ళనున్నసమయమునందు 1886వ సంవత్సరము 17వ సెప్టెంబరున నాకిట్లువ్రాసిరి:-

"కడచిన కొన్నిమాసములలోను పారిశుద్ధ్య విచారణసంఘం సంబంధమున మీరు నాకుచేసిన సహాయ్యమునకును మీరుకనఁబఱచిన

విరామములేని శక్తికిని నాహృదయపూర్వకములైన వందనములను మీకు సమర్పింప వలసియున్నది. అధ్యక్షపదమును పొందుటకు మీరు ప్రశస్తములని నేను నిశ్చయుఁడనయి యున్నాను కాని గుళికాపాతము చేత స్వతంత్ర వరణముచేయు పద్ధతి యెల్లప్పుడు నుత్తమ పురుషులే నియోగింపఁ బడుటలో పర్యవసింప దని మీరు కనుఁగొను చున్నారు"

రాజమహేంద్ర పురపరిపాలక సంఘమున ఉపకరగ్రాహి యధ్యక్షప్రతినిధిగా నుండిన కాలములో జరగిన యొక సభలో విచారణీయములైన ముఖ్యాంశము లనేకము లుండెను. కొన్ని యంశములు నిర్ధారణములు చేయఁబడిన తరువాత నప్పటికే కాలాతీతమయినందున దొరగారు నిర్ధారణముల పుస్తకములో వ్రాలుచేసి సభను విడిచి వెడలిపోయిరి. మిగిలి యున్న యంశములను గూడ నీసభలోనే నిర్ధారణములచేసి యిండ్లకు పోదమని నేను సభ్యులతోఁ జెప్పితిని. కార్యస్థాన కార్యనిర్వాహకుఁడన్ని నిర్ధారణములను దొరగారు చేసియే పోయిరని చెప్పెను. మాయభిప్రాయములను గైకొనక తమ మనసు వచ్చినట్లు నిర్ధారణములు వ్రాసిపోవుటకు దొరగారికేమి యధికారము కలదని నేను పలికితిని. సభవారి యనుమతితో నేను సాహసించి యగ్రాసనాసీనత్వము వహించి మార్పనలసిన నిర్ధారణములను మార్చి వానికింద నాఁవ్రాలు చేసితిని. సభముగియగానే కార్యనిర్వాహకుఁడు నిర్ధారణము పుస్తకమును తీసికొనిపోయి నేనుచేసిన దుండగమును దొరగారికి విన్నవించి పుస్తకమును చూపెను. దొరగారా మార్పులను జూచి మంచిదని పలికి పుస్తకమును మరల నిచ్చివేసెను.

నాదేహ మస్వస్థముగా నున్నందున రాజమహేంద్రవరములోనే జరిగిన యొక తాలూకా సంఘ సభకు నేను పోలేకపోయితిని. సభముగిసిన తరువాత కొందఱుసభ్యులు నన్ను చూడవచ్చిరి. ఏమేమి విశేషములు జరిగినవని నేనడగినమీఁదట వారిలోని విద్యాధికులే

యొకరు దొరగారు మమ్మడిగి మాయభిప్రాయములను గైకొన్నారా యే మేమి నిర్ధారణములుచేసిరో మాకు తెలియనిచ్చిరా యని నా కు త్తరమిచ్చెను. అట్లు జరుగనిచ్చుట మీదే తప్పిదమని నే నూర కుంటిని. ఆ పయినెలలోజరిగిన సభలో వారు మొట్టమొదట్టిన మోబర్లీ గారే యగ్రాసనాసీనులయి యుండిరి. ఒకవిషయమున దొరగారికిని నాకును యభిప్రాయభేదము కలిగి కొంతవివాదము నడచెను. ఈ ప్రకారముగా కొన్ని నిమిషములు నడచినతరువాత దొరగారు తమ పట్టునువిడిచి నాయభిప్రాయప్రకారముగానే నిర్ధారణముచేసిరి. అటు తరువాత సభ్యులయొక్కయు ముఖ్యముగా నాయొక్కయు నభిప్రాయ మును గైకొనకుండ నొక్క నిర్ధారణమునైనను దొరగారు చేయలేదు. తాలూకా సంఘవ్యవహారములలోను మండల సంఘ వ్యవహారము లోనూకూడ తగినంతశ్రద్ధ చేయుచునేయుండెడివాఁడను. సభాధ్యక్షుఁ డుగాని యధ్యక్షప్రతినిధిగాని రానప్పుడు నేనగ్రాసీనత్వము వహిం చుటయు గలదు. 1888వ సంవత్సరము మెయినెల 29వ తేదినిజరిగిన గోదావరీమండల సంఘసభలో 15 గురు సభ్యులుండి వారిలో నిరుపమ తపహ్నిలుదారులుండినను,అగ్రాసనాధిపత్యమునకు నన్నునియమించిరి.

నేను రెండుపాఠశాలలకు కార్యనిర్వాహక సంఘసభ్యుఁడనుగా నుండుటయేకాక యిన్నీసుపేటు బాలికాపాఠశాలకు కార్యనిర్వాహకు డనుగా నుంటిని. బాలికలు జీతము లిచ్చుకపోవ్రుటచేత దానిని భరిం చుట యెక్కువ కష్టముగానుండెను. ఈపాఠశాలను నేను చందాలు మూలమునను పురపారిశుద్ధ్యసంఘమువారును దొరతనమువారును వేఱువేఱుగానిచ్చు సహాయద్రవ్యమువలనను భరించుచుంటిని. 1885వ సంవత్సరము మార్చినెల 3 న తేదిని రాజమహేంద్రవర పురపరిపాల కాధ్యక్షుని యొద్దనుండి నాకీక్రిందియుత్తరము వచ్చినది:-

"దొరతనమువారు మీపాఠశాలకు నగర పారిశుద్ధ్యవిచారణ సంఘువారి ధనములోనుండి జీతముల సహాయద్రవ్యము నిచ్చుటను

నిషేధించి, బాలికాపాఠశాలలకు జీతముల సహాయధనము రాష్ట్రీయ ధనములోనుండి యియ్యబడునని చెప్పియున్నారు. పయి సంవత్సరారంభమునుండి ప్రతిపాలకసంఘధనములోనుండి మీపాఠశాలకు ద్రవ్యమియ్యఁబడదని నేనుమీకు తెలియఁజేయుచున్నాను."

ఈయుత్తరమువచ్చిన శీఘ్రకాలములోనే చెన్నపురిరాజధానీ విద్యావిచారణకర్తగారు రాజమహేంద్రవరమునకు వచ్చుట తటస్థింపఁగా, నేనాయనను కలిసికొని మాపాఠశాల విషయమై మాట్లాడి యాయనచేత బలముగా మాబాలికాపాఠశాల కనుకూలముగా వ్రాయించినమీఁదట దొరతనమువారు విశేషవిషయముగా మాపుర పాలకసంఘధనములోనుండి యథాపూర్వముగా సహాయధనమిచ్చునట్లుత్తరువుచేసిరి. బాలికాపాఠశాల స్థిరపడినపిమ్మట వారవారమును ప్రకటింపఁబడు వివేకవర్ధనితోపాటుగా సత్సహితబోధినియను స్త్రీల కుపయోగించు మాసపత్రిక నొకదానిని మూఁడుసంవత్సరములు నడపి స్త్రీలనిమిత్తమయి సత్యవతీచరిత్రము, చంద్రమతీచరిత్రము, సత్య సంజీవని, పత్నీహితసూచని, దేహారోగ్య ధర్మబోధిని మొదలగు పుస్తకములను రచించితిని.

మాయూర ప్రార్థనసమాజమునందు వారవారమును జరగెడు సభలలోనేను తఱుచుగా ధర్మోపన్యాసములు చేయుచుండెడివాఁడను. 1881-90 సంవత్సరములకు నడుమను పైనిచెప్పిన పుస్తకములనుగాక చమత్కారరత్నావళి, రాగమంజరి, నాటకముల నింగ్లీషునుండియు, రత్నావళి మాళవికాగ్ని మిత్రనాటకములను సంస్కృతమునుండియు తెలిఁగించి, ప్రహ్లాదనాటకము, దక్షిణగోగ్రహణము, సత్యహరిశ్చంద్రనాటకము అనురూపకములను, కొన్ని నాటకకథలను, ప్రహసనములను, ఆంధ్రకవులచరిత్రమును రచించితిని. ఇవిగాక వితంతువివాహ విషయమునను, ఇతరవిషయమునను, పెక్కుపన్యాసములవ్రాసి ప్రచు

రించితిని; పూర్వకవిప్రణీతగ్రంథములను కొన్నిటిని సంస్కరించి ప్రకటించితిని.


ఆకాలమందు మాపట్టణములో బాలురవిద్య యత్యధమస్థితి యందుండెను. సునిర్మితములైన సభలపాలనముక్రిందనుండి చక్కగా నడపఁబడుచుండిన రెండుపాఠశాలలకును పోటీగా ధనార్జనాభిలాష చేతను కీర్తికాంక్షత్వముచేతను కొందఱుబుద్ధిమంతులు పలుమిషలుపెట్టి యాస్థికపాఠశాలయనియు మహారాష్ట్రపాఠశాలయనియు స్వదేశాభిమాని పాఠశాలయనియు పాఠశాలలనుపెట్టి మొదలుపెట్టిరి. కార్యనిర్వాహకులు తమచేతిసొమ్మును వ్యయపెట్టుచున్నట్లు చూపి దొరతనమువారివలన సహాయద్రవ్యముగా విశేషవిత్తము గైకొనుచుండిరి. ఇట్టి కుతంత్రప్రయోగమువలన నీతినిమ్నాతమేకాక విద్యానుసహితము విద్యార్థులు కోలుపోవుచుండిరి. విద్యార్థులకంటె వారి సంరక్షకులలో నధికసంఖ్యాకులెక్కువ వివేకులుకాకుండిరి. అందుచేత, పాఠశాలా కార్యనిర్వాహకసంఘమున కధ్యక్షులయిన మెట్కాఫ్‌గారును సంఘసభ్యులయిన యస్మదాదులును, ప్రతిపక్ష పాఠశాలలవారు కోరిన నియమములనే యంగీకరించి, వారిపాఠశాలాధికారియైన యేలూరి లక్ష్మీనరసింహముగారినే ప్రధానోపాధ్యాయ పదమునందునిలిపి, పాఠశాలలన్నిటి నొక్కసభవారి కార్యనిర్వాహకత్వమునకు లోఁబఱుపఁగలిగితిమి.

ఇట్లు కలుపఁబడిన యీనూతనోన్నత పాఠశాలనిమిత్తము మందిరముకట్టుటకై పట్టణమధ్యమునందొక విశాలస్థలమును బేరమాడి క్రయనిర్ణయము చేసికొనుటకు సంసిద్ధులమయి యుంటిమి. మా సీమకు తహశీల్దారుఁడుగానున్న బుద్ధిమంతుఁడు తక్షణమే యా క్షేత్రస్వామిని తనయొద్దకు పిలిపించుకొని, ఆభూమిని తనవారిపేర వ్రాయించుకొనెను. పోయినభూమిని మరల రాబట్టుటకయి యుపా

యము నాలోచించి నేనుపకర్తగాహిగారినొద్దకుపోయి మాట్లాడి యాయనచేత నొత్తుడుకలిగించి పులినోటఁబడ్డ గోవును విడిపించి తెచ్చినట్లు నేలను మరల పాఠశాలా కార్యనిర్వాహక సంఘమువారి యధీనమగునట్లు చేసితిని. ఇప్పుడు బోధనకళాశాలాభవనము కట్టబడి యున్న స్థల మిదియే.

ఇన్ని విషయములలో నేనత్యంతోత్సాహముతో పనిచేయ బడినకాలములో బసవరాజు గవర్నరాజుగా రాకస్మికముగా 1888 వ సంవత్సరము జూలై నెల 16 వ తేదిని లోకాంతరగతులయిరి. అటు వంటి సుగుణనిధియైన మిత్రరత్నము మరణముతో నా కావఱకున్న కార్యోత్సాహము సగము తగ్గిపోయినది. నేను విరక్తుఁడనయి, పుర పరిపాలక సంఘములోను స్థానికనిధిసంఘములలోను నాసభ్యత్వములకు పరిత్యాగ పత్రికలనుబంపి యాపనులనెల్ల నొక్కమాఱుగా మానుకొంటిని. గవర్నరాజుగారు తన మరణమునకు నాలుగయిదు మాసము లకు ముందొకనాఁడు నాయొద్దకువచ్చి నా జీవచరిత్రమును వ్రాయుట కయి సాధనములనిమ్మని నన్నడిగెను; నేనాయనను నిరుత్సాహపఱచి నామరణానంతరమున నేమైన వ్రాయఁదగి యుండినచో వ్రాయవచ్చు నని చెప్పితిని. ఈ సంభాషణము జరిగిన కొన్నిమాసములలోనే నా జీవచరిత్రమును వ్రాయునెంచిన మిత్రుని జీవచరిత్రమును నేనే యా యనస్మృతిని శాశ్వతపఱచుటకయి చేయబడిన పురమహాజనులసభలో వ్రాసి చదువవలసినవాఁడనైతిని. ఈయనస్మృతి స్థిరీకరణార్థమయి దాదాపుగా మున్నూఱు రూపాయలు చందాలువేయఁబడినవి. వచ్చిన సొమ్ముతో నాదికొంతచేర్చి మున్నూటయేబది రూపాయలకు నిజ రూప పరిమాణముగల చిత్రాకృతిని వ్రాయించి రాజమహేంద్రపుర మందిరమునందుఁ బెట్టించితిని. ఈయన యనంతరము నాతరువాత నిరంతరాయముగా నత్యంతోత్సాహముతో లోకోపకారకార్యమును

నడుపుదురని నేను ప్రతీక్షించిన సత్తిరాజు మృత్యుంజయరావుగారును
వీరివలెనే యకాలమరణమునంది నాయాశకు భంగముకలిగించిరి;
ఆరంభింపఁబడిన సత్కార్యము నవిచ్ఛిన్నముగా జరిపి లోకమునకు
మేలుచేయుదురని నేనాశపడిన కడపటివారయిన దేశిరాజు పెద
బాపయ్యగారును పయి యిరువురివలెనే యకాలమృత్యుదేవత వాతం
బడిరి. ఈలోకములో మంచిపదార్థములు చిరకాల ముండవు
కాబోలును! ఆహా! ఈశ్వరేచ్ఛా విచిత్రప్రభావముల నెవ్వరు
గ్రహింపగలరు.



పురమందిరము – ప్రార్థనామందిరము

రాజమహేంద్రవరము.

12.1 (A)

1216 (B)

స్వీయ చరిత్ర ము

రెండవ భాగము

మొదటి ప్రకరణము

పురమందిరాదిక నిర్మాణదశ, 1890 మొదలు 1902 వరకు

1879 వ సంవత్సరమునందు వితంతువివాహవిషయమున నే నియ్యదలఁచుకొన్న కొన్నియుపన్యాసములకు తావొకపట్టున లభింపక సభాభవనమొకటి పట్టణమునను నుండిన బాగుండునుగదాయన్న సంకల్పముతో చెన్నపురి విద్యావిచారణకర్త కర్నల్ మక్లానల్డుగారిపేర రాజమహేంద్రవరములో పట్టణమందిరమును కట్టింపనలెనని 1880 వ సంవత్సరములో ప్రయత్నించితిని. చాలినంత ధనమువచ్చునన్న జాడ కానరానందున నప్పటికాకృషి సఫలమైనదికాదు. నేను పట్టణ మందిర నిర్మాణమునకయి పురమధ్యమున ధర్మవైద్యాలయ వీధియందొక స్థలమునుకొని శ్రీ విక్టోరియా మహారాజ్ఞి జ్యూబిలీమహోత్సవ సందర్భ మున 1887 వ సంవత్సరమున చందాలుచేర్చి పురమందిరమును కట్టింప వలెనని మరల ప్రయత్నముచేసి యొకసభ కూర్చితిని. శ్రీ పిఠాపుర రాజు గారు వేయిరూపాయలను దయచేసిరి. చందాలమూలమున నయిదారు నూరులు పోగయినవి. మందిర నిర్మితికయి పలుమాఱు సభలు చేయఁ బడుచువచ్చినవి. ఈప్రకారముగా రెండు సంవత్సరములు సభలు జరిగినపిమ్మట వృథా కాలహరణమగుటతప్ప నిట్టిసభలవలన కార్యము కలుగఁబోదని నేనుతలఁచి రెండుమూఁడువేల రూపాయలతో నొక చిన్న మందిరమును కట్టింపవలెనని పనికారంభించి నేనే యొద్దనుండి

పనిచేయించుచుంటిని. ఈవిషయములో నా కీశ్వరసాహాయ్యము ముఖ్యముగా ననుగ్రహింపఁబడినది. క్రిందటి సంవత్సరము నూఱురూపాయల పుస్తకములే నావియమ్మ్రీడుపోయినను పనికిఁబూనిన యీసంవత్సరమునందు వేయిరూపాయలకంటె నధికముగావచ్చినవి. నేనుకోరకయే యీసంవత్సరమున నన్ను సర్వకళాశాలవారు పరీక్షకునిగా నియమించిరి. చెన్నరాజధాని విద్యావిచారణకర్తగారు నన్ను మధ్యమ పాఠశాలాపరీక్షకునిగా నేర్పఱచిరి. ఈప్రకారముగా నేనెదురుచూడని ధనప్రాప్తి కలుగఁగా, మూడువేలతో ముగింపవలెననుకొన్న మందిరమును పెంచి యేడువేలరూపాయలు దానినిమిత్తమయి వ్యయపెట్టితిని. 1890 వ సం॥ అక్టోబరునెలలో దానిని తెఱచి గృహప్రవేశోత్సవ సమయమునందు చెన్నపురిరాజధానీ రాజకీయశాస్త్రపాఠశాలలో సంస్కృతోపన్యాసకులు రంగాచార్యులు (ఎమ్.ఏ.) గారు నన్నుఁగూర్చి యింగ్లీషున 23 వ తేది నొక యుపన్యాసమిచ్చిరి. కలకత్తాలోని సాధారణ బ్రహ్మసమాజ ప్రధానబోధకులైన పండిత శివనాథశాస్త్రి (ఎమ్. ఏ.) గారు వచ్చి నవంబరునెల 15 వ తేదిని నన్నుఁగూర్చి కొంతచెప్పి, పురమందిరములో రాజమహేంద్రపుర వాసులప్పటినుండి నిరాటంకముగా సభలు మొదలయినవి చేసికోవచ్చునని ఘోషించిరి. 1896 వ సంవత్సరాంతముతో పట్టణమందిర నిర్మాణవిషయమున నేనుచేసిన ఋణములన్నియు పూర్ణముగా తీఱిపోయినవి. నేను చెన్నపట్టణమునకు పోవుటకుముందు 1897వ సంవత్సరము డిశంబరునెలలో నిక్షేపపత్రమునువ్రాసి లేఖ్యారూఢముచేయించి మందిరము ధర్మకర్తలకొప్పగించి పోయితిని.

నేను పురమందిరమును కట్టించుటకుముందే యాస్థలవిషయమయి నాలుగువ్యాజ్యములు వేయఁబడి కొట్టుపడిపోయినవి. నేను నాగరాజుగారిపేర స్థలమును కొన్నసంవత్సరమునందే సూరి వేంకట

శాస్త్రిగారు మాకు స్థలమమ్మిన మహమ్మదీయుని జ్ఞాతికొకనిని జేరఁ దీసి వానిచేతతనకు స్థలములో భాగమున్నదని సంక్షిప్తాభియోగము తెప్పించెను. అది కొట్టుపడిపోయినతరువాత క్రమమైన వ్యాజ్యమును మాకు స్థలమమ్మినవానినిజేర్చి తాను పెట్టుబడిపెట్టి వేయించెను. అదియు కొట్టుపడిపోఁగా వ్యాజ్యమునకయిన కర్చులను వేంకటకృష్ణ శాస్త్రులవారే ఇచ్చుకోవలసినవారైరి. నేను పురమందిరమును కట్టుటకారంభించినతరువాత స్థలము తనకాలో నున్నదని వేంకట కృష్ణశాస్త్రిగారే తనపేరట అసలు వ్యాజ్యము తెచ్చెను. అది పుర మందిర నిర్మాణమైన తరువాత కొట్టివేయఁబడినది. దానిపైని ఉపర్య భియోగమును దెచ్చెనుకాని దానికిని పూర్వపువ్యాజ్యములకు మూటి కిని పట్టిన దురవస్థయేపట్టెను. ఇవి ఇట్లుండఁగా 1889 వ సంవత్సరము సెప్టెంబరు నెలలో ఖాజా అహమ్మదల్లాఖాన్ గారు కట్టలువేసికొనుట కయి యిచ్చినస్థలములో మేము గోయి పెట్టి కట్టలు కోయించుచుండగా ఒక పెద్దమనుష్యుఁడు ఖాజాసాహేబుగారి జ్ఞాతియైన యొక బీదవానిని పిలిపించి వానిచేత నేను తన తాతసమాధిని త్రవ్వించివేసినట్లు నాపై సంయుక్తదండ విధాయకుఁడైన మోపర్లీగారియొద్ద తేఁబడిన యభి యోగము నాదొరగారు విమర్శచేసి తమకు తెలియఁ జేయువలసినదని పోలీసువారికి పంపిరి. తన తాత యెముకలని తెచ్చినబుట్టతో నాబీద తురకవానిని పోలీసువారు రాజకీయ వైద్యునికడకుఁ గొనిపోయి పరీక్షింపించి, యెముకలన్నియు మేకయెముకలని డాక్టరు నిర్ణయపత్ర మిచ్చినతరువాత ఏలూరి లక్ష్మీనరసింహముగారి ప్రేరణముచేత తేఁబడినదిగాని ఇది నిజమైన యభియోగముకాదని దండవిధాయ కునికిఁ దెలియఁజేసిరి. దొరగారు తాము నన్ను స్వయముగా నెఱుఁ గుదుమనియు నేనట్టి పని చేయువాఁడను కాననియు ప్రాసి యా యభి యోగమును నవంబరు 30 వ తేదిని కొట్టివేసిరి. మోబర్లీగారు మా మండలము విడిచి వెళ్ళిన తరువాత నాతని తీర్పుపై నాలుగు

మాసములకు మ్యూమండల న్యాయాధిపతియొద్ద పునర్విమర్శకు విజ్ఞాప నమును బెట్టించిరి. ఆవిన్నపమును మండల దండన్యాయాధికారిగారు ఖొట్టివేసిరి.

నాకు బాల్యమిత్రుడయి యుండిన యేలూరి లక్ష్మీనరసిం హముగారు నాపైనిట్టి తప్పుటభియోగము నేలతెప్పింతురని కొంద ఱడుగవచ్చిను. ఆస్తికపాఠశాలా విషయమున నాతఁడనుసరిం చుచు వచ్చినమార్గమును రాత్రిపాఠశాలా విషయమున నాతఁడు త్రొక్కిన త్రోవయు, ఇతరవిషయముల యందతఁడవలంబించిన పద్ధ తులును, నింద్యములుగా నాకు కనబడినందున నేనప్పుడప్పుడాయనను మందలించుచుండుటయు వివేకవర్ధనిలో వ్రాయుచుండుటయు తట స్థించుచువచ్చెను. అతఁడును తానుప్రచురించెడు గోదావరీ వృత్తాంత మను పత్రికలో నాకు వ్యతిరిక్తముగ వ్రాయఁదొడఁ గెను. ఇదియిట్లుండఁగా నతఁడు రాజమహేంద్రవరోన్నత పాఠశా లకు ప్రధానోపాధ్యాయుఁడును, రాజమహేంద్రపుర పారిశుద్ధ్య విచారణ సంఘమున కధ్యక్షుఁడును అగుట తటస్థించెను. ఈకాలములో నెప్పల్లె రామబ్రహ్మమనునొక గృహస్థుని యింటివాద రాళ్లుపడుచుండెను. రామబ్రహ్మముగారి వదినె మాయింటి కేడ్చుచు వచ్చి యొకమిత్రునితో మాటాడుచూ మేడమీదనున్న నాతో లక్ష్మీ నరసింహముగారు తమ యల్లుని స్వాధీనముచేసికొని తమయింటివాద రాళ్లు వేయించుచున్నాఁడని చెప్పి యేలాగునైన తమ బాధను మాన్పి రక్షింపుమని నన్ను వేఁడుకొనెను. మనసుకరఁగిన వాఁడనయి మిత్రునిబంపివేసి నేనామె వెంట వారియింటికి పోయితిని. మేమక్కడ నిలుచుండియుండగానే వీధిప్రక్కనుండివచ్చి యొకరాయియింటివాద పడి జాతిమేమున్న చోటపడెను. అది చిన్నస్వామిగారి మేడమీదినుండి వేయఁబడినదని యామేడమీదికిపోయి చిన్నస్వామిగారి రెండవకుమా

రుని మందలింపఁగా నతఁడు లక్ష్మీనరసింహముగారి చాకలివాఁడే రాళ్లువేయుచుఁడఁగా మమ్మేలనిందించెదరని యడిగెను. అందుచేత రాళ్లువేయుటలో లక్ష్మీనరసింహముగారి సంబంధము తప్పకయున్నదని నిశ్చయించి, 1889 వ సం॥ జూలయినెల 30వ తేదీని నేనాయన పాఠశాలకుపోయి నిడమర్తి దుర్గప్రసాదరాయుఁడుగారును దామరాజు బసవరాజుగారును దగ్గఱనుండఁగానే రామబ్రహ్మముగారియల్లుని జేరఁదీసి వారియింటివీధ మీరు రాళ్లు వేయించుచున్నారని చెప్పుచున్నా రెంతవరకు నిజమని యడిగితిని. ఆయన తానేమియు నెఱుఁగనని చెప్పగా నేను మరలి మాయింటికిఁబోయితిని. తరువాత లక్ష్మీనరసింహముగారు భయపడి మఱునాఁడు (31 వ. తేది) తన మిత్రుఁడైన మూదిరెడ్డి వీరాస్వామినాయుఁడుగారి యింటికిపోయి యాయనతో నేమోమాటాడఁగా నాయఁడుగారు నన్నొకమారు దర్శనమిచ్చి పోవలసినదని నర్తమానముపంపిరి. ఆయన జరిగిన దేమనియడుగఁగా జరిగినవృత్తాంతమును జెప్పిరాళ్లు వేయుచున్నా రన్న చాకలవాఁడు మొదలయిన వారిపేరు లెల్లఁ జెప్పితిని. అప్పుడక్కడనున్న దామరాజు నాగరాజుగారు నామాటలు వినక యుసదండ విధాయకునియొద్ద లక్ష్మీనరసింహముగారిపయి నభియోగము తెచ్చి నన్నును వీరాస్వామినాయుఁడుగారు మొదలైనవారిని సాక్షులనుగాకోరెను. క్రిప్పిక్రిప్పి కడకు దండవిధాయి యాయభియోగమును కొట్టివేసెను. ఈపగను తీర్చుకోవలెనను యుద్దేశముతోనే లక్ష్మీనరసింహముగారు సమాధిని తవ్వించితినని నామీద మిథ్యాభియోగమును తెప్పించెను. వీరాస్వామినాయుఁడుగారియింట సమావేశము జరిగిన రెండుదినములకు (ఆగష్టు 2 వ తేదిని) ప్రాతఃకాలమునసే రామబ్రహ్మముగారు నాయొద్దకువచ్చి తమయింటివీధ మరల రాళ్లు పడుచున్నవనియు తమ్మపాయమునుండి రక్షింపవలసినదనియు నన్ను వేఁడుకొనెను. నేను దుగ్గిరాలవారి దొడ్డిలో యీవలకు వచ్చుచుండగా

చుట్టుపట్టులవారును నెప్పల్లె వారియింటిలో కాపురమున్నవారును వచ్చి తామెఱిగినది చెప్పఁజొచ్చిరి. వారుచెప్పినది వినుచుండఁగా లక్ష్మీనరసింహముగారి మిత్రుఁడైన బయపునేడి జోగయ్యగారచ్చటకువచ్చి లక్ష్మీనరసింహముగారి సమక్షమున నీవ్యవహారము నడచుట మంచిదని చెప్పి తానుపోయి యాయననక్కడకు తీసికొని వచ్చెను. అందఱు చెప్పినమాటలను విన్నపిమ్మట వేంకటజోగయ్య్య గారు మీనడతను శుద్ధపఱుచు కోవలసినదని లక్ష్మీనరసింహము గారితో చెప్పవలసిన వారయిరి. ఈదినము మొదలుకొని రామ బ్రహ్మముగారి యింటిమీఁద రాళ్లుపడుట నిలిచిపోయినందులకు నేను సంతోషించితిని.

ఈ వ్యవహారము నడచిన తరువాత దాదాపుగా సంవత్సర కాలమునకు లక్ష్మీనరసింహముగారు నేను తన్నిండ్లమీఁద రాళ్లు వేయించినట్టును తనయడత మంచిదికానట్టును పెద్దమనుషులమొదటి దూషించినందునకయి మాడు వేలరూపాయలు మానష్టమిప్పింపఁగోరి 1899 వ సం॥ జూలయి నెల 15వ తేదిని మండలన్యాయసభలో నామీఁద వ్యాజ్యము తెచ్చెను. నేనతఁడు రాళ్లువేయించినట్టును అతనినడత మంచిదికానట్టును ఋజువు చేసెదనని స్పష్టముగాఁజెప్పితిని. అందుమీఁద నాతనిమిత్రులును న్యాయవాదియైన దుర్గప్రసాద రాయఁడుగారును ఆలోచించి, 1890 వ సం॥ జూలై నెల 29 వ తేదిని పయిని చెప్పఁబడిన దూషణముకొరకే నామీఁద సంయుక్త దండ విధాయకునియొద్ద నభియోగము తెచ్చిరి.

ఈయభియోగముతోడనే మహారణ్యపురాధిపత్యమన్న ప్రహసనము తన్నుద్దేశించి ప్రకటింపఁబడినదనియు తత్ప్రకటనమునకయి నన్ను శిక్షింపవలయుననియు లక్ష్మీనరసింహముగారు నాపై నింకొక యభియోగమును కూడఁదెచ్చిరి. ఈవ్యవహారములను నడుపుటకయి

నేను సంవత్సరకాలము సెలవు పుచ్చుకొని పాఠశాలకు పోవుట మాని నిలిచితిని. వాదిపక్షమున దుర్గప్రసాదరాయఁడుగారు నన్నేలాగు నైనశిక్షింపఁ జేయవలెనని యెంతోపట్టుదలతో పనిచేయఁ దొడఁగిరి. నాపక్షమున న్యాపతి సుబ్బారావుగారును నన్నేలాగునైన శిక్షనుండి తప్పింపఁజేయవలెనని పదిరెట్టెక్కువ పట్టుదలతో పనిచేయసాగిరి. మెట్కాపురోరగా రుభయపక్షముల గౌరవమును నిలుపఁగోరి పూర్వమాయన నడతమంచిదికాదని యభిప్రాయపడి యిప్పుడితరులు మంచిదేయని చెప్పుటచే నేనన్నమాటలు మరలించు కొనుచున్నానని చెప్పినచాలునని బహువిధముల నాతోఁజెప్పిరికాని 'యిప్పుడుసహిత మతఁడు మంచివాఁడు కాఁడనియే నేను ధృఢముగానమ్మిచున్నందున నేనట్లు సందిగ్ధవచనములు వ్రాయుటకు సహితమొడఁబడనేర' నని యాయన కోరికను నిరాకరించితిని. సుబ్బారావుగారునన్ను సమాధాన పడకుండఁజేసిరని కొందఅభిప్రాయ పడిరి, కాని వారనుకొన్నది సరి కాదు.

ఈ వ్యవహార మిట్లు జరుగుచుండఁగా రాణీగారి – జ్యూబిలి – యుత్సవమునకయి కర్చుపడఁగా మిగిలియున్న కొంచెముసొమ్మే నేజనోపయుక్తకార్యమునిమిత్తము వ్యయముపెట్టవలెనో నిశ్చయించుట కయి పురజనుల సభయొకటి జరిగెను. ఆసభయందు రాజకీయ వైద్యుఁడు ధర్మవైద్యశాలకు చికిత్సనిమిత్తమయి వచ్చెడి నిరుపేదల యూచ్ఛాదన దానమునకయి దాని నుపయోగ పడ్డుపవలసినదని కోరెను; విద్యాధికులును నాపక్షమున సాక్షులుగానుండినవారును కొం దఱు బంతిలాటకయి చిత్రవస్తుప్రదర్శనశాలలో చత్వరమును చేయిం చుటకయి దాని నుపయోగ పరుపవలసినదని కోరిరి. అప్పుడు నేను వ్యాధిబాధితులైన నిరుపేదలకు వస్త్రదానము చేయుటకయి యున్న యల్ప ధనమును వ్యయపెట్టవలసినదని యొకరు చెప్పుచుండఁగా ధని

కులును విద్యాధికులున్నైన గృహస్థులు తమ నిమిత్తమయి కందుక క్రీడాచత్వరమును దానితో వేయింపుమని కోరుట యవమానకరమును స్వప్రయోజన పరత్వమును నని చెప్పితిని. సభనుండి మే మీవలకు రాగానే సుబ్బారావుపంతులుగారు మీవ్యవహారము తుదముట్టు వఱకును మీరిక్కముందు సభలకువచ్చి మాటాడకుండుఁడని నన్ను బతిమాలుకొనిరి. మా వ్యవహారములో సాక్ష్యులవిచారణ మారంభ మయినది. నా ప్రతిపక్షమునవచ్చిన సాక్ష్యులలో కొందఱు మిత్రరక్షణ తత్పరత్వముచేతనో ధారణాశక్తి లోపముచేతనో నేను తమతో ననని మాటలనుగూడఁగొన్నిటిని నేనన్నట్లు తమసాక్ష్యములోఁజెప్పిరి. అందుచేత దండాధికారి వారిసాక్ష్యమును విశ్వసింపకపోవుటసహితము తటస్థించెను. బంధువులయొక్కయు, కులమువారియొక్కయు నిర్బంధ మును సరకుగొనక బ్రాహ్మణేతరులలో ననేకులు నాపక్షమున సాక్ష్య మిచ్చిరి. విమర్శ ముగిసినమీఁదట ముందుగా దండవిధాయకుఁడు 1891 వ సం॥ జూలయినెల 27 వ తేదిని తీర్పుచెప్పి నామీఁద తెచ్చిన యభియోగములను రెంటిని కొట్టివేసెను. మూడువేల రూపాయలు మాన నష్టమునకయి యిప్పింపవలసినదని నాపైని లక్ష్మీనరసింహము గారు తెచ్చిన వ్యాజ్యమంతశీఘ్రముగాముగియక దాదాపుగా మూడు సంవత్సరముల కాలము నడచినపిమ్మట 1893 వ సం॥ మార్చినెల 10వ తేదిని తీర్పఁబడెను. ఈతీర్పులో న్యాయాధిపతి యించుమించుగా సారాంశముల నన్నిటిని నాకనుకూలముగానే నిర్ధారణము చేసినను "ఇండ్లమీద రాళ్ళు వేయించువారు పెద్దమనుష్యులుగా పరిగణింపఁ బడుచున్నారు" అని నేను వివేకవర్ధనిలో ప్రకటించిన దానినిగూర్చి నాకు ప్రతికూలముగా నిర్ణయముచేసి, నేనొక 'యణా' వాది పరువు నష్టంక్రింద నిచ్చునట్లును ఎవరివ్యయములు వారే భరించునట్లును తీర్పు చెప్పెను.

పురమందిరమునకు వలె ప్రార్థనమందిర నిర్మాణమునకయిన వ్యయముల నన్నిటిని నేనొక్కఁడనే భరింపలేదు. వ్యయములలో విశేషభాగము చందాలమూలమున సమకూర్పఁబడినది. ఈమంది రములో నుపాసన కుద్దేశింపఁబడిన క్రింది కూటముమాత్రమే కాక పైని మేడకూడ కట్టఁబడినది. ఈ మందిర నిర్మాణమునకు దాదాపుగా రు 1500 లయినవి. సంవత్సరోత్సవసమయమునందు శ్రీ ఆర్. వేంకట రత్నమునాయఁడుగారు బందరునుండి వచ్చి మందిరమును తెఱచి 1897 వ సం॥ ఏప్రిల్ నెల 17 వ తేదిని గృహప్రవేశోత్సవమును నడపిరి.

1893 వ నూతన సంవత్సరపు బిరుదులలో నిఁడియూ దొరతన మువాసు నాకు 'రావు బహదూరు' బిరుదము ననుగ్రహించిరి. బహు స్థలములనుండి నే నెఱిగినవాసును, ఎఱుగనివారునుకూడ నన్నభినందిం చుచు లేఖలువ్రాసిరి. రాజమహేంద్రవరపుర వాస్తవ్యులు మెట్కాపు గారి యాధిపత్యమున్ద పురమందిరములో నొక సభచేసి నా కభి నందనము చేసిరి. విద్యావిచారణాధికారి డంకర్ గారు రాజమహేంద్ర వరము వచ్చినపుడు కళాశాలాభవనములో నొకసభచేసి యుపాధ్యా యుల యొక్కయు, బాలురయొక్కయు సమక్షమున దొరతనమువా రంపిన సనదును నాకు బహిరంగముగా దయచేసిరి.

వితంతు వివాహప్రయత్న ప్రారంభదశలో నాకు విశిష్టజనుల కంటె విద్యార్థిజనులే యెక్కువ సహాయులుగా నుండిరి. అట్లుండుటకు కారణమే తద్విషయమైన నాబోధనలు వారిమనస్సుకెక్కుటయే. బాలురకు భగవద్భక్తియు పరోపకారాసక్తియు బోధించెడు పాఠ శాల యుండినయెడల శీఘ్రకాలములో దేశాభివృద్ధికలుగునని మొదటి నుండియు నానమ్మకము. ఈ నమ్మకముచేతనే యేలూరి లక్ష్మీనర సింహముగా రాస్తికపాఠశాలను స్థాపింపనలఁచినప్పుడు నే నాయనను

ప్రోత్సాహపఱిచితిని. ఆపాఠశాల 1889 వ సంవత్సరమువఱకునుండి నేను మొదటదలఁచుకొన్న యుద్దేశము లేనియు దానినలన నెఱవేఱ లేదు. సదుద్దేశములను బాలుర హృదయములలోఁ బుట్టించుటకుఁ దగిన శక్తిసామర్థ్యములును శ్రద్ధాభక్తులును గల యుపాధ్యాయులు కూడ కావలెను. 1893 వ సంవత్సరమునందు పట్టపరీక్షయందు కృతార్థులయియుండిన రాయసము వేంకటశివుఁడుగారును సత్తిరాజు మృత్యుంజయరావుగారును ఈ సదుద్దేశముతోనే ఎల్. టీ. పరీక్షకు చదువుటకయి సైదాపేటకు పోయిరి. పనిచేయువారితోడిపాటుగా పాఠశాలాభవనమునుగూడ సంపాదింపవలెనని నేను ప్రయత్నము చేయనారంభించితిని. కాని రాజమహేంద్రవర రాజకీయ కళాశాలాధ్యక్షుని సాహాయ్యముకూడ నీపనిలో నత్యావశ్యకము. ఆయనయు నస్మదాదులును గలిసి పట్టణములోనున్న పాఠశాలలన్నిటిని యొక్కటిగా కలిపి మా కార్యనిర్వాహణక్రిందనే యున్నత పాఠశాలను స్థాపించితిమి. దానిని దొరతనమువారు పుచ్చుకొని దాని శాఖలుగా పట్టణములో రెండుమూడు మధ్యమపాఠశాలలఁ బెట్టించు ప్రయత్నము నడచుచున్నది. ఇంతలో నేనే మఱియొక పాఠశాలను పెట్టినయెడల తత్ప్రయత్నమునకు విఘాతము కలిగించునుద్దేశముతో స్థాపించిన ప్రతిపక్ష పాఠశాలయని దొరగారనుకోవచ్చును.

(మెట్కాఫు) దొరగారితో నేను స్వయముగా మాపాఠశాల విషయమయి మాటాడితిని. ఆయన యున్నతపాఠశాలను నేనుపెట్టుట కొప్పుకొనలేదు కాని నేను మధ్యమపాఠశాలతో తృప్తిపొందినపక్షమున, పురమందిరమున కెదురుగానున్న పాఠశాలాగృహమును కూమా కిప్పించెదనని చెప్పెను. మధ్యమపాఠశాలలో పనిచేయుటకు వేంకటశివుఁడుగా రొప్పుకొనలేదు. అందుచేత నేను విఫల మనోరథుఁడనై నావద్దకువచ్చిన వేయి రూపాయలును గంజాము వేంకట

రత్నముగారికి మరల నిచ్చివేసి యప్పటికి నాప్రయత్నమును విడువ వలసినవాఁడ నైతిని. ఎల్. టీ. పరీక్షలో మృత్యుంజయరావుగా రొక్కరే కృతార్థులయిరి. నామాటను మన్నించి మెట్కాఫుగారు మృత్యుంజయరావుగారికి రాజమహేంద్రవర రాజకీయ పాఠశాలలో నొక్కసారిగా నూఱు రూపాయల పని నిప్పించిరి. గంజాము వేంకట రత్నముగారు నాయందు గౌరవము కలవారయి 1896 వ సంవత్సరము నందు నాపేరిట కాకినాడ కాలేజీలో విద్యార్థివేతనము స్థాపించుట కుద్దేశించి తన రెండువేలరూపాయల భీమాపత్రమును పంపిరి.

ఆస్తికపాఠశాలలో పని చేసెదనని యుత్సాహముతో ముందుకువచ్చిన గోఖేటి కనకరాజుగారు కొన్ని సంవత్సరములక్రిందట చెన్నపట్టణప్రభుత్వమువారి తెలుఁగు భాషాంతరీకర్తలయిరి.

1898 వ సంవత్సరమునందు చెన్నపురి దొరతనమువారు నన్ను సర్వకళాశాలా సభ్యునిగా జేసిరి.

నా యారోగ్యహీనతనుబట్టి వివేకవర్ధని నిలుపుచేయఁబడిన తరువాత 1891 వ సంవత్సరమునందు న్యాపతి సుబ్బారావుగారు తెలుఁగులో చింతామణి యను మాసపత్రికను స్థాపించి మా వివేక వర్ధనీ ముద్రాక్షరశాలలోనే దానిని ముద్రింపించుచు వచ్చిరి. నేనును వ్రాతలో సహాయుఁడనయి వ్రాయుచుంటిని. సమస్త వ్యయములను సుబ్బారావుగారే భరించుచుండెడివారు.

1897 వ సంవత్సరము జూన్ నెలలో గోదావరీమండలసభ యేలూరు పట్టణమందు జరిగినది. ఆ సంవత్సరము జూన్ నెల 9 వ తేదిని మండలసాంఘిక సభకూడ నక్కడనే జరిగినది. ఈసభకు న్యాపతి సుబ్బారావుగా రధ్యక్షస్థానాధిపత్యము వహించుట కేర్పాటు చేయఁబడినను వారాదినమున నక్కడకు రాలేకపోయినందున వారి

స్థానమున నన్నగ్రాసనాసీనునిగా నియమించిరి. మా మండలములో సాంఘికమండల సభలు జరుగుట కదియే యారంభము. వ్యావహారిక సభ కెందఱుజనులు వచ్చిరో యంతమంది సాంఘికసభకును వచ్చి నందున జనులు సాంఘికవిషయములందుకూడ శ్రద్ధనహించుట కారం భించిరనుట స్పష్టమగుచున్నది. ఈ నెలలోనే కృష్ణామండలసభకూడ కూడెనుగాని యామండలమునందు సాంఘికసభ జరగలేదు. ఏలూ రులో జరిగిన మా మండల సాంఘికసభలో నింకొక విశేషముకూడ నడచినది. సాంఘికవిషయము లాలోచింపఁబడునప్పుడు స్త్రీ లుండుట యభ్యర్థనీయమని నేనచ్చటి పెద్దమనుష్యులతో కొందఱితో ముచ్చ టించితిని. తమభార్యలను వేఱొకసభకుఁదీసికొనివచ్చెదమని యనేకులు వాగ్దానము చేసిరి. పట్టణములో పూర్వాచార విరుద్ధమయిన కార్యము జరగఁబోవుచున్నదని సంక్షోభము పుట్టినది. ఈ సంక్షోభమునకు భయపడి వాకొన్నారులు కొందఱు సభకు తమ భాగ్యాలను తీసుకొని రాలేకపోయినను ధైర్యశాలు లనేకులు తాముచేసిన వాగ్దానములను చెల్లించుకోఁగలిగిరి. వారిలో నిద్దఱినామముల నిందుఁ బేర్కొను చున్నాను. అందొకరు దాసు శ్రీరాములుగారు రెండవవారు సత్తిరాజు కామేశ్వరరావుగారు, ఈయన సత్తిరాజు మృత్యుంజయరావుగారి. తమ్ముఁడు.

నేను కొన్నిసంవత్సరములనుండి చెన్నపట్టణమునకు పోవలెనని తలఁచుచుండి 1894 వ సంవత్సరమునందు వేసవికాలపు సెలవులలో నక్కడకుఁ బోయినప్పుడు పరశువాకములో నాస్నేహితులైన మన్నవ బుచ్చెయ్యగారి యింటికెదురుగా నొక మేడయిల్లు కట్టించితిని. దూర స్థలములో క్రొత్తవారిలో నుండునట్లు నన్ను ముఖ్యముగా ప్రేరేచిన ప్రయోజనములు రెండు- అందొకటి నాగ్రంథములను చెన్నపట్టణ ములో సంపుటములనుగా ముద్రింపించుకొనవలెననుట, రెండవది

సంఘ సంస్కారవిషయమున రాజధానిలో పని చేయవలెనను ట. ధనమును సమకూర్చుటకయినా ముద్రాక్షరశాలను చిత్రపు నరసింహా రావుగారి కమ్మివేయుటయే కాక న్యాపతి సుబ్బారావుపంతులు వారి యొద్ద వేయి రూపాయలు ఋణము చేయవలసినవాడ నైతిని. చింతా మణిపత్రికను రాజమహేంద్రవరములో నడపుట కష్టముగా కనఁబడి నందున సుబ్బారావుగారా పత్రికను చెన్నపురిలో నడుపుటకు నా కిచ్చివేసిరి. నేనింగ్లండునకు వ్రాసి యావిరితో పనిచేయుటకు తగిన మంచి ముద్రాయంత్రమును చెన్నపురికి తెప్పించి యుంచి దానికి చింతామణీ ముద్రాక్షరశాల యని పేరు పెట్టితిని. మాఱుమూలనున్న రాజమహేంద్రవరమునందు సంఘ సంస్కారకార్యము నారంభించి రాజ్య మధ్యస్థమయి సముద్రతీరమునన్న చెన్నపట్టణమునందు నా కృషి శీఘ్రకాలములోన నాయాసముగా విశేష ఫలప్రదమగు నని నమ్మి నేను చెన్నపురిలోనే స్థిరనివాస మేర్పరచుకొన నుద్దేశించితిని. ఈ యుద్దేశముతో ముందుగా జీతముమీఁద పద్ధతివీఁద రెండు సంవ త్సరములు సెలవు పుచ్చుకొని ముందధికోపయోగకర కార్యమును జేయఁగలుగుదునన్న యూహతో జన్మస్థలమును విడువ శంకింప కుంటిని.

నేను తమ్మి విడిచిపోవనున్నట్లు తెలియఁగానే తమ లోంటి భేదభావమును మఱచి నాకు గౌరవము చూపులలో నొక్కటిగాచేరి రాజమహేంద్రపుర వాసులు నాతోడి వియోగమునుగూర్చి తమ విషాదమును దెలుపుచు బహువిధముల నాపాదన నాదరమును జూపిరి. అనేకసమాజములవారు నన్ను నడుమఁ గూర్చుండఁబెట్టుకొని ఛాయా చిత్రములను దీయించిరి. నాస్తోత్ర పాఠములను వార్తాపత్రికలకుఁ బంపిరి. కాకినాడ పుర నివాసులును సభచేసి యీప్రకారముగానే నన్ను సత్కరించి వీడుకోలిచ్చిరి. ఇట్లు స్వదేశీయుల దీవనలను బడిసి

1897 వ సంవత్సరాంతమునందు సకుటుంబముగా నేను చెన్నపురిఁ జేరితిని. నేను రాజమహేంద్రవరమును విడుచునప్పటి కిక్కడ నిరువది యేడు స్త్రీ పునర్వివాహములు జరిగినవి.

నేను 1897 వ సంవత్సరము డిసెంబరు నెలలో చెన్నపట్టణము చేరి నాపుస్తకముద్రణమున కారంభించి పని చేయఁజొచ్చితిని. నా పుస్తకముల పని ముగియునప్పటికి రెండు సంవత్సరములయినది. నా పుస్తకములన్నియు పది పెద్ద సంపుటములలో ముద్రింపఁబడినవి. దుర్బలమయిన నా శరీరము మఱింత దుర్బలపడినందున సంవత్సర కాలము నడిపినతరువాత చింతామణీ పత్రికను నడపలేక నిలుపుచేయ వలసినవాఁడ నైతిని. సంఘసంస్కరణ సమాజమునకును, దక్షిణ హిందూస్థాన బ్రహ్మసమాజమునకును, నే నధ్యక్షుఁడనగాఁ జేయఁబడితిని. చెన్నపురి పాఠశాలా పుస్తక దేశభాషా సంఘమువారు తమ కార్య నిర్వాహకసభ్యులలో నన్నొకనిగా జేసికొనిరి; దొరతనమువారు తమ పఠనీయగ్రంథసభలో నన్నొక సభ్యునిగా జేసిరి; సర్వకళాశాల వారు తమ ద్రవిడభాషాధ్యయన సభలో నన్ను సభ్యుని గావించిరి. కట్టకడపట ప్రభుత్వమువారు పురస్కరగ్రాహులు మొదలయినవారిని జేయు తెలుఁగుపరీక్షలలో నన్నొక పరీక్షకునిగా నియమించిరి.

నేను చెన్నపురి పోవునప్పటికి వార్తాపత్రికలలో జయప్రదముగా జరుగుచున్నవని శ్లాఘింపఁబడుచు వచ్చిన సంస్కార భోజనముల కాహూతుఁడనయి యొకసారి పోయితిని. ఈ భోజనములు పురమంది రములోని యొకగదిలో యేర్పాటు చేయఁబడినవి. దాక్షిణాత్య బ్రాహ్మణుఁడొకఁడు వంటచేసి యొకగదిలో వడ్డనచేయఁగా నే డెన మండ్రుకలిసి భోజనములు చేసిరి. అట్లు భోజనములు చేసినవారిలో నిద్దఱు బ్రాహ్మణేతరులుసహిత ముండిరి. చేతిరూపాయి వదలినను దాక్షిణాత్యభోజనము నాకు సరిపడనందున నింటి కాఁకలితో వచ్చి

మరల భోజనము చేయవలసినవాఁడ నగుతిని. మరల సంస్కార భోజనము వచ్చినది. నేను భోజనమునకుఁ బోయితిని గాని యీసారి యింటభోజనముచేసి మఱి పోయితిని. తక్కినవారు భోజనమునకారంభించి యాఁకలి తీర్చుకొనుచుండఁగా మాటలకారంభించి నేను నా సంశయముల దీర్చుకొంటిని. ఈ సంస్కారభోజనములో విశేషమేమి యని మొదట నడిగితిని. ఇందు బ్రాహ్మణులును, బ్రాహ్మణేతరులును గలిసి సహపంక్తిని భోజనము చేయుటయని యుత్తరము చెప్పిరి. భోజనము చేసినవారిపేరులు వృత్తాంత పత్రికలలో ప్రచురింతురాయని మరల నడిగితిని. పేరులు ప్రకటింపఁబడినయెడల నీ భోజనములే యుండవనియొకరు బదులు పలికిరి. అటుతరువాత నన్నెప్పుడును మరల సంస్కార భోజనములకు పిలువనులేదు; సంస్కారభోజన ప్రశంసను జేసిన ప్రకటనలను వార్తాపత్రికలలో నే నెప్పుడును చదువలేదు.

నేను చెన్నపురిచేరిన శీఘ్రకాలములోనే సంఘ సంస్కరణ సమావేశమయినప్పుడు సభవారు వితంతు శరణాలయము నొకదానిని స్థాపింతమని మహోత్సాహముతో నిశ్చయించిరి. దాని కిల్లుకావలసి యున్నందున, ఇల్లు కొనుటకై ధనమును తాను పెట్టుబడి పెట్టెదనని ఎన్. కే. రామస్వామయ్యగారు గుదారమనస్సుతో సభలో జెప్పిరి. వెల్లాలవీధిలో నేనున్న యిల్లు 28 వ సంఖ్యగలది. ఆవీధిలోనే 20 వ సంఖ్యగల గృహ మమ్మకమునకురాఁగా రు 3800 లకు బేరము నిశ్చయ పఱచి యింటి సత్వపత్రములను గైకొని నాయొద్ద నుంచుకొంటిని. ఋణము నిమిత్తమై రామస్వామయ్యగారి నడుగఁగా, అసొమ్మ్ము ప్రత్యేకముగా తనదికాక యుక్తవయస్సురాని తన తమ్ముని వితంతుతోఁ జేరి యున్నదనియు తగినంత ప్రాతిభావ్యములేక తాను బదులియ్యఁజాలననియు చెప్పెను. అందుచేతనే నింటివారి న్యాయవాదితో మాటాడి, సర్వకలాశాలాసరీక్షకుఁడనుగా నుండుటచేత నాకువచ్చిన మూల్యములోనుండి యేనూఱు రూపాయలు సంచకరువిచ్చితిని.

మూడు మాసములలోపల మూడువేల మున్నూఱు రూపాయలను చెల్లింప యత్నము చేయనారంభించితిని. చెన్నపట్టణములో మన్నవ బుచ్చెయ్యగారే నూఱు రూపాయలును, డాక్టరు సీ. బీ. రామారావు గారు ననూఱు రూపాయలును, కాకినాడలో దుగ్గిరాల సూర్య ప్రకాశరావుగా రేనూఱు రూపాయలును, రాజమహేంద్రవరములో న్యాపతి సుబ్బారావుగా రేనూఱు రూపాయలును, పోలవరము జమీందారుగారు వేయి రూపాయలును నూటి కెనిమిదణాల వడ్డీకి నాకు బదులిచ్చి నన్నాయాపదనుండి తొలగించిరి. వీరిలో దుగ్గిరాల సూర్య ప్రకాశరావుగారు నావద్ద వడ్డి పుచ్చుకొనలేదు. పోలవరము జమీందారుగా రసలే పుచ్చుకొనలేదు. ఈయన పాఠశాలలో నాయొద్ద చదువుకొనునప్పటినుండియు వినయ విధేయతలను, నాయెడల నాదర గౌరవములును గలవారయి యుండిరి. చమురురంగులతో చేయఁబడిన నాచిత్రపటమును వేయిరూపాయల వెలగల దంతగోళ క్రీడాఫలకమును (Billiaros table) రాజమహేంద్రపుర మందిరమునకు బహూమానము చేసిరి.

వితంతు శరణాలయమును చెన్నపురిలో స్థాపించెదమని సంఘ సంస్కరణ సమాజమువారు ప్రకటనపత్రికలను బంపినప్పుడు-

మిస్ (డాక్టరు) మేక్ఫెయిలు దొరసానిగారు .రు 50 లును, కుస్ మ్యానింగు దొరసానిగారు రు 20 లును, భాస్కరభట్ల లక్ష్మమ్మగారు రు 1 యు, కొటికలపూడి సీతమ్మగారు రు 5 లును, రాచర్ల రత్తమ్మగారు రు 4 లును, దామరాజు సుందరమ్మగారు రు 4 లును, సత్తిరాజు శేషమాణిక్యాంబగారు రు 2 లును, కందుకూరి రాజ్యలక్ష్మిగారు రు 5 లును, ఆదుర్తి రామారావుగారు రు 25 లును, యస్. యన్. సుబ్రహ్మణ్య అయ్యరుగారు రు 3 లును, శ్రీ రాజా రామచంద్ర రాజుగారు రు 15 లును, వినాయగతావరుగారు రు 25 లును, మొత్త

ముమిూద రు 159 లు నాయొద్దకుఁ బఁపిరి. ఈ సొమ్మొక్కని వశమున నుండుటకంటె సమాజమువద్ద నుండిన నెక్కువ సురక్షితమని భావించి యీమొత్తముతో నాసొమ్మ కొంతచేర్చి రు 875 లను వితంతుశర ణాలయ మూలధనముక్రింద సమాజనిధిలో నుంచుటకిచ్చితిని. కార్య దర్శి యుద్యోగాంతరము మీఁద బొంబయికి వెళ్లినప్పుడు ఆసొమ్మే మయినదని నేనాయన నడుగఁగా సమాజముయొక్క యితరకార్య ములకు కర్చయిపోయినదని యీయన సమాధానము చెప్పెను. సమా జాము నిజముగా ధనవిషయమున బీదస్థితిలోనే యుండెను. 1900 వ సంవత్స రాంభములో నింటి యద్దె క్రింద తొంబది రూపాయలు బాకి పడి యుండెను. సమాజము నిమిత్తమయి సొంత యింటి నొకదానిని కట్టించి యియ్యవలెనని యుద్దేశించి పరశువాకము గంగాధరేశ్వరుని కోవెల వీధిలో నొకస్థలము సంపాదించి 1900 వ సంవత్సరములో నొకయిల్లు కట్టించి 1902 వ సంవత్సరములో దానిపైని మేడ వేయించి యిచ్చితిని. దీనికంతకునాకు రు 1250 లు వ్యయపడినవి. సమాజమును లేఖ్యారూఢము చేయింపవలసినదనియు చేయింపఁగానే నేను దానిని సమాజముపేర వ్రాయించి యిచ్చెదననియు చెప్పుచు వచ్చితిని గాని చెన్నపురిలో నున్నకాలములో వారట్లు చేయలేదు. ఆయిల్లు సమా జముయొక్క యనుభవములోనే యుండినది. ఆయింటి నెప్పుడును కాపురము కొఱకమ్మి వేయకుండునట్లును జనోపయోగ కరములైన పనులకే యుపయోగించు చుండునట్లును, నేను చెన్నపట్టణమువెళ్లి నప్పుడు నన్నక్కడ నుండనిచ్చునట్లును, వారొప్పుకొన్న మీఁదట సంస్కరణ సమాజము వారిచేత బ్రహ్మసమాజమున కాయింటిని రు 650 లకు అమ్మించి సొమ్మిప్పించితిని. ఈక్రయధనమును మక్రయ ధనమును మహారాజా గజపతిరావుగారి ధర్మపత్ని బ్రహ్మసమాజము వారి కిచ్చెను. సంఘ సంస్కరణ సమాజమువారు నాకప్పటి కియ్య వలసియుండిన యిన్నూరు రూపాయలును నేను క్రయధనములోనుండి

తీసికొని వంటయింటిని, మరుఁగుదొడ్డిని నీటిగొట్టమును సమకూర్చుట కయి బ్రహ్మసమాజము వారికిచ్చివేసితిని.

నేను వితంతు శరణాలయమును చెన్నపట్టణములో స్థాపించి మాయింటనే జరపుచుంటిని. ఇద్దరో, ముగ్గురో నలుగురో వితంతువు లెప్పుడును మాయింట నుండుచునే వచ్చిరి. ఈశరణాలయమును రాజ దాసియైన ద్రావిడ దేశమందుంచినను, అందుచేరినవారిలో నిరువురు తప్ప తక్కిన వారందఱును తెలుఁగు దేశము నుండివచ్చినవారే యయియుండిరి. ఆయిరువురిలో నొక్కతె మాత్రమే యఱవ బాల వితంతువు; రెండవయామె తిరునల్వేల్లి నుండి తండ్రిచేత తీసికొని రాఁబడిన తెలుఁగు బాలవితంతువు, ఈకడపటి చిన్నదానిని సోమ నాథరావుగారి తమ్ముడైన గోపాలశర్మగారి కిచ్చి వివాహము చేసితిని. మొదటి చిన్నది మిక్కిలి తెలివిగలదయి పాఠశాలలో బహుమతు లను బడసి సంవత్సరకాలము నుండిన మీఁదట తండ్రివచ్చి, రానని యేడ్చుచుండగా పిల్లదానిని బలవంతముగా తీసికొనిపోయి బందువుల బాధచేత మరలఁ బంపకపోయెను. నేనక్కడనున్న కాలములో మాయింట పది వితంతు వివాహములు జరగినవి. ఈ పదిఁటిలో మూడవదియు నేనుచేసినదానిలో ముప్పదవదియునైన యొక్క వివాహముగూర్చి మాత్రమిందు ముఖ్యముగా ముచ్చటింపవలసి యున్నది.

గోదావరి మండలములో నుప్పదండవిధాయి నాతోడ సహా ధ్యాయియు నయి యుండిన కనపర్తి సంజీవరాయఁడుగారి కోడలును, కొంతకాలము సహాయ కర్తగాహిగానుండిన కొమ్మూరి వెంకటాచలము పంతులుగారి కుమారితయు నైన శ్రీమహాలక్ష్మమ్మ యను నామె కాకినాడ నుండివచ్చి రెండు సంవత్సరములు చెన్నపట్టణములో నాయొద్దనుండెను. ఆమెకప్పటి కిరువది వత్సరములు దాఁటి

యుండవచ్చును. ఆమె తాను పట్టపరీక్షయందు కృతార్థుడయి
యున్నవానిని గాని వివాహము చేసికోనని నియమము చేసికొనెను.
నాకు పరమ మిత్రులయియుండిన న్యాపతి సుబ్బారావు పంతులుగారి
తమ్ముడు గొప్ప రాజకీయోద్యోగి యయియున్నవాడు విదురుడైన
శేషగిరిరావుగారు నావద్దకువచ్చి తనకు వితంతువును వివాహమాడ
వలెనని యిచ్చ కలదనియు నాయొద్దనున్న వారిలో తగిన వారిని
తెలుప వలెననియు నన్నుకోరిరి. అప్పుడిద్దఱే నాయొద్దనుండిరి. ఆ
యిద్దఱిని గూర్చియు నాకు తెలిసినది చెప్పితిని. ఆయిరువురిలో నీమె
నాతడు వరించెను. వధూవరులొకరినొకరు చూచుకొని యొండొం
రులతో మాటాడుకొని పరస్పరానురాగము కలవారయి వివాహమున
కొప్పుకొనిరి. నేనును కార్యనిశ్చయము చేసితిని గాని వివాహమునకు
ముందీ కార్యవిషయము సుబ్బారావు పంతులుగారికి తప్పక తెలుప
వలెనని శేషగిరిరావుగారితో చెప్పితిని. ఆయన రాజమహేంద్రవ
రము పోయి యున్నగారితోఁజెప్పి తాను త్తరము వ్రాసెదనని చెప్పి,
నన్ను త్తరము వ్రాయవలదని వేఁడెను. నేనందుకు సమ్మతించి
వ్రాయక యూరకుంటిని. శేషగిరిరావుగారికి సెలవు దినములయి
పోవచ్చినవి; ఆయన బొబ్బిలిపోయిపనిలో చేరవలెను. అందుచేత
శేషగిరిరావుగారు నావద్ద సెలవు పుచ్చుకొని, వధువును దీసికొని
రావలసినదని బొబ్బిలినుండి తంత్రీవార్త్తను బంపెను. ఆతంతి సమా
చారమందగానే వధువును వెంటగొని భార్యా సహితముగా బయలు
దేరి రాజమహేంద్రవరము మీఁదుగాపోయి విజయనగరమును జేరి
తిని శేషగిరిరావుగారి భటులు నన్ను బండ్లమీఁద గజపతినగరము
నకుఁ గొనిపోయిరి. నేనాయనను చూడఁగానే మొదట వేసిన ప్రశ్న
"మీయన్నగారు చెప్పఁగానే సమ్మతించిరా" అని తానాయనతో
చెప్పలేదనియు, వివాహానంతరము వ్రాయవచ్చుననియు, చెప్పినప్పుడు
నామనసునకు కలిగిన విచారమింతంత చెప్పనలవికాదు. వివాహము

జరపకుండ పోవుట యుచితము కాదని తలఁచి 1900 వ సంవత్సరము ఫిబ్రవరినెల 26 వ తేదిని కార్యమును జరపి వధువును మగనివద్ద విడచి నేనును నాభార్యయు రాజమహేంద్రవరమునకు వచ్చితిమి. వచ్చిన దినమునసే సాయంకాలమున పురమందిరమునకుఁ బోయితిని. అక్కడ సుబ్బారావు పంతులుగారు మొదలైనమిత్రు లనేకులుండిరి. తమ్ముని వివాహ వార్తను నేనేఆయనకు మొట్టమొదట నివేదించితిని. ఆయన యిఁక నచ్చటనుండక బండినెక్కి వెంటనే యింటికి బోయిరి. మఱునాఁడు నేను సుబ్బారావుగారి యింటికిఁ బోయినప్పుడు మాయిరువురకును జరిగిన సంభాషణము మిత్రసమావేశ సమయమున జరగఁ దగినదిగా నుండలేదు. ఇట్లాకస్మికముగా నాపయిని కలిగిన కోపము కొంతకాల మాయనను నన్ను ద్వేషించునట్లు మాత్రమేకాక నేను పూనిన సంఘసంస్కరణ కార్యమును గూడ కొంత ద్వేషించునట్లు పరిణమించినది.

సుబ్బారావు పంతులుగారును నేనును కొంతకాలము పరస్పర సంభాషణములేని వారమయి యుండినను చెన్నపురిలో సర్వకలా శాలా సభ్యులసభ జరుగుచున్నప్పుడు పంతులుగారే నేను కూరుచున్న చోటికివచ్చి నన్ను పలుకరించి యాదర పూర్వకముగా నాయోగక్షేమములను విచారించిరి; నేనును సంతోష పూర్వకముగా వారి యారోగ్య సౌఖ్యములడిగి తెలిసికొంటిని. అటుతరువాత మాయిరువురి మైత్రియు క్రమక్రమముగా వృద్ధినొంది మరల పూర్వరీతికి వచ్చెను.

ఇప్పుడు పిఠాపుర సంస్థానమునందు రెండవ దివానుగానున్న కోకా సుబ్బారావునాయఁడు గారి వివాహము చెన్నపట్టణములో జరిగినవానిలో నాఁటవది. 1901 వ సంవత్సరము జనవరి నెల 31 వ

తేదిని జరగిన యీ ముప్పది మూడవ వివాహమే నాయఁడు శాఖ వారిలో మొదటిది.

చెన్నపటణములో నేనుండుట బ్రహ్మసమాజమునకు బొత్తిగా లాభకరముగా నుండకపోలేదు. విశాఖపట్టణములోని శ్రీమహారాజా వొడే గజపతిరాయనింగారు దక్షిణహిందూస్థాన బ్రహ్మసమాజము నకు రాజమోహనరాయల రాత్రిపాఠశాల మొదలయిన వాని వ్యయముల నిమిత్తము సంవత్సరమునకే నూఱురూపాయల నిచ్చు చుండెడివారు. అది యే హేతువు చేతనో కాని కొన్నసంవత్సరముల నుండి నిలిపివేసిరి. చెన్నపట్టణము నివాసముగా చేసికొని బ్రహ్మసమా జమున కధ్యక్షుఁడనయి నేను వ్రాసిన పిమ్మట మహారాజాగారా సంవత్సరమే నూఱురూపాయలు నాయొద్దకే పంపుచుండిరి. ఇది యీయన యనంతరమునఁ గూడ నవిచ్ఛిన్నముగా జరుగుటకయి తగిన స్థిరమయిన యేర్పాటు చేయవలసినదని నేను కోరిన మీఁదట శ్రీ మహారాజాగారు తమ మరణశాసనములో నీదానను శాశ్వత ముగా జరుగుటకయి యేర్పాటు చేసిరి. శ్రీ మహారాజా గజపతిరా యనింగారికి నాయందత్యంత గౌరవముండెను. నేను రాజమహేంద్ర వరములో నున్నప్పుడు క్రొత్తగా విశాఖపట్టణమున కయోమార్గము వేసినకాలములో నేనొకసారి నవరాత్రములలో కుటుంబ సహితముగా విశాఖపట్టణము వెళ్లుట తటస్థించెను. నేనప్పుడు వారిబంగళాలో వారి సత్కారమును బొందవలసిన వాఁడనైతిని. వారు నాయెడల నెంతో యాదరమును చూపి విజయదశమి నాఁడు నాకును నాభార్యకును బహుమానము చేయుటకయి మిక్కిలి విలువగల బట్టలు మొదలయిన వానిని తెప్పించిరి. నేనవి పుచ్చుకోకుండ వలెనని నిశ్చయించుకొని విజయదశమినాఁడు ప్రాతఃకాలమున వారిపద్ద సెలవు గైకొనకయే యావిరిబండి నెక్కి భార్యాసహితముగా రాజమహేంద్రవరమునకు

వచ్చితిని. నేను తమ బహుమానము స్వీకరింప నొల్లక రాజమహేం
ద్రవరము నకుఁ బోయితినని విని విచారపడి తమ యుద్యోగస్థుల
చేతి కిన్నూఱు రూపాయలిచ్చి మఱునాటి యూవిరి బండిలోనే యిద్ద
ఱని నాయొద్దకు బంపిరి. వారు బలవంత పెట్టఁగా సాధనాంతరములేక
యిన్నూరు రూపాయలను పుచ్చుకొని, పురమందిర నిర్మాణమున
కయి చేర్పఁబడిన చందా ధనముతో దీనిని జేర్చి పుస్తక భాండాగార
స్థాపనార్థమయి పురమందిరములోనున్న ప్రహర్షపఠన మందిరము
(జ్యూబిలీ రీడింగ్ రూము) వారికిచ్చివేసితిని.

నేను జీతము ముట్టని పద్ధతిమీఁద రెండు సంవత్సరములు
సెలవు పుచ్చుకొని రెండుద్దేశములతో చెన్నపట్టణమునకు వెళ్లి
యుంటినిగదా! అందు మొదటి యుద్దేశమైన పుస్తకముద్రణము రెండు
సంవత్సరములలో తీరిపోయినది. పుస్తకములన్నియు పది సంపుటము
లుగా ముద్రింపఁ బడినవి. ఇఁక రెండవది యైన సంస్కార కార్యము
నా దేహములో ప్రాణమున్నంతవఱకు నుండునదియేకొని రెండు
మూడు నాలుగు సంవత్సరములలో ముగియునదికాదు. అప్పటి విద్యా
విచారణాధికారియైన డంకనుగారు సర్వకళాశాలా సభాసమయము
లయందు కలిసికొన్నప్పు డొకసారి "నీకిక్కడ పనిలో నుండ నిష్టము
న్నదా" యని యడిగెను. నేను "మరల రాజమహేంద్రవరము పోవక
యిక్కడనేనిలిచి పనిచేయఁ దలఁచుకొన్నా" నని బదులు చెప్పితిని
ఆవిషయ మంతటితో నిలిచిపోయినది. విద్యా విచారణాధికారిగారి
స్వీయ సహాయక పదము నందుండిన శేషాద్రి ఆచారిగారు సాయం
కాల మప్పుడప్పుడు మాయింటికి వచ్చి నన్ను బండిలో విహారమునకు
తీసికొనిపోయి మరల మాయింటివద్ద విడిచి పోవుచుండెడివారు. ఇట్లు
విహారార్థము వెడలిన దినములలో నొక నాఁడాయన సభ్యుచు
'మీకిక్కడనే పనియైనద"ని పలికెను. దానిపై ని "నన్నేల పరిహా
సించెదర"ని నేనంటిని "నియోగాజ్ఞా పత్రము వచ్చిన తరువాతనైన

మీరునాతోమాట నమ్మెదరా ? " అని యాయన మరలఁ బలికెను. అప్పటికిని నేనాయన మాటలునమ్మక, మతిమాటాడక యూరకుంటిని. ఖిన్నుండఁగా నొకనాఁడు త్తరములు తెచ్చుభటుఁడు విద్యావిచారణాధికారి కార్యస్థానము నుండి వచ్చిన యొక యాచ్ఛాదన పత్రమును తెచ్చి నాచేతిలోఁ బెట్టెను. అదివిప్పిచూడఁగా నందులోనున్న రాజధానీ కలాశాలకు మార్చినట్లును కొక్కొండ వేంకటరత్నము పంతులుగారిని రాజమహేంద్రవరమునకు వేసినట్లును నియోగాజ్ఞాపత్రముండెను. ఆయుత్తరువులోనే యిష్టమున్నచెడల మిగిలియున్న సెలవును రద్దుచేసికొని వెంటనేపనిలోఁ జేరవచ్చుననియు వ్రాయఁబడియున్నది. అదిచూడఁగానే నాకాశ్చర్య సంతోషములు కలిగినవి. డంకన్‌గారు నన్నేలాగున్నైన చెన్నపట్టణము రప్పింపవలెనని నిశ్చయించుకొని కొక్కొండ వేంకటరత్నముగారి కింగ్లీషు రాదన్న మిష మీఁద నన్నక్కడకు వేసి యాయన నిక్కడకువేసిరి. నేను పనిలోఁ జేరులోపల నొక్కసారి రాజధానీ కలాశాలాధికారియైన స్టూఆర్టు గారిని చూడఁబోయితిని. ఆయన నన్ను తనగదిలో చెంతఁ గూరుచుండఁ బెట్టుకొని యత్యాదరముతో మాటాడి, భటునిచేత దేశభాషా పర్య వేక్షకులైన శేషగిరిశాస్త్రిగారిని పిలిపించి, నన్నుఁ దీసికొనిపోయి పని యొప్పగింప వలసినదని యుత్తరు విచ్చెను. నేను గదిలోనికిఁబోవునప్పటికి వేంకటరత్నముపంతులుగారక్కడ లేరు. పంతులవారు రాజమహేంద్రవరము చేరిన తరువాత మీయనుగ్రహము వలన నాకు గోదావరీ స్నాన పుణ్యఫలము లభించినదని నాకుత్తరము వ్రాసిరి. రాజధానీ శాస్త్రపాఠశాలలో నేను పరీక్షా గ్రంథములను బోధించుటయేకాక యన్ని తరగతులకును భాషాంతరీకరణము కూడా నేర్పవలసిన వాఁడనగుటచేత నాకుపని యధికమయ్యెను. మాయిల్లు పాఠశాలకు దూరములో నుండుటచేత గుఱ్ఱపు బండిని పెట్టుకోవలసిన వాఁడనైనందున నాకు మాసవ్యయము సహిత మధిక

మయ్యేను. నేను మొట్టమొదట నొకచిన్న గుఱ్ఱపు బండిని పెట్టుకొంటిని గాని తరువాత దాని నమ్మివేసి పెద్ద గుఱ్ఱమును పెద్దబండికొనియుంచితిని. ఈపెద్దగుఱ్ఱమును విక్రయించి వేయుటకయి శేషగిరిరావుగారు నాయొద్ద విడిచిపోయిరి. దానికి సుళ్లు మంచివి కాకపోవుటచేదాని కెవ్వరును కొనకుండిరి. అది నెలల కొలఁదిని నాయొద్దనుండవలసి వచ్చెను. సుళ్లు మంచివి కాకపోవుటచేత దుష్పలమేమి కలుగునో చూడవలెనన్న యభిలాషము చేతనే కొంతవరకు నీగుఱ్ఱమును గొంటిని. నేను చెన్నపట్టణము విడిచి రాజమహేంద్రవరము వచ్చువరకును గుఱ్ఱము నావద్ద నాలుగుసంవత్సరములున్నను సుళ్లేమియు నాకు కీడు చేయలేదు.

నేను చెన్నపట్టణము వెళ్లిన తరువాత హైందవ దేశీయ మహాసభ 1898 వ సంవత్సరము నందక్కడ జరిగెను. ఆసభకు నన్నగ్రాసనాధిపత్యమును వహింపవలసివదని కోరిరి. ఆసభలో శ్రీమహాదేవగోవిందరెడ్డిగారు 'దక్షిణహిందూదేశ విద్యాసాగరు' డని నాకు నూతన నామకరణముచేసిరి. నాది మొదలే పెద్దగొంతుకకాదు ఆమిూవ శ్వాసకాస రోగపీడి తుఁడనయియుండుటచేత మతింతహీన స్వరము పడినది. ఈ హీనస్వరముతోనే నాయధ్యక్షోపన్యాసమును గొంతవరకు చదివి దగ్గుచేత చదువలేక పోఁగా శేషమును నాకు మాఱుగా నామిత్రులయిన న్యాయపతి సుబ్బారావుగారు చదివిరి. తరువాత 1902 వ సంవత్సరము జూన్ 14 వ తేది కాకినాడలో జరిగిన చెన్నరాజధానీ దేశీయ సాంఘిక మహాసభకు నన్నగ్రాసనాధిపతిగాఁ జేసిరి. ఆసభలో జరగిన యుపన్యాసములను వినుటకయి వ్యావహారిక సభకు వచ్చిన వారికంటెను నెక్కువమందివచ్చి యెక్కువ యుత్సాహముతోఁ బనిచేసిరి. నేనప్పుడు చేసిన యుపన్యాసములోని భాగములను రివరెండు మర్డాకు దొరగారు తమగ్రంథములలో నుదాహరించిరి.

1903 వ సంవత్సరమునందు మెయినెలలో బెజవాడలో జరగిన కృష్ణామండల సాంఘిక సభకు నన్ను గ్రాసనాసీనునిగాఁజేసి గౌరవించిరి.

1903 వ సంవత్సరమునందు చెన్నపట్టణములో హిందూదేశా స్తిక మహాసభకును నేనగ్రాసనాధిపతిగా జేయఁబడితిని. ఆ సంవత్స రమునందు జరగిన హైందవ దేశీయ సాంఘిక మహాసభకు పూర్వము నందు కొన్ని వివాదములు సంభవించినవి. హిందూసభ చెన్నపురియం దప్పుడే తలచూపి విజృంభింప నారంభించినది. వారు ముందుగా తమలో నేర్పాటుచేసికొని వితంతూద్వాహమునకు విరోధులుగానున్నవారిపట్టిక నొకదానిని సిద్ధముచేసికొనివచ్చి యాండ ర్సను హాలులో నొక సభచేసి యాపట్టికలోని వారినందఱిని సాంఘిక మహాసభకు చెన్నపురివారి ప్రతినిధులనుగా నేర్పఱిచినట్లు నిర్ణయము చేయించిరి. నేనును వారిచ్చు పాయమునకుప్రతిక్రియనాలోచించి వితంతు వివాహపక్షమువారిపట్టిక నొకదానిని వారిపట్టికకంటెను పెద్దదానినిసిద్ధ ము చేయించి చెన్నపురి హిందూసంఘ సంస్కరణ సమాజపక్షమున ఆండర్సను హాలులోనే సభ సమకూర్పించి, యీక్రొత్త పట్టికలోని వారినందఱిని సాంఘిక మహాసభకు ప్రతినిధులుగా నేర్పఱిచినట్లు సభ వారిచే నిర్ణయము చేయించితిని. సాంఘిక మహాసభకు చెన్నరాజ ధానీ కార్యదర్శిని నేనగుటచేతను, చిరకాలమునుండి యుండియున్న హిందూ సంఘసంస్కార సమాజమునకు నేనధ్యక్షుఁడ నగుట చేతను ఏవి నిజమయిన సంస్కార సభలో ఎవరుమహాసభలో మాటాడుట కర్హులయిన ప్రతినిధులో నిర్ణయము చేసెడి యధికారము నాయందుం డినది. హిందూసమాజమువారు లబ్ధమనోరథులు కాక మహాసభకు రాక నిలిచిపోయిరి. వారిలో దివాన్ బహదూరు ఆదినారాయణ య్యరుగారు మొదలైన యేకపక్షావలంబులు కొనివారు కొందఱు మాత్రము సభకువచ్చిరి. ఆసంవత్సరపు సాంఘిక మహాసభ వెనుకటి

సభలకంటెను నధిక జయప్రదముగా జరగెను. హింమూసమాజము వారు పురమందిరములో ఆనిబెసెంటు దొరసానిగారి యాధిపత్యము క్రింద నొకమహాసభనుచేసిరి. కాని యాయొక్కసభతోనే యాసమాజ మంతరించినది.

1902 వ సంవత్సరములో గుంటూరునందు ప్రథమ వితంతూ ద్వాహము జరిగించి పోవలసినదని యక్కడి ప్రాడ్వివాకులైన విశ్వ నాధశాస్త్రిగారు నన్నుకోరిరి. వారి కోరిక నంగీరించి నేను భార్యా సహితముగా అక్టోబరు నెల 10 వ తేదికి గూంటూరు వెళ్లి విశ్వనాధ శాస్త్రిగారి లోపలనేదిగితిని. నేనక్కడికి పోగానే గుంటూరులో పెద్దసంక్షోభ మారంభమయ్యెను. 1902 వ సంవత్సరము 11 వ తేదిని గుంటూరులో ప్రథమ వితంతు వివాహము వారియింటనే నడ చినది. ఉన్నవ లక్ష్మీనారాయణగారీ వివాహములో భోజనమునకు వచ్చి యీపట్టమునఁజేరిరి. తరువాత గుంటూరులోఁ జేయఁబడిన స్త్రీ పునర్వివాహము లన్నియు శ్రీ లక్ష్మీనారాయణగారి చేతనే చేయఁబడి నవి. మఱునాఁటి రాత్రి నాగౌరవార్థముగా గుంటూరు నాటకసమా జమువారు మద్విరచితమైన శాకుంతల నాటకమును బ్రదర్శించిరి. నేనారాత్రి నాటకమును జూచి మఱునాఁడు బైలుదేరి యింకొక పునర్వివాహము చేయించుటకయి కుటుంబ సహితముగా రాజమ హేంద్రవరమునకుఁ బోయితిని. 1902 అక్టోబరు 14 వ తేదిని రాజ మహేంద్రవరములో నుద్దేశింపఁబడిన వితంతు వివాహము చేసి నాభార్యతో నేను మరల చెన్నపట్టణమునకుఁ బోయితిని.

నేను చెన్నపురిలో నున్నకాలములోనే సుమారు రు 1200 లు కర్చుపెట్టి రాజమహేంద్రవరములో స్త్రీలకు ప్రార్థన మందిరమును కట్టించితిని. నేను 1907 వ సంవత్సరమునందు నాభార్యతోఁ గలిసి వేసవి కాలములో బెంగుళూరికి పోయితిని. అప్పుడు బెంగుళూరిలోని

యరుళపేట బ్రాహ్మసమాజికులు నన్నును నాభార్యను తమ యుపాస
నాసమయమందు రావలసినదని యాహ్వానముచేయఁగా మే మక్క-
డకుఁ బోయితిమి. ఆ యింటిమిద్దె యెత్తులేనిదయి యించుమించుగా
నెత్తికి తగులుచున్నట్లుండెను. అక్కడ నుపాసనచేసిన సామాజికులు
చదువుకొన్నవారును, ధనవంతులును, కాకపోయిననుు నిక్కమయిన
భక్తిపరులుగా మాకుఁ గనఁబడిరి. వారిలో కొందఱు నన్ను చూచు
టకు చెన్నపట్టణము వచ్చినప్పుడు వారి మెడలలో పెద్దపెద్ద వెండి
లింగకాయలుండెను. వారిప్పుడా లింగములను దీసివేసి యేకేశ్వరా
రాధనపరులయి యుండిరి. వారిభక్తికి సంతోషించి నేనును నా
భార్యయు వారికొక చిన్నమందిరమును కట్టించియిచ్చిన బాగుండునని
యాలోచించితిమి. అరుళపేటలోనే 1908 వ సంవత్సరమునం దొక
యిల్లే నూఱు రూపాయల కమ్మకమునకు వచ్చినదని వారు వ్రాయఁగా
వెంటనే సొమ్మ్ము పంపి యాయిల్లు కొనునట్లు చేసితిని. ఆవ్రాఁతయిల్లు
తరువాత పడఁగొట్టించి వేయి రూపాయలకొక మందిరము ఆస్థలములో
కట్టించితిని. ఈ మందిరనిర్మాణమునకు రు 1500 లు వ్యయపడినవి.
కొన్ని సంవత్సరములనుండి యీ మందిరములోనే ప్రతివారమును
బ్రహ్మసామాజికులు తమ యుపాసనమును జరపుకొనుచున్నారు.

నా మిత్రులయిన రంగయ్యసెట్టిగారికు వితంతురక్షణార్థముగా
నెలకు పదేసి రూపాయలు 1903 వ సంవత్సరమునుండి నాకు పంపుచు
వచ్చిరి. బళ్లారిపురవాస్తవ్యులైన కోలాచలము వేంకట్రావుపంతులు
గారు నన్ను చూడవచ్చినప్పుడు బళ్లారి సభాపతి యంత్రములోనే
మూడువేలరూపాయల తమ భాగములను 1901 వ సంవత్సరములో
వితంతు సంరక్షణార్థమయి నాపేర వ్రాసియిచ్చిరి. చేసిన పదివివాహా
ములకును, వితంతువులయొక్క పోషణమునకును, విద్యాదికమునకును
చేతికివచ్చిన సొమ్మ్మకంటె నెక్కువసొమ్మే వ్యయపడినను వితంతు
శరణాలయమున కేదైన కొంతనిధి చేర్చిపెట్టవలయునన్న యుద్దేశ

ముతో పోలనరము జమీందారుగారిచ్చిన వేయి రూపాయలను ఆర్బ్ తున్నట్లు కంపెనీలో పెట్టితిని. నాచేతికి సొమ్మ్ వచ్చినప్పుడెల్లను కొంత కొంత చేర్చుచువచ్చి దానిని రెండువేల యిన్నూఱు రూపాయలవఱ కును పెంచితిని.

చెన్నపట్టణములో మాయింటనుండుచు వచ్చిన వితంతువులను విద్యాభ్యాసమునిమిత్తము మాయింటనే పాఠశాల యుంతమన్న నా కున్న రెండిండ్లలోను దేనిలోను పాఠశాలనుంచుటకు చాలినంత తావు లేదు. మాయింటికి కొంచెము దూరమున కీల్పాకములో నొక సగుగు డుతోట యమ్మకమునకురాఁగా రు 900 లకు దానిని నా భార్యపేరిట కొంటిని. దానిలో నడుమగా పాఠశాలకుఁదగిన నాలుగు గదులుగల యిల్లొకటి కట్టించి, దొడ్డిగోడకుచేర్చి వసారా దింపించి, దానిలో వంటలు చేసికొనుటకు మూఁడునాలుగు గదులువేసితిని. నేనందులో నికి నీటిగొట్టమును (Pipe) తెప్పించి, దొడ్డిలో నంటుమామిడితోట వేయించి నాలుగువేల రూపాయలు కర్చుపెట్టినను ప్రయోజనము కనఁబడలేదు. అక్కడ కాపురముండువారెవ్వరును లేకపోవుటచేత ఇల్లు పాడగునట్లు కనఁబడెను. అందుచేత మాయింటనున్న వితంతు వులలో నలువదేండ్లుదాటిన యిద్దఱి నక్కడకు కాపురమునకుఁ బంపి నేను ప్రతిదినమును పోయి చూచుచుంటిని. నాకక్కడ సాయము చేయువారు లేకపోయినను వితంతువుల నొంటిగా నక్కడ నుంచితినని తప్పులుపట్టువారు మాత్రముండిరి. నాకు చెన్నపట్టణ నివాస మెత్తి వేయవలెనన్న బుద్ధిపుట్టినది. నాకు తోడుపడెడు మిత్రులు బుచ్చెయ్య పంతులుగారు స్వర్గస్థులైరి. వితంతు శరణాలయములోనికి వచ్చెడు వారు తెలుఁగువారే కాని చేరువనున్న యఱవదేశమునుండి వచ్చు వారొక్కరును కనఁబడలేదు. వివాహములు చేసికొన్నవారు పదు గురునుగాక శరణాలయములోనుండిన వితంతువులలో నిద్దఱు ప్రాథ మిక పరీక్షలోను నొక్కరు మధ్యమపరీక్షలోను కృతార్థురాండ్రయిరి.

ఇతర దేశములో నెన్ని సౌఖ్యములున్నను ఎంత గౌరవమున్నను మన స్నెప్పుడును స్వదేశమువంకను, జన్మస్థలమువంకను బాఅుచుం డును. ఈ స్వాభావికవాంఛకూడ పయి హేతువులతోడిపాటు నన్ను స్వస్థల గమనమునకుఁ బురికొల్పఁ జొచ్చెను. నా సేవాపుస్తక లేఖన మును బట్టి 1904వ సంవత్సరము మార్చి నెలతో నాకేఁబదియ్యైదేండ్లు నిండునుగాన డాక్టరువద్ద కుత్తరముతోపోయి నేను కొలువునకు పనికి రానన్న నిర్ణయపత్రము సంపాదించితిని. ఈ యేర్పాటువలన నా కుప కార వేతనములో నాఅురూపాయలు తక్కువయి నే నిరువదినాలుగు రూపాయలతోనే తృప్తిపొందవలసిన వాఁడనైతిని. వైద్యనిర్ణయ పత్రము రాగానే యధికారులు పనినుండి నన్ను విముక్తుని జేసిరి. విద్యార్థులు నన్నెప్పుడును ప్రేమించువారగుటచేత నాలుగు తరగతుల వారును తమ నడుమ నన్నుఁ గూర్చుండబెట్టుకొని ఛాయాపటముల నెత్తించిరి. నేను పని చాలించుకొనుటకు పూర్వమే వేయి రూపాయ లను కూడఁబెట్టి యామొత్తమును పరశువాకములో నుండిన పరోప కారిణీనిధియందు నిలువయుంచుకొని యుంటిని.

రాజమహేంద్రవరమునకంటె చెన్నపట్టణములో నా కెక్కువ గౌరవమును సౌఖ్యములును నుండినవనుటకు సందేహములేదు. నేను పెద్ద గుఱ్ఱపుబండినెక్కి భార్యాసహితముగా సముద్రతీరమునకును, జనోద్యానమునకును సైన్యవాదిత్ర శ్రవణార్థమును, విహారార్థమును ప్రతి సాయంకాలమును వెడలుచుంటిని. నీటి సౌలభ్యమును వస్తు సంపాదన సౌలభ్యమును, ఇతర సౌఖ్యములును చెన్నపురిలో నధిక ముగా నుండెను. ఉపకారవేతనమును బొందినతరువాత దాదాపుగా సంవత్సరకాలము చెన్నపురిలోనే యుంటిని. ఈలోపల రాజమహేం ద్రవరమున కొక్కసారి పోయి మిత్రులతో నాలోచించి మరల చెన్న పట్టణమునకు వచ్చి చెన్నపురిలో నాకున్నవస్తువులు నమ్మివేసి 1905వ సంవత్సరములో మరల స్వస్థలమయిన రాజమహేంద్రవరము చేరితిని.

రెండవ ప్రకరణము

గ్రంథకర్తృ దశ

1870వ సంll మొదలు 1900వ సంllవఱకు

నేను పాఠశాలలో నాలవతరగతిలో చదువుకొనుచుండినప్పటి నుండియు తెలుఁగులో తెలిపిగలవాఁడనని యొక వాఁడుకయుండెను. అప్పటి మా ఆంధ్రోపాధ్యాయులైన పులిపాక గురుమూర్తిశాస్త్రులు గారికిని నాపై నట్టియభిప్రాయమే. ఆ కాలమునందు పద్యములు చేసిన వారికే కాని వచనము వ్రాసినవారికి గౌరవములేదు. అప్పటి నా మూఢభక్తి ననువరించి, నేనుచేసిన మార్కండేయశతకము, గోపాల శతకమును ఖండపద్యములతోనే చేసితిని. నాభక్తి శివకేశవులయందు సమానముగానే యుండెను. చిరకాలముక్రిందటనే యీ రెండు శతకములు నశించెను. అభాగ్యోపాఖ్యానములో వేసియుండుటచేత రెండవ శతకములోని యీ క్రింది పద్య మొక్కటిమాత్ర మిప్పుడు నిలిచియున్నది.

క. శ్రీ రమణీహృల్లోలా! కారుణ్యలతాలవాల కాంచనచేలా!
ఘోరా హవజయశీలా! శ్రీ రాజమహేంద్రవరపురీ గోపాలా!

మతింత కఠినమైన కావ్యమును రచియించుటకున్మేఖుఁడనై మా పాఠశాలలో పలుమారు పఠించుచువచ్చిన మిశ్రకావ్యమయిన భారతములోని నలచరిత్రమును శబ్దాంధ్ర చంపు కావ్యముగాఁ జేయ నుపక్రమించితిని. అచ్చ తెలుఁగు గ్రంథములను పొస్నగంటి తెలగ నార్యుఁడును, కూచిమంచి తిమ్మకవియు మాత్రమే రచియించిరి. నిర్వ చనగ్రంథము నొక్క తిక్కనసోమయాజి రచియించెను. నిరోష్ఠ్య

గ్రంథమును నిద్దఱు కవులుమాత్రమే చేసిరి. ఈ మూఁడు విధములైన ప్రయాసములను సమీకరింపఁజేసి యేక గ్రంథమునం దిముడ్చుట యెక్కువ ప్రశంసనీయమని తలఁచి, మొదటచేసిన పద్యములను తీసి వేసి శుద్ధాంధ్రనిరోష్ఠ్య నిర్వచన నైషధమను పేర గ్రంథరచన కారంభించి ముగించితిని. సర్వకలాశాలవా రంగీకరించి దీనిని పట్టపరీక్షకు పఠనీయగ్రంథముగా నిర్ణయించి యున్నారు.

ఈ గ్రంథము నారంభించినప్పుడే మిశ్రప్రబంధము నొక్కదాని నారంభించి రసిక జన మనోరంజనమను పేర చిత్రాంగదా పరిణయములో రెండాశ్వాసములు రచియించితిని. అంతవఱకు చేసినతరువాత దీని నచ్చ తెలుఁగులోనికి మార్చినచో శ్లాఘ్యతరముగా నుండునని భావించి సాధ్యమైనంతవఱకా పద్యములను తెలిఁగించియు, సాధ్యము కానిచోట్ల క్రొత్తపద్యములను రచించియు నైదాశ్వాసముల శుద్ధాంధ్రప్రబంధమును జేసితిని. కడపటి యాశ్వాసమునుదక్క మిగిలినదాని నంతను నేను సర్వకళాశాలా ప్రవేశపరీక్షకు చదువుచుండిన కాలములోనే చేసితిని. ఆ కాలమునందు నేను వసుచరిత్రము మొదలయిన శృంగార ప్రబంధముల నమిత్రముగా చదివియుండినందున పూర్వగ్రంథకర్తలు చూపిన మార్గమునే నే ననుసరించి దీనిని జేసితిని. ఇందు నా క్రొత్తకల్పనలును విశేషముగా నున్నవి. సర్వకలాశాలవారు ప్రథమ శాస్త్ర పరీక్షకుం దీనిని పఠనీయగ్రంథముగాఁ జేసిరి. శబ్దరత్నాకర నిఘంటువును జేసిన బహుజనపల్లి సీతారామాచార్యులుగారును, ఇతర పండితు లనేకులును దీనిపై సదభిప్రాయముల నిచ్చియున్నారు. ఇప్పుడు పద్యకావ్యమును రచింపవలసి యుండినయెడల నేనిట్టి శృంగార కావ్యమును రచియించి యుండను. ఇప్పుడు నా చిన్నతనపు పద్యకావ్యములలోని మృదుపదములతప్పిన కావ్యములను, పద్యములను దీసివేయుచున్నాను. ఇది యచ్చ తెలుఁగు పుస్తకమయినను మిశ్రకావ్యమువలె ధారాళముగా నడుచును.

1870 వ సంవత్సరమునందు రాజమహేంద్రవరములోని దొర తనమువారి పాఠశాలకు బారోగారు ప్రధానోపాధ్యాయులుగా నుండి గోదావరీ విద్యా ప్రబోధిని (The Godavary Educationist) యను మాసపత్రికను నడిపెడివారు. ఆ సంవత్సరమునందు నేను ప్రవేశపరీక్షకు చదువుచు బారోగారికిని మఱియొకరికిని తెలుఁగుచెప్పి నెల కిరువదియైదు రూపాయలు సంపాదించుచు, గోదావరీ విద్యా ప్రబోధినిలోని తెలుఁగు భాగమునకు వ్రాయుచుండెడివాఁడను. ఆ సంవత్సరమునందే నేను ప్రవేశపరీక్షయందు కృతార్థుఁడ నయి, పాఠ శాలయం దుపాధ్యాయ పదమునందు గుదిరియుండియు నేను పద్య ములను వ్రాయుచుండుట మానలేదు. 1872 వ సంవత్సరమునందు నేను కోరంగిలో నాంగ్లోదేశభాషా పాఠశాలకు ప్రధానోపాధ్యాయుఁ డనుగా నుండి శుద్ధాంధ్రోత్తర రామాయణమును రచియింప నారం భించి క్రొత్తగా బృందావన పురమునందు (Masulipatam) స్థాపిం పఁబడిన పురుషార్థప్రదాయినికి పద్యములను బంపుచుంటిని. నా పద్య ములను చదివి మెచ్చుకొని పలువురు నన్నభినవ తిక్కన మొదల యిన నామములతో లేనిపోని స్తోత్రముల జేయ నారంభించిరి.

ఈ కోరంగిలోనున్న కాలములో నేను సంగ్రహ వ్యాకరణ మును, పద్యరూపమున నీతిదీపికను, చేసి ముద్రించితిని. అప్పుడు బ్రౌడ్షాగారు ఉత్తర మండలముల పాఠశాలాపరీక్షకులు. ఆయన, నేను ప్రధానోపాధ్యాయుఁడనైన కొంతకాలమునకే ధవళేశ్వరము పాఠ శాలను పరీక్షించుటకు వచ్చిరి. ఆయన, ద్వితీయోపాధ్యాయుఁడు క్షేత్ర గణితము నేర్పుచున్న తరగతికి బోయి యొక ప్రతిజ్ఞనిచ్చి దానిని పలకలమీద చేసి చూపుఁడని విద్యార్థుల నడిగెను. వా రది చేయలేక తప్పిపోయిరి. నల్లబల్లమీఁద దానిని వేసి విద్యార్థులకు చూపుమని దొరగారు నన్నడిగిరి. ఆ పాఠము ద్వితీయోపాధ్యాయుఁడు

పుచ్చుకొనునదిగాన నేను చూపనని నిర్భయముగా నిరాకరించితిని. ఈ సంగతి నాయన తన స్మరణ పుస్తకములో వ్రాసికొనెను. పాఠశాలలో దొరగారొక్కరు కూరుచుండుటయు, ఉపాధ్యాయులు మొదలయినవారు నిలుచుండుటయు, ఆచారము. నేనా ప్రకారముగా చేయక యాయన సరసనే కూరుచుంటిని. నా వ రనమునుబట్టి దొరగారికి నాయందు యనిష్టము కలిగినను నా స్వతంత్ర స్వభావమునకు సంతోషించి నా వ్యాకరణమును పాఠశాలలో పెట్టుటకు కార్య నిర్వాహకుల కుత్తరవు చేసెను. ఆ పుస్తక మిప్పుడును మన దేశము నందలి పాఠశాలలోమాత్రమే కాక నైజాము రాజ్యమునందును వాడఁబడుచున్నది.

నీతి దీపిక యీకాలమున కనుకూలమయిన నీతులను గలదయి సులభమైన గీత పద్యములలో వ్రాయఁబడినది.

కూచిమంచి తిమ్మకవి తెలిఁగింపగా మిగిలిన రామాయణము లోని యుత్తరకాండమును శుద్ధాంధ్రోత్తర రామాయణమను పేర తెనిఁగించి, శుద్ధాంధ్ర భారతమను పేరున మహాభారతము నంతను నచ్చ తెనుఁగున రచియింపవలెనని యెంచి, సభాపర్వము నారం భించి దానిలోఁ గొంతభాగము నాంధ్రభాషా సంజీవనిలోఁ బ్రకటించి తిని. కాని యింతలో నా బుద్ధి మాఱి తెలుఁగులో పద్యకావ్యముల కంటె వచనకావ్యములను వ్రాయుట యెక్కువ యుపయోగకరమని నాకు తోఁచినది. ఈ యాలోచన మనస్సులో పుట్టఁగానే సగము సగము వ్రాసియున్న పద్య కావ్యములను విడిచి నీతిచంద్రిక యుత్త రార్ధమును పూరించుట కుపక్రమించి విగ్రహమును ముగించి, 1874వ సంవత్సరాంతమున ముద్రింపించి ప్రచురించితిని. చెన్నపురి క్రైస్తవ కళాశాలలో గణిత శాస్త్రోపన్యాసకుఁడును, దేశభాషా పర్యవేక్ష కుఁడునైన సమర్థి రంగయ్యశెట్టిగారు నేను కోరకయే నా పుస్తక

మును తమ కళాశాలలో పాఠపు స్తకమునుగాఁ బెట్టిరి. ఆవఱకు నా కాయనతోడి పరిచయములేదు. పు స్తకమును పాఠమునుగాఁ బెట్టించి నాకు ప్రో త్సాహము కలిగించినందుకు సంతోషించి నే నాయనకు కృతజ్ఞ తా పూర్వకమయిన వందనముల నర్పించుచు నా ప్రథమ లేఖను వ్రాసితిని. దాని కు త్తరముగా శ్రీ రంగయ్య సెట్టిగారు 1875వ సంవత్సరము ఫిబ్రవరి 8 వ తేదిన చెన్నపట్టణమునుండి నా కిట్లు వ్రాసిరి :-

నా ప్రియవర్యా!

..... ఏదో యనుగ్రహము చూపుటకుఁ గాక దాని నిజమైన యోగ్యతలమీఁదనే పు స్తకమును నేను పెట్టితిని గాన మీరు నా కుపకార ఋణముక్రింద నుండకపోవుట సత్యము..... తెలుఁగు లోని యున్నత పాండిత్యమునకు తోడుగా మీ రింగ్లీషులో మిక్కిలి మంచి జ్ఞానము కలవారయినందుకు సంతోషించుచున్నాను..... తెనుఁగులో స్వయం కల్పితమైన వచన ప్రబంధమును వ్రాయుటకు మీరు పూనుకొనలేరా?

ఎస్. రంగయ్య సెట్టి.

వావిలాల వాసుదేవశాస్త్రి గారి పు స్తకమును గూర్చి యిట్లు వ్రాసిరి :-

సీ॥ వాటంబుగా నిడ్డ తేట మాటలచేత
నొప్పు మీరెడి శైలి నొక్కచోటఁ
సంస్కృత పదములు చాలఁగ్రాలంగ నింపు
గ్రక్కు ధోరణి మఱొ కొక్కచోటఁ
గనరాని కలయిక లెండు భాషల
సూ క్తులఁ దగురీతి నొక్కచోటఁ
బొదరిల్లు విధమున మృదు లతా కీర్ణమై
యుఁ అవగు ఫక్కి వే ఱొక్కచోట

గీ. గాఁగ నాయీ పట్టుల గరము వింత
గొలుపుచును సజ్జనార్థుల కోర్కి లెల్ల
సఫలములు గాఁగఁ బొడము కోశంబు నాఁగ
వెలయు నీ నీతి చంద్రికా విగ్రహంబు.

ఈ పుస్తక రచనను జూచి సంతోషించియే చెన్నపురిలోని పండితులు నన్ను చటకు రప్పించి యాదరించి నాకొక వెండిపాత్రమును బహుమానము చేసి నా ఛాయాపటము నెత్తించి సత్కరించి పంపిరి. సర్వకళాశాలవారీ పుస్తకమును ప్రవేశపరీక్షకుఁ బఠనీయమునుగా నిర్ణయించిరి. అందుమూలమున నాకా సంవత్సరము దీనివలన వేయి రూపాయలు చేతిలోఁ బడినవి.

తెనుఁగులో నొక వచన గ్రంథమును వ్రాయుటకు మీరు పూనుకొనలేరా యని రంగయ్యసెట్టిగారు తమ ప్రథమలేఖలో వ్రాసి నప్పుడే యీ పనికి పూనుకొనవలెనని నాకుద్దేశము కలిగినది. మొట్ట మొదట గోల్డుస్మిత్తనెడి యింగ్లీషుకవి చేసిన "వైకర్ ఆఫ్ వేక్‌ఫీల్డు" అను కథను తెనిఁగింప నారంభించి రెండు మూడు ప్రకరణములు వ్రాసితిని. విదేశకథఁయు దాని భాషాంతరమును మనవారి కింపుగా నుండవని తోఁచి చేసినభాగము నా మనస్సుకే తృప్తికరముగా నుండనందున దానిని మానివేసి రాజశేఖర చరిత్రమును వ్రాయ నారంభించితిని. ఇంగ్లీషు కథకును దీనికిని విశేష సంబంధము లేదు. అది యొక యుద్దేశముతో చేయఁబడినది; ఇది వేఱొక యుద్దేశ ముతో చేయఁబడినది. మనలోఁ గల మూఢ విశ్వాసములను పో గొట్టవలెనన్న ముఖ్యోద్దేశముతో నేను దీనిని వ్రాసితిని. ఇది యించు మించుగా స్వకపోలకల్పిత మనియే చెప్పవచ్చును. దీనిని మొట్ట మొదట భాగ భాగములుగా 1878 వ సంవత్సరమునందు వివేకవర్ధ నిలోఁ బ్రచురించి తరువాత పుస్తకముగాఁ బ్రకటించి యప్పటి విద్యా

విచారణాధికారియగు కర్నల్ మెక్డొనల్డుగారి కంకితము చేసితిని. మెక్డొనల్డుగారు నాయందు మంచి యభిప్రాయము గలవారయి, ప్రెసిడెన్సీ కాలేజిలోని రెండవ పండిత పదమును నాకిచ్చెదమని వ్రాసిరి కాని నే నంగీకరింపలేదు. రాజశేఖర చరిత్రము పత్రికాధిపతులచేతను బహువిధముల పొగడఁబడెను. గాని వేయిప్రతులు గల మొదటికూర్పు మ్రగ్గిపోవుటకే బహు సంవత్సరములు పట్టినది. అందుచేత నిప్పుడు నవల లనఁబడెడు వచన ప్రబంధములను వ్రాయు ప్రయత్నమును మానివేసితిని. అయినను చదిని తెలిసికొనఁ గలిగినవాఁడీనిని మెచ్చుకొనఁ జొచ్చిరి. ఈ పుస్తక విషయమయి యింగ్లండునుండి జనరల్ మెక్డొనల్డుగారు 1881 వ సంవత్సరము డిసెంబరు నెల 23 వ తేదిని నా కిట్లు వ్రాసిరి :-

దేశీయ హైందవ సమాజముయొక్క కార్యదర్శిని యైన మానింగుకన్యక పత్రికలో "నింగ్లీషు పాఠకుఁడు హైందవ గృహ జీవన వర్ణనమును గాంచునట్టియు సందుమూలమున పత్రిక కాకర్షక లక్షణము చేర్పఁబడునట్టియు మంచి హిందూదేశ కల్పిత కథయొక్క భాషాంతరమును" వరుసక్రమమున ప్రచురించుచుండవలెనని యుద్దేశించుచున్నది. మీ రాజశేఖర చరిత్రముయొక్క భాషాంతరము తగినదిగా నుండవచ్చునని నేను మానింగు కన్యకు సూచించియున్నాను. ఈ యభిప్రాయమున కామె మిక్కిలి సంతోషించినట్లు కనఁబడుచున్నది. కాబట్టి మీ వచన ప్రబంధము పత్రికలో ప్రచురింపఁ బడుటకు మీ కిష్టమున్నదో, దాని యింగ్లీషు భాషాంతరమును పంపుటకు మీ కిష్టమున్నదో, తెలిసికొనుటకు నేను వ్రాయుచున్నాను.'

ఆర్. ఎమ్. మక్డొనెల్డు.

ఆ కాలమందు నేను వితంతు వివాహ కార్యభారములో మునిఁగియుండి రాజశేఖర చరిత్రమున కింగ్లీషు భాషాంతరము చేయించు

టకును ప్రకటనార్థమయి యింగ్లండులోని యీ పత్రికకు పంపుటకును ప్రయత్నము చేయలేదు. శ్రీకాకుళమునం దుండిన యమెరికా క్రైస్తవ మతాచార్యులైన హచ్చిన్సనుగారు నా యనుమతిపైని దీని నింగ్లీషుచేసి చెన్నపురి క్రైస్తవ కళాశాలా పత్రికయందు మొదట 1886 వ సంవత్సరమున భాగములుగా ప్రకటించి, తరువాత 1887 వ సంవత్సరమునందు 'అదృష్ట చక్రము' (Fortune's wheel) అను పేరితో పుస్తకరూపమున చిత్రపటములతో లండను నగరమందు ప్రకటించిరి. దీనికి జనరల్ మక్డానల్డుగారుపోద్ఘాతమును వ్రాసిరి. దీనిని దొమ్మ్రగూడెములోనున్న యింగ్లీషుక్రైస్తవ మతాచార్యులు కెయినుగారు కూడ విశేష భాగ మింగ్లీషునకు భాషాంతరీకించిరిగాని యింతలో మొదటి భాషాంతరము ప్రచురింపఁబడ నారంభించినందున ముగింపక విడిచిపెట్టిరి.

రాజశేఖర చరిత్రము కన్నడభాషలోనికి భాషాంతరీకరింపఁబడి బెంగుళూరులో ముద్రింపఁ బడినది.

రాజశేఖర చరిత్రమునకు ముందు 'కాపర' నెడి యింగ్లీషు కవీశ్వరుడు రచియించిన జాన్ గిల్పినను పుస్తకమును, అభాగ్యోపాఖ్యాన మనెడి చిన్న హాస్యప్రబంధమును, పద్యములతోఁ జేసితిని. ప్రబంధప్రణేతృపంథను బరిహసింపవలెనన్న యుద్దేశముతో నభాగ్యోపాఖ్యానమును చేసితిని. 1875 వ సంవత్సరము వేసవికాలములో నేను చెన్నపట్టణము వెళ్ళి యుండినప్పుడు నా మిత్రుని ప్రోత్సాహ వచనములచేతను, కొల్లా గురుసామిశెట్టిగారి సాదర పూర్వకములైన ప్రేమ వచనములచేతను నేను వేగిరపడి భారత సంగ్రహమును వ్రాసి యిచ్చెదనని వాగ్దానముచేసి, 1878 వ సంవత్సరాంతమున ముగించి చెన్నపురికిఁ బంపితిని. ముగింపక విడిచిపెట్టిన శుద్ధాంధ్రోత్తర రామాయణమును, పలువురు ప్రశంసించి యున్నారు.

నీతి చంద్రికలోని విగ్రహమును చేసినతరువాత సంధినికూడ నించుమించుగా విగ్రహ తంత్రము శైలినే చేసి దానిని మా శాస్త్ర పాఠశాలాధికారియైన మెట్కాఫుగారి కంకితము చేసితిని.

గ్రంథములను సాధారణముగా సలక్షణమైన సులభ శైలిని రచియింపవలె ననియే నా యభిప్రాయ మైనను విషయానుగుణముగా తత్తదుచిత రీతిని గ్రామ్యభాషయందు సహితము గ్రంథములను వ్రాయవచ్చు ననికూడ నా యభిప్రాయము. పూర్వ వ్యాకరణము లన్నియు బద్యకావ్య రచనకొఱకే, వచనకావ్యములు లేని కాల ములో పుట్టిన వగుటచేత నందలి లక్షణము లనేకములు వచన కావ్యాభివృద్ధికి తగవనియు నిప్పటికాలమునకుఁ దగినట్లుగా నొక నూతన వ్యాకరణమును మాచ్చుకోవలయుననియు నేననుకొని యీ కాలమునకును వచన రచనాభివృద్ధికిని తగినట్లుగా నొక నూతన వ్యాకరణమును వ్రాసి దానికి లక్ష్యముగా నొక వచనకావ్యమును జేయవలె నని పలుమాఱు దలపోసితిని. వృద్ధుఁడను, దుర్బలశరీరుఁ డను నగుటచేత నట్టి పని నా కిప్పుడు సాధ్యము కాదేమో! కాదన నేల? ఈశ్వరానుగ్రహ మున్నయెడల సాధ్యము కానువచ్చును.

సులభ వచన రచనా విషయమయి యితరుల మాటలను పాటి చేయక నా నూతన మార్గానుసారముగా సంభాషణ రూపమున బ్రాహ్మ వివాహమును వ్రాసి హాస్య సంజీవని మొదటి పత్రికలో కొంత భాగమును ప్రకటించితిని. మొదటిసంచిక ప్రకటింపఁబడిన తరువాత రెండవసంచిక వెలువడులోపల వచ్చిన చందాదారుల సంఖ్యపేరు లన్నిటిని బత్రికానుబంధముగా వేయొక కాగితముమీఁద ముద్రింప వలసినవాఁడ నైతిని. ఆ కాలమున బ్రాహ్మ వివాహమును సాధారణముగా జనులు పెద్దయ్యగారి పెండ్లిపుస్తక మని వాడుచు వచ్చిరి. ఈ గ్రంథమును నేను కేవల వినోదముకొఱకు మాత్రమే

కాక యతి బాల్య వివాహము, వృద్ధ వివాహము, కన్యాశుల్కము మొదలైన దురాచారముల వలని యసర్థకములను జూపి జనులను వానినుండి విముఖులను జేయుతలంపుతో గూడ వ్రాసితిని.

హాస్య సంజీవినిలో బ్రాహ్మ వివాహము ముగిసినతరువాత వ్యవహార ధర్మబోధిని యను పేర మఱియొక గ్రంథమును గ్రామ్య భాషలో వ్రాసి ప్రచురించితిని. బ్రాహ్మ వివాహమునందువలెనే యందలి పాత్రము లనేకములు నిజమైనవి. ఇందలి విషయము లనేకములు నిజముగా జరిగినవి. బ్రాహ్మ వివాహమువలె దీనిని గూడ జనులు విశేషముగా చదువుచు ప్లీడరు నాటకమని దీనిని పిలుచుచు వచ్చిరి. వ్యవహార ధర్మబోధిని మొట్ట మొదట వినోదార్థముగా విజయనగరము మహారాజాగారి బాలికాపాఠశాలలో బ్రదర్శింపఁ బడినప్పుడు నూఱులకొలది చూడవచ్చుటయే కాక యందులో వర్ణింపబడిన న్యాయవాదులు సహితము కొందఱు చూడవచ్చిరి.

1880 వ సంవత్సరమునందు ధార్వాడ నాటకసమాజమువారు మా పట్టణమునకు వచ్చి గొప్ప పాకవేసి దానిలో తమ నాటకముల నాడిపోయినతరువాత యా నాటకశాలలో నాడింపవలెనన్న కుతూహలముతో శ్రీ హర్ష దేవ విరచితమైన రత్నావళీనాటికను సంస్కృత మునుండి పద్య గద్యములతోను, షేక్స్పియరు మహాకవి రచితమైన 'కామడీ ఆఫ్ ఎఱ్ఱర్సు' నాటకము సింగ్లీషునుండి గద్యాత్మకముగాను, అత్యంత శీఘ్రకాలములో తెలిఁగించి యారెంటిని తన్నాటకశాలలో జయప్రదముగా ప్రదర్శింపించితిని. 1880 వ సంవత్సరమున వివేకదీపిక యను పేరితో స్త్రీ పునర్వివాహమునుగూర్చిన నాటకములో మూడంకములను, షేక్స్పియరు నాటకములో నొక్కటియైన 'మర్చెంటు ఆఫ్ వినీస్' లోని ప్రథమ ద్వితీయాంకములను వినీసు వర్తకచరిత్ర మను పేర ద్విపద కావ్యముగాను చేసి ప్రకటించితిని గాని వానిని

తరువాత ముగింపలేదు. ఈ సంవత్సరములోనే స్త్రీ పునర్వివాహ నాటకము నొకదానిని పద్యకావ్యముగాఁ జేయ నారంభించితిని గాని దానిని సహితము ముగింపలేదు.

నన్నును నా వ్రాఁతలను దూషించుటకయి వేంకటరత్నము పంతులుగారు 'హాస్యవర్ధని' యని పేరుపెట్టి యొక పత్రికను బైలు దేఱఁదీయఁగా నేనును 'హాస్య సంజీవని' యని పేరుపెట్టి మఱియొక పత్రికను బయలుదేఱఁ దీసితిని. ఇట్లు మా యిరువురకును వాగ్యుద్ధము నడచుచున్న కాలములో పంతులవారు తమ విగ్రహ తంత్రమునకు వ్రాసిన టిప్పణములో శివశంకరపాండ్యాగా రింగ్లీషున పీఠికవ్రాసి దానిలో మద్రచితమయిన విగ్రహతంత్రము పంతులువారి విగ్రహము ననుసరించి యెడమచేతి వ్రాతగా వ్రాయఁబడినట్లు నుడివిరి. దానిపైని నేను కొక్కొండ వేంకటరత్న కవి కల్పిత విగ్రహ తంత్ర విమర్శన మును 'గుణాగుణ ప్రదర్శనీ సమాజకుఁ' డను పేరితో వ్రాసి ప్రకటింప నారంభించితిని. చూచినవా రెల్లరు నేనే వ్రాసితినని దాని శైలి కచ్చెరు పడసాగిరి. పంతులవారు మొదటి యెనిమిదిపుటలను జదువఁగానే తమ యెఱుక లేకయే పాండ్యాగా రామాటలను వ్రాసిరి గాన క్షమించి విమర్శనమును మానవలసినదని నాపేర సుహృద్భావముతో వ్రాసినందున నేను కొన్ని భాగములను మాత్రమే విమర్శించి ముగించితిని.

వార్తాపత్రికలను గూడఁ గఠినమైన గ్రాంథికశైలినే వ్రాయవలె నని వాదించిన వీరే నేనొకసారి చెన్నపురి రాజకీయ పాఠశాలలోని యాంధ్రభాషాభివర్ధనీ సమాజముయొక్క సాంవత్సరికోత్సవ సమయమున నగ్రాసనాధిపత్యము వహింపఁ దటస్థించిన తఱిని తమ యుపన్యాసములో పుస్తక రచనము నా దానివలె సుగమముగా నుండవలెనని శ్లాఘించినప్పుడు నా కత్యంతాశ్చర్యము కలిగినది.

1875 వ సంవత్సరమునందు కాళిదాసుని యభిజ్ఞాన శాకుంతల నాటకమును తెనిఁగింపవలెనని తలఁచి, అన్నిప్రతులను దగ్గర నుంచుకొని చదువుచు, దేనిలోని పాఠము సమంజసముగానున్నదని నాబుద్ధికి తోఁచినదో దాని ననుసరించుచు రెండంకములు తెనిఁగించి 1876 వ సంవత్సరమునందు వివేకవర్ధనిలోఁ బ్రకటించితిని. పరవస్తు వేంకట రంగాచార్య లయ్యవారలంగారు శాకుంతలము నంతను దెనిఁగించి రనియు, అది విశాఖపట్టణములోని సకల విద్యాభివర్ధనీ పత్రికలోఁ బ్రకటింపఁ బడుచున్నదనియు విని వారిది ముగిసిన తరువాత నాది పూర్తి చేయవలెనని నా భాషాంతరమును నిలిపివేసితిని. వారును రెండంకములు మాత్రమే యందు ప్రకటించి నిలిపివేసిరి. ఇంతలో శాకుంతల నాటకము తెలుఁగులిపిలో చెన్నపురిలో ముద్రింపఁబడి నందున నే నా చెన్నపురి ప్రతి ననుసరించియే మిగత భాగమును భాషాంతరీకరించి 1883 వ సంవత్సరమునందు పుస్తకరూపమునఁ బ్రకటించితిని.

ఇది యొకసారి ప్రథమ శాస్త్రపరీక్షకుఁ బఠనీయగ్రంథముగా సహితము నిర్ణయింపఁబడెను. నాటక సమాజమువారు దీనిని బహు స్థలములయందుఁ బ్రదర్శించిరి. నేను దీనిని రచించినతరువాత దాఁదాపుగాఁ బదేండ్లకు రాయదుర్గము నరసయ్యశాస్త్రి శాకుంతలమును మరలఁ దెలిఁగించిరి. రెండు మూఁడేండ్ల తరువాత వేదము వేంకటరాయశాస్త్రిగారు వెండియుఁ దెలిఁగించిరి. తరువాత మఱి రెండేండ్లు తాళి దాసు శ్రీరామపండితులవారింకొక భాషాంతరము చేసిరి. నేను భాషాంతరీకరించిన యిరువదేండ్లకు తరువాత వడ్డాది సుబ్బారాయఁడుగారు వేరొక భాషాంతరము చేసిరి. నా భాషాంతరము గూఢపదములను ప్రౌఢాన్వయములను లేనిదయి తేట తెల్లమయి యుండును. అందుచేత నా పుస్తకము పెక్కు తడవలు ముద్రింపఁబడవలసిన దయ్యెను.

నేను తరువాత తెనిఁగించిన సంస్కృతనాటకము కాళిదాస ప్రణీతమైన మాళవికాగ్నిమిత్రము. ఇది రత్నావళివలెనే నాటిక యయి బహు విషయములయందు దానిని బోలియుండును. దీనిని 1885 వ సంవత్సరమునందు నేను ముద్రింపించి ప్రకటించితిని. 1885 వ సంవత్సరముం దారంభించి ప్రబోధచంద్రోదయ నాటకమును మరల నందుకొని చింతామణి మాసపత్రికయందుఁ గొంత కొంతగాఁ బ్రకటించి 1891 వ సంవతరమునందు పుస్తకరూపమున ముద్రింపించితిని. ఇది యద్వైత మత సిద్ధాంతమును ప్రతిపాదించుటకయి చేయఁబడిన వేదాంతనాటకము. ఇందు వివేకునకును మహామోహునకును పోరాటము జరిగి కడపట వివేకునకు జయము కలిగినట్లు వర్ణింపఁబడినది. ఇందలి పాత్రానుగుణముగా కొన్ని పద్యములు నా సామాన్య సులభశైలిని కాక కఠినశైలిని రచియింపఁ బడినవి.

అందుచేత కొంత రసూయాపరు లీ పద్యములే నావి కావనియు నంది మల్లయ్య, ఘంట సింగయ్యకవుల గ్రంథములోనుండి తీసికొనఁ బడిన వనియు ప్రవాదమువేసిరి. నేను దాని ముద్రించి ప్రకటించిన తరువాత నితరులు సత్యమునెఱిఁగి యనుగుచురాగా పూర్వ మపవాదములు వేసిన యసూయాగ్రస్తపండితులు సిగ్గుపడి మౌనముధరించి యూరకుండిరి. నేను ప్రబోధచంద్రోదయ నాటకమును ప్రచురించిన తరువాత వడ్డాది సుబ్బారాయుడుగారు తమ ప్రబోధ చంద్రోదయ నాటకమును ప్రచురించిరి.

ఈ పుస్తకమునకుఁ బూర్వమునసే యొక నాటకసమాజము వారు నన్నడుగఁగా 1885 వ సంవత్సరమునం దతి త్వరితముగా ప్రహ్లాద నాటకమును వ్రాసి ముద్రింపించితిని. తరువాతఁ జేయఁబడిన నాటకము రాగమంజరి. 'షెరిడన్' అను నింగ్లీషుకవిచే రచియింపఁ బడిన "ద్యూయన్నా" నాటక కథ ననుసరించి చేయఁబడినది. కథ

యంత మనోహరముగానున్నను సామాన్యజనులు దీనిని గ్రహించి పొందవలసినంత యానందమును బొందజాలరు.

దీనిని రచించిన 1885 వ సంవత్సరమునందే భారత విరాట పర్వములోని దక్షిణ గో గ్రహణకథను పద్య గద్యాత్మకముగా నై దంకముల నాటకముగా రచియించి ముద్రింపించినాడను. రాగమంజరి కథవలెఁ గాక యీ కథకు మనవారలవాటుపడి దీని నెక్కువ యాదర ముతోఁ చదువ్రచు వచ్చిరి.

రాజమహేంద్రవరమునందలి నాటకోజ్జీవక సమాజమువారు హరిశ్చంద్రోపాఖ్యానమును నాటకరూపముగా వ్రాసి యిండని కోరఁగా 1886 వ సంవత్సరమునందు రెండు మూడు వారములలో నాలుగంకములు రచించితిని గాని వారప్పుడు దానిని ప్రదర్శించుటకు వలనుపడనందున నిలిపితిని. కాకినాడలోని యొక నాటక సమాజము వారు దానిని తా మాడుటకయి ప్రార్థిజేసి యిండని యడుగఁగా వారము దినములలోఁ బంచమాంకమును గూడఁ జేసి యిచ్చితిని. వారు దాని నాడినప్పుడు విశాలమైన నాటకశాలయంతయు చూడ వచ్చిన జనులతోఁ గిక్కిఱిసిపోయెను. ఈ నాటకమును నేను మొదట వివేకవర్ధనిలోఁ బ్రకటించి 1889 వ సంవత్సరమునందు పుస్తక రూపమున ముద్రింపించితిని. హరిశ్చంద్రకథ సర్వజనప్రియమైనది గానఁ బత్రికాధిపతులు గాక తదితరులును గొందఱు నా పుస్తకమును ప్రశంసించుటతోఁ దృప్తినొందక, పోలికలకు దిగి నా పుస్తకమును శంకరకవి దానితోఁ బోల్చి నాదే శ్రేష్ఠమైనదని జోలిమాలిన వాద ములలో ప్రవేశించిరి. నాకవిత్వ మెట్లున్నను, శంకరకవి కవిత్వము ప్రశస్తమైనదనుటకు సందేహము లేదు. నే నా పుస్తకమునుగూడ దగ్గఱ నుంచుకొనియే సత్యహరిశ్చంద్ర నాటకమును జేసితిని.

1889 వ సంవత్సరమునందు నేను "తిర్యగ్విద్వన్మహాసభ" "మహారణ్య పురాధిపత్యము" అను రెండు పుస్తకములను జేసితిని.

వీనిలో మొదటిది నా మిత్రులైన బసవరాజు గవర్నాజుగారు మరణము నొందినప్పుడు వారి బంధువులును, పురోహితులు మొద లయినవారు పెట్టిన బాధలను చూచినప్పుడు వారి దుశ్చర్యలను వెల్లడి చేయవలెనన్న యుద్దేశముతో భారతములోని గృధ్రజంబుకో పాఖ్యానము మూలాధారముగా గొని చేయఁబడినది. ఇదియును మూషకాసుర విజయమును నొక్కటిగాఁ జేర్పఁబడి జంతు పాత్ర ములను దెలుపు చిత్రపటములతో ముద్రింపఁబడినది. ఏలూరు లక్ష్మీ నరసింహముగారు నామీఁద దెచ్చిన యభియోగములోని యా యా పాత్రములు తమ్మే తమ్మద్దేశించి వ్రాయఁబడెనని తమ సాక్ష్యములో జెప్పిరి.

రెండవదియైన మహారణ్య పురాధిపత్యమును పైదానియట్ల యాక్షేపగర్భ నాటకమే. ఇందులిపాత్రములును తిర్యగ్జంతువులే. నక్క నీలికుండలోఁబడి తన్ను రాత్రి దేవతలు స్వర్గమునకుఁ గొనిపోయి మృగరాజ్యమున కభిషిక్తుని జేసి పంపిరని బొంకి కడపట సత్యము తేటపడఁగాఁ, నొక వ్యాఘ్రముచేతఁ జంపఁబడెనన్న పంచతంత్రము లోని కథ దీనికి మూలాధారము. ఇది మొట్టమొదట వివేకవర్ధనిలో భాగ భాగములుగాఁ బ్రకటింపఁబడి తరువాత చిత్రపటములతో పుస్తకరూపమున ముద్రింపఁబడినది. ఇది తమ్మద్దేశించి వ్రాయఁ బడినదని యేలూరి లక్ష్మీనరసింహముగారు నాపైని న్యాయసభలో నభియోగములు తెచ్చిరి.

నాచేత రచియింపఁబడిన నాటకములలోఁ గడపటిది కళ్యాణ కల్పవల్లియనునది. ఇది 'షెరిడన్' అనెడి ఇంగ్లీషుకవిచేత 'దిద్రైవల్స్' అను పేరితో నత్యంత మనోహరముగా రచియింపఁబడిన యైదంకముల నాటకమునకు తెలుఁగు. ఇందలి కథ రాగమంజరి యితి వృత్తము కంటెను నధిక హృదయాకర్షకముగా నుండును. దీనిని 1894 వ సంవత్సరమునందు ముద్రింపించి ప్రకటించితిని.

నాకు స్త్రీ విద్యయందును, స్త్రీల యభివృద్ధియందును విశేషాభిమానము. స్త్రీలను ప్రస్తుత స్థితిలోనే యుంచి తాము పైకి లేచుట పురుషులకెన్నడును సాధ్యముకాదని నేను దలంచుచుండెడి వాఁడను. వారు చదువుటకు తెలుగులో మంచి పుస్తకములు లేకుండుటఁ దలపోసి యా లోపమును నా చేత నెంతవఱకు తొలఁగింపవలెనని 1883 వ సంవత్సరమునందు స్త్రీలకొఱకు 'సతీ హిత బోధిని' యను పేరితో తెలుఁగున నొక మాసపత్రికను ప్రకటించుట కారంభించితిని. ఆ సంవత్సరమునందే స్త్రీల యుపయోగార్థముగా సత్యవతీ చరిత్రమనెడి యొక చిన్న వచన ప్రబంధమును జేసితిని. స్త్రీలుమాత్రమే కాక పురుషులుసహిత మత్యాసక్తితో దానిని చదివి యానందించిన వా రనేకులు తమకుఁ బుట్టిన స్త్రీ శిశువుల కందలి కథానాయకురాలయిన సత్యవతి పేరుపెట్టిరి. ఈ పుస్తక మజవము లోనికిని, కన్నడము లోనికిని, ఇంగ్లీషులోనికిని భాషాంతరము చేయఁబడినది. ఇది యీనడుమ ప్రాఢ్వివాకులు మొదలయిన వారి పరీక్షలకుఁగూడ పఠనీయగ్రంథముగా నిర్ణయింపఁ బడినది.

1884 వ సంవత్సరమున స్త్రీల నిమిత్తమయి చంద్రమతీ చరిత్రమును జేసితిని. ఇందు హరిశ్చంద్రుని ధర్మపత్నియైన చంద్రమతి తన బాల్యావస్థయందు గురువువద్ద నేర్చుకొన్నట్లుగా మతవిషయమునను, నీతి విషయమునను ప్రాథమిక ధర్మములు తెలుపఁబడినవి. కడపటి భాగమునందు చంద్రమతియొక్కయు, హరిశ్చంద్రుని యొక్కయు కథ కొన్ని మార్పులతోఁ జెప్పఁబడినది.

1887 వ సంవత్సరమున స్త్రీలకొరకు "సత్య సంజీవిని" యను నీతిబోధకమయిన యొక పుస్తకమును జేసితిని. దీనిలోని కథను నే నేదో యింగ్లీషుపుస్తకమునుండి గ్రహించితిని. ఈ పుస్తకమునం దసత్య మాడుటవలని యనర్థములు నిదర్శన పూర్వకముగా మనస్సున

నాటుకొనునట్లు చెప్పఁబడినవి. ఈ పుస్తకమును చదివినప్పు డొక బాలిక తా నావఱకాడిన యసత్యము స్మరణకు రాఁగా పుస్తకము క్రిందఁబెట్టి యేడువఁ దొడఁగెను.

1891 వ సంవత్సరమునందు స్త్రీలవిషయమున మనవాచేసిన యన్యాయములు తేటపడునట్లుగా వ్యాజరీతిని సత్యరాజ పూర్వ దేశ యాత్రలయొక్క ప్రథమభాగమును రచించి ప్రకటించితిని. నేనింగ్లీషు 'గలివర్సు ట్రావెల్సు' చదివినప్పుడు వ్యాజరూపమున మనలోని దురాచారములను మూఢవిశ్వాసములను పరోక్షముగా బ్రదర్శించుచు నట్టి పుస్తకమును నాలుగుభాగములుగాఁ జేయవలెనని బుద్ధిపుట్టి మొదట నీ భాగమును జేసితిని. ఈ పుస్తకము ప్రకటింపఁబడినప్పుడు సత్యరాజనునతఁడు నిజముగానే యున్నాఁడని భ్రమపడి యాతనికి వ్రాయవలసిన యుత్తరముయొక్క పైవిలాసమును దెలుపవలసినవని బహుస్థలములనుండి నాకు లేఖలు వ్రాసిరి. ఈ పుస్తక మింగ్లీషు లోనికిని, కన్నడములోనికిని భాషాంతరము చేయఁబడినది. ఈ భాగమును సాధారణముగా ఆమ మళయాళమని వాడుదురు. జ్యోతిశ్శాస్త్రములోని జాతకభాగముయొక్కయు, ముహూర్త భాగముయొక్కయు నివిశ్వాసనీయతను పరోక్షముగాఁ దెలుపుటకయి పయియట్లు లంకాయాత్రయను రెండవభాగమునుగూడఁ జేసి ప్రకటించితినిగాని మూడు నాలుగు భాగములను జేయలేదు. ఈ రెండవభాగము కూడ కన్నడములోనికి భాషాంతరీకింపఁబడినది.

1897 వ సంవత్సరమునందు స్త్రీలకొఱకు శ్రీ విక్టోరియా మహారాజ్ఞిగారి చరిత్రమును బటములతోఁ బ్రకటించితిని. ఈ పుస్తకమును జేయునప్పటికి రాణిగారు సజీవులయి యుండుట చేత నామె యంత్యదశ యందు జెప్పఁబడలేదు.

1893 వ సంవత్సరమునందు నీతికథామంజరిని చిత్రపటములతో రెండు భాగములుగాఁ బ్రకటించితిని. ఈ పుస్తక మింగ్లీషులోనున్న

'యీసపుకథల' ననుసరించి చేయఁబడినది. ప్రతి కథయొక్క యంతము నందును, కథవలన నేర్చుకొనవలసిన నీతినిదెలిపెడు పద్యమొకటి చేర్చఁబడియున్నది.

1889 వ సంవత్సరమునందు స్త్రీల కర్తవ్యావశ్యకములైన శరీరారోగ్య ధర్మములను బోధించెడు "దేహారోగ్య ధర్మబోధిని" యను గ్రంథమును జేసితిని. 1896 వ సంవత్సరమునందు "పత్నీహిత సూచని" యను గ్రంథమునుజేసి ప్రకటించితిని.

1889 వ సంవత్సరమునందు 'సతీహితబోధిని' యను నామముతో తన్నామమును వహించిన స్త్రీల పత్రికలోని యుపయుక్తములయిన ముఖ్యవ్యాసములనేర్చి కూర్చి పుస్తకరూపమున ప్రకటించితిని. ఆవఱకే "స్త్రీ నీతిదీపిక" యను పేరితో నీతిబోధకమైన శతకమునొకదానిని బాలికలకై చేసితిని. అటుతరువాత "సత్యద్రౌపదీ సంవాదము' 'మాతృపూజ' 'పితృపూజ" అనువానిని స్త్రీల యుపయోగార్థము ద్విపదములుగా జేసితిని.

స్త్రీలు వినోదకరముగాఁ జదువుకొని యానందించుటకు తగియుండునని తలఁచి, షేక్స్పియరు మహాకవియొక్క నాటకముల ననుసరించి యింగ్లీషులో 'ల్యాంబ' ను నతఁడు నచనరూపమున రచియించిన కథలలో పదునాఱింటిని నేను సులభశైలిని తెలిఁగించితిని. చమత్కార రత్నావళి, సతీమణి విజయము, సుమిత్రచరిత్రము, రఘుదేవ రాజీయము, కురంగేశ్వర వృత్తక చరిత్రము, కళావతీ పరిణయము, గయ్యాళిని సాధుచేయుట, చిత్రకేతు చరిత్రము, దాన కేసరి విలాసము, వైదర్భీ విలాసము, భానుమతీకళ్యాణము, సరసజన మనోభిరామము, ధర్మకవచోపాఖ్యానము, కుమారద్వయవిలాసము, పద్మినీ ప్రభాకరము, మాలతీ మధుకరము, అనునవి యాకథలకు నేను పెట్టిన పేరులు. ఆ నాటకకథలను నేను తెలిఁగించునప్పుడు

మునుపున్న పేరులకుమాఱుగా మనదేశపు పేరులుపెట్టి, అందున్న దేశములను మన భరతఖండములోని దేశములనుగా మార్చి, కథలో మనయాచారవ్య వహారములకుఁ బ్రతీకూలముగానున్న భాగముల ననుకూలముగా నుండునట్లు చేసి, సాధ్యమైనంతవఱకు మనవారికింపుగా నుండునట్లు చేసితిని.

జనులలోగల మూఢవిశ్వాసములు పోవుటకుఁ బ్రకృతిశాస్త్ర జ్ఞాన మావశ్యకమని తలఁచి తెలుఁగులోఁ బ్రకృతిశాస్త్రములు లేకుండుట విచారించి, నేను 1878 వ సంవత్సరమునకుఁ బూర్వము నండే పదార్థ వివేచకశాస్త్రమును బ్రశ్నోత్తరరూపమున తెనిఁగించి ప్రకటించి యుంటిని. ఆ కాలమునందు రాజమహేంద్రవరమునం దుండిన కులాచార సంస్కార సమాజము (The Social Reform Association) వారి సభ నన్ను శారీకశాస్త్రమును జేయ నియమించిరి. నాకృషివిషయమయి కొంత తెలుపునుగాన 1888 వ సంవత్సరాంతమునఁ బ్రకటింపఁబడిన నా శరీరశాస్త్రముయొక్క యుపోద్ఘాతములోని కొంతభాగము నిందుదాహరింప ననుజ్ఞ వేఁడుచున్నాను.

"తెనుఁగుభాషయందుఁ బ్రకృతిశాస్త్రములు లేని లోపము విస్తారముగా నున్నందున, దానిని కొంతవఱకు నివారించుటకయి యీ శారీరశాస్త్రమును మొట్టమొదట నారంభించి యొకవిధముగా ముగింపఁగలిగినాడను. ఆంధ్రభాషయందు జ్యోతిశ్శాస్త్రమును రచించుటకయి యీవఱకే యారంభించియున్నాను. కులాచార సంస్కరణ సమాజము శారీరశాస్త్రమును దెనిఁగింపుమని నన్నుఁ గోరిరి. వారికోరిక ననుసరించి యింగ్లీషుభాషలోని శారీరశాస్త్రముల బెక్కుంటిని జదివితిని. నా మిత్రుఁడైన యొక వైద్యశాలాసహాయుని సాహాయ్యమున మేకయొక్కహృదయము శ్వాసాశయము మొద లయిన యవయవములను వానియందలి భాగములను నతఁడు ఛేదించి

చూపఁగా నావఱకు దుర్లభగాహములుగా నుండిన యంశము లనేక ములు గ్రహించితిని, హిందూశారీరశాస్త్రమును గూడ చదువ నుద్దే శించి ముద్రితగ్రంథము లేవియు దొరకక విశేష ధనము వ్యయము చేసి తాళపత్ర లిఖితగ్రంథములను సంపాదింపవలసిన వాఁడనయితిని; కలకత్తానుండి నాగరాక్షరములతో ముద్రింపఁబడిన శుశ్రుతాది గ్రంథములనుగూడఁ గొన్నిటిని దెప్పించితిని. వ్యయప్రయాసములకు లోనయి సంస్కృతగ్రంథములను తెప్పించి చదివినను, కొన్ని పారి భాషికపదములను గ్రహించటలోఁ దప్ప నాకు వానివలన విశేష ప్రయోజనము కలుగలేదు.

కొంత ధనవ్యయముచేసి సంపూర్ణమయిన మనుష్యకంకాళము నొకదానిని సంపాదించితిని. మేఁకలయొక్క హృదయ శ్వాసాశయ ములకంటె మనుష్యులయొక్క హృదయశ్వాసకోశాదులను బరీక్షించి చూచుట యెక్కువ యుపయోగకరమని భావించి శవపరీక్ష నిమిత్త మయి క్రొత్తశవము వచ్చినప్పుడు నాకు వర్తమానముచేసి నా యెదుట కోసి చూపించునట్లు వైద్యశాలాధికారులతో నేర్పాటు చేసితిని. వారొకసారి నన్ను పిలిపించి శవమును నాయెదుట కోయ నారంభింపఁగా నేను చూడలేక కన్నులుదిరిగి లోపలినుండి వికారము వచ్చి మూర్ఛపోయితిని. నే నటుతరువాత మనుష్యహృదయాదిశోధన మునకయి మరలఁ బ్రయత్నింపలేదు. ఈ పుస్తకమునకయి కావలసిన చిత్రరూపములను విశేష ధనవ్యయముచేసి యిరువది రూపాయి లను కలకత్తాలో కట్టమీఁదఁ జెక్కించి తెప్పించి యుపయోగించితిని. పుస్తక మును విద్యార్థులును వైద్యులును మహాజనులును గూడఁ దెప్పించు కొని చదువుచున్నారు.

1895 వ సంవత్సరమునందు జ్యోతిశ్శాస్త్ర సంగ్రహమును బటములతోఁ బ్రకటించితిని. గ్రహణములు మొదలైనవి కలుగుటకుఁ

గల నిజమైన కారణములను దెలిసికొన్న పక్షమున, మూఢాచారము లును నశించి సుజ్ఞానము కలుగుననుటకు సందేహము లేదు. మన పూర్వులు చిరకాలము క్రిందటనే దీని విషయమయి కృషిచేసి బహు సత్యములను దెలిసికొనియుండిరి. ఈ భూపాంతరమునకు నేను వ్రాసిన యుపోద్ఘాతములోనుండి కొన్నివాక్యము లిందుదాహరించుచున్నాను.

"రాశి చక్రమును మన పూర్వులు మొదట యవనుల (గ్రీకుల) నుండి గ్రహించిరి. ఈనడిమికాలములో నొక్క భాస్కరాచార్యుడు దక్క చక్కని సిద్ధాంతగ్రంథములను రచియించిన వారెవ్వరును గాన రారు. యూరపుఖండములో 1543 వ సంవత్సరమునందుఁ బరలోక గతుఁడయిన 'కోపర్నికస్స'ను జర్మను పండితుఁడు సంయుక్తికముగా స్థాపించువఱకును భూభ్రమణసిద్ధాంతము వ్యాపించలేదు. ఈ భరత ఖండములోఁ గ్రీస్తుశకమున నైదవశతాబ్దములో నుండిన యార్య భట్టాచార్యులవారు వరాహమిహిరునకుఁ బూర్వమునందే భూభ్రమణ సిద్ధాంతమును బోధించిరి. మన పూర్వులకు గ్రహముల గతులు తెలి యును. ఆకాలమునందు సహితము నళికాది యంత్రములేమో కొన్ని యున్నను గ్రహవేధకయి యిప్పుడున్న దూరదర్శికయంత్రాదులప్పుడు లేనందున నిప్పుడు తెలిసికొన్న యనేకాంశములు వారికప్పుడు తెలి యుట యసాధ్యమయ్యెను."

ఈ గ్రంథమును రచించుటకయి నే నింగ్లీషుభాషలోనున్న కొన్ని జ్యోతిష గ్రంథములను చదువుటయేకాక సంస్కృతభాషలో నున్న సూర్యసిద్ధాంతము, సిద్ధాంతశిరోమణి, పంచసిద్ధాంతిక మొద లయిన సిద్ధాంతగ్రంథములను సహితము చదివితిని. మనలోని తెలిసిన వారిసాయమువలన రాత్రుల గ్రహములు నక్షత్రములు మొదలయిన వానిని జూచి వానిస్థానములను రూపములను గ్రహించితిని. నేను చెన్నపురికిఁ బోయియుండినప్పు డచ్చటి నక్షత్రశాలాధికారుల సాహా

వ్యాము వలన పగలు, శనిగ్రహాదులను శనిగ్రహాముయొక్క యుంగ రములను దూరదర్శక యంత్రములతో నచ్చట యుద్యోగస్థులు చూపగా జూచితిని.

ప్రకృతిశాస్త్రములలో నేను రచించిన మూడవది జంతు స్వభావ చరిత్రము. దీనియుంబలి ప్రథమభాగమును 1896-వ సంవత్స రమునందు దాదాపుగా నఱువది జంతుపటములతో బ్రకటించితిని. జంతువు లన్నిటిలోను జరాయుజములనఁగా మూవిలోనుండి పుట్టిన జంతువులు శ్రేష్ఠములయినవి. మనుష్యుఁడును జరాయువునుండి పుట్టినవాఁడే. ఈ జంతువులు పిల్లలకు పాలిచ్చి పెంచును. మూవినుండి పుట్టిన పిల్లలకు స్తన్యమిచ్చెడి యీజాతి జంతువులను గూర్చియే యీ ప్రథమభాగమునందు వ్రాసియున్నాను. పుస్తకము చదువువారికి మనోహరముగా నుండుటకయి జంతువుల స్వభావాది వర్ణనము చేయుటయేకాక యక్కడక్కడ వానినిగూర్చిన కథలను మనుష్యులకు వానిని గూర్చిగల యభిప్రాయములనుగూడ చేర్చియున్నాను.

ప్రకృతిశాస్త్ర విషయకములైన గ్రంథములలోఁ బదార్థ విజ్ఞాన శాస్త్రమును, భౌతిక భూగోళశాస్త్రమును, నేను గొంతవఱకుఁ జేసితిని, గాని వానిని బూర్తిచేయలేదు. సంగ్రహవ్యాకరణము, కావ్య సంగ్రహము, అలంకార సంగ్రహము, ఆంధ్రతర్క సంగ్రహము, అనెడు నేను రచించిన గ్రంథములు శాస్త్రసంబంధములైనవేకాని ప్రకృతిశాస్త్రములతో సంబంధించినవికావు.

నేనుచేసిన గ్రంథములలోనెల్ల నాంధ్రకవుల చరిత్రము ప్రధానమైనదని జెప్పవచ్చును. దీనియొక్క ప్రథమభాగమును నేను 1887వ సంవత్సరమునందు బ్రకటించితిని. ఈ ప్రథమభాగము పూర్వకవులను గూర్చినది. హూణశకము 1450వ సంవత్సరము వఱకును గల కవులు

పూర్వకవులనియు, 1450 వ సంవత్సరమునకుఁ దరువాతను 1650 వ సంవత్సరమునకుఁ దరువాతనున్న వారాధునిక కవులనియు, నేను సంకేత మేర్పఱచుకొంటిని. పూర్వకాలమునుండియు మన దేశములోఁ జరిత్రములను వ్రాయుట యెంతో కష్టసాధ్యమయ్యెను.

దీని విషయమై దొరతనమువారిచేఁ బ్రకటింపఁబడిన న్యాయస్థానవారి దక్షిణహిందూదేశ శాసన పుస్తకములను మాత్రమేకాక చెన్నపురియందును నితర రాజధానులయందును మైసూరునందును ప్రకటింపఁబడుచు వచ్చిన తామ్రశిలాశాసనాదులను గల పత్రికలను పుస్తకములను చరిత్రములను దెప్పించి నేను చదివితిని. చెన్నపురి చిత్రవస్తు ప్రదర్శనశాలలోనున్న తామ్రశాసనములను జదివితిని. ముద్రితములుకాని తాళపత్ర పుస్తకములను విస్తారముగా సంపాదించితిని. తంజావూరి మండల న్యాయాధిపతిగానుండిన హామ్మెట్టు గారి సాహాయ్యమున నక్కడనున్న తెలుగుపుస్తకముల పట్టికను సంపాదించి నేను స్వయముగా నక్కడకుఁబోయి నాకు కావలసిన భాగములను వ్రాసికొనివచ్చితిని. పెక్కు పుస్తకములకుఁ బ్రతులను వ్రాయించి తెప్పించితిని. వేసవికాలము సెలవులలో చెన్నపట్టణమున ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునకు ప్రతిదినమునుపోయి తాళపత్ర లిఖితపుస్తకములను జదివి వానిలోనుండి కావలసినభాగములను వ్రాసికొనుచుంటిని. ఈ ప్రకారముగా విశేష శ్రమపడి నేను కవుల చరిత్రమును వ్రాసి ముగించితిని.

కవిచరిత్రములను వ్రాయుటకియి తెలుఁగులో గ్రంథశతములను జదువుచు కొంద ఆధునికుల గ్రంథములను జదివినప్పు డిటువంటి గ్రంథము లేల వ్రాయఁబడెనాయని మనస్సులో చింతయు గోపమును గలిగి వాని విషయమునఁ గొంత కఠినముగ వ్రాయవలసినవాఁడ

నైజిని. నా యభిప్రాయములను జనుల హృదయములలో నాటు నట్లుగా తేటపఱచుటకయి నేనా కాలమునందు 'సరస్వతీ నారద విలాప' మను పేర నొక చిన్న పద్యపుస్తకమును జేసితిని. అందలి పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను :—

సీ॥ దయమాలి తుదముట్టఁ దలకట్లు నిగిడించి,
ధీరుఁడై నన్ను బాధించు నొకఁడు;
పాదంబులోపలఁ బాదంబు లిమిడించి,
నీరుఁడై నన్ను నొప్పించు నొకఁడు;
ప్రాసంబుపైఁ బెక్కు ప్రాసంబు లడరించి,
పోటుబంటయి నన్నుఁ బొడుచునొకఁడు;
బెండుపల్కులు గూర్చి నిండించి నగలంచు,
దిట్టయై చెవులు వేధించునొకఁడు;
ఖడ్గచక్రాది రూపముల్గానిపించి,
వర్ణముల్ మార్చిననుఁ జిక్కుపఱుచునొకఁడు;
కుమతు లొడలెల్ల విఱిచి ప్రాణములుతీయ,
నొడలి పసలేక శుష్కించియున్నదాన్;

క॥ సుందర బహురస పుష్టిన
మందానందంబు బుధుల మదికిడ దేనిన్
ఛందోబద్ధంబగుసగిది
బృందాటోపంబు తాఁగవిత్వంబగునే ?

క। రసములుకావే ప్రాణము
లసమాన కవిత్వకాంత కవనీస్థలిలో
రసహీనమైన కవితకుఁ
బొసగించు నలంకృతి శవమున కిమ్ము తొడవౌ.

క॥ విను ఛందోబద్ధంబను
ఘనకారణమున నె బ్రాయకుఁ గననగు నేఁ డీన్
తనువది వదలి వెసంజ
క్క ని మృతినొందుటయె లెస్స కవితాసతికిన్.

క॥ కవితాసతి జీవకళన్
శ్రవణోత్సవ భాషణంబు సలిపెడునట్లుం
డవలెంగాక యొకప్పుడు
శవమువలె నిద్రితవలెఁ జనదుండంగన్.

హాస్య సంజీవనియొక్క మొదటి రెండవ మూఁడవ భాగములు వివేకవర్ధనియొక్క ప్రథమ ద్వితీయ తృతీయ భాగములు, ఉపన్యాస మంజరి, అనునవి నేను హాస్యరసప్రధానములుగాను వివిధ విషయ వివరణములుగాను నీతి మతధర్మబోధకములుగాను వ్రాసిన వ్యాసము లెత్తి ప్రత్యేకముగా ముద్రింపఁబడిన పుస్తకములు. అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము, విచిత్ర వివాహ ప్రహసనము, మహాబధిర ప్రహసనము, పునస్మరణ ప్రహసనము, బలాత్కార గాన వినోద ప్రహసనము, కలహప్రియ ప్రహసనము, మహామహోపాధ్యాయ ప్రహసనము, యోగనిద్రాప్రహసనము, మహావంచక ప్రహసనము, అసహాయశూర ప్రహసనము, అను పదియు నింగ్లీషుభాషలోనున్న ప్రహసనముల ననుసరించి పేరులను కొంత కథను తెనుఁగువారి కనుకూలముగా నుండులాగున నేను మార్చివేసిన ప్రహసనములు. కలి పురుష శనైశ్చర విలాసము, వేశ్యాప్రియ ప్రహసనము, కౌతుక వర్ధని, వినోదతరంగిణి, నా స్వకపోల కల్పితములైన ప్రహసనములు.

జన్మాంతరము, అతిబాల్యవివాహము, విగ్రహారాధనము, ఈశ్వరదత్త పుస్తకములు, ఈశ్వరోపాసనము, ప్రార్థన, మానుష ధర్మము, విద్యాధికుల ధర్మములు, మనుష్యజీవితముయొక్క పర

యూర్ధము బానిని పొందుమార్గము, వైరాగ్యము, విద్యాధురీణుల యుర్వాక్కృత్యములు, వర్ణము, హిందూమతములు, స్వాయుంకృషి, సకాయుకష్టకర్మలు, వేశ్యాకాంతల యుపన్యాసము, ఐకమత్యము, దాసములు, స్త్రీ పునర్వివాహ చరిత్రము, స్త్రీ పునర్వివాహ విషయకోపన్యాసము, స్త్రీ పునర్వివాహ విషయక ప్రథమ విజ్ఞాపనము, స్త్రీపునర్వివాహ ద్వితీయ విజ్ఞాపనము, స్త్రీ పునర్వివాహ శాస్త్ర సంగ్రహము, స్త్రీ పునర్వివాహ వ్యాపారముయొక్క భూత వర్తమాన స్థితులు, దేశీయ మహాసభయు దాని యుద్దేశములును, శంకరాచార్యులు, బసవరాజు గవ్వరాజుగారి జీవితచరిత్రము- ఇవి యప్పుడప్పుడు నేను సభలో ప్రాసికొనివచ్చి చదివిన యుపన్యాసములు. ఆరంభదశలో నా మిత్రులు నేను చక్కగా ప్రాయగలనుగాని మాటాడలేనని భావించుచుండిరి. నేను గంటలకొలది తడవుకొనకుండ నుపన్యాసములు చేయగలిగినను, నా వ్యాగ్రూపమునైన యుపన్యాసము లెప్పుడును నా లిఖితోపన్యాసములంత శక్తిమంతములుగా నుండకపోవ్రట సత్యమే. అయినను నేను చెప్పెడునది యుక్తియుక్తముగాను హృదయాంతరాళమునుండి వచ్చిన యవ్యాజమయినదిగాను వినువారికి తోచుచుండెను.

1894-95 వ సంవత్సరములో నేను స్వదేశసంస్థాన చరిత్రాదులను పుస్తకరూపమున చిత్రపటములతో ప్రకటించితిని. దీనియందు అల్లాఉద్దీన్ చిత్తూరుకోటను ముట్టడించునప్పుడు పద్మిని విషయమున నడచిన యద్భుత పరాక్రమచర్యలు మొదలయినవి వర్ణింపబడినవి.

1894-వ సంవత్సరమున నెండకాలపు సెలవులలో నేను చెన్న పట్టణము వెళ్లినప్పుడు తెలుగున జీసస్ చరిత్రమును ప్రాయనారంభించి యాఱుప్రకరణములు చేసితిని. అది అప్పటినుండియు ముగియక యట్టే యుండగా ఈ 1913 వ సంవత్సరము ఏప్రిల్ నెలలో చల్ల

దనమునకయి బెంగుళూరు పోయియుండి యచ్చట మిగిలియున్న రెండు ప్రకరణములను వ్రాసి పుస్తకము నేదోవిధముగా ముగింపఁ గలిగితిని. పుస్తకమంతయు దాదాపుగా నూటయిరువదిపుటలుండును. దీనియందుఁ గొన్ని చిత్రపటములును గలవు.

ఉత్తమస్త్రీ చరిత్రములలోని మొదటిభాగమును క్రొత్తగాఁ బ్రకటించితిని. ఇది చిత్రపటములతోనున్న యెనుబదిపుటల గ్రంథము. ఈపుస్తకమునందు గ్రేస్ డారిలింగుకన్య, ఆర్లీయన్సుకన్య యనబడు జోన్ ఆఫ్ ఆర్క్, ఎలిజెబెత్ ప్రైదొరసాని, లేడీజేడ్ గ్రే, మేరీ కార్పెంటరు, అను నింగ్లీషుకాంతలయొక్క చరిత్రములును, ఉత్తమ మాతయను నుపన్యాసమును ఉన్నవి.

రాజా రామమోహనరాయల చరిత్రమును బహు సంవత్సరముల క్రిందట నారంభించి కొంతవఱకు వ్రాసి విడిచిపెట్టితిని.

సత్యవాదినిలోఁ బ్రకటించిన కొన్ని యుపన్యాసములను, అద్వైతమతసంగ్రహమును, విశిష్టాద్వైత మతసంగ్రహమును, ద్వైత మతసంగ్రహమును, జేర్చికూర్చి సత్యవాదిని యనుపేరితో 64 పుటల గ్రంథమును నూతనముగాఁ బ్రకటించితిని.

1892 వ సంవత్సరమునం దింగ్లీషులో గోల్డుస్మిత్తను కవీశ్వరుఁడు రచించిన "మార్గస్థుఁడు" అను పద్యకావ్యమును పథికవిలాసమను నామముతోఁ బద్యరూపమునఁ దెనిఁగించితిని. భాషాంతరము సుగమముగాను మనోహరముగానున్నదని ప్రకటింపఁబడిన కాలమునందు మహామహోపాధ్యాయ కొకొండ వేంకటరత్నము పంతుల వారు మొదలయినవారు శ్లాఘించిరి గాని దానినిగొని చదువు మహాజనుల సంఖ్యనుబట్టి మనవా రంతగా నాదరించిరని నేను భావింపను.

1883 వ సంవత్సరమున నప్పటి రాజప్రతినిధియగు రిప్పన్ ప్రభువుగారు చెన్నపురికి వచ్చినప్పుడు బాలికలు చదువుటకును పాము

టకును కొన్ని పద్యములను పాటలను జేయుఁడని మిత్రులు కోరగా వానిని ప్రాసి సత్ప్రీహితబోధినిలోఁ బ్రచురించితిని.

1885 వ సంవత్సరమునందు నేను చెన్నపురికిఁ బోయియుండి నప్పుడు నా మిత్రులైన మన్నవ బుచ్చయ్యపంతులుగారి కోరికపయిన బ్రహ్మోపాసనామందిర ప్రతిష్టాపన సమయమునందీ క్రింద పద్యములను జేసితిని :—

ఉ॥ బ్రహ్మమునే భజించుచునువచ్చుట దక్షిణహిందూదేశపు బ్రహ్మసమాజమంచు నవనామము దీనికిఁ బెట్టి యిచ్చటన్
బ్రహ్మమతంబు శ్రీధరులు వ్యాపన మించుకచేసి యింతలో
బ్రహ్మపదంబుజేరె దరువాత సమాజముచెండె క్ష్మీణతన్

చ॥ తగిన సహాయమునంగనక తద్దయు క్ష్మీణతి నొందుచుండగా
మగుడని భక్తితోఁగడఁగి మన్నవ బుచ్చయపంతు లెంతయున్
దగుపనిచేసి తానొకవిధంబున నిల్పె సమాజమియ్యెడన్
దెగువను దేశములిరిగితెచ్చి ధనంబును సుస్థిరంబుగన్

చ॥ నిలిపెను బ్రహ్మమందిరము నిత్యుని కర్మలు నీశుఁగొల్వగా
సలిపెనుసాయ మీపనికిఁ జాలగఁ దా శివనాథశాస్త్రియున్
వెలయునుగాక చెన్నపురిపేరను జెన్నగు నీపురంబునన్
సలిలతభక్తి నెక్కుడగు సామినిగొల్చెడు పుణ్యమీపయిన్

1887 వ సంవత్సరమున శ్రీ విక్టోరియా మహారాజ్ఞిగారి పంచాశద్వత్సర పరిపాలన మహోత్సవ సమయమున మిత్రవాంఛానుసారముగా "శ్రీ విక్టోరియా జ్యూబిలీ నవరత్నము" లను పేరిట పద్యములను రచించి ప్రకటించితిని.

1893 వ సంవత్సరమునం దెవ్వరో కులాచార సంస్కారపరాయణులయందు లేనిదోషముల నారోపించుచు నైదుపద ముల నొక

పత్రికయందు ప్రచురించిరి. వానిని చదువగానే నాకుఁ గొంత చిత్తో
ద్రేకము కలుగఁగా వెంటనే వానికిఁ బ్రతిగా పద్యములనుజేసి సత్య
వర్ధనిలోఁ బ్రచురించితిని :—

సీ॥ పరులసొమ్ములు హరింపఁ బన్నినకర్మలు
వెలయవంచను విలపించు నొకఁడు;
జనుల మూఢులఁజేయ నొనరించు కృషియెల్లఁ
జెడిపోయడు నటంచు నడలునొకఁడు;
వలదు విద్యయటంచుఁ బశువుఁ జేయఁగ నెంచి
వనిత చదువునంచు వగచునొకఁడు;
తలగొతిగించి వెతలబెట్టఁగ తలంచు
నింతి సుఖించునం చేడ్చునొకఁడు;
పసితనంబునఁ బెండ్లి పొసఁగకున్నఁ
గూఁతు నెట్లమ్మికొనునంచుఁ గుందునొకఁడు;
వీరు పూర్వనాగరికులా పెద్దలిపుడు
దుష్కులాచార రక్షణోద్యోగు లకట !

సీ॥ నీరజాక్షి చదువునేర్చుచో నరమాంస
విక్రయం బెట్లంచు వెఱచునొకఁడు;
మానవతి విదుషియైనచో వెట్టినో
ములు పట్టుబెట్టంచుఁ బొక్కునొకఁడు;
కమలాక్షి సద్విద్య కఱచుచో ననుదేవు
నిగనెంచు బెట్టంచు బొగులునొకఁడు;
పికవాణిపాండితి బెరయుచో డెబ్బలు
పడుట యెట్లంచును బనువునొకఁడు;

హంసయాన విద్యావతి యయ్యెనేని
బ్రతిమలను గొల్చుబెట్లంచుఁ బదరునొకఁడు;

వీరు పూర్వనాగరికులా పెద్దలిపుడు
దుష్కులాచార రక్షిణోద్యోగు లకట !

కర్నల్ మక్డొనాల్డు దొరగారు విద్యావిచారణాధికారిగా నున్న కాలములో దొరతనమువారి రెండవ పాఠపుస్తకమును, మాక్సుడన్ గారి కోరికమీఁద మాక్మిల్లన్ కంపెనీవారికి నాలవ వాచకపుస్తక మును, అయిదవ వాచకపుస్తకమును, ఆఱవ వాచకపుస్తకమును, నేను వ్రాసియిచ్చితిని. ఈ వాచకపుస్తకములలో నొకదానిని వారు ముద్రింపించుచున్నప్పుడు ముద్రాశాలవారి యజాగ్రత్తవలనఁ గొంత భాగము పోయెను. అప్పుడు వారు నావద్దనున్న చిత్తుప్రతినిబట్టి పోయిన భాగమును వ్రాసియియ్యవలసినదని యడిగిరి. చిత్తువ్రాయుట నా కభ్యాసము లేదనియు, సొమ్మిచ్చినమెడల పురల వ్రాసియిచ్చెద ననియు, బదులు చెప్పవలసిన వాఁడనైతిని. వా రా ప్రకారముగా మరల సొమ్మిచ్చి పోయినభాగమును క్రొత్తగా వ్రాయించుకొనిరి.

తెలుఁగుభాషను వృద్ధిచేయవలెనన్న యభిలాషము నాకు మొదటినుండియు విశేషముగానుండెను. నేనొక్క పనితోఁ దృప్తి నొందక యేకకాలమునందెన్ని పనులను పైనివేసుకొని నిర్వహింపఁ జూచుచుండెడివాఁడనో మీకు విశదమయియుండును. దీనికితోడు నే నెప్పుడును దృఢగాత్రుఁడనుగాక ప్రకృతిచేత రోగశీలమైన దుర్బల శరీరము గలవాఁడను. అయినను తెలుఁగులో మొట్టమొదటి వచనప్రబంధ మును నేనేచేసితిని; మొదటినాటకమును నేనే తెనిఁగించితిని; మొదటి ప్రకృతిశాస్త్రమును నేనే రచించితిని; మొదటి ప్రహసనమును నేనే వ్రాసితిని; మొదటి చరిత్రమును నేనే విరచించితిని; స్త్రీలకై మొదటి వచనపుస్తకమును నేనే కావించితిని; అయినను ప్రథమప్రయత్నము లెప్పుడును ప్రథమ ప్రయత్నములే.

శబ్దరత్నాకర నిఘంటు కర్తలైన బహుజనపల్లి సీతారామా చార్యులవారు తమ నిఘంటువుయొక్క యవతారికలో కొన్ని పూర్వ

పుస్తకముల పేరులు వినఁబడుటయేకాని పుస్తకము లెక్కడను గాన రావని వ్రాసిన పుస్తకములలోఁ బదింటికంటె హెచ్చుగా నేను సంపాదించి సంశోధించి ముద్రింపించి ప్రకటించితిని. అముద్రితములయి యున్నవానిని సంస్కరించి నేను ముద్రింపించి ప్రకటించిన పుస్తకము లిరువదికంటె నెక్కువగా నున్నవి. నేను తాళపత్ర పుస్తకములను విస్తారముగా సంపాదించి కట్టలుగా నుంచితిని. నేను రాజమహేంద్ర వరములోనుండిన కాలములోనే వానిలో బహుపుస్తకములు నశిం చెను. మిగిలినవానిని నాతో చెన్నపట్టణమునకుఁ గొనిపోగా నక్కడ సహితము పురుగుపట్టి యధికసంఖ్యాగల పుస్తకములు చెడిపోయెను. వానిని కాపాడుట కష్టముగా కనఁబడినందున మిగిలిన పుస్తకముల నొక మిత్రుని కిచ్చివేసితిని.

మూఁడవ ప్రకరణము

విశ్రాంతిదశ

క్రీస్తుశకము 1900 సం॥ మొదలుకొని 1910 సం॥ వఱకు

ఈకాలమును నేను విశ్రాంతియని పిలుచుచున్నను తన యుపార కరుణచేత పరమేశ్వరుఁడు నన్నెల్లప్పుడును కష్టజీవిగా నుంచునట్లే తోఁచుచున్నది.

1881 వ సంవత్సరమునందు ప్రథమ వితంతు వివాహమును జేసికొన్నప్పుడు తనకు ప్రథమభార్యవలనఁ గలిగిన నాలుగుమాసముల పురుష శిశువును పెంచుటకయి మావద్ద విడిచిన శ్రీరాములుగారా శిశువున కావఱకే నా పేరునుపెట్టిరి. ఆశిశువును నేనును నా భార్యయు పుత్రప్రేమతోఁ బెంచి విద్యాబుద్ధులు చెప్పించుటచేత నతఁడు పట్ట పరీక్షయందుఁ గృతార్థుడయ్యెను. —'అపుత్రస్య గతిర్నాస్తి' యన్న నమ్మకము నాకు మొదటినుండియు లేదు. అందుచేత నేను పెంచుకో వలెనని యెప్పుడును దలఁచుకొనలేదు. నాకుగల యల్పమైన సొత్తును ధర్మకార్యమునకు వినియోగింపవలెనని నేను నిశ్చయించుకొంటిని— మైసూరు నివాసులైన చెఱుకుమిల్లి వేంకటరత్నముగారు నా యొద్దకు వచ్చి, తమ కొమారితను వీరేశలింగమునకిచ్చి వివాహముచేయ తనకిష్టమున్నదని, వరుని దనవెంట గొనిపోయెను. వీరేశలింగము బెంగుళూరులో ప్రాయశ్చిత్తము చేయించికొని వేంకటరత్నముగారి కొమారితను వివాహమాడెను.

1902వ సంవత్సరము నవంబరు నెల 26వ తేదిని రాజమహేంద్ర వరములో తనకు వేంకటచలపతిరావుగారి గృహమునందు భట్టిప్రోలు శరభయ్యగారి వివాహము జరిగినది. ఉన్నవ లక్ష్మీనారాయణ

పంతులుగారి సంబంధమును కుదిర్చి కృష్ణామండలము నుండి రాజమహేంద్రవరమునకు వివాహము జరుపునిమిత్తము పంపిరి. వరుడు ప్రథమశాస్త్ర పరీక్షయందుఁ గృతార్థుడుకాఁగా పచ్చయప్పగారి కళాశాలకుఁ ప్రధానాధ్యక్షుఁడుగానున్న యేట్సునొరవారి కుత్తరము వాసి సగము జీతమిచ్చు పద్ధతిమీఁద నాతనిని పట్టపరీక్ష తరగతిలోఁ జేర్పించితిని.

గోపాలిపురపు మహాలక్ష్మియను కంసాలి వితంతువును, ఆమె యొక్క వితంతు పుత్రియైన యన్నపూర్ణయు, రాజమహేంద్రవరము నుండి వచ్చి కొంతకాలమునుండి నావద్దనే యుండిరి. వారిని మా యింటనే కావ్వరముంచి, పోషించుచు చదువునిమిత్త మిద్దఱిని పాఠశాలకుఁ బంపుచుంటిని. 1903 వ సంవత్సరము ఫిబ్రవరి 14 వ తేదిని గంజాముమండల నివాసుఁడైన కొత్తర్తి నరశింహాయ యను నతఁడు కూఁతురయిన యన్నపూర్ణను వివాహము చేసికొనెను. ఇతఁడు పెండ్లినాటికే సర్వకలాశాల ప్రవేశ పరీక్షయందుఁ గృతార్థుడయి యుండెను. తరువాత నీతనిని ప్రథమశాస్త్రపరీక్ష తరగతిలోఁ బ్రవేశ పెట్టి చదివించితిని. కాని యతఁడు చదువుచాలించి యుద్యోగములోఁ బ్రవేశించి తన భార్యను వెంటఁగొని స్వస్థలమయిన గంజాము మండలమునకుఁ బోయెను. ఈతనిది స్వర్ణకార వితంతు వివాహములలో మొదటిది.

1904 వ సంవత్సరము మార్చినెల కడపట నుపకారవేతనము నొంది యక్కడి ముద్రాయంత్రము మొదలయినని వెంటఁగొని 1905వ సంవత్సర ప్రారంభమునసే రాజమహేంద్రవరమునకు వచ్చి చేరితిని. ఏడెనిమిది సంవత్సరములు చెన్నపట్టణములోనుండి వచ్చుటచేత రాజమహేంద్రవరము నాకు క్రొత్తదిగా కనఁబడెను. దేశరాజు పెదబాపనయ్యగారు మొదలైనకార్యకర్తలు కొందఱు నాకు క్రొత్త మిత్రులైరి. రాజమహేంద్రవరము రాఁగానే నేను మొట్టమొదట

చేసినపని శ్రీ విక్టోరియా బాలికాపాఠశాల యను పేరితో నొక బాలికాపాఠశాలను స్థాపించుట; రెండవపని సత్యవాదిని యను పేరితో మార్చినెల మొదటితేదినుండి యింగ్లీషు తెలుఁగు భాషలలో నొక వారపత్రికను ప్రకటింపఁబూనుట. ఈ బాలికాపాఠశాల 1905 వ సంవత్సర జనేవరు 16 వ తేదిని నెలకు ముప్పదిరూపాయల యద్దె రాఁగల మా స్వగృహమునందే యుంచఁబడినది. నేను కాపురమున్న కొంచెము భాగమ తప్ప ఇల్లంతయుఁ బాఠశాలనిమిత్తమే విడిచిపెట్టఁ బడినది. ఈ బాలికా పాఠశాలకు దేశిరాజు బాపయ్యగారు కార్య దర్శిగా నేర్పఱుపఁబడిరి.

ఈ పాఠశాల వితంతు శరణాలయ సంబంధముననే స్థాపింపఁ బడినది. నేను చెన్నపురిలో నుండినప్పు డప్పటి హిందూదేశ చక్ర వర్తినిపేర విక్టోరియా వితంతు శరణాలయము నక్కడ స్థాపించి దాని లోని వితంతు విద్యార్థినుల నుపాధ్యాయినీ బోధనాభ్యసన పాఠ శాలకుఁ జదువునిమిత్తము పంపుచుంటిని. అక్కడినుండి నేను కాలు కదలుపఁగానే యక్కడి వితంతుశరణాలయ మంతరించినది. నేను రాజమహేంద్రవరము రాఁగానే యిద్దరు ముగ్గురు బాలవితంతువులు మాయింటి కనఁగా వితంతు శరణాలయమునకు వచ్చిచేరిరి. వారికి విద్యనిమిత్తమయి పాఠశాల కావలసియుండెను. చెన్నపట్టణములో వలె స్త్రీలను బంపఁదగిన పాఠశాల యిక్కడ నేదియులేదు. ముగ్గురు నలుగురు వితంతువులకై మాత్ర ముపయోగించెడు పాఠశాలకంటె వితంతువుకాని కులాంగనలకును బాలికలనుగూడ నుపయోగపడెడు విద్యాశాల నేర్పఱచుట యుచితమని దీనిని స్థాపించితిని.

శరణాలయములోనివారు గాక పైనుండి యొకరిద్దరు బాల వితంతువులు చదువవచ్చుచుండిరి. వృద్ధుఁడైన యొక యుపాధ్యాయుని తోడను నలుగురు బాలికలతోడను పాఠశాల నారంభించితిని. పక్షము

దినముల కనఁగా నెలకడపట బాలికలసంఖ్య 49 అయినది; సంవత్స రాంతమునకుఁ దొంబదియైనది. పయిసంవత్సరములో దాదాపుగా 150 వఱకును పెరిగినది. ప్రథమసంవత్సరాంతమున ముగ్గు రుపాధ్యా యులును ముగ్గురుపాధ్యాయినులును బాఠశాలలోఁ బనిచేయుచుండిరి. మొదటి సంవత్సరములో నేను నాచేతినుండి రు 1708-9-9 వ్యయము చేసితిని. 1905 వ సంవత్సరము మెయి నెలలో శ్రీమతి లక్ష్మీ కాంతమ్మగారు, ఆమె భర్త రామచంద్రరావుగారును మంగుళూరు నుండి రాజమహేంద్రవరము నన్నుచూచుటకు వచ్చినప్పు డిక్కడ నుండి పనిచేయువా రెవ్వరును లేరని నేను ప్రస్తావించితిని. ఆయన తనకు రెండువేలరూపాయల ఋణమున్నదిగాని లేనియడలఁ దాము వచ్చి యిక్కడనుండి పనిచేయుదుమని చెప్పెను. నేనా ఋణము దీర్చెదనని, వారిని రావలసినదని, చెప్పి, నే నుపకారవేతన మును బొందుటకు ముందొక నిధిలో నిలువచేసికొన్న వేయిరూపా యలును వడ్డితోఁగూడ రామచంద్రరావుగారి కిచ్చినట్లు వ్రాసి తక్కిన వేయిరూపాయలను మరల రామచంద్రరావుగారు వచ్చినప్పు డిచ్చుటకు వాగ్దానము చేసితిని. ఆయన యందుచేత తన భార్యను రాజమహేంద్రవరములో నావద్ద విడిచి, యాఱుమాసములలో దాను వచ్చి చేరునట్లు చెప్పి, నేనిచ్చిన వేయిరూపాయలతోను ఋణము తీర్చుటకు మాఱుగా మఱియొక క్రొత్తభూమిని గొని మునుపువున్న ఋణమును ద్విగుణము చేసికొనివచ్చెను. 1906 వ సంవత్సరారంభ మునఁజే, నక్కడిపనిని మానుకొని రామచంద్రరావుగారు తిరిగివచ్చు వరకును శ్రీమతి లక్ష్మీకాంతమ్మ ప్రధానోపాధ్యాయురాలుగానుండి మా పాఠశాలలో నత్యంత శ్రద్ధతోఁ బనిచేయుచుండెను. ఆయన వచ్చినతరువాత ప్రధానోపాధ్యాయత్వమును ఆయన వహించెను. ఇపువరకును గలిపి నెలకు నలువదిరూపాయ లిచ్చుచుంటిని. ఆయన తిరిగివచ్చులోపల వారినిమిత్తమై యాఱు నూఱురూపాయలు వ్యయ

పెట్టి తోఁటలో నొకయిల్లు కట్టించితిని. తోఁట యెక్కఁడిదో ముందు తెలిపెదను. ఇప్పటికి నేను పాఠశాలలో నాఱుగురు పాధ్యాయినులను బెట్టితిని. వారిలో నిద్దఱు మాధ్యమిక పరీక్షయందుఁ గృతకృత్యులయి క్రమశిక్షను బొందినవారు. తక్కినవారు ప్రాథమికపరీక్ష నిచ్చినవారు. ఆయన యిక్కఁడఁ బనిచేయనారంభించిన కొన్ని వారములలోనే తమ కియ్యవలసినసొమ్మునఁ బంపవలసినదని యాయనకు ఋణప్రదాతల వద్దనుండి యుత్తరములు రాఁజొచ్చెను. ఆయన నా కా యుత్తరములను జూపి మొదల వాగ్దానము చేసినప్రకారముగా తక్కిన వేయి రూపాయల నిమ్మని యడిగెను. ఆయన క్రొత్తభూమిని విక్రయింపనని చెప్పెను; విక్రయింపకపోయినయెడల సొమ్మీఁయనని నేను చెప్పితిని. ఈ కలహమునుబట్టి యాయన భార్యాసహితముగా మరల స్వస్థలమునకుఁ బోవలసినవాఁడయ్యెను. అందుచేత నేను మొదట నిలువచేసి కొన్న వేయిరూపాయలును నష్టమయ్యెను. ఈ దంపతుల నిక్కడకుఁ బిలిపించుటలో నా ముఖ్యోద్దేశము నాకు సాయముగా నిక్కడ నింకొక యనుస్థాన బ్రాహ్మకుటుంబ ముండునని.

నేను చెన్నపట్టణమునుండి వచ్చినది మొదలుకొని బ్రహ్మ సమాజములో ననుస్థానపరుఁడను గావలెనని తలఁచియుంటిని. నేను యజ్ఞోపవీతమును విసర్జించి వర్ణభేదమును విడిచి యనుస్థానిక బ్రాహ్మఁడ నయిన పక్షమున, నేనిప్పుడు శూద్రాదులతోమాత్రమే కాక క్రైస్తవ మహమ్మదీయ మతాంతరులతోఁ గూడ సుఖముగా భోజన ప్రతిభోజనాదులు చేయగలవాఁడనగుదును. క్రమక్రమముగా వివాహము లాడినవారిసంఖ్య యధికమగుచువచ్చి భోజన ప్రతిభోజనాదులు జరపఁదగిన సంఘమేర్పడినది; మాతోఁగలిసి భోజనములు చేయ సాహసించెడి యితరులసంఖ్యయుఁ గాలక్రమమున హెచ్చినది. వివాహము లొక్కొకరియింట చేయుచు వారిని నలవాటు పఱుపవలె

నన్న యుద్దేశముతో నేను రాజమహేంద్రవరము వచ్చినతరువాత జరిగిన కొతా శ్రీరామశాస్త్రిగారి వివాహమును మాసూరి పురుషోత్తముగారి యింట నిన్నీసుపేటలో జరపించితిని; ఇంకొక వివాహమును తణుకు వేంకటాచలపతిరావుగారి యింట జరపించితిని.

రామచంద్రరావుగారును భార్యయు 1905 వ సంవత్సరము మెయినెలలో నన్ను చూడవచ్చిరి. అప్పుడాయనయు నేనును ప్రాతఃకాలమునందు సంచారమునకుఁ బోవుచుంటిమి. ఒకనాటి విహారములో నొక తోఁటలోనుండి నడచుచుండినప్పుడీతోఁట వితంతు శరణాలయము కట్టుట కనుకూలముగా నుండునని యాయన నాతోఁ బ్రస్తావించెను. పట్టణములోని ప్రాఁతయిటిని గొనఁ బ్రయత్నించుట కంటె నిటువంటి తోఁటను సంపాదించి యందు వితంతు శరణాలయాదులు కట్టించుటయే యుక్తమని నాకునుఁ దోఁచెను. ఆ తోఁట నాకు క్రొత్తదికాదు. అది నామిత్రులైన చల్లపల్లి రంగయ్యపంతులుగారిది. రంగయ్యపంతులుగారి యింటికిఁబోయి నేనువచ్చిన కార్యమును జెప్పి వితంతుశరణాలయనిర్మాణార్థముగా తోఁట నాకిండనియడిగితిని. సత్కార్యముకొఱకు నేనడుగుచున్నాను గనుక నాకు రెండువేల యేనూఱు రూపాయలకేయిచ్చెదమని వారుచెప్పిరి. నేనువెంటనే యేనూఱురూపాయలను గొనిపోయి యాయనకిచ్చి యాయనచేతను తమ్ముని కొమార్ల్లచేతను తోఁటను నాకు రెండువేల యేనూఱురూపాలకు విక్రయింపనిర్ణయించి క్రయధనములోనే నూఱురూపాయలు ముందుగా బుచ్చుకొన్నట్లు వ్రాయించి పుచ్చుకొంటిని. ఆర్బత్తునట్టు కంపెనీలో నావి రెండువేల రూపాయలుండెను. ఈ తోఁట కొనుటకయి యీ రెండువేల రూపాయలను తెప్పించితిని. ఇందులో నా కీశ్వరుని సాహాయ్యము స్పష్టముగాఁ గానఁబడుచున్నది. ఈ సొమ్మ్ము నేను తెప్పించుకొన్నతరువాత శీఘ్రకాలములోనే ఆర్బత్తునట్టు కంపెనీ దివాలాతీసెను.

చెన్నపట్టణములోనున్న యిండ్ల నిప్పటి కింకను విక్రయింపలేదు. వాని వలన నెలకు రు 15 లు అద్దె వచ్చుచుండెను.

వితంతు శరణాలయ సంబంధమున స్థాపింపఁబడిన బాలికా పాఠ శాలలో నలుగురు మాత్రమే కులస్త్రీలు పెద్దవారు చదువుచుండిరి. పురుషు లనేకులు తమ స్త్రీలను బాఠశాలకుఁ బంపుటకు తమ కిష్ట మున్నది కాని పాఠశాలకుఁ బంపుటకు బోవలసిన కాలము వారికి సరిపడకున్నదని నాతోఁ జెప్పిరి. వారి యానుకూల్యము నాలోచించి యట్టి స్త్రీలకొరకయి మా మేడమీఁద బ్రత్యేకముగా జనానా తర గతులను బెట్టి వారికి నేనే చదువు మొదలయినవి చెప్పుచుంటిని.

రాజమహేంద్రవరము రాఁగానే నే నారంభించిన రెండవ పని సత్యవాదిని యను పేరుతో నింగ్లీషు తెలుఁగు భాషలలో వార పత్రిక నొకదానిని ప్రకటింపించుట యని యీవఱకే తెలిపియున్నాను. చందాలమూలమున వచ్చినదిపోఁగా దానికయ్యెడు మిగిలిన వ్యయము లన్నిటిని నేనే భరింపవలసినవాఁడ నయితిని. ప్రథమభార్య జీవించి యుండగానే పోలవరము జమీందారుగారు రెండవ వివాహమును జేసికొనిరి. ఈ వివాహమయి 1905 వ సంవత్సరము మార్చినెల 29వ తేదిని ప్రకటింపఁబడిన సత్యవాదిని యందు నేనిట్లు వ్రాసితిని:—

"శ్రీ పోలవరము జమీందారుగారీ నడుమ తమ వివేకమును విడిచి విధ్యుక్తముగా వివాహమాడిన భార్య విలపించుచుండఁగా పదేండ్లు పడుచును మరల వివాహమాడిరని వినుట కెంతయుఁ జింత నొందుచున్నారము. ఈయన వితంతు శరణాలయమునకు వేయి రూపాయల నిచ్చియుండుటను జూచి యీయన వలన నీ దేశమున కెంతో మేలు కలుగునని తలఁచియుంటిమి. ఈ మధ్య నీయన యార్య మత బోధినికిఁ బ్రబధాన పోషకులైరని వింటిమి. ఆర్యమతబోధిని యీ వివాహము నెట్లు వర్ణించి శ్లాఘించునో చూడవలసి యున్నది. తమ

ప్రథమ భార్యను మరలఁ గొనివచ్చి యింట నుంచుకొని యాపరించి చక్కఁగా నేలుచుఁ గోరితెచ్చుకొన్న యీ క్రొత్త భార్య యెదిగి కాపురమునకు వచ్చినప్పు డీయగ్రమహిషికిఁ గలిగించిన సౌఖ్యమునే కలిగింపక యన్యస్త్రీ విముఖతతో నా యబల నర్ధాంగి యనుటకుఁ దగినట్లుగా యాదరింతురని మా జమీందారుగారికి హితబోధ చేయుచున్నారము."

నేను తోటను కొన్నతరువాత నేను పోయి యందు కాపుర ముండినంగాని తోఁట బాగుపడదనియు, అక్కడ ననుకూలముగా నుండనియెడల శీతకాలములో మరల మనయింటికే వత్తమనియుఁ జెప్పి యొడఁబఱిచి భార్యాసహితముగా నేను తోఁటలోనికి శ్రావణ మాసములోఁ గాపురమునకు వెళ్ళితిని. శీఘ్రకాలములోనే యక్కడి నివాసమునకు నే మలవాటు పడితిమి. ఇఁక నుయ్యి త్రవ్వింపవలసిన పని యొకటి మిగిలియున్నది. వేయిరూపాయలకుఁ గాని నుయ్యి యగు నట్లు కనఁబడలేదు. నాయొద్దనున్న నూఱు రూపాయలతోను త్రవ్వు పని నారంభించి తరువాత చూచుకొందమని యీశ్వరుని మీఁద భారమువేసి నూయి త్రవ్వింప నారంభించితిని. మిస్ మ్యానింగుగారు తమ మరణశాసనములో నేఁబది పౌనులు నా కియ్యవలసినదని వ్రాసి నట్టును, ఆసొమ్మ్ము నా కిమ్మని చెన్నపట్టణములోని తమ ప్రతినిధులకు వ్రాసినట్టును, లండనులోని యామె మరణశాసన నిర్వాహకులింతలో నాకు వ్రాసిరి. వ్యయము లన్నియుఁ బోఁగా మిగత సొమ్మును రు 659-1-0 లను చెన్నపట్టణము నుండి చెన్నీకంపెనీవారు నాకు పంపిరి. ఆ సొమ్ముతోను మఱికొంచెము సొమ్ముతోను నూతిపని పూర్తియయినది. నీరు నే ననుకొన్నంత లోఁతునఁ బడక పైఁగానే పడినందున రు 800 లులోనే నూయి ముగిసెను. ఈ సాయము కేవల భగవత్ప్రేరణవలన వచ్చినదేకాని వేఱుకాదు.

మొట్టమొదట మక్డానల్డుగారు నా రాజశేఖర చరిత్రనుగూర్చి యామెతో నా విషయమయి మాట్లాడియుండును. తరువాత నామె చెన్నపట్టణము వచ్చినప్పుడు మాయింటికి వచ్చి నా భార్యను కౌగిలించుకొని మాయింటనున్న శరణాలయములోని వితంతువులనుజూచి సంతోషించెను. ఈమె రామమోహనరాయ లింగ్లండునకు వెళ్లిన కాలములో మిస్ కార్పెంటరు మొదలైనవారితోఁ గలిసి వ్యాధి సమయమునం దాయన కుపచారములుచేసినవారిలో నొకతె. మరణమునకు ముందు వైద్యుఁడు రామమోహనరాయల తలకత్తిరించినప్పుడా వెండ్రుకలను సంగ్రహించి యప్పటినుండియు దాఁచిపెట్టుకున్న వానిని నా కీమె ప్రేమతో బహుమానముచేసెను. ఆ బహుమానము నమూల్యమైనదానినిగా గ్రహించి యిప్పటికిని నాయొద్ద బదిలముగాఁ బెట్టుకొని యున్నవాఁడను.

1905 వ సంవత్సరోత్తరార్ధారంభమునందు సాధారణ బ్రహ్మ సమాజ మతప్రచారకులైన బాబూ హేమచంద్ర సర్కారుగారు రాజమహేంద్రపరమునకు వచ్చిరి. అప్పుడు నేనాయనతో మా తండ్రిగారి శ్రాద్ధకర్మను బ్రహ్మసామాజిక విధుల ననుసరించి చేయ నుద్దేశించుకొన్నట్టును, అప్పటినుండి యనుష్ఠానపరుఁడను గాదలచుకొన్నట్టును చెప్పితిని. తరువాత రెండుమూడు మాసములకు బాపయ్యగారు నాయొద్దకువచ్చి తాము యజ్ఞోపవీతాదులను విసర్జించి యనుష్ఠాన బ్రాహ్మ మతావలంబుఁడయి పితృ శ్రాద్ధమును బ్రాహ్మ సిద్ధాంత పద్ధతి ననుసరించి జరుపవలెనని యున్నదని నన్నాలోచన యడిగెను. నేనాయనను బ్రోత్సాహపఱచి నేను భోజనమునకు వచ్చెదననియు శీఘ్రకాలములోనే నేనుకూడ ననుష్ఠానపరుఁడ నయ్యెదననియుఁజెప్పి, కలకత్తా నగరమునకు నా మిత్రులయిన పండిత శివనాథశాస్త్రిగారి పేర బ్రాసి శ్రాద్ధకర్మను నేనే నడిపి యితరులతోఁ గలిసి నేనక్కడ

భోజనము చేసితిని. ఈ విషయమున నాకాయన మార్గదర్శకులయి నందుకు మిక్కిలి సంతోషించితిని.

1906 వ సంవత్సరము ఫిబ్రవరి 2 వ తేదిని బాపయ్యగారి యింట సంస్కారభోజన మొకటి జరిగెను. ఆ విందులో కొందఱు బ్రాహ్మణులును, వైశ్యులును, శూద్రులును, క్రైస్తవు లొకరిద్దఱును గలిసి భోజనములు చేసిరి. ఈ విందు జరిగిన మూఁడు దినముల కనఁగా 1906 వ సంవత్సరము ఫిబ్రవరి నెల 15 వ తేదిని మా తండ్రి గారి యాబ్దికమును నేను బ్రాహ్మ ధర్మపద్ధతినిఁ బెట్టి నాఁడుమొదలు కొని యనుష్ఠానిక బ్రాహ్మఁడ నగుచున్నానని ఘోషించి, సర్వ జాతులవారితోను గలిసి సహపంక్తిని భోజనము చేసితిని. అప్పుడు వితంతు శరణాలయము వేఱుగ లేకపోవుటచేత నందలి యిద్దరు ముగ్గురు వితంతువులును గలిసి మాయింటనే యుండిరి. నే నెవ్వరితో భోజనముచేసిననుసరే జందెము తీసివేయకుండిన యెడల మా యింటనే యుందుమని చెప్పిరి. వారి నిమిత్తమయి పదునేను దినముల వఱకును జన్నిదమును తీసివేయక యుంచుకొనెదననియు, వారీలోపల నిష్టమున్నచో వేఱుచోటికిఁ బోవచ్చుననియుఁ జెప్పితిని. పులవర్తి వేంకటసుబ్బారావను పదునెనిమిదేండ్లు బాలుఁడొకఁడు కూడ నా సంరక్షణలో నుండెను. అతఁడు వేరాధారము లేనివాఁడయినందున నాయొద్దనే యుండెదనని చెప్పెను. బ్రాహ్మణ వితంతువు లిద్దఱును 28వ తేదిని మాయిల్లు విడిచి వెడలిపోయిరి. ఒక్క శూద్ర వితంతువు మాత్ర మట్టెయుండెను. 13 దినము లుంచినతరువాత నేనా దినము ననే యజ్ఞోపవీతమును దీసివేసి యందఱితోను జెప్పితిని.

రాజమహేంద్రవర ప్రార్థనసమాజము—ఈ సమాజ మిక్కడ దాదాపుగా 30 సంవత్సరములనుండి యుండియున్నది. అంతకాలము నుండి యుండఁగా నేటికాలమునకా సామాజికులలోఁ గొందఱనుష్ఠాన

పరులగుట తటస్థించినది. బ్రహ్మసమాజములను నామమునను ప్రార్థనసమాజములను నామమునను బరగుచున్న సమస్త సమాజముల యొక్కయు, ముఖ్య సిద్ధాంతములు రెండని చెప్పవచ్చును. అందొకటి సర్వలోకాధిపతియైన యీశ్వరుడు లోకైకపితయన్న విశ్వాసము; రెండవది జాతివర్ణమత భేదములు లేక యీశ్వర దృష్టిలోనివారైన సర్వమానవులును సోదరతుల్యులన్న విశ్వాసము. ఈరెండును తా ననుష్ఠానపరుడు కాగలిగినను కాజాలక పోయినను పూర్వోక్తములైన సమాజములలోఁ జేరిన ప్రతి సామాజికునియొక్కయు పరమభావనలు. ఎప్పుడును లోకములో నేసంస్కారమును తనయొక్క న్యాయబలమునుబట్టి నిలిచియుండునుగాని మానవమాత్రునిజీవితమునుబట్టిప్రబలదు ఈశ్వరేచ్ఛచేత నావంటిమర్భలుఁడు సహితమొకానొకప్పుడు సంస్కారప్రాబల్యమున కొక పనిముట్టుగా నుండవచ్చునుగాని యాతనిలోడనే యా సంస్కారము నశింపదు.

ఇంచుమించుగా నేను కొన్న తోఁటకంటియున్న మరియొక తోటనుగూడ రు 600 లకు కొంటిని. ఈ తోఁట కారాగృహమునకుఁ బోవు రథ్యకు సమీపమునందున్నందున వితంతు శరణాలయము మొదలయినవానిని దీనిలోనే కట్టింప నుద్దేశించితిని. నేను తోటలోఁ గాపురమున్న యారంభదశలో న్యాయవాదులైన ములుకుట్ల యచ్చుతరామయ్యగారొకనాఁడు నన్ను చూచుటకయి వచ్చిరి. ఆయనకు నేను కొన్న తోఁటలనుజూపి క్రొత్తగాకొన్న తోఁటలో ననాథ శరణాలయమును వితంతు శరణాలయమును కట్ట నుద్దేశించి యున్నట్టు చెప్పితిని. ఆయన నేను కోరకయే తా మా గృహములను కట్టి చియిచ్చెదమని వాగ్దానముచేసిరి. ఈశ్వరుఁడు మంచి కార్యముల కెప్పుడును తోడుపడుచుండును. అచ్చుతరామయ్యగారు రాజమహేంద్రవర కళాశాలలో నా శిష్యులు; నాయందు విశేషగౌరవము కలవారు. నామీఁదగల యవ్యాజప్రేమమునకు నేను వారికి వందన

ములు సమర్పించితిని. వారు శీఘ్రకాలములోనే పని యారంభించి క్రొత్తతోటలో నిప్పుడు వితంతు శరణాలయమున్న విశాల భవన మును గట్టించియిచ్చిరి. ఇది కట్టించుట కాయన కెంత వ్యయమైనదో నాకు తెలియదుగాని మైదువేలరూపాయ లయియుండునని నేనను కొంటిని. వారీ శరణాలయమును నా కప్పగించినతరువాత నేను మఱి వేయిరూపాయలా భవనముపై వ్యయపరచితిని.

నే ననుష్ఠానికబ్రాహ్మణుడనయిన నాలుగు మాసములకును పోల వరము జమీందారుగారి వివాహమునుగూర్చి వ్రాయబడిన తరువాత మూఁడు మాసములకును నన్ను తిట్టుటకయి మా పట్టణములో "హిందూదేశాభివర్ధని" యను పేరితో నొక పక్షపత్రిక బయలు వెడలినది. పత్రికాధిపతి శ్యామారావను నతఁడు. అతఁ డేడెనిమిది రూపాయలుసంపాదించుకొని జీవనముచేయుచుండిన వీధిబడిపంతులు; అతఁడు దూరదేశమునుండి రాజమహేంద్రవరమునకు క్రొత్తగా వచ్చినవాఁడు; అతఁడు నన్నెఱుగఁడు; నేనాతని నెఱుఁగను; అతఁడు పత్రిక కచ్చు ఖర్చుల నిచ్చుకొనుటకైన శక్తిలేనివాఁడు. ఈ పక్ష పత్రికయొక్క మొదటిసంచికయం దనఁగా 1906 వ సంవత్సరము జూలై నెల 1 వ తేదిని వృత్తాంతములను శీర్షికక్రింద వ్రాసినవాడెవ్వఁ డయినను వితంతు శరణాలయములోని వితంతుస్త్రులు వ్యభిచారిణు లనియు నందులోనే వ్యభిచారము జరుగుచుండుననియు లోకు లను కొనునట్లు చేయనుద్దేశించెసనుట స్పష్టమగుచున్నది. ఈ దుర్వార్త లను చదివిన పిమ్మట న్యాయవాదిచేత పత్రికాధిపతికి పయి యట్లు వ్రాసినందుకు క్షమార్పణము చేయవలసినదనియు చేయని యెడల దండవిధిననుసరించి యభియోగము తేఁబడుననియు నివేదన పత్రికను బంపించి నేనాతనిపైని సంయుక్త దండవిధాయకునివద్ద నభియోగము తెచ్చితిని. విచారణ యయినవిమాఁదట సంయుక్త దండవిధాయకుఁడు

శ్యామారావుగారికి వేయిరూపాయలు కాబోలును ధన దండనమును పదునెనిమిది మాసములు కారాగృహవాసమును విధించిరి. అతఁడా తీర్పుమీఁద మండల న్యాయాధిపతియొద్ద నుపర్యభియోగమును తేఁగా, మండల న్యాయాధిపతులైన పార్థసారథి అయ్యంగారు కనుణించి ధనదండనమును మున్నూఱురూపాయలకు తగ్గించి కారాగృహవాస మావఱకున్నదే చాలునని తీర్పుచెప్పిరి.తన్ను తాటిచెట్లెక్కించినవారు దిగువనిచ్చెన తీసివేసి యదృశ్యులుకాఁగా నతఁడెట్లో చండాలమూలమున నెంతో కష్టముమీఁద ధనదండనమును చెల్లింపఁగలిగెను.

1906 వ సంవత్సరము డిశంబరునెల 15న తేదిని నేను పూనిన కార్యములను నెరవేర్చుటకయి హితకారిణి సమాజమను పేర నొక సంఘమును స్థాపించితిని. దానిలో నప్పుడు చేరినవారు ముప్పది యాఱుగురు. ఈసంఘము తరువాత రాజశాసనప్రకారముగా లేఖ్యారూఢము చేయఁబడినది. ఈసంఘముయొక్క ముఖ్యోద్దేశము వితంతుశరణాలయములు, అగతిక శిశు సంరక్షణశాలలు, పాఠశాలలు, శిల్పశాలలు మొదలయినవిస్థాపించి వానినిజరుపుట సభ్యులలో తొమ్మండ్రు కార్యనిర్వాహక సంఘముగా నేర్పఱుపబడిరి. 1907 వ సంవత్సరమునందు సమాజనిబంధనలు ప్రకటింపఁబడగానే, నాస్తికులు కార్యనిర్వాహక సంఘములో నుండఁగూడదన్న నిబంధనయున్నందున టంగుటూరి శ్రీరాములుగారును మఱికొకరును సభ్యత్వమును మానుకొనిరి. ఈ సమాజకార్యము లవిచ్ఛిన్నముగా జరుగుటకయి యల్పమయినను నాకున్న సొత్తునంతను సమాజమున కిచ్చివేసితిని.

ఈ సొత్తును నిక్షేపత్రమును వ్రాసి 1908 వ సంవత్సరము మేయినెల రెండవతేదిని లేఖ్యారూఢము చేయించితిని. ఈ సొత్తు నా జీవితకాలములో సమాజపక్షమున నా యధీనములో నుండవలె

నని మాత్రము నిక్షేపపత్రములో వ్రాసిపిని. అందులోనే వితంతు శరణాలయములోని వితంతువుల వివాహములు వారి యిష్టానుసారముగా జరుపవచ్చుననియు, వితంతు శరణాలయములో విద్య నిమిత్తము వితంతువులు కానివారిని సహితము చేర్చుకోవచ్చుననియు, యేర్పాటు జేసితిని. నా జీవితకాలములో పుస్తక విక్రయమువలన వచ్చెడిదితప్ప నాసొంతమునకయి నేనేమియు నుంచుకోలేదు. చెన్న పట్టణములో నున్న యిండ్లను సహిత మమ్మివేసి దానిని సహితము రొక్కముగా నిచ్చివేసితిని.

దేశిరాజు పెదబాపయ్యగారి దుష్టాంతమును బట్టి యిద్దఱు ముగ్గురు తరుణవయస్కులనుష్టానిక బ్రాహ్మలగుట తటస్థించినది. బాపయ్యగారి యింట సార్వజనీనమైన సంస్కార భోజనము జరిగిన దినమునే భోజనమునకు ముందక్కడకు వచ్చినవారితో నేను స్థిరముగా నిలువగలిగిననే భోజనమునకు రావలసినదనియు లేనియెడల పోవలసినదనియు స్పష్టముగాఁజెప్పితిని. బంధువులకు భయపడక ప్రాయశ్చిత్తమునకు లోనుగాక నిలిచినవారిలో నొకడు కారుమూరి కామరాజుగారు. కామరాజుగారికి మా తోఁటలోనే వాసమున కిల్లిచ్చితిని. అనుష్టానిక బ్రాహ్మలలో నింకొకడు బాపయ్యగారి మేనమామయైన కామరాజు హనుమతంరావుగారు; ఈయన ప్రవేశపరీక్షయందు తేఱిన వారు. బోధనాభ్యసన పాఠశాలలోఁ జేరి యుపాధ్యాయ పదమునకు శిక్షితుఁడగుటకయి రాజమహేంద్రవరమునకు వచ్చెను. ఈ యుద్దేశముతోనే ప్రథమశాస్త్ర పరీక్షయందుఁ జేఱి యనుష్టానిక బ్రాహ్మఁడయిన కవికొండల సాంబశివరావుగారును బందరు నుండి రాజమహేంద్రవరమునకు వచ్చెను. వీరిరువురకునుకూడ కాపురముండుటకు మాతోఁటలోనే యిల్లిచ్చితిని. 1907 వ సంవత్సరమునందు బోధనాభ్యసన శాస్త్ర పాఠశాలలోఁ జేరి చదువుకొనుచుండిరి. వీరితోఁగలిసి

కొంతకాలము బాపయ్యగారు మా తోటలోనే యుండిరి. కాని తరు
ణాత రోగగ్రస్తులయి వైద్యము నిమిత్తము రాజమహేంద్రవరము
నిమువవలసిన వారయిరి.

వంగదేశపు వక్తలలో నొక్కరయిన విపిన చంద్రపాలుగారు
రాజమహేంద్రవరమునకు వచ్చి దేశీయ స్వపరిపాలన విషయమునఁ
గొన్ని యుపన్యాసములు చేసి యువజనులయొక్కయు విద్యార్థుల
యొక్కయు మనస్సులలో నొక విధ్వమైన యుద్రేకమును దేశాభి
మానమును గలిగించిపోయెను. రాజ్యాంగ విషయములలో నాకును
మా తోటలో నున్నవారికిని తఱుచుగా వివాదములు జరుగుచు
వచ్చెను. వారు నన్ను దేశాభిమాన శూన్యునిగా పరిగణించి నా
మాటలను పాటింపక పాఠశాలాధికారుల యాజ్ఞలను ధిక్కరించగా
యిరువురును పాఠశాలనుండి తొలగింపబడిరి. దొరతనమువారి పాఠ
శాలలోఁగాని దొరతనమువారి సాహాయ్యమును బొందుచున్న పాఠ
శాలలోఁ గాని వారిద్దరికని కొలువు లియ్యగూఁడదని రాజకీయ వ్యవ
హార పత్రికయందు ప్రకటింపఁబడినది. మూఁడవవారయి స్వదేశ
వస్తువుల యంగడిపెట్టిన కారుమూరి కామరాజుగారు నే నింగ్లీషు
వారి ప్రభుత్వమువలన హిందూదేశమునకుఁ బూర్వమెప్పుడును లేని
శుభములనేకములు కలుగుచున్నవని వాదించిన తప్పిదమునకయి
కొంతకాలము నాతో మాటాడుటయే మానివేసెను.

నేను పదునాలుగేండ్లు వివేకవర్ధనికి విలేఖకుఁడనుగా నుండి
దానిలో రాజ్యాంగ విషయకములైన వ్యాసములను ప్రాసితిని.
హైందవ దేశీయ మహాసభ యారంభమయినప్పుడు న్యాపతి సుబ్బా
రావు పంతులుగారు మొదలైనవారితోఁ గలిసి నేనును గొంతపని
చేసితిని. ఆ మహాసభ 1887 వ సంవత్సరమున మొదటితడవ చెన్న
పట్టణములో జరుగుటకు ముందు రాజమహేంద్రవరములో జరిగిన

సభలో నేనొక యుపన్యాసకుఁడనుగానుండి చెన్నపురి మహాసభకు నే నొక ప్రతినిధిగాఁబంపబడితిని. 1885 వ సంవత్సరమున 'దేశీయ మహాసభయు దాని యుద్దేశములు' నని రాజమహేంద్రవరమునం దొక యుపన్యాసమిచ్చి దానిని ముద్రింపించి విద్యావిచారణాధికారి మొదలయినవారికి సహితము పంపితిని. మత నీతి కులాచార సంస్కా రములులేక యొక్క రాజ్యాంగ సంస్కారమునలననే దేశ మభివృద్ధి పొందునని నే నెప్పుడును తలఁచినవాఁడఁగాను. దేశాభివృద్ధి కన్నిటి లోను సమానముగా పనిజరగవలెనని నా యభిప్రాయము.

పాలుగారి యుపన్యాసమువలనఁ గలిగిన దేశాభిమానము యుక్తాయుక్త వివేకములేక యింగ్లీషువారిని వారి ప్రభుత్వమును గర్హించుటయేకాక యింగ్లీషు ప్రభుత్వపక్షమున మంచిమాట చెప్పిన వారిని దూషించుటవఱకును వచ్చినది. ప్రార్థనసమాజ ప్రముఖులలో నొకరైన నాళము కృష్ణారావుగారు రాజద్రోహియు, నరహంతకుఁడు నైన కుదిరాం బోసు చాయాపటమును నా పేరిటనున్న పథసమందిర ములో వ్రేలాడఁదీయుటయేకాక యెవరు చెప్పినను దానిని తీసివేయక పోయెను. ఈ పటమునుగూర్చి యదియేల పథనమందిరములో తగి లింపఁబడినదో తెలుపవలసినదని మండల కరగ్రాహి నా పేర వ్రాసెను. పటమందు తగిలింపఁబడి తరువాత తీసివేయబడినదనియు, ఊరక నాపేరు పెట్టుటయేకాని యా పథనమందిరమునకు నాకును సంబంధమేదియు లేదనియు, స్త్రీల కుపయుక్తములయిన పుస్తకము లను వార్తాపత్రికలను వారి యింట్లకుఁబంపి దేశాభివృద్ధికి పాటుపడెద మని నాకు నేను చెన్నపట్టణములో నున్నప్పుడు వ్రాయఁగా నమ్మి మందిరము నుపయోగించుకొనుట కంగీకరించితిననియు, పథన మంది రమువారు రాజ్యాంగములలోఁ బ్రవేశించెడు పక్షమున పథన మంది రము నందుండి వేఱుచోటికి తీసికొనిపోవలసినదని నివేదనము నంపెద

సనియు, నేనాయన కుత్తరము వ్రాసితిని. పఠనమందిరమునకు నా పేరు తీసివేయవలసినదనియు నేను కార్యదర్శికి వ్రాసితిని. ఈవిషయ మయి మొదట నాకు వ్రాసిన మండల కరగ్రాహితోను తరువాత నాయన స్థానమునవచ్చిన యింకొక మండల కరగ్రాహితోను ఉత్తర ప్రత్యుత్తరములు నడచినమీదట ఛాయాపటోద్బంధన విషయ మప్పటికి ముగిసెను. 'రాజద్రోహ పక్షమువారికి మీరు నాయకులట కారా' యని రాజమహేంద్రవరము నందలి యనుగత కరగ్రాహు లైన బ్రాడ్ఫూటు దొరగారు నన్నడిగిరి. ప్రాక్తన సామాజికులలో కొందఱప్పుడు తా మనలంబించిన మతసిద్ధాంతములనే సంపూర్ణ ముగా మఱచిపోయిరి. ఆ సిద్ధాంతములలో నొకటి సర్వజన సహోదర భావము. ఈ సిద్ధాంతమునుబట్టి యింగ్లీషువారును మన సహోదర తుల్యులయి యుండగా న్యాయముగానైనను అన్యాయముగానైనను వారిని పరిహసించినవాఁడును హింసించినవాఁడును దేశాభిమానియైన మహాత్ముఁడని సామాజికులు భావించుట యెంతయు శోచనీయము. 1908 వ సంవత్సరము ఏప్రిల్ నెల 18 వ తేదిని నే నాంధ్ర పరిశుద్ధా స్తిక మహాసభలో నగ్రాసనాసీనత్వమును వహించుటకు బందరు పురమునకు వెళ్లినప్పుడీ నూతనావేశము మనస్సులో నుంచుకొని యిట్లు చెప్పితిని :—

"నిజమైన దేశాభిమానమునకు మాఱుగా ననేకులలో మన దేశమునం దిప్పుడొక విధమైన దురభిమానము వ్యాపించుచున్నది. ఈ యపూర్వ దేశాభిమానులు మూఢజనుల మెప్పునకయి దేశీయ మైనదానినెల్ల బట్టువలె భూషించుచు విదేశీయమై దానినెల్ల ద్వేషించుచు దేశాభివృద్ధికయి యాత్మశ్లాఘనలుగాక సత్యమును న్యాయమును ప్రేమమును గావలెనని పలుకువారిని దేశద్రోహులనియు సత్కార్యభీరువులనియు దూషించుచున్నారు. దేశాభివృద్ధికి నిజమైన

యీశ్వరభక్తులు కావలెను. పరిశుద్ధమైన ఈశ్వరభక్తి గలవారు మాత్రమే స్వార్థపరిత్యాగులయి కార్యశూరులయి సత్యన్యాయకారుణ్యమైన యమోఘ సాధనములనుగొని యీశ్వర ధర్మధ్వజమును దాల్చి పోరాడగల్గుదురు. పరిశుద్ధాస్తిక మతావలంబులమని చెప్పుకొనెను మన మెప్పుడును దేశాభిమానము పేరుచెప్పికొని మరి యే సర్కారయినను చెప్పిగాని యన్యులను ద్వేషింపగూడదు."

సంస్కారాభిమానులు బృందావనపురములో విందు చేయుటకు ప్రయత్నించిరిగాని శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారి లోపల జరిగిన వింతలో నాస్తిక్యకర్తయు, ముట్నూరి కృష్ణారావుగారును, రామాచారిగారును, పావకేశ్వరరావుగారును, మజిలీయొకరును పంచ పాండవులవలె నయిదుగురు మాత్రమే నాతో గలిసి సోదరప్రీతి భోజనమును గావించిరి.

ఇక వితంతు వివాహము చేసికొన్నవారి కథకు వత్తము. వారిలో రాజమహేంద్రవరమున నున్న కొందఱు నే ననుష్ఠానిక బ్రాహ్మణ సగుటవలని లాభమునుపొంది, యందువలన తాము కీర్తిప్రతిష్ఠలను సంపాదింపవలెనన్న యుద్దేశముతో నాకు స్వస్త్యా మంత్రణము నిచ్చి మిషమీఁదను పరస్పర సమావేశములవలన నన్యోన్య మైత్రాదులు హెచ్చునన్న నెపముమీఁదను వితంతు వివాహము చేసికొన్నవారిని వివిధస్థలములనుండి రాజమహేంద్రవరమునకు రావించి 1907 వ సంవత్సరం డిసెంబరు నెల 27వ తేదిని నాటకశాలలో నొక సభచేసి నన్నభినందించు పత్రిక జదివిరి.

ఇట్లందఱును సమావేశమైన తరువాత తిరుమెల్లి వెంకట సుబ్బారావుగారును పుల్లాభట్ల గవరయ్యశాస్త్రిగారును నాయకులుగా నుండి యందఱితోను మాటాడి తాము వేఱొక క్రొత్తసమాజమును స్థాపించుట యావశ్యకమని బోధించి యట్లుచేయ నొడఁబఱిచిరి. నాకు

స్వాగతపత్రికను జదివిన రాత్రియే బందరునుండి యిందునిమిత్తమయి వచ్చి మాయింట దిగినవారిని భోజనమునకు వెళ్లినప్పుడు, మాయింట దిగుటచే రాగూడదని మరల బంపివేసిరి. వారు మఱునాఁడు నన్ను తమ నడుమను గూరుచుండఁబెట్టుకొని ఛాయాపటమును దీయించుకొనెదము రమ్మని యాహ్వానము చేయఁగా నేను రానని మొట్ట మొదట నిరాకరించితినిగాని యొక మనుష్యుఁడు మఱిమఱి బతిమాలుకోఁగా తుదకు పోవలసిన వాఁడనయితిని.

వీరిలో పుల్లాభట్ల గవరయ్యశాస్త్రిగారు నాతో భోజనప్రతిభోజనములు మాని వేఱుసమాజమునస్థాపించినఁగాని వితంతువివాహపక్షము నశించునని మిత్రులు భ్రమపెట్టుటచేత మాయఁలోబడి యట్లు పని చేసెను. అతఁడావఱకే వ్యాధిబాధితుఁడయియుండి యాకస్మికముగా రోగము హెచ్చుచేసినందునఁ దన్నుఁ జూచిపొమ్మని నాకు వర్తమాన మంపెను. నేను నోఁగానే యతఁడు నమస్కారముజేసి యేమేమో చెప్పనారంభించెనుగాని నాలుక తడఁబడి నోట మాట రాకపోయెను. అంతట కాగితమును సీసపు పుడకయు భార్యచేత తెప్పించి "నేను మీయెడ నపచారము చేసితిని. క్షమింపుడు" అని వ్రాసి నా చేతికిచ్చెను. నా కేవిధమైన కోపమును లేదనియు, ఆ విషయమును మనసులో నుంచుకోవలదనియు నేను చెప్పితిని. ఆవఱకు తిరుమెళ్ల వేంకటసుబ్బారావుగారును మఱియొకరును వచ్చి నన్నడుగఁగా హితకారిణి సమాజములో చేరవలసినదనియు చేరినయెడల వితంతువివాహములు చేసికొన్నవారి నొక యుపసంఘముగా నేర్పఱచి వారిచేతనే వివాహములు చేయించుట కేర్పాటు చేసెదననియు చెప్పితిని. వారు హితకారిణీ సమాజములో చేరకైరి. మా వితంతు శరణాలయములోనే వితంతువులు చేరుచున్నారు. ఏఁటఁటా నాలుగును, అయిదును, ఆఱును వివాహములు జరుగుచునేయున్నవి.

నేను తోటలోనికిఁ గాపురమునకు వచ్చినను విశాలమయిన మా యిల్లంతయు ఉపయోగింపఁబడుచుండుటచేత ముద్రాయంత్రము నిమిత్తము కొన్ని నూఱులు రూపాయలు వ్యయపఱిచి యింటి దొడ్డిలో పెద్ద పెంకుటిశాల యొకటి వేయవలసివచ్చినది వారపత్రికను సకాలములో ముద్రించి ప్రకటించుటకయి పెద్ద భృత్యవర్గమును పెట్ట వలసివచ్చెను. అందుచేత గున్నేశ్వరరావు సోదరులకు చింతామణీ ముద్రాయంత్రమును విక్రయింపవలసినవాఁడ నైతిని. నా పుస్తకము లను విక్రయించు స్వాతంత్ర్యమునుగూడ వారికే పదియేండ్లవఱకు నిచ్చితిని గాని కొన్నియేం డ్లయినతరువాత వారి యనుమతితో నేనే పుచ్చుకోవలసిన వాఁడనైతిని.

నే నంతకంతకు బలహీనుఁడ నగుచు వచ్చుచున్నను కార్యో త్సాహముచేత పని మానకుంటిని. ఇట్లుండగా నొకనాటిరాత్రి నేను లేచి మంచముమీఁదనుండి దిగి నిలుచుండి యేదో వికారము రాఁగా స్పృహలేక విఱుచుకొని పడిపోయితిని. ఆ పడ్డచప్పుడు విని నిద్రపోవు చున్న నా భార్య యులికిపడిలేచెను. నాకు కొంతసేపటికే మరల స్మృతివచ్చి కన్నులువిప్పి చూచుసప్పటికి నా భార్య నావద్ద కూరు చుండి యేడ్చుచుండెను. తలక్రింద నొక్క తలగడ యుండెను. గోడ చెంతనున్న దిండ్లెట్లు నా తలక్రిందకు వచ్చెనో, యూహించుట కశక్య మయియున్నది. అది యంతయు నీశ్వరరక్షయని నిశ్చయించుకొని పరుండియే ప్రార్థనచేసి యీశ్వరునకు నా కృతజ్ఞతాభి వ్యంజకము లైన వందనములను సమర్పించితిని.


రామచంద్రరావుగారును భార్యయును మంగుళూరునుండి రాక మునుపు కొంచెమునాళ్లము గుంటూరునుండి వచ్చి ఉన్నవ లక్ష్మీ నారాయణగారును భార్యయు పట్టణములోని మా యింటిలోనుండి వితంతు శరణాలయమును జూచి మరల గుంటూరుకి వెళ్లిపోయిరి.

పాఠశాలలో నాఱుగు ఉపాధ్యాయినులను ఒక యుపాధ్యాయుని బెట్టి విశేష ధనవ్యయము చేయుచుంటిని. ఎంతో కష్టమువీఁద నిద్దఱు పిల్లలు రెండవఘారమునకు వచ్చిరి; వారిలో నొకామె కన్యక; రెండవ యామె బాలవితంతువు. వారిపురనుగూడ తల్లిదండ్రులు బడిమాని పించిరి. ఈ పాఠశాలను క్రమక్రమముగా స్త్రీల యున్నతపాఠశాలను జేయవలెనని మొదట నా సంకల్పము. ఇప్పు డా సంకల్పమునకు ప్రథమమునే వికల్పము సంభవించెను. ఎప్పుడైనను స్త్రీల యున్నత పాఠశాల యేర్పడవలెనన్న వితంతుశరణాలయములోని వితంతువుల వలనను అగతిక రక్షణశాలలోని బాలికలవలనను నేర్పడవలసినదే కాని వేఱువిధముగా నేర్పడ నేరదనియు, తలఁచి యొక యగతిక రక్షణశాలను గూడ స్థాపింప నిశ్చయించితిని. అందుచేత మా పాఠశాలను పట్టణముకుండి యప్పించి 1908 వ సంవత్సరము వేసవికాలపు సెలవులైరువాత మా తోఁటలోని రామచంద్రరావుగారి యింటిలోఁ బెట్టితిని. పట్టణములోని బాలిక లక్కడకు వచ్చుటమానివేసిరి. తగవు లాడిన యుపాధ్యాయినులనంపఁతిని దీసివేసితిని. వితంతుశరణాలయము లోని వితంతువులు తోఁటలోని యీ క్రొత్తయింటిలోనే యుండిరి. వారికి విద్యచెప్పుటకయి ప్రవేశపరీక్షయందు కృతార్థులయిన వయస్సు చెల్లిన యుపాధ్యాయులను బెట్టితిని. పాఠశాలను పట్టణగృహమునుండి తొలగించిన తరువాత నాయింటి కించుమించుగా నెలకు ముప్పది రూపాయ లద్దె వచ్చుటచే నది యొక క్రొత్త యాదాయముగా నేర్పడెను. తోఁటలో నగతిక శిశు సంరక్షణశాలను (Orphnage) గూడఁబెట్ట నుద్దేశించితిని గాని శ్రీ పిఠాపురపు రాజుగారు పెట్టుబూని నందున నేనా ప్రయత్నము మానివేసితిని.

నేను జెన్నపట్టణమునుండి తిరిగి వచ్చినతరువాత నాహృదయ క్షేత్రమునం దడఁగియుండిన యాస్తిక పాఠశాలాస్థాపన బీజము మరల నంకురించెను. మనస్సున్న పక్షమున మార్గ ముండకపోదు.

శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు పట్టణములో నొక మాధ్యమిక పాఠశాలను స్థాపించి కొన్ని సంవత్సరములనుండి జరపుచుండిరి. నేనా పాఠశాలను హితకారిణీ సమాజమున కిమ్మని కోరఁగా వారు సంతోషపూర్వకముగా పాఠశాలను మాకిచ్చుట కంగీకరించి బల్లలు దేశపటములు మొదలయిన సమస్త సామగ్రితోను 1907 వ సంవత్సరము సెప్టెంబరు నెలలో దానిని మా యధీనము చేసిరి. ఇఁక దీని నున్నత పాఠశాలనుగా మార్చవలెను. పాఠశాల క్రొత్త కార్య నిర్వాహకత్వమునకు వచ్చుటచేత నూతనాంగీకారమును బడయు వలసివచ్చెను. యేట్సుదొరగారి సాహాయ్యమువలన విద్యా విచారణాధికారి మాపాఠశాల నంగీకరించెను. దాని నున్నత పాఠశాలనుగాఁ జేయు విషయమునఁ గృషిచేయ నారంభించితిని. ఈ విషయమయి పాఠశాలా పరీక్షకులయిన యేట్సుదొరగారితోను, రాజకీయ కళాశాలాధ్యక్షులగు హంటరు దొరగారితోను, మాటాడి రాజమహేంద్రవరములో నింకొక యున్నత పాఠశాలను స్థాపించుట కావశ్యకమున్నదని వారిని సహేతుకముగాఁ జెప్పి యొప్పించితిని. పాఠశాలా మందిరమును గట్టించుటకయి యించుమించుగా రెండువేలరూపాయల కొక యింటిని చెరువు సోమయాజులుగారివద్ద కోటసమీపమునఁ గొనుటయేకాక దాని చుట్టుపట్ల నిండ్లను గొనుటకుఁగూడ బేరమాడుచుంటిని. మా పట్టణములో నున్నతపాఠశాలలు రెండుండెను. ఒకటి క్రైస్తవమతాచార్యులది, రెండవది దొరతనమువారిది. రెండవది యయిన రాజకీయ బోధనాభ్యసన పాఠశాల మిక్కిలి మంచి దశయందుండినది. మల్లాది వేంకటరత్నముగారు మా పాఠశాల తమ పాఠశాలకుఁ బ్రతిస్పర్ధిగా నుండునని భయపడి మాదానిని విద్యావిచారణాధికారిగా రంగీకరింపకుండఁ జేయవలెనని హంటరుగారితోఁ జెప్పిరి. రాజకీయ బోధనాభ్యసన పాఠశాలకు హంటరుగా రధ్యక్షులు; వేంకటరత్నముగా రుపాధ్యక్షులు. మా పాఠశాల నున్నత పాఠశాలనుగా

20 SEP 1984



వీరేశలింగము ఆస్తికోన్నత పాఠశాల భవనము.

2021B

నంగీకరించుటకు నేము విద్యావిచారణాధికారులకు ప్రార్థన పత్రమును బంపినప్పుడు హంటరుగారు వ్యతిరేకముగా ప్రాయుటనుబట్టి వా రంగీ కరింపక పాఠశాలయొక్క స్థిరత్వమును గూర్చి యే వేవో ప్రాసిరి. అందుపైని నేనాయనను కలసికొని పాఠశాలా కార్యనిర్వాహణమున కయి నేనొక యుపసంఘమేర్పరిచెదననియు దానియందాయనను గూడ నుంచెదననియు జెప్పితిని. దొరగారు కొంతవఱకు నా పక్షము నకు తిరిగి, ఉపసంఘములోఁ దానొకడుగా నుండుట కంగీకరించెను. శాస్త్రపాఠశాలాధ్యక్షుఁడును పాఠశాలా సహాయ పరీక్షకుఁడును పాఠ శాలా ప్రధానోపాధ్యాయుఁడును నేనును మఱి యిద్దరు హితకారిణీ సామాజికులును కాకినాడ కాలేజి యధ్యక్షులయిన వేంకటరత్నము నాయుఁడుగారును గల యొక యుపసంఘము నేర్పాటుచేసి, వేంకట రత్నమునాయుఁడుగారు శ్రమపడిచేసిన విధు లాయనకుజూపి యాయన యంగీకారమును బడసితిమి. విద్యావిచారణాధికారి మరుసటి సంవత్స రము నాలవఫారమును తరువాత సంవత్సర మయిదాఱు ఫారములను నంగీకరించి మా పాఠశాలను సంపూర్ణోన్నత పాఠశాలను జేసెను.

ఈశ్వర ప్రేరణమువలన శ్రీ పిఠాపుర సంస్థానాధిపతులైన శ్రీ రాజా కుమార మహీపతి సూర్యారావు బహద్దరుగారు పాఠశాలా భవన నిర్మాణార్థముగా మొదట నిరువదివేల రూపాయల నిచ్చెదమని దయాపూర్వకముగా వాగ్దానముచేసిరి. నేను మొట్టమొదట తోఁటను గొని యందు వసింప నారంభించినకాలములో వారు రాజమహేంద్ర వరము వచ్చినప్పుడు మాతోఁటకు దయచేసి నాకు దర్శనమిచ్చిరి. వీరి సాహాయ్యముచేత నేను పాఠశాలాభవనమును గట్టుట కుద్యమించితిని. ఇప్పుడు పాఠశాల నిమిత్తమయి క్రొత్తస్థలమును విచారించుచుండగా నిన్నీసుపేటతోఁజేరియున్న యాఱెకరముల హుకుము పేట పోలమొకటి యమ్మకమునకు వచ్చెను. అప్పుడు రాజమహేంద్ర వరమునకు వచ్చియున్న యేట్నుగారిని రాజకీయశాస్త్ర పాఠశాలా

ధ్యక్షులైన హంటుగారిని నేనా పొలమునకుఁ బిలుచుకొనిపోయి చూపగా, వారది కొనవచ్చునని చెప్పిరి. పండ్రెండువందల రూపాయలకు నేనా పొలమును గొంటిని. ఆ పొలముయొక్క మధ్యనుండి యినుపదారి పోయినందున దాని గట్టున కీవలనున్న యెకరముపై చిల్లరమాత్రమే యిన్నీసుపేటలో చేరి పాఠశాలా భవననిర్మాణమున కర్హమైనదిగా నుండెను. మొదటిపొలము నంటియున్న యింకొక పొలములో నినుపదారిగట్టున కీవలనున్న యెకరమున్నర భూమిని ననూనూటయేఁబది రూపాయలకు కొని మొదటిదానితోఁ జేర్చితిని. ఈ రెండుపొలములను నల్ల రేగడి నూనెగడ్డ భూములగుటచేత పునాదులు మొదలైనవి వేయుటలో నెంతజాగ్రత్త పుచ్చుకొని గట్టిపని చేయించి నను ముండెప్పుడయిన గోడలు బీటలువాఱుసేమోయని నాకిప్పటికిని భయముగానే యున్నది.

మా పాఠశాలలోని విద్యార్థులు ప్రతిదినమును విద్యారంభమునకు ముందు చేయవలసిన ప్రార్థనములో నంత్యభాగమిది:—

"ఓ సర్వకారుణ్యా! మే మెల్లప్పుడును శ్రద్ధాభక్తులతో విద్యనభ్యసించుచు, జ్ఞానాభివృద్ధిని జేసికొనినట్లు ప్రసాదింపుము. విద్యవలన మేము వినయపరులమును, నీతివంతులమును, అయి సర్వకార్యములయందును నీకుఁ బ్రీతికరముగా వర్తించునట్లు మమ్మ నడుపుము. మేము పొందిన విద్యాలాభమును ఇతరులకుఁగూడఁ గలిగించుచు, స్వార్థపరత్వమును మాని సాధ్యమైనంతవఱకుఁ బరోపకారపరాయణత్వమును బూని, ఈశ్వరభక్తియు ప్రభుభక్తియు కలవారమయి, మమ్మ్మగన్న తల్లిదండ్రులకును, మేము చదివిన పాఠశాలకును ఖ్యాతి తెచ్చునట్టి సద్వర్తనమును బడయుటకయి సదా ప్రయత్నించుచుండు బుద్ధిని మాకు కరుణింపుము. ఓం తత్సత్!"

1908 వ సంవత్సరమునందు ఎడ్వర్డు పాఠశాలనుగూడ మా పాఠశాలలోఁ జేర్చుకొని యా పాఠశాలయున్న గృహమునకు మా పాఠశాలను పట్టణమునుండి యిస్నినుపేటకుఁ దీసికొని పోయితిమి. శ్రీ పిఠాపురపు రాజుగారేడువేల రూపాయ లిచ్చినందున యా సొమ్ములతో బల్లలు మొదలయినవి సమగ్రముగాఁ గొంటిమి. ఈ యాస్థిక పాఠశాలకు దేశిరాజు పెదబాపయ్యగారిని ప్రధానోపాధ్యాయునిగా నియమింప నిశ్చయించుకొంటిమి. తానొకటి తలఁచిన దైవ మొకటితలఁచును. ఆయన వ్యాధిబాధితుఁడయి యౌషధసేవ నిమిత్తము చెన్నపట్టణము పోయియుండి యక్కడ 1908 వ సంవత్సరము మార్చినెల 9 వ తేదిని ఈశ్వరసాన్నిధ్యము నొందెను.

నేనుకొన్న హుకుముపేట భూములలో పాఠశాలా మందిరమును కట్టించుటలో శ్రీ కంచుమర్తి వేంకటసీతారామచంద్రరావు గారు నా కత్యంత సహాయులయి పనిచేయించిరి. పని విశేషముగా సాగినదికాదు. అందుచేత నేనుదయాస్తమానములయందు ప్రతి దినమును పోయిచూచుచు నెక్కువచుఱుకుఁదనముతో పనిచేయింప నారంభించితిని. మా పాఠశాలలో సహాయాధ్యాపకుఁడుగా నున్న కుందూరి వేంకటరత్నముగారు నాకు మిక్కిలి సహాయులుగా నుండిరి. నలువదివేల రూపాయలతోఁగాని సుందర విశాల భవన నిర్మాణము కానట్లు కనఁబడెను. మా కోరికను సఫలముచేయుటకయి కల్పతరువు వలె శ్రీ పిఠాపురపు రాజుగారు మాపెరటి చెట్టయి నిలిచిరి. వారా నలువదివేల రూపాయలు నియ్యనను గ్రహింపఁగా నలువది వేల రూపాయల యిల్లరువదివేల రూపాయల యిల్లయ్యెను. ముందువైపున మాత్రమే రెండవయంతస్తు వేయఁదలచుకొన్న దన్నివైపులను రెండంతస్తులుగల దివ్యసౌధమయినది. ఈ పాఠశాలా భవనములో రెండవ యంతస్తుమీద వేయేసిమంది పట్టఁదగిన రెండు సభాసదనములున్నవి. ఈ పాఠశాలామందిరము నీతిధర్మ విద్యానిలయమయి సదా

శ్రీ రాజావారి కీర్తిని బ్రకటించుచుండును గాక! ఈ పాఠశాలలో స్త్రీలు వేఱుగా విరామకాలములో వచ్చి కూరుచుండుటకయి యొక విశాలమైన గది విద్యార్థినుల యుపయోగార్థమయి కట్టబడియున్నది.

తక్కిన పాఠశాలలకంటె హితకారిణీ సమాజమువారి యీ పాఠశాలలో రెండు విశేషము లున్నవి. అందొకటి పురుషులతోడి పాటుగా స్త్రీలను గూడఁ జేర్చుకొని ప్రవేశపరీక్షవఱకును జదివించుట. ఇప్పుడు బాలురకు బాలికలయందు గౌరవము చూపుట యభ్యాసమైనది. విరామసమయములలో బాలికలు కూరుచుండు గది కేవల యుపాధ్యాయులగది యుండుటచేత బాలురెవ్వరును స్త్రీల గది వంక పోవుటకైనను సాహసింపరు. సాధ్యమయినయడల నెప్పుడైనను బాలికల యున్నత పాఠశాలగాఁ గూడ నుపయోగపడవలెనన్న యాలోచనతో నేనింత పెద్ద భవనమును గట్టించుటకుఁ బ్రయత్నించితిని. సాధారణముగా బాలికలు బాలురతోఁ కలిసియే మూడవ ఫారమువఱకును జదువవచ్చును. అప్పటికి బాలికలు కొంత యెదుగవచ్చునుగాన పయి మూఁడుతరగతులలోను స్త్రీలే యుపాధ్యాయిను లుగా నుండి విద్యచెప్పుట యుక్తముగానుండును. స్త్రీలకుఁ బ్రత్యేకముగా నయిదాఱు తరగతుల నుంచుటకుఁగూడ పాఠశాల తగియున్నది. మా పాఠశాలలో స్త్రీలకందఱికిని ధర్మార్థముగానే చదువు చెప్పుదుము. ఇట్లు మేము చూపినమార్గము ననుసరించి కాకినాడ కాలేజీవారును స్త్రీలను దమ పాఠశాలలోఁ జేర్చుకొనుట కారంభించి యున్నారు.

రెండవ విశేషము పంచమ బాలురనుగూడ నాయా తరగతులలోఁ జేర్చుకొని చదువుచెప్పుట. కొన్ని సంవత్సరములనుండి యయిదాఱుగురు పంచమబాలురు మా పాఠశాలలోని యున్నతవర్గములలో చదువుచున్నారు. పంచమబాలురని చెప్పినఁగాని యితరులకును వారి

కిని భేదము తెలియరాదు. బాలికలకువలెనే మొదటిఫారము మొదలు పయి తరగతులలోఁ జదువు పంచమబాలురకును జీతములు గైకొనక ధర్మార్థముగాఁ జదువు చెప్పఁబడును. క్రైస్తవపాఠశాలలోఁ గూడ క్రైస్తవులుకాని మాలబాలురను జేర్చుకోరని నేను కొంతకాలము క్రిందట విన్నప్పుడు నాకత్యాశ్చర్యము కలిగినది. మా యున్నత పాఠశాల స్థాపింపఁబడిన తరువాత మా పట్టణములోని క్రైస్తవ మతాచార్యులు తమ యున్నతపాఠశాలను దీసివేసి దానిని మాధ్యమిక పాఠశాలనుగా మార్చిరి. మా పాఠశాల యిరుగుపొరుగులు మాత్ర మంత మంచివికావు. మా పాఠశాలకు దక్షిణమువైపునున్న నాలుగు వందలకు లోపల రాఁదగిన యైదువేల గజముల స్థలమును మేము నాలుగువేలరూపాయ లిచ్చికొనవలసి వచ్చినది. ఈ నాలుగువేల రూపాయలనుగూడ శ్రీ పిఠాపురపు రాజుగారే దయచేసిరి. స్థలముల కయినను మందిర నిర్మాణమున కయినను యుపకరణ సంపాదన మున కయినను యీవఱకే పాఠశాలవిషయమున శ్రీ పిఠాపురపు రాజుగారు డెబ్బదివేల రూపాయలను వ్యయపెట్టిరి.

1911 వ సంవత్సరము నవంబరునెల 27 వ తేదిని పాఠశాలా గృహప్రవేశోత్సవము మహావైభవముతో జరపఁబడినది. కలకత్తా నగరమునుండి సిటీకాలేజి యధ్యక్షులైన హేరంబచంద్ర మైత్రగారు వచ్చి గృహప్రవేశోత్సవము నడిపి మంచి యుపన్యాసముచేసిరి. నాకుఁ దెలియకయే శ్రీ పిఠాపురపు రాజుగా రావఱకే విద్యావిచారణాధికారి గారికి వ్రాసి యాయనవద్దనుండి హితకారిణీ పాఠశాల యన్న పేరును నాపేరునకు మార్చినట్లు వచ్చిన తంతివార్తను, శ్రీ రాజావారి యుత్తరమును సభలోఁ జదివిరి. రాజాగారు నా కట్లుచూపిన గౌరవమునకు నేనెంతయుఁ గృతజ్ఞుఁడ నయియున్నానుగాని మార్చినపేరు, కాసుకర్చుచేయని నాదిగాక సమస్తవ్యయములను భరించిన వారిదయి యుండిన నాకెంతో సంతోషకరముగా నుండియుండును. ఈపాఠశాల

యా స్తికోన్నత పాఠశాలయని పిలువఁబడుచున్నది. పరిశుద్ధాస్తిక మత ధర్మములందుఁ జెప్పఁబడకపోయిన పక్షమున నిప్పటిపేరు సార్థకమయి నదిగాక నేతిబీరకాయవంటి దగును. అది పేరునమాత్రమేకాక క్రియ యందుఁగూడ నిజమైన యా స్తికపాఠశాల యయినప్పుడు నే నా స్తిక పాఠశాలను స్థాపింపవలెనని చిరకాలమునుండి చేయుచుండిన కృషి సంపూర్ణముగా సఫలమయినదని సంతోషించుట కవకాశము కలు గును. ఆ స్తిక ప్రార్థనముతో పాఠశాలపని నారంభించుచుండుట తప్ప పాఠశాలతో నిప్ప డా స్తికప్రబోధ మేమియు జరుగుచుండలేదు. ఈ పనిని సమర్థతతో నిర్వహించుట కా స్తికు లుపాధ్యాయులలో నెక్కు వగా నుండవలెను. పాఠశాలకు చుట్టును గోడలేకపోవుట యిప్పుడొక కొఱతఁగా నున్నది. ఈ కొఱత శీఘ్రముగానే తీరవచ్చును. రు1250 లకు కొన్న పొలములో నినుపదారిగట్టున కావలనున్న భాగము రు 1250 లకు విక్రయింపఁబడి యా ధనముతోను మఱికొంత ధనము తోను పాఠశాల కుత్తరవైపుననున్న తాటాకుల యిండ్ల వరుస యొకటి కొనివేయఁబడినది.

1907 వ సంవత్సరము వేసవికాలపు సెలవ్రులకుఁ దరువాత వితంతు శరణాలయములోనివారికి విద్య చెప్పుటకయి ప్రవేశపరీక్ష యందుఁ గృతార్థులయిన పురుషుల నిద్దఱిని, కుట్టుపని నేర్పుటకయి యొక స్త్రీనిబెట్టి పాఠశాలను సరిగా నడపుచుండుటయేకాక నేనును పాఠశాలలో పనిచేయుచుంటిని. నా భార్య వారికి సంగీతము నేర్పు చుండుటయేకాక క్రొత్తగా తోఁటలో గట్టఁబడిన యానందాశ్రమ ములోఁ బ్రతిదినమును ప్రాతస్సాయంకాలములయందు వారిని గొని పోయి ప్రార్థనము జరుపుచుండెను. వారికిఁ జిత్రలేఖనము నేర్పుటకయి కొంతకాల మొక యుపాధ్యాయుని సహితము పెట్టితిని. ఇట్లుండగా నా బాల్యసఖుఁడైన కనపర్తి యోగానందముగారి కొమారిత సుంద రమ్మాయను పదునాఱేండ్ల ప్రాయముగల బాలవితంతువు 1907 వ

సంవత్సరమున వితంతు శరణాలయమును జేరెను. ఆమె మాయింటనే యుండఁగోరినందున నామె తండ్రిగారి యెడల నాకుండిన మిత్రభావమునుబట్టి యట్లే యుంచుకొని యామెను నేనును నా భార్యయుఁ బుత్రికావ్యవహారమువలెఁ జూచుచుంటిమి.

వితంతు శరణాలయములోనివారి కొక్కరొక్కరికి నెలకై దేసి రూపాయ లిచ్చుచు వారికిఁ గావసినవాని నా రూపాయలతోఁ గొని యిచ్చుచుండిరి. కొంతకాల మా ప్రకారముగానే జరిగెను. దాని విషయమైన చరిత్రము నిచ్చటఁ గొంత చెప్పవలసియున్నది. వివాహము చేసికొన్నవారిలోనే యొకరు వితంతు శరణాలయములోని కొక వితంతువును బంపిరి. ఆ వితంతువు గర్భిణియయియుండినట్లల్ప కాలములోనే తెలియవచ్చినది. ఇటువంటి వితంతువును శరణాలయములో నుంచుట నీతిగాదు. ఈమెను వెడలగొట్టుటకును మాకు మనసు గొలుపలేదు. అందుచేత యాలోచించి యట్టివారి నిమిత్తమయి 'పతిత యువతీ రక్షణశాల' (Rescue Home) యొకటి స్థాపింపవలెనని నిశ్చయించి యామెను వేఱొకచోట నొక గదిలో నుంచి కాపాడితిమి. ఆమెకు నాభార్యయే ప్రసూతి చేసెను. బిడ్డ పుట్టి గతించెను. తరువాత నీ పతిత యువతీ రక్షణశాలకు ఒక కోమటి వితంతువు వచ్చెను. ఇఁకముందు మంచినడత గలిగి యుండెదవాయని యా వితంతువునడిగి, యుండెదనని చెప్పినమీఁదట సంవత్సరకాలము పరీక్షించి యుంచెదమనియు నీ లోపల నెప్పుడైన మరల చెడునడతలోఁ బ్రవేశించిన పక్షమున వెంటనే వెడలఁగొట్టెదమనియు జెప్పి యావితంతువును పతితయువతీరక్షణశాలలోఁ జేర్చుకొంటిమి. తరువాత కాకినాడనుండి వచ్చి సలాది కృష్ణమూర్తి కనకరత్నమును వివాహముచేసికొనెను. ఈ వితంతువు పేరు కనకరత్నము. పైని పేర్కొనఁబడిన యిరువురునుగాక మఱికొనలుగురప్పుడీ పతిత యువతీ రక్షణశాలలోఁ జేరిరి. వారిలో నింకొకరికి వివాహమయ్యెను. తక్కిన

వారు బిడ్డలనుగని చెప్పియుఁజెప్పకయు పాఱిపోవ్రుచునచ్చిరి. ఒక బ్రాహ్మణవితంతువు బిడ్డనుగని విడిచిపారిపోగా నాభార్య యీ బిడ్డను పెంచుచుండెను.

శ్రీ ములుకుట్ల అచ్చుతరామయ్యగారు దయాపూర్వకముగాఁ గట్టించియిచ్చిన క్రొత్త వితంతు శరణాలయమునందు గృహప్రవేశోత్సవము 1908వ సంవత్సరము నవంబరు నెల 15వ తేదీని జరిగినది నాకాలమంతయు నించుమించుగాఁ గడచిపోయినది. నేనీక ధనార్జన పరత్వమునుపేడి నాయీయు శ్శేషమును స్త్రీ జనాభివృద్ధి నిమిత్తమయి వినియోగింప నిశ్చయించుకొన్నాఁడను. ఈశ్వరుడు నాయభిమతమును సిద్ధింపజేయునుగాక!

అనుష్టానిక బ్రాహ్మలలో నొక్కఁడయిన కారుమూరి కామరాజుగారు రోగపడి శ్రీకాకుళమునకుఁ బోయి దేశిరాజు పెద బాపయ్యగారివలెనే యక్కడ నకాలమరణమునొందెను. అనంతర మాయన భార్యయైన మల్లమ్మ వితంతు శరణాలయములోఁజేరి దాని యభివృద్ధికయి తనజీవితకాలము గడపవలెనన్నమహోత్సాహముతో నుండి 1909వ సంవత్సరమున నేను బెంగుళూరులో నుండినప్పుడు కాలధర్మమునొందెను.

1908వ సంవత్సరమునందు దొరతనమువారు నన్ను 1873వ సంవత్సరము 3వ సంఖ్య రాజశాసనానుసారముగా వివాహములు జరుపుటకు గోదావరి మండలమునకు వివాహలేఖ్యా రూఢునిగా నియమించిరి. నేను పుత్రికాప్రాయునుగాఁజూచుచున్న సుందరమ్మకును హనుమంతరావుగారికిని వివాహమునిశ్చయింపఁబడెను. ఈ వివాహముతోఁగలిపి నాచేఁబోషింపఁబడి మాయింటనున్న చిరంజీవి పుల వర్తి వేంకటసుబ్బారావు వివాహమునకూడా చేయుట కేర్పాటుచేసితిని. అన్నియు సిద్ధమయినతరువాత హనుమంతరావుగారు వివాహదినమున

స్త్రీ పురుషులందరును మాలవాసితోఁగలసి భోజనము చేయవలెనని పట్టుపట్టెను. అట్లు చేయుటకు నాభార్య మొదలయినవారొప్పుకొనలేదు. ఇట్టిస్థితిలో 1908 వ సంవత్సరము అక్టోబరు నెల 18 వ తేదీని పులవర్తి వేంకటసుబ్బారావు వివాహము మాత్రమే జరిగి శ్రీ పిఠాపురము రాజుగారు చెన్నపట్టణమునుండి పంపినయుంగరము గడియారము మొదలయిన బహుమానము లాతనికే యియ్యబడినవి. హనుమంతరావుగారు వితంతుశరణాలయములోని తమయుపాధ్యాయ పదమును విడిచి బృందావనపురమున కరిగి యక్కడపనిచేయ నారంభించిరి. నేను శ్రీమతి సుందరమ్మకు విద్యాభివృద్ధిచేయుచు, ప్రతిదినమును నేనింగ్లీషు స్వయముగా చెప్పుచుంటిని. ఈ లోపల హనుమంతరావుగారు తనపూర్వపు పట్టుదలనువిడిచి సాంఘికధార్మికోద్యమముల యందేపనిచేయుచు నుండుటకొప్పుకొని మరల రాజమహేంద్రవరమునకువచ్చిరి. ఈ యిరువురకు 1909 వ సంవత్సరము జూలై నెల 25 వ తేదీని వివాహముజరగినది. వివాహానంతరమున సుందరమ్మ వితంతుశరణాలయ పర్యవేక్షకురాలుగాను హనుమంతరావుగారు హితకారిణీ సమాజ సహాయకార్యదర్శిగాను నియమింపఁబడి యుభయులును గలిసి యిరువదియైదు రూపాయల వేతనమును బడయుచు పనిచేయుచుండిరి. ఈ రెండు వివాహములునుగాక మూఁడవ శాసనానుసారముగా మఱి యైదు వివాహములయినవి.

1907వ సంవత్సరమున వొకనాటిరాత్రి మూర్ఛవచ్చిపడిపోయి తేఱిన తరువాత కొంతకాలమునేను దుర్బలుఁడనయి రోగపీడితుఁడనయియే యుంటిని. ఆ సమయమునందిక్కడకు పండిత శివనాథ శాస్త్రిగారువచ్చిరి. నేను నా భార్యను వెంటఁగొని శివనాథశాస్త్రి గారితోఁగలిసి ఏప్రిల్ 4 వ తేదిని కలకత్తాకు బైలుదేఱి త్రోవలో భువనేశ్వరమువద్దనిలిచి యచ్చటి దేవాలయములను వానిసమీపమున

నున్న బౌద్ధగుహామండపములను జూచి, కలకత్తాచేరి యక్కడనున్న దినములలో శివనాథశాస్త్రిగారి యతిథిసిగా నుండితిని. నాపేరావరకే కలకత్తాలో విశేషముగాఁదెలిసియుండుటచేత సాధారణ బ్రహ్మసమాజమువాసు మాత్రమేకాక యాదిం బ్రహ్మసమాజమువానును భరత వర్షీయ (నవవిధాన) సమాజమువానునుగూడ నన్ను గౌరవించిరి. నా కక్కడివారు స్వాగతమిచ్చినప్పుడు మూఁడుసమాజముల ముఖ్యులును గూడినాయందాదరమునుచూపిరి. నేనక్కడవారనుదినములుండిచూడ వలసినవానినెల్లఁజూచి కలకత్తానువిడిచి త్రోవలో కటకములో రావు బహుదూరు మధుసూదనరావుగారి యతిథిగా నొకదినముండి మరల సురక్షితముగా భార్యాసహితముగా రాజమహేంద్రవరము చేరితిని. ఈ యాత్ర చెరుపుచేయుటకు మాఱుగా నాకుఁ గొంత మేలేచేసినది. కొంచెము కాలము రాజమహేంద్రవరమునుండి యా సంవత్సరము వేసవికాలములో నేను బెగుళూరునకు వెళ్ళితిని. మైసూరిలోని వార్తా పత్రికలన్నియు నన్నభినందించుచు వ్యాసములు వ్రాసెను. బెంగుళూరు లోని వర్ధమాన సమాజము (Progressive Union) వారు నాకు సత్కారముచేసి తమతోఁగలసి నా ఛాయాపటము నెత్తించి నన్ను గౌరవించిరి. అక్కడ కొన్ని దినములుండి మైసూరునకుఁ బోఁగా "మహారాణీకాలేజి" లో నాకు స్వాగతమిచ్చి యాదరించిరి. శివ సముద్రమునకుఁ బోయి యక్కడ కావేరీ నదీపతనమును దానివలన విద్యుచ్ఛక్తిని కలిగించురీతినిజూచితిని. ఇట్లక్కడఁజూడఁదగినవిశేషము లన్నిటిని జూచి మరల బెంగుళూరును జేరితిని. అక్కడిపౌరులు సభ చేసి నాలుగుభాషలలో నాకు స్వాగత పత్రికలను జదివిరి.

బెంగుళూరునుండి రాజమహేంద్రవరమునకు వెళ్ళినతరువాత నేను శీఘ్రుకాలములోనే శరణాలయములోని యొక వితంతువునకు వివాహము చేయుటకయి కళత్రసహితముగా బరంపురము వెళ్ళితిని. అక్కడజరిగిన వితంతు వివాహమునకు పట్టణములోని పెద్దమనుష్యు

లనేకులు వచ్చిరి. అక్కడి పురజనులును 1907వ సంవత్సరము జూలై నెల యేడవ తేదీని నాకు స్వాగతమిచ్చి సంబోధనపత్రికను జదివిరి.

1908వ సంవత్సరములో నేను వెళ్ళినప్పుడు బందరు పుర జనులు ఏప్రిల్ 17 వ తేదిని స్వాగతమిచ్చిరి.

ఈ ప్రకారముగానే బొపట్ల మొదలయిన స్థలములకు నేను వెళ్ళినప్పుడక్కడివారు నాకు స్వాగతమిచ్చి పత్రికలు చదివిరి. దూషించి బ్రాళ్లువేసెడి పూర్వకాలముపోయి యిప్పుడు భూషించి పూవులువేసెడి క్రొత్తకాలము వచ్చినది.

చెన్నపట్టణమునుండి వచ్చినతరువాత మరల నేనొకసారి పుర పారిశుద్ధ్య విచారణ సంఘములో సభ్యుడనుగా రెండు సంవత్స రము లుండవలసినవాడ నయితిని. మొట్టమొదట మా పట్టణము లోని యుపకారగ్రాహిగారు పారిశుద్ధ్య విచారణ సంఘములో సభ్యు డవ్వుగా నుండుమని కోరినప్పుడు రెండుసారులు నే నంగీకరింప నిరాక రించితిని. తరువాత మండలకరగ్రాహిగారు నేను సభ్యుడనుగా నుండ నంగీకరించుట తమ కనుగ్రహము చూపినట్లుండునని యీంత రంగికలేఖను వ్రాసినమీఁదట మోటుతనముచేయుట యుక్తము కాదని యొప్పుకొంటిని. ఆ ప్రకారముగానే రాజమహేంద్రవరములో నున్న మధ్యస్థ కారాగారమునకు (Central Jail) నన్ననాధికారిక ద్రష్టనుగా (Non - official Visitor) నియమించిరి కాని దాని యందును నేను శ్రద్ధవహించి పని చేయలేదు.

చెన్న రాజధానీ పరిపాలకులయిన లాల్‌దొరగారు 1909 వ సంవత్సరమున రాజమహేంద్రవరము వచ్చినప్పుడు నాకు దర్శన మిచ్చి చాలసేపు నాతో నత్యంతాదరముతో మాటాడిరి. మా సంభాషణములోఁ దొరవారు తాము వచ్చి మా వితంతు శరణా

లయమును చూచెదమని సెలవిచ్చిరి. అక్కడకు దారిలేదని తప్పించు కొనుటకయి చూచితినిగాని బండిరానియెడల తాము బండిదిగి నడిచియే వచ్చెదమని వారు సెలవిచ్చిరి. అందుపైని నే నింటికి వచ్చి నడుమ నాదివారమొకటి వచ్చినందున తక్షణమే నలువండ్ర కూలివాండ్రను బెట్టి రాత్రియుఁబగలును పని చేయించి సోమవారము నాఁడు ప్రాతఃకాలమున దొరగారు వచ్చునప్పటి కొక విధముగా బండివచ్చుటకుఁ దగిన బాటను వేయించితిని. వారా దినమున ప్రాతఃకాలమునం దేడు గంటలకు విజయంచేసి వితంతు శరణాలయమును చూచి సంతోషించి పోయిరి.

1908 వ సంవత్సరము ఏప్రిల్ నెల 14 వ తేదితో నా కఱువది సంవత్సరములు నిండినవి. నా భార్యయొక్క ప్రేరణముచేత షష్టి పూర్త్యుత్సవము తలపెట్టి మిత్రులు మొదలయినవారి కాహ్వానపత్రి కలను బంపితిని. నా యాహ్వానము నంగీకరించి దూరప్రదేశముల నుండి సహితము పలువురు మిత్రులును వివాహాములు చేసికొన్న వారును, శ్రమచేసి వచ్చి నన్ను గౌరవించిరి. పట్టణములోని పెద్ద మనుష్యులును పలువురువచ్చి నన్నాదరించిరి. అందుచేత నాటి యుత్సవము మిక్కిలి జయప్రదముగానే జరగెను. మా మండల న్యాయాధిపతిగారయిన పార్థసారథి అయ్యంగారును దయచేసి నా కానందము కలిగించిరి. ఆ సమయమునందు నామిత్రులును శిష్యులు నయిన గోపిశెట్టి నారాయణస్వామి నాయఁడుగారు నాకొక శాలువను బహూమానముచేసిరి. ఆప్రకారముగానే విజ్ఞానచంద్రికా మండలివారి పక్షమున కొమర్రాజు లక్ష్మణరావుగారొక శాలువను బహూమతి చేసిరి. ఆదిపూడి సోమనాథరావుగారు నూతనవస్త్రములను కట్టఁ బెట్టిరి. పీటరుగారు నా ఛాయాపటమును పెంచి పెద్దదిచేసి బహూ మానము చేసిరి. (శ్రీ) పిఠాపురము రాజుగారు మొదలయినవా రనే

కులు తంతివార్తలను, అభినందనలేఖలను బంపిరి. కొందఱు పద్యము లను వ్రాసి తెచ్చియిచ్చిరి. వితంతువివాహము లాడినవారి బిడ్డలును మంగళగీతములను పాడిరి. అక్కడకువచ్చినవారి ఛాయాపటము తీయఁబడిన తరువాత నాటిదిన మానందాశ్రమములో జరిగిన యుత్స వము సంపూర్ణమయినది.

1909 వ సంవత్సరమునందు వేసవికాలములో నేను బెంగుళూరు వెళ్ళవలెనన్న యుద్దేశముతో నాభార్యను చి॥ సుందరమ్మను జాని కమ్మను వెంటగొని బైలుదేఱి దారిలో చెన్నపట్టణములోఁ గొన్ని దినములు నా మిత్రులయిన సమర్థి రంగయ్యశెట్టిగారి యాదరముచేత నిలిచితిని. ఈ రంగయ్యశెట్టిగారు నాయందత్యంత గౌరవమును, ప్రేమయు గలిగినవారు. నేను చెన్నపట్టణములోనుండిన కాలములో నేను కోరకయే వితంతుశరణాలయ పోషణార్థముగా నెలకు పదేసి రూపాయలు పంపుచు వచ్చిరి. నేను చెన్నపట్టణము విడిచి రాజమ హేంద్రనివాసమును స్థిరముగా నేర్పరచుకొన్న తరువాత నే నాయన నొకసారి కలిసికొన్నప్పు డిట్లు నెలనెలకు పదేసి రూపాయ లిచ్చు చుండుటకంటె శాశ్వతనిధిగా నేమైన పెట్టుట యుచితముగా నుండు నని చెప్పితిని. ఆయన తాను చెన్నపురి పారిశుద్ధ్య సమాజమువారికి బదులిచ్చిన పత్రములలోనుండి వేయి రూపాయలు విడఁదీసి హిత కారిణీసమాజము పేర వ్రాయించి వెంటనే నాకోరికను చెల్లించిరి. ఆయన యా వేసవికాలములో నెలదినములు బెంగుళూరులో నాతోఁ గడపవలెనని నిశ్చయించుకొనెను. ఆయన నిమిత్తమయి నే నొక యిల్లక్కడ కుదిర్చితిని. ఇట్లుండఁగా దొరతనమువారిపక్షమున హరి సర్వోత్తమరావుగారి దేశీయ స్వపరిపాలన విషయమున వ్రాతలను గూర్చి సాక్ష్యమిచ్చుటకు కృష్ణామండలమునకుఁ బోవలసినవారయిరి. అట్లు సాక్ష్యమిచ్చి తిరిగి వచ్చినపుడు జూలై నెల 19 వ తేదిని సంభ

వించిన యయోమార్గ మహావిపత్తులో నామిత్రుని కకాలమరణము సంభవించెను.

ఈసారి నాతో బెంగుళూరికి వచ్చినవారిలో శ్రీమతి సుంద రమ్మనుగూర్చి యీవరకే కొంత వ్రాయఁబడినది. రెండవయామె యైన శ్రీమతి జానికమ్మ వితంతువివాహమును చేసికొన్న న్యాపతి శేషగిరిరావుగారి ప్రథమభార్య కూఁతురు. వితంతువయిన కొంతకాల మున కీమె రాజమహేంద్రవరములోనున్న తన పినతండ్రి యింటినుండి మాతోఁటలోనికి వచ్చెను. అప్పటి కీమె తండ్రిగారు సజీవులయియే యుండిరి. ఈసారి బెంగుళూరిలో నున్నప్పుడు మా యారోగ్యము చక్కగా నున్నందున ఁబతి సంవత్సరమును మన మాఱు మాసము లిక్కడనే యుందమనియు మన నివాసమునకయి యొకయిల్లు కొన వలసినదనియు నా భార్య నాతోఁ జెప్పెను. ఆ సంవత్సరమునందే నాభార్య యిష్టానుసారముగా చామరాజపేటలో మంచిభాగమున నొక స్థలమును గొని దానిలో నిల్లుకట్టుటకయి మేము రాజమహేంద్ర వరమునకు తిరిగి రాకముందే మిత్రులద్వారమున నేర్పాటుచేసి మఱి వచ్చితిమి. ఈ యింటికయి నేను కొంతయప్పు చేసితిని. నేనిప్పుడు బెంగుళూరిలో నిల్లు కట్టించుచుండుటచేత రెండు పనులపను సొమ్మై తెచ్చుటకు నేనసమర్థుడ నైతిని. అందుచేత నెక్కడనైనను దిరిగి వితంతు శరణాలయాదుల నిమిత్తము ధనము తెచ్చుట యత్యావశ్యక మయినది. నేను హితకారిణీ సమాజమున కాఱువేల యేనూఱు రూపాయల రొక్కమిచ్చి, దాని యసలు ముట్టుకొనక పడ్డినిమాత్ర ముపయోగించుకోవలసినదని నియమ మేర్పరచితిని. ఆ సొమ్మిలో నుండి రెండువేల రూపాయలు చెఱువు సోమయాజులుగారికిని, వేయి రూపాయలు రామమూర్తిగారికిని, బదుళ్ళిచ్చితిమి. మిగిలిన మూడు వేల యేనూఱు రూపాయలును నాయొద్ద నిలువయుండెను. చేతిలోనికి సొమ్మి వచ్చినప్పు డియ్యవచ్చునని యప్పులో వ్రాసి యా సొమ్మి

216 A



వీరేశలింగము దంపతులు

కు॥ శే॥ రాజ్యలక్ష్మి:- జననం - నవంబరు 1851. మరణం - 12-8-1910

२ 216B

లోనుండి హితకారిణీ సమాజ వ్యయములను జరుపుచు వచ్చితిని. ఇప్పటికా రూపాయలన్నియు వితంతు శరణాలయాదుల నిమిత్తమయి హితకారిణీ సమాజముక్రిందనే వ్యయమయినవి. ఇప్పుడు సమాజము వారికి చందాలు పోగుచేయవలసిన వెట్టి పుట్టినది. అందుచేత వారు ధనసహాయ్యము నిమిత్తమయి యింగ్లీషున నొక విన్నపముత్రాసి ముద్రింపించి నాచేతి కిచ్చిరి.

కార్య నిర్వాహక సంఘమువాడు సహాయ కార్యదర్శియైన హనుమంతరావుగారిని వెంటఁగొని సకళత్రముగా నేను బొంబాయి పోయి చందాలు సమకూర్చవరసినదని నిర్ధారణము చేసిరి. అది శీత కాలమయినను నేనఱువదియేండ్లు దాటినవాఁడ నయినను నిర్వాహక సంఘ నిర్ధారణానుసారముగాఁ బోవఁ బ్రయాణ మయితిని. హనుమంత రావుగారు ప్రయాణమయి నావెంటను బైలుదేఱి వచ్చిరి. మేము మఱునాఁడు సికిందరాబాదు చేరి నాటి కక్కడ నిలిచిపోయితిమి. అక్కడ డాక్టరు, జి. నాయుఁడుగారు మొనట చందాను పదునేడు రూపాయలు నాచేతికిచ్చిరి. నేను వారియింటికిఁ బోయినప్పుడు కవయిత్రియైన సరోజనీ నాయఁడ స్నస్థురాలయి యుండి బిడ్డలను తన వద్దకుఁ బిలిచి "మీ తాతగారు వచ్చినారు చూఁడుడని" నన్ను చూపెను. వారి వివాహమును చెన్నపట్టణములో నేను చేసియుండుట చేత నామె నన్నట్లు పిలిచినది. సికిందరాబాదులో చి॥ శ్రీమతి కొటికలపూడి సీతమ్మ తన యన్నగారియొద్ద నుండఁగా మేము వారి యింటనే బస చేసితిమి. రాజమహేంద్రవరములో నాభార్యచేత స్థాపింపఁబడిన స్త్రీ పార్థనసమాజమును మేము చెన్నపట్టణములో నున్న కాలములో చి॥ సీతమ్మయే జరుపుచు వచ్చెను. ఆమె గర్భ వతియై మిక్కి లి బలహీనురాలుగా నుండినప్పుడు భర్త యామెను చెన్నపట్టణము మాయింటికిఁ బంపెను. నాపద్దనున్న కాలములో నే నామెకు ఛందస్సును, వ్యాకరణమును నేర్పితిని, అక్కడనున్నప్పుడే యామె యొక శతకమును జేసెను. ఆమె కూఁతురు చి॥ చంద్రమతి చెన్నపట్టణములో మాయింటఁ బుట్టినదే. ఇట్లు సికిందరాబాదులో

నొకదిన మామె యన్నగారి యింటనుండి మఱునాఁటి యుదయమున బయలుదేటి భార్యామిత్ర సహితముగా బొంబాయికిఁ బోయితిని. అక్కడ నా మిత్రులును హైందవ సాంఘిక సంస్కార పత్రికాధిపతులునైన నటరాజయ్యగారు మమ్ము తమ యింటికిఁ గొనిపోయిరి. చదువుకొన్నవారిలోను సంస్కారపక్షము వారిలోను ప్రాగ్ధన సామాజికులలోను నా పేరక్కడసహితము చక్కఁగాఁ దెలిసియున్న దగుట చేత నక్కడివారును నాకు స్వాగతమిచ్చి నన్ను గౌరవించిరి. న్యాయమూర్తి చంద్రవార్కరుగారు నన్నాసభలో నభినందించిరి. యంత్రకారశాఖయందున్నవారును నా శిష్యులును నయిన గంటి లక్ష్మీనరసింహముగారును నా మిత్రులైన న్యాయమూర్తి గణేశ నారాయణచంద్రవార్కరుగారును నాకు విందులు చేసిరి. నేనక్కడనున్న వారము దినములలోను తొమ్మిదివందల రూపాయల చందాలు వేయించితిని. ఈ విషయములో నాంధ్రపత్రికాధిపతులైన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారును, హైందవ సాంఘిక సంస్కార పత్రికాధిపతులైన నటరాజయ్యగారును నాకు మిక్కిలి తోడుపడిరి. నే నక్కడ నుండఁగానే యిద్దఱు తెలుగు బ్రాహ్మణ వితంతువులు రాజమహేంద్రవర వితంతు శరణాలయములోఁ జేఱుటకయి నన్నుఁ గలిసికొనిరి. నా మిత్రుఁడైన హనుమంతరావుగారివెంట నిద్దఱు బ్రాహ్మణ వితంతువులను రాజమహేంద్రవరమునకుఁ బంపివేసి నేనును నా భార్యయు పూనాలోనిలిచి రెండుదినములు పూనావితంతు శరణాలయ సంస్థాపకులును నా మిత్రులునైన కర్వేపండితుని యతిథుల మయి యుంటిమి. ఒక దినమున నక్కడి వితంతు శరణాలయములోనే యుండి యక్కడ జరుగుచున్న పద్ధతులన్నిటిని జూచితిమి. ఆవఱకే నామిత్రులయిన కోలాచలము వేంకటరావుగారు నన్ను కోరి యుండి నందున పూనానుండి బైలుదేటి నేనును నా భార్యయు బళ్ళారికిఁ బోయితిమి. వారక్కడ మమ్ము గౌరవించి తమ యింటనే యుంచుకొని మాకుఁ బ్రయాణ వ్యయములక్రింద నూఱు రూపాయలిచ్చి హితకారిణీ సమాజమునకుఁ దాము మున్నిచ్చిగుండిన మూఁడువేల

రూపాయల భాగములను సభాపతి యంత్రములలోని మఱి రెండువేల రూపాయల భాగములను దయచేసిరి. తరువాత నేనును నాభార్యయు బైలుదేఱి గుంటకల్లుమీఁదుగా రాజమహేంద్రవరమును జేరితిమి. నేను కాకినాడకుఁబోయి యక్కడ రు 1332 ల చందాలను సమకూర్చితిని. ఇట్లు సమకూర్పఁబడిన ధనముతో హితకారిణీ సమాజము యొక్క ఋణము కొంత తీఱినది.

1910 వ సంవత్సరము వేసవికాలములో మేము బెంగుళూరికిఁ మాతో న్యాపతి జానికమ్మను, కామరాజు గడ్డ మంగమ్మను దీసికొని పోయితిమి. ఈసారి మే మక్కడ మా స్వగృహములోనే ప్రవేశించితిమి. మేము పోవునప్పటికి నామిత్రులు గృహమును గట్టించి నివాసమున కర్హమగునట్లు చేసిరి. మేము వెళ్ళినతరువాత లోపలికి మంచినీళ్ళ వచ్చుటకు గొట్టములు పెట్టించితిమి. విద్యుద్దీపముల కేర్పాటు చేసితిమి. నాభార్య సంవత్సరములో నాఱుమాసము లా యింట నుండి సుఖింపవలెనని నిశ్చయించుకొనెను. ఆమె కోరికప్రకారముగా నక్కడ నాఱు నెలలుండుటకు నేనును సమ్మతించితిని. ఈసారి మా వెంటఁ గొనివచ్చిన శ్రీమతి న్యాపతి జానికమ్మకు వివాహము చేసితిమి. ఇది బెంగుళూరిలో జరిగిన మొదటి వితంతువివాహము. వితంతు వివాహశాసనము మైసూరు రాజ్యమునందు వ్యవహారములో లేదు. అందుచేత మేమీ వివాహమును స్వగృహమునందు చేయుటకు వీలులేక యింగ్లీషురాజ్యమయిన దండుపట్టులోనికి వధూవరులను దీసికొనిపోయి యక్కడ చేయవలసినవార మయితిమి. ఈ వివాహ మక్కడ నూతనమయినదగుటచేత బెంగుళూరులోని పెద్దమనుష్యులు విశేషముగావచ్చి తాంబూలాది సత్కారములను గైకొని సంతోషించి పోయిరి. శ్రీమతి జానికమ్మ వివాహమయినతరువాత బెంగుళూరు విడిచి వచ్చినవార మందఱమును సుఖముగా మరల రాజమహేంద్ర వరము చేరితిమి.

నా లుగవ ప్రకరణము

అసహాయదశ

క్రీస్తు శకము 1910మొ॥ 1913వ సంవత్సరము వరకు.

1910 వ సంవత్సరమున అగష్టునెల 11 వ తేదిని నా భార్య యారోగ్యవతియయి సుఖముగా నున్నట్లే కనఁబడినది. ఆదినమునఁ బ్రాతఃకాలమునను సాయంకాలమునను తానే స్వయముగా వంటజేసి పెట్టినది. నాటిరాత్రి మేమిద్దరమును కలిసి భోజనము చేయునప్పుడు మఱునాఁడు తా నుదయమునకే ప్రేమావతిని వైద్యశాలకు దీసికొని పోయి మందిప్పించి వచ్చెదనని నాతోఁ జెప్పెను. ప్రేమావతి పతిత యువతీ రక్షణశాలలోని యొకబిడ్డ. ఆ బిడ్డను నాభార్య పెంచు చుండెను. నాభార్య మేడపైకి వచ్చినప్పటికే గదిలో నేను నిద్ర పోయితిని. నేనారాత్రి మూఁడుగంటలు కాకముందే లేచి తలుపుతీసి దొడ్డిలోనికి వెళ్లివచ్చి నాభార్య మంచమువద్దకు పోయి మెల్లఁగా 'నిద్రపోవుచుంటివా' యనియడిగితిని. బదులుపలుకకపోవుటచేత నేను పోయి నామంచముమీఁద మేలుకొనియే పరుంటిని. కొంతసేపటికి గడియారము నాలుగు కొట్టినది. నేనప్పుడు నా మంచముమీఁదనుండి దిగి నాభార్య మంచమువద్ద నిలుచుండి "ఇంకను నిద్ర మెలఁకువ రాలేదా?" యని యడిగితిని. నా పలుకునకు మాఱుపలుకలేదు. ఇంతలో గడియార మైదుగంటలు వేసెను. ఆమె యైదుగంటల తరు వాత నెప్పుడును పరుండెఁడిది కాదు. అందుచేత నేనుపోయి పిలిచి లేపి పలుకకపోఁగా మీఁదచేయివేసి కదల్చితిని. దేహము చేతికి చల్లగాతగిలి లేవకపోఁగా నేమియుదోఁచక మేడదిగి వైద్యుని పిలుచు కొని వచ్చుటకయి పులవర్తి సుబ్బారావును లేపిపంపి నేను వెనుక పోయితిని. నేను పోవునప్పటికి డాక్టరు లేచి యీవలకు వచ్చెను.

అతఁడు నాతో మేడనెక్కి నాభార్యను పరీక్షించి చూచి "ప్రాణము పోయిన" దని చెప్పెను. నేనామాట నమ్మక చక్కగాఁ బరీక్షింప వలసినదని యడిగితిని. ప్రాణముపోయి మూఁడు నాలుగు గంటల సేపయి యుండునని చెప్పి నన్నోదార్చి ధైర్యముగా నుండవలసినదని బోధించి మెల్లుదిగెను. నేనును గోడకుఁ జేరగిలఁబడి పడిపోవుదునని నేలపైఁ గూలఁబడి కన్నులు మూసుకొని యీశ్వరునిఁ దలఁచి ప్రార్థింపవలెనన్న చింతతో "ఓ యీశ్వరా! వృద్ధదశలో నాకిట్టి మహాపదను దెచ్చి పెట్టితివా?" యని మొదటివాక్యము నంటిని. అనునప్పటికి "ఓయీ! దుఃఖ పడఁబోకుము. ఇది మీ యుభయుల మేలుకొఱకే జరిగినది" అన్నమాటలు నాకు విస్పష్టముగా వినఁబడినవి. అప్పుడేమియు నాపవ రానట్లుగానే నేను నా భార్య మంచము వద్దకుఁ బోయి పరీక్షించి చూడఁగా నామె హాయిగా పరుండి నిద్ర పోవుచున్నట్టే నాకంటికిఁ గనఁబడెను. ముక్కువద్ద వ్రేలుపెట్టి చూచితిని గాని యూపిరి యాడుచున్నట్టుకనఁబడలేదు. పెద్దతనములో నీ ప్రకారముగా హృదయవ్యాపార మాకస్మికముగా నిద్రలో నిలిచి పోవుట కలదని డాక్టరుగారు చెప్పిరి.

అప్పుడు వితంతు శరణాలయములోనివారందఱును విలపించుచు వచ్చి యేడ్చువఁదొడఁగిరి. ఇంతలో పలువురు మిత్రులువచ్చి నా భార్యను మేము వాసముచేసెడి యింటిముందు వసారాలో పడక కుర్చీమీఁద గూర్చుండబెట్టిరి. ఆమె జీవించి కూర్చుండి యున్నట్టు గానే యుండెను. అప్పుడామె పెంచిన పిల్లియొకటి వచ్చి పైకిమూఁకి యామె యొడిలోఁ గూరుచుండెను.

నా భార్య మరణవార్త పట్టణములో తెలియఁగానే యేడు గంటలు మొదలుకొని జనులు గుంపులుగుంపులుగా మాతోఁటలోనికి రాఁదొడఁగిరి. ఆ వచ్చినవారిలో హిందువులును, మహమ్మదీయులును,

క్రైస్తవులును, బ్రాహ్మణులును, శూద్రులును, శుద్ధశోత్రియులును, సంస్కారప్రియులును, పుణ్యస్త్రీలును, వితంతువులును, వృద్ధులును, పిన్నవయసువారును కూడ నుండిరి. నా భార్యమెడలంగల గౌరవమును దెలుపుటకయి క్రైస్తవపాఠశాలయు, హితకారిణీపాఠశాలయు నాదినమున మూసివేయబడినవి; ఇంగ్లీషున ప్రకటింపబడెడి యొక పక్ష పత్రికతక్క తక్కిన వార్తాపత్రికలన్నియు నా భార్య మృతి విషయమయిన యనుబంధములను ప్రకటించినవి. ఆ పత్రికలు ముద్రింపబడెడు ముద్రాయంత్రములన్నియు నాదినమున మూసివేయబడినవి. ప్రాడ్వివాకులు తమ సభను మూసివేసి కొందఱు న్యాయవాదులతోడగూడ మాతోటకు వచ్చిరి. నా భార్యకు దహనసంస్కారమును తోటలోనే చేయించుటకు నిశ్చయించి మూడు గంటలయినతరువాత ప్రేతమును, ప్రార్థనాదికమును నిర్వర్తించుటకయి యానందాశ్రమమునకుఁ గొనిపోయితిమి. ప్రార్థనములు జరిపినపిమ్మట శవమును తోటలోనే యొక చివరను దహనము చేసితిమి.

ఈదుఃఖవార్తను కనపర్తి శ్రీరాములుగారు కాఁబోలును తంత్రీముఖమునఁ దెలుపఁగా నా భార్య ప్రేమతోఁబెంచి పెద్దవానిని జేసిన గోగులపాటి వీరేశలింగము శీఘ్రకాలములోనే వచ్చెను. అతని భార్యకిచ్చుటకయి నా భార్యపెట్టెనుదీసి బనారసుచీరను బైకిఁదీయునప్పటి కెంతయాపుకొన్న నాగక లోపలినుండి దుఃఖము పొరలివచ్చి నాకన్నులనుండి నీరు కాలువలుగట్టెను. అతఁడును పెద్ద పెట్టున నేడ్చెను. సమాధికట్టించెడి యుద్దేశముతో నా భార్య యస్థికలను గొన్నిటిని నేనొక పెట్టిలోఁబెట్టి జాగ్రత్తచేసియించి, వితంతువివాహములు చేసికొన్నవారడుగఁగా తక్కినవానిని వారిని దీసికొనిపోనిచ్చితిని. గోగులపాటి వీరేశలింగము నాయొద్దనున్న యస్థికలలోఁ గొన్నిటిని దనకిమ్మని యడుగఁగా గొన్నిటి నతనికిచ్చితిని. మేము పెంచి పెద్దవారినిజేసిన గోగులపాటి వీరేశలింగమొకఁడు, పులవర్తి సుబ్బా

రావొకఁడు. నాభార్య యొకనిని తనవాఁడన్న యనురాగముతోను, రెండవవానిని దిక్కులేనివాఁడన్న జాలితోను బెంచెను. వీరేశలింగము ప్రాయశ్చిత్తము చేయించుకొని వివాహమాడి తన్ను విడనాడెనన్న సంగతి తెలిసినప్పుడామె మనస్సునకు దుఃఖముకలిగి కొన్నివారములు మనస్స్వాస్థ్యము లేనిదయి యుండెను.

ఈశ్వరభక్తిచేత నామె యల్పకాలములోనే యాదుఃఖమును మరచి స్వస్థచిత్తురాలయి సత్కార్యకరణమునందు తనకాలము నుత్సాహముతోఁ గడపఁజొచ్చెను. ఇఁక నామె పెంచిన రెండవవాఁడగు సుబ్బారావు మాయింటనుండెను. వితంతు శరణాలయమునకు గణపవరమునుండి గ్రామపాచకుని తోఁబుట్టువైన మంగమ్మయను పదునాఱేండ్ల ప్రాయముగల బాలవితంతువు వచ్చెను. ఆ వితంతువు చిన్నదిగా నుండుటచేత సుబ్బారావునకిచ్చి వివాహము చేయుటకు తగినయీడుకలదిగా నుండునని యెంచి యతనితోఁ జెప్పఁగా నతఁడందునకు సమ్మతించెను. 1908 వ సంవత్సరమునందు వారికి వివాహముచేసి వేఱుగా కాపురముపెట్టి వాసముచేయుటకు మా తోఁటలోనే యిల్లిచ్చితిని.

నాభార్య యప్పుడప్పుడు తన ప్రార్థనలయందు "భర్తగారికంటె ముందుగా నన్ను నీసాన్నిధ్యమునకుం గొనిపొమ్మ" అని యీశ్వరునిఁ బ్రార్థించుచుండుట గలదు. మరణమునకు ముందు రెండు మూఁడు వారములక్రిందట నిట్టిప్రార్థన యొకటి పట్టీపట్టనినిద్రలో నాచెవినిబడెను. నేనప్పటి కూరకుండి తెల్లవాఱుజామున లేచినప్పుడు మేముచేయు సంభాషణములో నీప్రస్తావనను దీసికొనివచ్చి భైరవమున నాకేమైన ప్రాణాపాయము సంభవించు సూచనలు కనఁబడినప్పుడాత్మహత్యకు ప్రయత్నింపఁగూడదని నొక్కి చెప్పితిని. తా నట్టి పాపకార్యమున కెప్పుడును ప్రయత్నింపననియు, నాకంటె ముందుగానే

తనకు స్వాభావికమరణము సంభవించునని తనకు దృఢముగా దెలియు ననియు, నాభార్య చెప్పెను. అయినను నే నామాటలు నమ్మలేదు. ఆనందాశ్రమమునకు సమీపములోనే తోటలో రాజ్యలక్ష్మి నివాస మను నొక గృహమును కట్టించి దానిలో పాలరాతితో చేయఁబడిన సమాధినిబెట్టి యందులో నాభార్యయస్థికలను నిక్షేపించితిని. ఈ పాల రాతిసమాధి కలకత్తాలో మిక్కిలి సుందరముగా చేయఁబడినది. సమాధి కిరుప్రక్కలను నాభార్యయొక్క జన్మదినమును, మరణదిన మును దెలిపెడు వ్రాతలు పాలరాతిపలకమీద చిత్రింపఁబడినవి. అం దొకటి యింగ్లీషులోను, రెండవది తెలుఁగులోనుఁడున్నవి. నాభార్యకు పువ్వులయం దత్యంతప్రీతి కలిగియుండెను. అందుచేత సమాధిచుట్టును రాజ్యలక్ష్మి ప్రమదావనమను పేరితో పుష్పవనము వేయఁబడినది. ఈ పువ్వులతోటలో వివిధస్థలములనుండి తెప్పింపఁబడిన వింత వింతలయిన పూవుల చెట్లను, పూవుల దీవెలును గలవు. దీనికంతకును వేయి రూపా యలయినవి.

నాభార్య పేరితో తోఁటలో నొక నుయ్యికూడ ధర్మార్థముగాఁ ద్రవ్వించుట కేర్పాటుచేసి వేసవికాలములో నేను బెంగుళూరికిఁ బోయితిని. నూయియంతయు కూలిపోయి చేసినపని వ్యర్థమయ్యెను. 1912 వ సంవత్సరములో వేసవికాలములో మరల నుయ్యి త్రవ్వించుట కేర్పాటుచేసి నేను బెంగుళూరికి పోయితిని. నుయ్యి మొదలంటఁగూలి చేయించినపనియు, వ్యయపఱిచిన ధనమును, సర్వమును వ్యర్థమయి పని మొదటికివచ్చెను. తలఁచుకొన్న ధర్మకార్యమునకు రెండుసార్లు విఘ్నమువచ్చినది. నేను స్వయముగా నూతిపనిని యారంభించి 1913 వ సంవత్సరము ఏప్రిల్ నెల 7 వ తేదివఱకు రాజమహేంద్ర వరములోనుండి పని ముగించి మఱి బెంగుళూరికి వచ్చితిని. ఈ నూతి లోసగము జామిపేటప్రజల యుపయోగముకయి విడిచిపెట్టఁబడినను తక్కినసగము తోఁటకునయోగపడును. ఈ నూతితో నేను త్రవ్విం

చిన మూడు నూతులును పూర్వమున్నదొకటి యుండగలిసి తోటలో నాలుగు మంచినీళ్ళనూతులున్నవి. తోట నేను కొన్నప్పుడు తాటి చెట్లును ప్రాత మూమిడిచెట్లును చిత్తచెట్లునుకొన్న, యుసిరిక చెట్లును, నారింజచెట్లును తప్ప విశేష ఫలవృక్షములేవియు లేవు. ఈ చెట్లువలన సంవత్సరమునకు ముప్పది రూపాయలు వచ్చుచుండెను. తాటిచెట్ల వలన మఱి డెబ్బదిరూపాయలు వచ్చుచుండెనుగాని చిగా యాయము తోటను నేను గొనుటవలన పోయినది. ప్రాగుబోతుతనము దేశములోని యనేకానర్థములకు మూలమనియు, దానిని సాధ్యమైనంత వరకు మాన్పింపజూచుట ప్రజాక్షేమమును గోరెడు దేశాభిమానుల కెల్ల కర్తవ్యమనియు, నా యభిప్రాయము. అందుచేత నేను తోట లోని తాటిచెట్లను కల్లుగీచుట మానిపించి యందువలనవచ్చు ధనా గమమును బోగొట్టితిని. తోటలో నడుమనుగానున్న యీతచెట్లను తాటిచెట్లను కొట్టించివేసి, చీపురుముండ్లయడవిని ఛేదించి, పుట్టలను, పొదలను త్రవ్వించివేసి, వానిస్థానమున ఫలవృక్షములను నానాదేశ ములనుండి తెప్పించి వేయించితిని. ఇట్లు తోట వేసినవాడను నేను; దీనిఫల మనుభవించువారు ముందువారు. ఈతోట యిప్పుడు రాజ మహేంద్రవరమునకు దక్షిణపుతోటలలో నుత్తమమయినదిగా బరిగణింప బడుచున్నది.

నాభార్య జీవితచరిత్రము నించుక తెలుపుట యిచ్చట ననుచిత ముకాదని భావించి దానినిందు బొందుపఱుచు చున్నాను.

నాధర్మపత్నియగు శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి కాతేరు గ్రామమునందు బ్రహ్మశ్రీ అద్దంకి పట్టాభిరామయ్యగారికిని, తద్ధర్మ పత్నియగు కొండమాంబగారికిని 1851 వ సంవత్సరము నవంబరు నెలలో జననమొందెను. ఈసాధ్వి 1910 వ సంవత్సరము ఆగష్టునెల పండ్రెండవ తేదిని తెల్లవారుజామున పరమపదము నొందెను. పట్టాభి రామయ్యగారి కీమె రెండవకుమార్తె; శైశవమునందే మాతృమర

ణము నొందిన యీ మెను మేనమామయు కాతేరు కరణమును నగు వెన్నేటి వేంకటరత్నముగారును భార్యయగు లచ్చమాంబగారును పెంచి పెద్దదానినిజేసిరి. ఈ యుత్తమదంపతులు సంతానము లేనివా రగుటచేత తమ మేనగోడలిని యేవిధమైన కొఱతయుఁ గలుగకుండఁ గాపాడుచు వచ్చిరి. పుట్టినింటివా రీమెకు పెట్టినపేరు బాపమ్మ; వా రీమెను మఱణమువఱకును బాపాయి యని పిలుచుచుండెడివారు. మేనమామయే యీమె నెనిమిదవయేటను పండ్రెండేండ్ల ప్రాయము గల నాకిచ్చి వివాహము చేసెను. పెండ్లినాటికే యీమె కొంతవిద్య నెర్చి తరువాత నమకచమకములను, పురుషసూక్తమును, నారాయణ మును ముఖస్థముగా నేర్చుకొని యింట పురుషులులేని దినములలో తానే దేవతార్చనము చేయుచుండెను. పండ్రెండేండ్ల ప్రాయమున పునస్సంధానము చేసి యీచిన్నదానిని మాయింటికిఁ బంపివేసిరి. నా తల్లి పూర్ణమాంబ నాభార్యకు రాజ్యలక్ష్మియని తన తల్లిపేరు పెట్టి పిలువఁజొచ్చెను. ఈ క్రొత్తపేరే నాభార్యకును ఇష్టమయిన దయి నందున మరణమువఱకును తా నా పేరితోనే వ్యవహరింపఁబడుచు వచ్చెను.

కాపురమునకు వచ్చినది మొదలుకొని మాయిద్దఱకును పరస్పరానురాగము ప్రబలి యిద్దఱము నేకాభిప్రాయులము కాఁ జొచ్చితిమి. ఆమె నాయెడల పరమవిశ్వాసము కలదయి సర్వము నందు నన్ననుసరించుచు భ్రమరకీటక న్యాయమున నానలె మాఱి పోయెను. నే నేసాహసకార్యమునం దడుగుపెట్టినను తాను తోడు నీడయై యుండి ప్రోత్సాహవాక్యములు పలుకుచు నన్ను ముందుకు నడిపించుచుండెను. నాది కొంత కోపస్వభావము; నాభార్యది శాంత స్వభావము.

నేను వితంతువివాహప్రయత్నము నారంభించినప్పటినుండియు నాభార్యకు కష్టము లారంభమయినవి. నా బంధువులును, మిత్రు

లును, పురజనులును, పూర్వాచార పరాయణులైన పండితులును తామకార్యకరణమనుకొన్న యీ కార్యమునుండి నన్ను మరలింప సర్వవిధములఁ బ్రయత్నించిచూచి దారిగానక కడపటి యుపాయము గా నాభార్యను పట్టుకొనిరి. కాని యక్కడను కార్యసాఫల్యము గలుగ లేదు. తన్ను పెంచి పెద్దదానినిజేసి విద్యాబుద్ధులు చెప్పించిన మేన మామయు బంధువులును ఘోరవిపత్తు సంభవించినట్లుగా నేడ్చుచు నీభర్త నీయకార్యమునుండి మరలింపుమని నేను లేని సమయమున నాభార్యను దీనముగా వేఁడికొనిరి. రాతిగుండెనుసహితము కరగించెడి యీ దీనాలాపములకు సంచలింపక "ఆయన పూనినది మంచికార్య మని నేనును నమ్మిచున్నదాన నగుటచే నే నాయనతో వలదని చెప్పకపోవుటయే కాక యెన్ని కష్టములువచ్చినను నే నాయనను విడు వక తోడ్పడియెద" నని దృఢముగాఁ జెప్పెను. నేను పూనితినన్న హేతువుచేత నేకాక యీ యనాథబాలికా కష్టనివారణమునం దామె కును నవ్యాజమైన యాదరముండెను. వివాహాపేక్షతో మాయింటికి వచ్చిన బాలవితంతువులను నే నింటనుండినను లేకుండినను లోపలికిఁ గొనివచ్చి "మీరు వివాహములు చేసికొని భర్తలయిండ్లకు పోవు లోపల చదువు నేర్చుకొని మీ కష్టసుఖముల నుత్తరములమూలమున మాకు తెలుపుటకు శక్తురాండ్రు కావలె" నని పురికొల్పి వారికి విద్యా బుద్ధులు చెప్పుచుండెను. వచ్చినవారిలో నెవ్వరైన కొంచెము కాని మార్గమున సంచరించినను వారికి మంచిబుద్ధులు చెప్పి నీతిమార్గమునకుఁ ద్రిప్పుచుండెను. క్రొత్తగా వివాహములైన దినములలో నాపతికు వివాహములు చేసికొన్నవారు వచ్చి వియ్యాలవారివలె గదులలోఁ గూర్చున్నను తానొక్కతెయే పనులెల్లఁజేసి సోమరితనము సర్వా నర్థదాయకమని బోధించి తమ యవివేకమునకు తామే లోపల సిగ్గు పడునట్లు చేయుచుండెను. వివాహముల నిమిత్తమయి మాయింటికి వచ్చిన వితంతుకాంతల నందఱిని పుత్రికాప్రేమతోఁ జూచి. యీవ

రించుచు వివాహానంతరమున వారితో నుత్తర ప్రత్యుత్తరములను జరిపి అవశ్యమైనచో వారికి పుస్తకాలుపోసియు వ్యాధిసమయమునందుప చారములుచేసియు స్వస్థపఱిచి వారినిండ్లకుఁ బంపుచు వారియెడల నత్యంత సానుభూతిని గనఁబఱుచుచుండెను.

పరిణయాభిలాషతో పరితపించెడు వితంతు యువతులయెడల నెట్టి యాదరమును దయను జూపుచువచ్చెనో యట్టి యాదరమును జాలినే పతితలయి పశ్చాత్తప్తలైన యనాథ మానినులయెడలను నా భార్య చూపుచు వచ్చెను. నాభార్య జీవితకాలములో నట్టివారేవురు రక్షింపఁబడిరి.

మరణమునకు మూఁడు నాలుఁగుమాసములు ముందు మేముభ యులమును బండిలో నెక్కి పురమందిర సమీపమునుండి ధర్మవైద్య శాలవంకఁ బోవుచుంటిమి. మా కెదుటిప్రక్కను బోగమువాండ్ర సందులోనుండి యొక గుంపునడుమ యౌవనవతియైన యొక వేశ్యాం గన డాడపగిలి వృద్ధవేశ్యొకర్తయు పరివేష్టించి నడపించుచుండఁగా భీభత్సరూపముతో కానఁబడెను. జారత్వశంకచేత విటుఁడెవ్వఁడో దానిని డాడపగులఁగొట్టఁగా నభియోగము తెచ్చుటకయి రక్షక భటాగారమునకుఁ బోవుచున్నట్లు చెంతనున్నవాము చెప్పిరి. ఆ మాట వినఁబడిన తక్షణమునఁ నా భాగ్య నావంకఁదిరిగి యిట్టివారిస్థితిని బాగు చేయుటకయి మన మేమైన తప్పక చేయవలెనని నాతో చెప్పెను.

చిరకాలముక్రిందట వేసవికాలములో నొకనాఁడు మధ్యాహ్న మున నేను పాఠశాలకు పోయియుండినప్పు డొక పంచముఁడు మా వీధిలోని యిసుకలో స్మృతితప్పి పడిపోయెను. వాఁడు మాలవాఁడగుట చేత శూద్రులుసహితము వానిని ముట్టుకొన నొల్లక తమదారిని పోవఁ జొచ్చిరి. బసవరాజు గవర్రాజుగారి యింటినుండి కనపర్తి శ్రీరాములు గారొంటిగంటకును రెండు గంటలకును మధ్య నప్పుడాదారిని ఇంటికిఁ

భోవుచుండుట తటస్థించెను. నాభార్యయు నతఁడును చెఱియొకవైపు
నను బట్టి యా మాలవానిని మా యరుగుపైని బెట్టిరి. అతఁ డంతట
తన దారిని పోయెనుగాని నాభార్య వానియొద్దనుండి కావలసిన
సాయము చేయుచుండెను.

నాభార్య నిజమైన యీశ్వరభక్తురాలు. స్త్రీ పునర్వివాహ
సంబంధమున పామరజనులు బహువిధముల బాధించినప్పటికిని వంటల
వాఁడు మొదలయిన పరిజను లొక్కసారిగా మమ్మ్మి విడిచిపోయినప్పు
డును గోదావరికిపోయి యచ్చటి యల్పులాడెడి యవమానవాక్యము
లకు కోపింపక స్వయముగా నీళ్లు మోచుకొనివచ్చుట మొదలైన
పనులను నిశ్చింతతోను నిత్య సంతోషముతోను నిర్వహింపఁగలుగుట
యీశ్వరభక్తిచేతఁగాక మఱి దేనిచేత సాధ్యమగును? స్త్రీ ప్రార్థన
సమాజమును స్థాపించుటయు, పరిశుద్ధాస్తిక భావమును ప్రోత్సాహ
పఱుచు కీర్తనలను రచించి వానిని తమ సమాజమునందు ప్రతివార
మును పాడుచుండుటయు ఆమెకు కలిగియుండిన యేకేశ్వర విశ్వాస
మును సహస్రముఖముల ఘోషించుచున్నవి. ఆమె యీ ప్రార్థన
సమాజ సంబంధమున ప్రతి సంవత్సరమును సంవత్సరోత్సవమును
జరపి బీదల కన్నప్రదానము చేయుటలో నెంతో పాటు పడుచుండిరి.
డబ్బులను మూటకట్టుకొనిపోయి దారిలో కనఁబడిన వికలాంగులకు
దానము చేయుచుండెడిది.

ఆమెకు సోమరితనమన్న తలకంటగించును. ఆమెకు గృహ
కృత్య నిర్వహణమునందును పాకరచనమునందును నిరుపమానమైన
సామర్థ్యముండెను. రాగికానైనను వ్యర్థముగా పోవుటకుమాత్ర మిష్ట
ములేనిదయియుండెను. ఆమె తెల్లవాఱుజామున లేచినది మొదలు
కొని నా సంరక్షణము తనకు ప్రథమ కర్తవ్యముగా భావించినన్ను
పసిబిడ్డలను పెంచినట్లు పెంచుచుండెడిది. నే నేమంచి పనికిఁబూనినను

నాకు సహాయురాలయి యుండి సహధర్మచారిణియని పిలువఁబడుటకు సర్వవిధముల నర్హురాలయి యుండెను. ఆమెకు పువ్వులయం దత్యంత ప్రీతి. నావలెనే యామె వేషభాషలయం దంతగా క్రొత్తమార్పుల నవలంబింపక పూర్వకాలపు నగలను బొట్టునుదాల్చి పూర్వకాలపు ముత్తయిదువవలె నుండుచుండును. నాభార్యయందును కొన్ని లోపములున్నను గుణబాహుళ్యమును బట్టి యామెను స్త్రీరత్నమని చెప్పవచ్చును.

మంచివారికి మరణమే సాక్షియని పెద్దలు చెప్పుచున్నారు. రాత్రి పదిగంటలవరకును పనిచేసి వచ్చి యీశ్వరుని ప్రార్థించి ప్రక్కమీఁద పరుండి యీయాసలేశమైనను లేకుండ నామె నిద్రలోనే యీశ్వరసాన్నిధ్యము చేరెను.

ఇఁక నాభార్య మరణకాలమునుండియు నాకు సంభవించిన దుర్దశనుగూర్చి కొంచెము చెప్పుకొనవలసి యున్నది. నాభార్య పోయిన మఱునాటినుండియు పులవర్తి సుబ్బారావుగారియింట రెండు మెతుకులుతిని యెట్లో కాలక్షేపము కొన్నిదినములు చేసితిని. నాకష్టమునుజూచి జాలిపడి రాచర్ల రత్నమ్మ నా సంరక్షణము చేయఁబూనుకొని మాతోఁటలోనికి వచ్చెను. ఈమె వితంతువివాహము చేసికొన్నవారిలో రెండవవాఁడగు రాచర్ల రామచంద్రరావుగారిభార్య. రత్నమ్మ నాయొద్దనుండి నాకు సంరక్షణముచేయుట చిరకాలము సాగినదికాదు. అల్పకాలములోనే పట్టణములోనున్న యీమెతల్లి తనకు జబ్బుగానున్నదని వర్తమానములు పంపుచురాఁగా విధిలేక వెళ్ళవలసినదయ్యెను. అందుచేత నేను సుబ్బారావుగారియింటనే మరల చేరవలసినవాఁడనైతిని. ఒక్కఁడనుగచేసి వేళకింతయన్నము పెట్టినఁజాలును. నాకదియు సరిగా జరిగినదికాదు.

ఆకస్మికముగా నాభార్య పోవుటచేత శరణాలయములోనివారు తమ యోగక్షేమముల నారయు తల్లి పోయినట్లుగాఁ గొంతకాలము

వఅకును విచారగ్రస్తులయి దీన ముఖములతో నుండుచు వచ్చిరి. వారిలో ముఖ్యముగా నాభార్యకు ప్రియతములాలయియుండిన మంగమ్మ యామె నిమిత్తము బెంగపెట్టుకొని రోగపడెను. తిన్న పదార్థములు సరిపడకపోవుటచేత నేనన్నము మానివేసి రెండుపూటలును జావతోనే తృప్తి నొందవలసినవాడ నయితిని. సుబ్బారావు స్వయముగా తానే జావచేసి రాత్రియందు బగలును నాకుఁదెచ్చియిచ్చుచుండెను. నేను పదునేను దినములకు బెంగుళూరికి బోవుదు ననఁగా మరల నొకపూట యన్నము తినుట కారంభించితిని. ఇది 1911 వ సంవత్సరము మార్చి నెల మధ్యభాగము. బలహీనపడినను మంచ మెక్కక తిరుగుచునే యుండుటచేత వితంతు శరణాలయమునకుఁ బోయి ప్రతిదినమును వారికి భోజనపదార్థములను పంచియిచ్చి మంచి మాటలతో వారిని బ్రోత్సాహ పరుచుచుండుటకును కట్టుబడుచుండిన పాఠశాల భవనమువద్దకు బండిలో ప్రతిదినమును పోయి యుదయ నాయంకాలములయందు పని విచారించి వచ్చుచుండుటకును మానిన వాఁడనుగాను.


నావద్ద స్థిరముగానుండి, వివాహము చేసికొని, వితంతు శరణా లయములోనివా రెవ్వరైన యావజ్జీవమును నా సంరక్షణము చేసెడి పక్షమున నట్టివారికి వేయి రూపాయల నిచ్చెదనని చెప్పితిని. అప్పు డందుండినవారిలో మంగమ్మ, తా నిక్కడనుండ నొప్పుకొన్నవానినే బ్రహ్మసమాజ వివాహవిధుల ననుసరించి వివాహము చేసికొని యావ జ్జీవమును నాకు సంరక్షణము చేయుచుందునని చెప్పెను.

నేను బెంగళూరు వెళ్ళుటకు నెలదినములు ముందు రాజమ హేంద్రవరములోని దొరతనమువారి బోధనాభ్యసన పాఠశాలలో శిక్షితుఁడగుచున్న తెన్నేటి వెంకటదీక్షితులుగారు మాతోటకునచ్చి యాచఁటలో తనమిత్రుఁడొకడు వితంతు వివాహమును జేసికొన

నభిలషించుచున్నాడనియు, అతడచ్చటి పాఠశాలలో వ్యాకూమ బోధకుడుగా నున్నాడనియు చెప్పెను. ఆపనియే యిక్కడ దొరికిన యెడల నతడిక్కడనుండునా యని నేనడిగితిని. సంతోషపూర్వకముగా నుండునని యతడు త్తరమిచ్చెను. అందుమీదనేను మంగమ్మ సంగతిని దీక్షితులుగారితోఁజెప్పితిని. ఆయన యుత్తరమువ్రాసి తనమిత్రుని నిక్కడకుఁబిలిపించిరి. అతనిపేరు పోతరాజు సూర్యప్రకాశరావుగారు. దీక్షితులుగారితోచెప్పిన మాటలనే సూర్యప్రకాశరావుగారితోఁజెప్పి, నేను బెంగుళూరునుండి తిరిగి రాఁగానే వివాహము చేసెదనని చెప్పి పంపివేసితిని. ఇఁక నేను బెంగుళూరికి మూఁడు దినములకుఁ బోవుదుననఁగా మంగమ్మ నాకు వంటచేసిపెట్టుట కారంభించెను.

1911 వ సంవత్సరము మార్చి నెల 27 వ తేదీని నేను బెంగుళూరికిఁ బోయి స్వగృహమునఁ బ్రవేసించితిని. ఎక్కడఁ జూచినను గత సంవత్సరమున నేనును నాభార్యయుఁ విహరించిన విహారములును, సంభాషించిన సంభాషణములును, స్మరణకువచ్చి, నాభార్య యప్పుడు మృతినొందినట్లే మనస్సునకు నొప్పి కలిగింపఁజొచ్చెను. అందుచేత వెంటనే యింటి నమ్మివేసి బైలుదేఱి చెన్నపురివీధిగా రాజమహేంద్రవరము చేరితిని. శ్రీమతి మంగమ్మ వివాహము వఱకుఁ తోడనే రాక జాగుచేసినందున అక్టోబరు నెల 8 వ తేదీనిగాని జరగలేదు. శ్రీమతి మంగమ్మ వివాహమయిన తరువాత వితంతు శరణాలయ కార్యములను జూచుటకై యామెకు నెల కాఱు రూపాయలును, తోఁటపని జూచుటకయి యామెభర్తకు నెల కాఱు రూపాయలును జీతము సమాజమువారు నిర్ధారణముచేసిరి. డిశంబరు నెలనుండి పాఠశాలలో సంఘమువారు పండ్రెండు రూపాయల జీతమువీధి సూర్యప్రకాశరావుగారికి సహాయ వ్యాకూమ శిక్షకోద్యోగము నిచ్చిరి.

378
D18



వీరేశలింగ దంపతుల - సమాధులు

ఆనందోద్యానవనము.

232B

1911 వ సంవత్సరము డిసెంబరు నెల కడపటను కాకినాడనుండి రావుబహద్దరు వేంకటరత్నము నాయుఁడుగారు నన్ను చూడవచ్చిరి. నాటి ప్రాతఃకాలమున నేను రాజమఁడ్రి యయోమార్గస్థానమునకు బండిమీఁద వెళ్ళి వారిని కలుసుకొని యింటికి మరల వచ్చునపుడు వారును నేనును త్రోవలోనున్న మాయున్నతపాఠశాలను జూఁడ బోయితిమి. నా కాదినమున నే కొంచెము జ్వరమువచ్చెను. నాయుఁడు గారు భోజనముచేసి సాయంకాలమువఱకును నాతోనుండి మరల కాకినాడకు వెళ్ళిరి. నాకు జ్వర మంతకంతకు హెచ్చఁజొచ్చినది. ఈ జ్వరవార్త విని 1912 వ సంవత్సరము జనవరి నెల 8 వ తేదీని రెబ్బాప్రగడ పాపయ్యగారును, జయంతి గంగన్నగారును, కుందూరి వేంకటరత్నముగారును వచ్చి, నేను మేడమీఁద వసారాలో పడక కుర్చీమీఁద పరుండి యుండఁగా నావద్ద కూరుచుండియుండిరి. ఇంతలో లోపలివారు నాకు కాఫీచేసి తెచ్చియియ్యగా కొంచెము త్రాగితిని. తరువాత నత్యల్పకాలములోనే నేను స్పృహతప్పి పైసుక కొరగితిని. నే నీశ్వరానుగ్రహముచేత నేలాగుననో తేఱుకొని కన్నులువిప్పి చూచితిని. నామిత్రులు నన్ను గదిలోనికి తీసుకొనిపోయి మంచము మీఁద బరుండఁబెట్టిరి. అటుతరువాత సహితము పదునేనుదినముల పైనిగాని నేను మంచముదిగి మేడమీఁదనైనను కొంచెము నడ యాడ లేకపోయితిని. నేను వ్యాధి బాధితుఁడనయియున్న కాలములో రాజమహేంద్రవరములోని వానినిమాత్రమే కాక పరస్థలములనుండి వచ్చిన భిషగ్వరిణి పండిత డి. గోపాలాచార్యులు మొదలైనవారిని సహితము మావారు మేడమీఁదికి వచ్చి నన్నుచూచి పోనియ్యనందున కెంతయుఁ జింతిల్లుచున్నాను. ఫిబ్రవరి నెల 14 వ తేదినాటికి నాకు కొంత బలమువచ్చి నేనప్పటినుండి కొంతపని చేయగలుగుదునేమో యనుకొన్నాను.

మఱునాఁడు కొంచెము వ్రాయవలెనని ప్రయత్నము చేసితిని. గాని చేయ వడఁక వ్రేళ్ళు పట్టేయకపోఁగా నేమియు వ్రాయ లేకపోయితిని. రెండు మూఁడు త్తరములు వ్రాయునప్పటికే నా కాయాసము కలుగుచువచ్చెను. బెంగుళూరు వెళ్ళుటకుముందు మిత్రబృందమును సమావేశపఱచి యానందాశ్రమములో నాకు రోగశాంతి చేసినందు నకు దేవునకుఁ గృతజ్ఞతా పూర్వకములైన వందనముల సమర్పించి తిని. పాఠశాలకు సెలవులియ్యఁగానే మేమందఱమును గలిసి బెంగు ళూరికి పోవలెనని నే ననుకొంటిని గాని ప్రకాశరావుగారు బెంగుళూ రికిఁ బోయినగాని యారోగ్యము కలుగదని మార్చి నెలమధ్యనుండియు నన్ను త్వరపెట్టుచు వచ్చినందున మంగమ్మతో ఏప్రిల్ నెల 6 వ తేదిని బయలుదేఱి బెంగుళూరికి పోయితిని. ప్రకాశరావుగా రా నెల 27 వ తేదిని మమ్మిక్కడఁ గలిసికొనిరి.

నాభార్య మృతినొందిన సంవత్సరము లోపలనే నేనామెకు సమాధిని గట్టించితిని. దేశరాజు పెదబాపయ్యగారు నాభార్యకంటె రెండుసంవత్సరములు ముందుగామృతుఁడయ్యెను. అప్పుడొకసంఘము చేరి యాయనపేరు శాశ్వతపఱుచుటకయి నిర్ధారణములుచేసి చందాలు సమకూర్చిరి. కాని క్రియశూన్యమయ్యెను. నేనుపూనుకొని 1912 వ సంవత్సరాంతమున సమాజముయొక్క నిర్ధారణానుసార ముగా సమాధినిర్మాణ నిమిత్తమయి కలకత్తాకు త్తరవుచేసితిని. బసవ రాజు గవర్రాజుగారు తమమరణమునకు ముందప్పుడుండిన వితంతు వివాహ సమాజమునకు తమసొత్తులోఁగొంతయియ్యవలెనని తము మరణశాసనములోఁ వ్రాసిరి. భర్తగారికోరిక నెరవేర్పవలెనని యాయన భార్య మొదటినుండియు సంకల్పికొనియుండెను. ఆమెయు నా మె యల్లుఁడయిన దాసు విష్ణురావుగారునుగలిసి 1910 సంవత్సరాంతమున

రు 900ల కొక్కమును రు 1100లకు కనపర్తి శ్రీరాములుగారు వారి పేర వ్రాసియిచ్చిన వాగ్ధానపత్రము మొత్తము రెండు వేలరూపాయలు నావశమున నిచ్చిరి.

హితకారిణీసమాజ మున్నను వితంతు శరణాలయము మొద లయిన వానిక్రిందనయ్యెడు వ్యయములలో విశేషభాగము నేనే పెట్టి బడి పెట్టవలసిన వాఁడనగుచున్నాను.. నెలకిరువదినాలుగు రూపా యల యుపకార వేతనమును పొందెడి నీవు వేలకొలది వ్యయముచేయు టకు నీకు సొమ్మెక్కడనుండి వచ్చుచున్నదని యడుగవచ్చును. ధనాగ మమునకు నాకు రెండుమార్గములుండినవి– ఒకటి మద్రి రచితపుస్తక విక్రయము; రెండవది సర్వకలాశాలాపరీక్షత్వము. నేను క్రొత్తపుస్త కములను చేయలేనివాఁడనగుటచేతను బుద్ధిమంతులయిన పిన్నవారు వివిధ విషయములలో కొత్తకొత్త పుస్తకములను రచియించి ప్రకటించుచుండుటచేతను, నాపుస్తకముల యమ్మకమిప్పుడు తగ్గి పోయినది.

సమాజమునొక్క– యీ ధనవిషయకావస్థను విని (శ్రీ) పిఠా పురపురాజుగారు ఋణవిముక్తికయి యిటీవల సమాజమునకు మూఁడు వేల రూపాయలను దయచేయుటయేకాక మాసవ్యయములకయి నెల కయువదేసి రూపాయలను బంపుచున్నాను.

1887 వ సంవత్సరమునుండి యవిచ్ఛిన్నముగా నిరువదియై దేండ్లు నేను సర్వకలాశాలాపరీక్షకుఁడనుగానుండి దానివలన దాదా పుగా నిరువదివేల రూపాయల నార్జించి యంతయు పరార్థముగానే యుపయోగించి నాభార్య మరణాంతరమున 1911 వ సంవత్సరము నుండి పరీక్షకత్వము నాకక్కఱలేదని మానివేసినందున నాకిప్పుడా

యాయమసలే పోయినది. నేను ప్రతి సంవత్సరమును మృత్యువును ప్రతీక్షించుచున్నాఁడను. ఒకటి రెండుపు స్తకములు వ్రాయుటలోతప్ప నేను తలపెట్టిన కార్యములన్నియు సీశ్వరానుగ్రహమువలన నెఱవేఱి నవి. నావయఃకాలము నంతను దేశాభివృద్ధి ప్రయత్నములలోఁ గడపి యసహాయుఁడనయి యశ క్తుఁడనయి బీదపడియున్న నా సాయమునకు వచ్చి యస్మద్దేశీయులు వితంతు శరణాలయాదిక సంరక్షణభారమును వహింతురని నమ్మచున్నాను. స్వోదర భరణార్థమయి నే నితరులను వేఁడను. దానికిఁజాలిన యల్పవి త్తమును దేవుఁడు నాకుపకారవేతన రూపమున ననుగ్రహించి యున్నాఁడు. ధనాభావముచేతనే యిప్పు డఁగిపోయిన నాపు స్తకములను పునర్ముద్రితములను గావింపశ క్తుఁడను గాకున్నాను. భ క్తవత్సలుఁడైన పరమాత్ముఁడు నా యీ శ క్తిలోప . మును బాపునుగాక!

విజ్ఞాపనము

అస్మద్దేశీయులైన యాంధ్ర మహాజనులారా! భ్రాతృనరు లారా!

మీవలెనే మన దేశస్థులితరులును నిర్హేతుక జాయమాన కటాక్షముచేత నన్ను గొప్పచేయుచు వచ్చుటచే నాయల్ప సంస్కార ప్రయత్నమునుబట్టి తెలుఁగుదేశములో రాజమహేంద్రవరము సంస్కార ములకు జన్మభూమియని పేరు పడినది. ఈ ప్రఖ్యాతికి నేనే కారణము గాదు; నేను నాటిన సంస్కార లతాంకురమును బయికి లేవఁదీసి పట్టు కొమ్మలయి నిలిచి నానాముఖముల తీఁగలు ప్రాఁకఁజేసిన మహానీ

యులు దీనికి ముఖ్య కారకులని చెప్పవలసియున్నది. ఈక్ర్తి తెలుఁగు దేశమంతటిది కాని రాజమహేంద్రవరము దొక్కదానిదేకాదు. నే నఖిల దేశమునందును కన్నడదేశమునందును సంచారము చేయునప్పు డక్కడివారు సంఘ సంస్కారాది విషయములలో తమ దేశముల కంటె తెలుఁగుదేశ మెక్కువ యభివృద్ధి పొందినదని చెప్పుకొను చుండఁగా నేను పలుమాఱువిని యాంధ్రదేశముయొక్క యభ్యున్నతి కానందించి గర్వపడుచు వచ్చినాఁడను. ఓ యాంధ్రమహా జనులారా! దేశాభివృద్ధికి సంస్కార మన్నివిషయములలోను సమానముగా నుండ వలయును గాని యొక్కవిషయములో మాత్రమే నడచుచుండుట చాలదు. ధార్మిక సాంఘికాభివృద్ధి ప్రయత్నము నుపేక్షించి యొక్క రాజ్యాంగ స్వాతంత్ర్యాభివృద్ధిని గూర్చియే యుద్యమించుటయు సంపూర్ణసుఖసాధకము కాఁజాలదని భావింపవలయును. ఇంటను బయ టనుగూడ హేయదాస్యమునుండి విముక్తులమయి యుభయ స్వాతం త్ర్యములను బొందఁ గలిగినప్పుడుగదా మనము నిష్కళంక సౌఖ్యము నొంది యవ్యాజానందము నొందఁగలుగుదుము?

ఇప్పుడు మన యాంధ్రదేశము మేలుకొని కన్నులు తెఱచి మాంద్యమును మాని చుఱుకుఁదనమును పూని దేశాభివృద్ధికరము లైన నానా క్షేత్రములయందు మహోత్సాహముతో కృషిచేయు చున్నందుకు నేనెంతయు సంతోషమొందుచున్నాను. ఇది మన దేశ ముయొక్క పురోభివృద్ధికి శుభసూచకముగా నున్నది. ఇటువంటి స్థితి మన మాతృభూమికి కలుగఁగాఁ జూడవలెనని నేను ముప్పది నలువది సంవత్సరములక్రిందట నభిలషించుచుంటిని.

మన దేశాభివృద్ధి కిప్పుడు పనికావలెనుగాని యదిలేని పొడి మాటలు కావలసియుండలేదు. మన యాంధ్రదేశమునందు సాంఘిక

ధార్మిక విషయములలోఁ బనిచేయుటకయి యేర్పడియున్న సమాజములలో రాజమహేంద్రవరమునందు స్థాపింపఁబడియున్న హితకారిణీ సమాజము ముఖ్యమైనదని చెప్పనచ్చును. దాని భరణమునకయి నాకున్నయర్థము నిచ్చితినిగాని యది దాని వ్యయములలో నర్థమున కయినను చాలదు. ధనాభావముచేత హితకారిణీసమాజము నూతన ప్రారంభములకుఁ బూనలేకపోవుటయేకాక యున్న వితంతు శరణాల యామములను సహితము ఉదారభావముతో నిర్వహించుటకు శక్తము గాక త్రొక్కటపడుచున్నది. దానికి జనకుఁడనని చెప్పఁదగిన నేనిప్పు డశక్తుఁడనయి బీదపడి సమాజపుత్రికా సంరక్షణమున కసమర్థుఁడ నయి యున్నాఁడను. నూతన ప్రతిష్ఠలకంటె జీర్ణోద్ధారణ మధికాదర నీయముకదా!

ఓ యాంధ్రమహాజనులారా! మీ దేశసేవయందు కాలముస్రుచ్చి మీకు దయనీయుఁడనయియున్న నేను చేతులుజోడించి వినయపూర్వ కముగా మీకు నాకడపటి ప్రార్థనను చెల్లించి, హితకారిణీ సమాజ ములో సామాజికులుగాఁజేరి దాని నుద్ధరించి నిరంతరాయముగా నెగ డునట్లు చేయుఁడు. ఈశ్వరుఁడు మీకు నిరంతర శ్రేయస్సులను కలిగిం చునుగాక!

ఇట్లు విన్నవించు విధేయసేవకుఁడు,

కందుకూరి వీరేశలింగము.

ఈశ్వర ప్రార్థనము

ఓ సర్వేశ్వరా! సర్వకారుణ్యా! సత్యస్వరూపా! ఓ భక్తజనాభీష్టప్రదాయకా! నీ యనుగ్రహమువలన నే నీ స్వీయచరిత్రమును సంపూర్ణముచేయఁ గలిగినాఁడను. ఈ వృద్ధదశలోను, దుర్బలస్థితిలోను, బహుకష్టముల మధ్య దీనిని సాంతముగా రచించు మన స్వాస్థ్యమును శక్తిని నాకు ప్రసాదించినందునకయి కృతజ్ఞతా పూర్వకములైన వందన సహస్రములను నీకు సవినయుఁడనై సమర్పించుచున్నాను. ఈ స్వీయచరిత్రమునందు నేను సత్యమని నమ్మినదానిని తప్ప వేఱు దేనిని వ్రాయకుండుటకే సదా ప్రయత్నించుచు వచ్చినాఁడను. అయిన ను మనుష్య స్వాభావికములైన భ్రమ ప్రమాదాదులచేతను, నేను తెలిసికొనలేకయే నా హృదయాంతరాళమునం దడఁగియున్న రాగద్వేషాంకుర ప్రభావముచేతను, పొరపాటు లేవేని పడియుండినయెడల తెలిపినవారికి వందనము లాచరించుచు దిద్దుకొను సద్బుద్ధిని నాకుఁ బ్రసాదింపుము.

ఓ దీనశరణ్యా! దీనజనుఁడనైన నన్నీలోకములో నింక నుంచ ననుగ్రహించెడు పక్షమున నా కారోగ్యభాగ్యమును పరార్థమయి పాటుపడెడు బుద్ధిని దయచేసి నా యాయుశ్శేషము వ్యర్థముగాఁ గడపకుండునట్లు చేయుము.

ఓం తత్సత్.

కొ॥ శే॥ రావుబహదూర్

కందుకూరి వీరేశలింగముపంతులుగారి

గ్రంథములు - పునర్ముద్రితములు

'స్వీయచరిత్ర' సంపూర్ణము రెండు భాగములు
ఒకే వాల్యూమ్ రు 8-00

'రాజశేఖర చరిత్ర' ఆఫ్ కాలికో ... రు 2-75

,, సాదా ... రు 2-00

,, సంక్షిప్తప్రతి ... రు 1-00

'అభిజ్ఞాన శాకుంతలము' ... ... రు 1-75

— త్వరలో వెలువడనున్నవి —

శ్రీ బులుసు వేంకటరమణయ్యగారిచే పరిష్కరింపబడిన

శ్రీ పంతులుగారి

ఆంధ్ర కవుల చరిత్ర 1, 2 భాగములు

శ్రీ పంతులుగారి యితర గ్రంథములు విడిగాను వాల్యూములు గాను మావద్ద దొరకును.

గౌరవ కార్యదర్శి

హితకారిణి సమాజము (రిజిష్టర్డు)

రాజమహేంద్రవరము.

241

24B2

Check List

Book Number	AADO1F223	Date	28/10/2021
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CI iii, 20B, 122, 202B 216B, 232B, 121A		
Missing Pages	NO		
Prepared By	J. Adilakshi	Cutting By	Sireesha
Scanned By	Sireesha	Pages	265